ఈనాడు

విజయవాడ 6-12-2025 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 116

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 20

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



ఈనాడు

విజయవాడ 6-12-2025 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 116
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 20
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఆత్మీయ బంధానికి ఆర్థిక సత్తువ

ఐదేళ్ల ప్రణాళికకు భారత్, రష్యా ఆమోదం

పుతిన్‌తో మోదీ శిఖరాగ్ర భేటీ

11 కీలక ఒప్పందాలపై ఇరు దేశాల సంతకాలు

వాణిజ్య బంధం విలువను 100 బిలియన్ డాలర్లకు పెంచుకోవాలని తీర్మానం

ఉక్రెయిన్ సంక్షోభానికి శాంతియుత పరిష్కారం ఆవశ్యకమన్న మోదీ



దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో మోదీ, పుతిన్‌ల చర్చలు

దిల్లీ: కాలం పెట్టిన అనేక కఠిన పరీక్షలను సమర్థంగా ఎదుర్కొన్న తమ మైత్రీ బంధాన్ని ‘ఆర్థిక’ పునాదులపై మరింత పటిష్ఠంగా మార్చుకోవాలని భారత్, రష్యా తాజాగా తీర్మానించుకున్నాయి. ఇందుకోసం ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను ఇంకా బలోపేతం చేసుకోవాలని నిర్ణయించాయి. ఆ దిశగా



రాష్ట్రపతి భవన్ వద్ద రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీతో రష్యా అధ్యక్షుడు పుతిన్

ఐదేళ్ల కాలానికిగాను ‘2030 ఆర్థిక కార్యక్రమం’ ప్రణాళికకు తుదిరూపునిచ్చాయి. భారత పర్యటనకు వచ్చిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో శుక్రవారం జరిపిన శిఖరాగ్ర సమావేశంలో ఇరు దేశాల మధ్య మొత్తం 11 కీలక ఒప్పందాలు కుదిరాయి. ఆరోగ్యం, ఆహార భద్రత, నౌకాయానం, ఎరువులు, విద్య, భారత్ నుంచి రష్యాకు నిపుణులైన కార్మికుల వలస తదితర రంగాల్లో పరస్పర సహకారం పెంపునకు ఇవి దోహదపడనున్నాయి. మాస్కోతో వాణిజ్య లోటును పూడ్చుకోవడంలో దిల్లీకి సాయపడనున్నాయి. భౌగోళిక రాజకీయాలు ఎన్నెన్నో కుదుపులకు లోనైనప్పటికీ.. భారత్-రష్యా స్నేహం ధ్రువతారలా నిరంతరం వెలుగులీనుతూనే ఉందని పుతిన్‌తో భేటీలో మోదీ వ్యాఖ్యానించారు. (మిగతా 6లో)

> *గత 8 దశాబ్దాల్లో ప్రపంచం ఎన్నో ఎత్తుపల్లాలను చూసింది. మానవాళి అనేక సవాళ్లు, సంక్షోభాలను ఎదుర్కొంది. వాటన్నింటినీ తట్టుకుంటూ భారత్-రష్యా మైత్రి ధ్రువతారలా నిలిచి ఉంది. ద్వైపాక్షిక ఆర్థిక సహకారాన్ని కొత్త ఎత్తులకు తీసుకెళ్లడం మాకు ప్రాధాన్యాంశం. అందుకు అనుగుణంగా 2030 వరకు అనుసరించాల్సిన ‘ఆర్థిక సహకార కార్యక్రమం’పై సంతకాలు చేశాం.* – మోదీ

> *భారత ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా నిరంతరం ఇంధనాన్ని సరఫరా చేసేందుకు మేం సిద్ధం. చిన్న, మాడ్యులార్ అణు రియాక్టర్లు, నీటిలో తేలియాడే అణు విద్యుత్ కేంద్రాల నిర్మాణంలో సహకారంపై ఇరు దేశాలూ అమితాసక్తితో ఉన్నాయి. అణు సాంకేతికతలను ఔషధాలు, వ్యవసాయం వంటి ఇంధనేతర రంగాల్లో ఉపయోగించుకోవడంలో భారత్‌కు మేం సహాయం చేయగలం.* – పుతిన్

రుణగ్రహీతలకు భారీ ఉపశమనం

2025లో 1.25% తగ్గిన వడ్డీ రేట్లు • ఇల్లు కొనాలనుకునే వారికి తగ్గనున్న భారం



ఈనాడు, బిజినెస్‌బ్యూరో: ఇల్లు, కారు కొనాలనుకునే వారికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) శుభవార్త వినిపించింది. తాజా పరపతి విధాన సమీక్షలో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. 2024 డిసెంబరు 6న రెపో రేటు 6.50% కాగా.. ఏడాది తర్వాత ఇప్పుడు 5.25 శాతానికి దిగివచ్చింది. అంటే 2025లో రెపో రేటు 1.25% (ఫిబ్రవరిలో 0.25%, ఏప్రిల్‌లో 0.25%, జూన్‌లో 0.50%, డిసెంబరులో 0.25% చొప్పున) తగ్గింది. ఇది సామాన్యులకు ముఖ్యంగా ఇప్పటికే గృహ, (మిగతా 8లో)

ఎగరని ఇండిగో

వెయ్యికి పైగా విమానాల రద్దు

- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు
- రైల్వే ప్లాట్‌ఫామ్‌లను తలపిస్తున్న ఎయిర్‌పోర్టులు
- సాధారణ పరిస్థితులు నెలకొనడానికి మరో 5 నుంచి 10 రోజులు పట్టే అవకాశం!
- ఉన్నతస్థాయి దర్యాప్తునకు మంత్రి రామ్మోహన్ నాయుడు ఆదేశం
- ఎఫ్‌డీటీఎల్ నిబంధనలు తాత్కాలికంగా ఉపసంహరిస్తున్నట్లు ప్రకటన



బెంగళూరు విమానాశ్రయంలోని ఇండిగో కౌంటర్ల వద్ద రద్దీ

ముంబయి/దిల్లీ: భారత్‌లోని అతి పెద్ద విమానయాన సంస్థ ఇండిగో విమాన సేవలకు వరుసగా నాలుగోరోజూ తీవ్ర అంతరాయం కలిగింది. దేశవ్యాప్తంగా వెయ్యికి పైగా విమాన సర్వీసులను ఆ సంస్థ శుక్రవారం రద్దు చేసింది. శనివారం కూడా భారీస్థాయిలోనే విమానాలు రద్దయ్యే అవకాశం ఉంది. సాధారణ పరిస్థితులు నెలకొనడానికి మరో ఐదు నుంచి పది రోజులు పడుతుందని ఆ సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈవో) పీటర్ ఎల్బర్స్ తెలిపారు. ఇండిగో విమానయాన సేవల అంతరాయాన్ని కేంద్రం తీవ్రంగా పరిగణించింది. ఈ అంశంపై ఉన్నతస్థాయి దర్యాప్తునకు పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ఆదేశించారు. రానున్న మూడు రోజుల్లో విమాన సర్వీసులను పూర్తిస్థాయిలో పునరుద్ధరించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటామని చెప్పారు. పౌర విమానయాన (మిగతా 8లో)



మన్యం జిల్లా భామినిలో నిర్వహించిన మెగా పీటీఎంలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రి లోకేశ్

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో.. 2 లక్షల మంది దివ్యాంగులకు మేలు

పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ సర్వీసుల్లో ఇకపై ఫ్రీ

మద్యం నిందితులకు 19 వరకు రిమాండ్ పొడిగింపు

లోపలి పేజీల్లో »

తాత్కాలికంగా భర్తీ చేస్తే నిరుద్యోగుల పరిస్థితేంటి?

- విద్యా వ్యవస్థ నాశనమవుతుంటే చూస్తూ ఊరుకోం
- ఎస్వీయూపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు
- అకడమిక్ కన్సల్టెంట్ల పోస్టుల భర్తీపై స్టే

ఈనాడు, అమరావతి: అకడమిక్ కన్సల్టెంట్ల నియామకం (2025-26) కోసం శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం (ఎస్వీయూ) రిజిస్ట్రార్ ఇచ్చిన నోటిఫికేషన్ అమలును హైకోర్టు నిలుపుదల చేసింది. ఒప్పంద, పొరుగు సేవల విధానంలో తాత్కాలికంగా పోస్టులు భర్తీచేయడాన్ని తప్పుపట్టింది. న్యాయబద్ధం కాని నిర్ణయాలతో విద్యాసంస్థలను అడ్డాకూలీల కేంద్రాలుగా మారుస్తున్నారని, విద్యావ్యవస్థ నాశనం అవుతుంటే చూస్తూ ఊరుకోబోమని ఘాటు వ్యాఖ్యలు చేసింది. ‘నిర్దిష్ట కాలానికి, నామమాత్రపు గౌరవవేతనం చెల్లిస్తూ యువతను దోచుకుంటున్నారు. తాత్కాలిక భర్తీలతో కాలం గడుపుతుంటే నిరుద్యోగుల పరిస్థితేంటి? నాణ్యమైన విద్య పొందడం విద్యార్థుల హక్కు. అకడమిక్ కన్సల్టెంట్ పోస్టులు చట్టంలోనే లేవు. విభాగాల వారీగా పోస్టుల భర్తీలలో రూల్ ఆఫ్ (మిగతా 8లో)

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ లేదు

కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ స్పష్టీకరణ



ఈనాడు, దిల్లీ: విశాఖ ఉక్కు కర్మాగారంలో 32 విభాగాలను ప్రైవేటుకు అప్పగించేందుకు ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్ (ఈఓఐ) పిలిచారన్న వాదనలను ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తోసిపుచ్చారు. శుక్రవారం రాజ్యసభలో వైకాపా ఎంపీ గొల్ల బాబూరావు “ఆర్ఐఎన్ఎల్‌లోని 32 విభాగాల్లోకి ప్రైవేటువారిని ఆహ్వానిస్తూ కేంద్రం ఏమైనా ఈఓఐ ఆహ్వానించిందా?” అని అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లేదని సమాధానం ఇచ్చారు. స్టీల్‌ప్లాంట్ పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడవడానికి రోజుకు 9 రేక్‌ల బొగ్గు కావాల్సి ఉండగా... ప్రస్తుతం ఆరు రేక్‌లే ఉన్నాయా? అన్న ప్రశ్నకు కాదని సమాధానం ఇచ్చారు. దేశీయ బాయిలర్ బొగ్గు రోజుకు ఒక రేక్, మీడియం కోకింగ్ కోల్ నాలుగు రోజులకు ఒక రేక్ అయితే చాలని స్పష్టం చేశారు.

మన విద్యావ్యవస్థ దేశానికే ఆదర్శం

- జనవరిలో విద్యార్థుల భాగస్వామ్య సదస్సు నిర్వహణ
- రాష్ట్రవ్యాప్తంగా ‘మన్యం ముస్తాబు’
- మెగా పేరెంట్-టీచర్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

రాష్ట్రంలో అమలయ్యే విద్యావ్యవస్థ మూడేళ్లలో దేశానికి ఆదర్శంగా నిలుస్తుందనే నమ్మకం తనకుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. దీనిపై మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారని, ఆ లక్ష్యాన్ని చేరుకుంటామనే నమ్మకం తనకుందన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ నియోజకవర్గం భామిని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం జరిగిన మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం(పీటీఎం)లో ఆయన పాల్గొని ప్రసంగించారు. మంత్రి లోకేశ్, ఉన్నతాధికారులు సమన్వయంతో విద్యావ్యవస్థలో సంస్కరణలు అమలుచేస్తున్నారని ప్రశంసించారు. భామిని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఈ సభ నిర్వహణలో అదుర్స్ అనిపించారన్నారు. చిన్నారుల నుంచి తాను తెలుసుకోవాల్సిన విషయాలు చాలా ఉన్నాయన్నారు. అన్ని అంశాల్లో పరిజ్ఞానం అందించేలా బలమైన పునాది వేసే బాధ్యత తీసుకుంటానని తెలిపారు. ఇంకా ఏం చెప్పారంటే..

కలలకు రెక్కలు

“విద్యార్థులతో ఇటీవల మాక్ అసెంబ్లీ నిర్వహించాం. వారు శాసనసభ్యులను మించిపోయారు. నూతన ఆవిష్కరణల్లో ప్రతిభ చూపిన విద్యార్థులతో భాగస్వామ్య (మిగతా 6లో)

భాగస్వామి కోటాలో జీవితాంతం ఒకేచోట విధులా?

ఉద్యోగ సంఘాల నాయకుల హోదానూ అడ్డుపెట్టుకుంటున్నారు

కొందరు ప్రభుత్వ ఉద్యోగుల తీరుపై హైకోర్టు తీవ్ర ఆక్షేపణ

ఈనాడు, అమరావతి: దాంపత్య భాగస్వామి (భార్య లేదా భర్త-స్పౌజ్) పనిచేస్తున్నారన్న కారణంతో అక్కడే పోస్టింగ్ తీసుకుంటున్న కొందరు ప్రభుత్వ ఉద్యోగులు జీవితాంతం ఒకేచోట విధులు నిర్వర్తిస్తున్నారని హైకోర్టు ఆక్షేపించింది. ఉద్యోగ సంఘాల నాయకులు సైతం వారి హోదాలను అడ్డుపెట్టుకొని ఏళ్ల తరబడి ఒకేచోట పనిచేస్తున్నారని తప్పుపట్టింది. ఇలాంటి చర్యలు ఆయా స్థానాలకు రావాలనుకుంటున్న ఇతర ఉద్యోగుల ప్రయోజనాలను దెబ్బతీయడమేనని వ్యాఖ్యానించింది. స్పౌజ్ కారణం, ఉద్యోగ సంఘాల నాయకుల హోదాను అడ్డుపెట్టుకొని ఏళ్ల తరబడి ఒకేచోట పనిచేస్తున్న వ్యవహారంపై లోతైన విచారణ జరుపుతామని స్పష్టం చేసింది. తాలూకా, రెవెన్యూ డివిజన్, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో ఉద్యోగ సంఘాల నాయకులమని చెప్పుకుంటూ పలువురు ఒకేచోట పనిచేస్తున్నారని తెలిపింది. స్పౌజ్ కోటా కింద (మిగతా 2లో)


Khushi ke
har pal ke liye KISNA
KFNC40436NAM
UP TO 50% తగ్గింపు*
వజ్రాల ఆభరణాల తయారీ ఛార్జీలపై
UP TO 25% తగ్గింపు*
బంగారు ఆభరణాల తయారీ ఛార్జీలపై
90%* బైబ్యాక్ | 95%* ఎక్స్ఛేంజ్
వజ్రాల నగలపై తయారీ ఛార్జీలతో సహా
KISNA
DIAMOND & GOLD JEWELLERY
BY HARI KRISHNA GROUP
From the Global Leader
in Diamond Manufacturing
Our Existing Exclusive Showrooms: Telangana, Hyderabad - Sarath City Mall | Inorbit Mall - Cyberabad | Somajiguda | A. S. Rao Nagar | Karimnagar |
Andhra Pradesh - Srikakulam | Visakhapatnam - Gajuwaka, Sampath Vinayaka Road | Vijayawada |
Upcoming Showrooms: Telangana, Hyderabad - Himayatnagar, Kukatpally | Chanda Nagar | Andhra Pradesh - Guntur | Visakhapatnam - Inorbit Mall | Madhurawada
ICICI Bank | 5% Instant Discount* on Credit & Debit Cards.
KISNA is now available at 125+ Exclusive Showrooms and more than 1,500 Shop-In-Shop outlets across India | www.kisna.com
SCAN HERE

ఈనాడు

విజయవాడ 6-12-2025 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 116

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 20

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ప్రజలందరికీ వికసిత్ భారత్ ఫలాలు అందాలి

- అదే అభివృద్ధికి నిర్వచనం
- సంస్కరణలతో బ్యాంకులు బలోపేతం
- ఇతర దేశాలకు ఆదర్శంగా 'ఫిన్‌టెక్' రంగం



'ఈనాడు' ప్రత్యేక ఇంటర్వ్యూలో కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సేవల శాఖ కార్యదర్శి ఎం.నాగరాజు

గన్నవరపు సుబ్బారావు

ఈనాడు బిజినెస్ బ్యూరో, హైదరాబాద్

దేశంలోని ప్రజలందరికీ అభివృద్ధి ఫలాలు అందడమే 'వికసిత్ భారత్' ప్రధాన లక్ష్యమని కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సేవల శాఖ కార్యదర్శి ఎం.నాగరాజు అన్నారు. వికసిత్ భారత్- 2047 కోసం బ్యాంకింగ్, బీమా, ఆర్థిక సేవలు, ఎంఎస్ఎంఈ (సూక్ష్మ-చిన్న-మధ్య స్థాయి సంస్థలు), మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సేవల రంగాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని పేర్కొన్నారు. సంస్కరణల వల్లే బ్యాంకింగ్ రంగం బలోపేతం అవుతోందని, ఇతర దేశాల్లో మన బ్యాంకింగ్ వ్యవస్థపై గౌరవం పెరిగిందని వివరించారు. ఫిన్‌టెక్ రంగం అనూహ్యంగా విస్తరిస్తోందని, యూపీఐ సేవలను ఎన్నో దేశాలు వినియోగించుకుంటున్నాయని తెలిపారు. జన్‌ధన్, ఆధార్, మొబైల్ (జామ్) వల్ల ప్రజలందరికీ బ్యాంకింగ్ సేవలు దగ్గరయ్యాయని, ప్రత్యక్ష నగదు చెల్లింపులు సులభతరంగా మారినట్లు వెల్లడించారు. బ్యాంకింగ్ సంస్కరణలు, డిజిటల్ టెక్నాలజీ వినియోగం, ఫిన్‌టెక్ విస్తరణ వల్ల దీర్ఘకాలంలో ఎన్నో రెట్లు అధికంగా ఫలితాలు సాధించగలమని 'ఈనాడు'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన వివరించారు. ఇంటర్వ్యూ ముఖ్యాంశాలు:

బ్యాంకింగ్ రంగం స్థితిగతులు ఎలా ఉన్నాయి? సంస్కరణల ఫలితాలు కనిపిస్తున్నాయా?

గత పదేళ్లలో ఎన్నో సాహసోపేత సంస్కరణలు అమల్లోకి వచ్చాయి. దీనివల్ల బ్యాంకులు బలోపేతం అయ్యాయి, రుణ సదుపాయాలు విస్తరించాయి. డిజిటల్ టెక్నాలజీ పెద్దఎత్తున అందుబాటులోకి వచ్చింది. పరిపాలనా విధానాలు మెరుగుపడ్డాయి. బ్యాంకులకు నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 2018లో 11.2% కాగా, ఇప్పుడు దాదాపు 2% వద్ద ఉన్నాయి. ప్రొవిజన్ కవరేజీ రేషియో (పీసీఆర్) దాదాపు 95% ఉంది.

మన ఆర్థిక వ్యవస్థపై మీ అంచనాలు ఏమిటి?

ఈ ఆర్థిక సంవత్సరంలో దాదాపు 4.19 ట్రిలియన్ డాలర్ల (సుమారు రూ.377 లక్షల కోట్ల) జీడీపీ (స్థూల జాతీయోత్పత్తి) తో ప్రపంచంలో నాలుగో పెద్ద ఆర్థిక వ్యవస్థగా మనదేశం నిలుస్తుందని ఐఎంఎఫ్ కొద్ది రోజుల క్రితం అంచనా వేసింది. 2028 నాటికి జర్మనీని అధిగమించి మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే అవకాశం ఉంది. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారడం 'వికసిత్ భారత్' లక్ష్యం. అప్పటికి 30 ట్రిలియన్ డాలర్ల (సుమారు రూ.2,700 లక్షల కోట్ల) ఆర్థిక వ్యవస్థ కావాలి. తలసరి ఆదాయం 20,000 డాలర్ల (సుమారు రూ.18 లక్షల)కు చేరుకోవాలి. ఈ క్రమంలో మౌలిక సదుపాయాలు, ఎంఎస్ఎంఈ, వ్యవసాయం, ఆరోగ్య రంగాలు విశేషంగా విస్తరించాలి. బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా) రంగం క్రియాశీలక పాత్ర పోషించాలి.

అందరికీ ఆర్థిక సేవలు అందించాలనే లక్ష్యసాధనలో ఎక్కడ ఉన్నాం?

ఎంతో ప్రగతి సాధించాం. 'ఆర్‌బీఐ ఫైనాన్షియల్ ఇంక్లూజన్ ఇండెక్స్' ఈ ఏడాది మార్చికి 67 కు పెరిగింది. దాదాపు 57 కోట్ల జన్‌ధన్ యోజన ఖాతాలు తెరిచిన విషయాన్ని గుర్తించాలి. ఇందులో సగం ఖాతాలు మహిళలవే. గ్రామీణ, పాక్షిక-పట్టణ ప్రాంతాల ప్రజల ఖాతాలూ ఎక్కువే. 2024-25లో జామ్ (జన్‌ధన్, ఆధార్, మొబైల్) ద్వారా ప్రత్యక్ష నగదు బదిలీ విలువ రూ.6.9 లక్షల కోట్లకు చేరింది. యూపీఐ చెల్లింపులు లెక్కకుమిక్కిలిగా నమోదవుతున్నాయి. ఇప్పుడు మనదేశంలో 89% మందికి బ్యాంకు ఖాతాలున్నాయి. 2011లో బ్యాంకు ఖాతాలున్న ప్రజలు 53% మాత్రమే.

ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన ఎంఎస్ఎంఈ రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం ఏవిధంగా కృషి చేస్తోంది?

ఎంఎస్ఎంఈలకు రుణ సదుపాయాలు పెంపొందించాం. 2024-25లో ఈ రంగ రుణాలు రూ.32 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ముద్ర యోజన, పీఎంఎస్‌వీఏ నిధి, ట్రెడ్స్, ప్రాధాన్యతా రుణాలు, ఎగుమతి ప్రోత్సాహకాల ద్వారా ఈ రంగాన్ని ప్రోత్సహిస్తున్నాం.

మౌలిక సదుపాయాల విస్తరణతోనే అభివృద్ధి ముడిపడి ఉంటుంది. ఈ రంగానికి నిధుల కొరత తీర్చేందుకు ఏం చేస్తున్నారు?

అభివృద్ధికి ఇంధనం మౌలిక సదుపాయాల రంగమే. ఈ రంగానికి 2025-26 బడ్జెట్లో రూ.19.79 లక్షల కోట్ల కేటాయింపు లభించింది. కేంద్ర బడ్జెట్లో ఈ రంగం వాటా 5.5 శాతానికి పెరిగింది. రూ.10 లక్షల కోట్ల ఆస్తుల నగదీకరణ లక్ష్యం, రూ.25,000 కోట్లతో సముద్ర వనరుల అభివృద్ధి నిధి ఏర్పాటు, రూ. లక్ష కోట్ల అర్బన్ ఛాలెంజ్ ఫండ్.. మౌలిక సదుపాయాల రంగానికి అండగా నిలిచే చర్యలే. మూలధన ప్రాజెక్టులు చేపట్టడానికి రాష్ట్రాలకు రూ.1.5 లక్షల కోట్ల వరకు వడ్డీ రహిత రుణాలు మంజూరు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

'ఫిన్‌టెక్'లో మన దేశ అడుగులు ఎలా ఉన్నాయి?

ఈ విభాగంలో మనం ఎన్నో దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నాం. 'యూపీఐ' ఇప్పుడు సింగపూర్, యూఏఈ, ఫ్రాన్స్, నేపాల్, భూటాన్, మారిషస్, శ్రీలంక దేశాల్లో అమల్లో ఉంది. రూపే, ఏఏ (అకౌంట్ అగ్రిగేటర్) ఫ్రేమ్‌వర్క్‌పై ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తి పెరుగుతోంది. ఏఐ (కృత్రిమ మేధ)తో క్రెడిట్ స్కోరింగ్, మోసాల విశ్లేషణ, కస్టమర్ సర్వీస్, రిస్క్ మేనేజ్‌మెంట్ మెరుగుపడుతున్నాయి. జనరేటివ్ ఏఐ వల్ల బ్యాంకింగ్ రంగం ఉత్పాదకత 30-40% పెరగొచ్చు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే 'ఫిన్‌టెక్'లో బహుముఖంగా విస్తరిస్తున్నామనే విషయం నిర్ధారణ అవుతుంది.

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలనేది 'వికసిత్ భారత్' లక్ష్యం. అభివృద్ధికి మీరిచ్చే నిర్వచనం ఏమిటి?

అభివృద్ధి అంటే కేవలం స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) పెరగడమే కాదు.. ఆర్థికంగా, సామాజికంగా సమాజాన్ని మెరుగైన స్థితిలో నిలపడం, ప్రజలందరికీ అభివృద్ధి ఫలాలు అందడం. భారత దేశం అభివృద్ధి పథంలో సాధారణ ప్రజల నుంచి ఔత్సాహిక పారిశ్రామికవేత్తల వరకూ ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉండాలి. అదే ప్రభుత్వ ఉద్దేశం, లక్ష్యం కూడా.

నాగరాజు గురించి క్లుప్తంగా

1993 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన ఎం.నాగరాజు యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (యూఓహెచ్) నుంచి ఫిలాసఫీలో పీజీ పట్టా పుచ్చుకున్నారు. యూఓహెచ్ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. గతంలో ఆయన కేంద్ర బొగ్గు శాఖలో పనిచేశారు. గత ఏడాది ఆగస్టులో కేంద్ర ఆర్థిక సేవల శాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు.

వచ్చే ఏడాది నుంచి వృత్తి విద్యా కోర్సులకు

కొత్త ఫీజులు



త్వరలో నోటిఫికేషన్ జారీ చేయనున్న కమిషన్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో వృత్తి విద్య కళాశాలలకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్త ఫీజులు అమలులోకి రానున్నాయి. ప్రతి మూడేళ్లకోసారి ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ ఫీజులను నిర్ణయిస్తుంది. ఈ మేరకు 2026-27 విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి కొత్త ఫీజులు నిర్ణయించాల్సి ఉంది. సుమారు 3 వేల విద్యాసంస్థలకు ఫీజులను ఖరారు చేయాలి. ఇంజినీరింగ్‌లో ప్రస్తుతం కనిష్ఠ ఫీజు రూ.43 వేలు ఉండగా.. గరిష్ఠంగా రూ.1.20 లక్షల వరకు ఉంది. కన్వీనర్ కోటాలో చేరిన విద్యార్థులకు ప్రభుత్వమే మొత్తం ఫీజులను చెల్లిస్తోంది. యాజమాన్య కోటాలో కన్వీనర్ కోటా ఫీజుపై మూడింతలు వసూలు చేసుకునే వెసులుబాటును కళాశాలలకు కమిషన్ కల్పించింది. కళాశాలలు చేసిన వ్యయం ఆధారంగా ఆయా విద్యా సంస్థలకు ఫీజులను నిర్ణయిస్తారు. ఫీజులకు సంబంధించి త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.

- ఫీజుల విధానంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఫీజులను నిర్ణయించాలని భావిస్తోంది.

వైస్ ఛైర్మన్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు..

కమిషన్ ఛైర్మన్ పదవీకాలం గత నెల 9తో పూర్తికావడంతో ఇన్‌ఛార్జి ఛైర్మన్‌గా వైస్ ఛైర్మన్ విజయప్రకాష్‌ను నియమించనున్నారు. ఈయన పదవీకాలం ఫిబ్రవరి 21 తో ముగుస్తుంది. ప్రస్తుతం నర్సింగ్, బీఈడీ కళాశాలలకు ఫీజులు నిర్ణయించాల్సి ఉండడంతోపాటు కార్యాలయ కార్యకలాపాలు నిర్వహించేందుకు వైస్ ఛైర్మన్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగిస్తున్నారు.

- కమిషన్ చట్టానికి కొన్ని సవరణలు చేసే అవకాశం ఉంది. ప్రభుత్వానికి ఉన్న అధికారాలే కొన్ని కమిషన్‌కు ఉండడంతో వీటిల్లో కొన్నింటిపై సవరణ చేయాలని ఉన్నత విద్యా శాఖ భావిస్తోంది. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ సవరణ బిల్లు ప్రవేశపెట్టనున్నారు.

చేద పోయి.. చేతి పంపు వచ్చె!



బావిలోకి వేసిన చేతి పంపు పైపు



చేతిపంపు కొడుతున్న స్థానికుడు

వందేళ్ల నాటి బావి అది. అందులో నీరు బాగుంటుందని నేటికీ గ్రామస్థులు వాడుతున్నారు. ఇంత ఆదరణ ఉంది కాబట్టే.. అప్పట్లో బావి నుంచి ఒకేసారి 8 మంది నీటిని తోడుకునేలా ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం చేద బకెట్లు, తాళ్లు పోయాయి. చేదే ఓపిక, సమయమూ లేదు. అందుకే ఇలా బావి గట్టుపైన చేతి పంపు ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం జయంతి గ్రామంలో చెరువు ఒడ్డున ఉందీ బావి. చేతి పంపు ఏర్పాటు చేయాలని ప్రజలు ఎన్నోసార్లు పంచాయతీ అధికారులకు మొరపెట్టుకోగా.. చివరికి కూటమి ప్రభుత్వంలో వారి కోరిక నెరవేరింది.

– ఈనాడు, అమరావతి

రూ.100కే వారసత్వ వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్

- ఆస్తి రిజిస్ట్రేషన్ విలువ రూ.10 లక్షలు దాటితే రూ.1,000
- వైకాపా బాదుడు నుంచి రైతులకు భారీ ఊరటనిచ్చిన కూటమి ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: వారసత్వ వ్యవసాయ భూములకు కుటుంబసభ్యుల మధ్య భాగపంపిణీ ఒప్పందాల రిజిస్ట్రేషన్ ఫీజుల విషయంలో కూటమి ప్రభుత్వం సమూల మార్పులు తెచ్చింది. 2021లో వైకాపా ప్రభుత్వం విధించిన బాదుడు నుంచి రైతులకు విముక్తి కల్పించింది. ఆ ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువ రూ.10లక్షల లోపు ఉంటే స్టాంపుడ్యూటీగా రూ.100 చెల్లిస్తే సరిపోతుంది. రూ.10లక్షల పైన ఉంటే రూ.1,000 చెల్లించాలి.

2021 ముందు ఇలా

★ వారసత్వంగా సంక్రమించిన వ్యవసాయ భూముల్ని కుటుంబసభ్యులు భాగపంపిణీ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుంటే.. రిజిస్ట్రేషన్ విలువలో అధిక విలువ కలిగిన ఒక సభ్యుడి వాటాకు మినహాయింపు లభించేది. మిగిలిన ఇద్దరి వాటాల రిజిస్ట్రేషన్ విలువపై 1% స్టాంపుడ్యూటీ వసూలు చేసేవారు.

★ అంటే రూ.15లక్షల విలువైన ఆస్తిని ముగ్గురు కుటుంబసభ్యులు సమానంగా పంచుకుంటే ఒక్కొక్కరికి రూ.5లక్షలు. ఒకరికి మినహాయింపు మిగిలిన రూ.10లక్షలపై 1% చొప్పున రూ.10వేల స్టాంపుసుంకం చెల్లించాలి. భాగపంపిణీ సమానంగా లేకున్నా.. కుటుంబసభ్యుల్లో మేజర్ విలువ కలిగిన ఆస్తికి మినహాయింపు ఇచ్చి మిగిలిన ఇద్దరి ఆస్తి రిజిస్ట్రేషన్ విలువపై స్టాంపు రుసుము వసూలు చేసేవారు.

వైకాపా బాదుడు ఇది

వారసత్వ ఆస్తిని కుటుంబసభ్యుల్లో ఒకరు ఎక్కువ, మిగిలినవారు తక్కువగా తీసుకుంటే.. ఎక్కువగా పొందిన విలువపై 3% స్టాంపుసుంకం వసూలు చేయాలని వైకాపా హయాంలో 2021 నవంబరు 2న ఉత్తర్వులిచ్చారు.

★ రూ.15లక్షల విలువైన ఆస్తిలో పెద్ద కుమారుడి ఆస్తి రిజిస్ట్రేషన్ విలువ రూ.10లక్షలు, రెండో కుమారుడికి రూ.3లక్షలు, మూడో కుమారుడికి రూ.2లక్షల చొప్పున ఉందనుకుందాం. మిగిలిన ఇద్దరితో పోలిస్తే పెద్ద కుమారుడి ఆస్తి విలువ రూ.5లక్షలు అధికం. దీనిపై 3% చొప్పున రూ.15వేల స్టాంపుసుంకం చెల్లించాలి. రిజిస్ట్రేషన్ రుసుము కింద 0.5% చొప్పున రూ.2,500 కట్టాలి.

మిగిలిన ఇద్దరి ఆస్తి రిజిస్ట్రేషన్ విలువ రూ.5లక్షలపై 1% చొప్పున రూ.5వేలు కట్టాలి. రిజిస్ట్రేషన్ రుసుముగా రూ.1,000 చెల్లించాలి. మొత్తం స్టాంపు సుంకం, రిజిస్ట్రేషన్ ఫీజు కలిపి రూ.23,500 అవుతుంది.

ఆగిన భాగపంపిణీ రిజిస్ట్రేషన్లు.. మృతుల పేర్లతో 3.91 లక్షల పట్టాలు

భాగపంపిణీ ఆస్తుల రిజిస్ట్రేషన్ బాదుడుతో చిన్న, సన్నకారు రైతులపై అధికభారం పడింది. దీంతో చాలా మంది రిజిస్ట్రేషన్లకు ముందుకురాలేదు. వెబ్‌ల్యాండ్‌లో 3.91 లక్షల పట్టాలు మృతుల పేర్లతోనే ఉన్నాయి. రాష్ట్రంలోని మొత్తం పట్టాదారుల్లో 4.57% ఇవే.

★ రిజిస్ట్రేషన్ రుసుము భరించలేక చిన్న, సన్నకారు రైతులు 100 రూపాయల స్టాంపుపత్రంపై ఒప్పందాలకే పరిమితం అవుతున్నారు.

★ దీంతో భూముల మ్యుటేషన్ కావడం లేదు. పట్టాదారు పాసుపుస్తకాలు రావడం లేదు. తరచూ సివిల్ వివాదాలు వస్తున్నాయి.

★ ఆస్తి అమ్మినప్పుడు కుటుంబసభ్యులంతా వచ్చి సంతకాలు చేయాలి. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్టు ఇవ్వాలి.

★ తమ స్వాధీనంలోనే భూమి ఉన్నా దాని రిజిస్ట్రేషన్ విలువపై మళ్లీ 1%, 3% చొప్పున స్టాంపు సుంకం ఎందుకు చెల్లించాలనేది రైతుల ప్రశ్న.

రైతన్నకు పెద్ద ఊరట

కుటుంబసభ్యుల మధ్య భాగపంపిణీకి ప్రభుత్వం ఊరట కల్పించడంతో వారసత్వ భూముల రిజిస్ట్రేషన్లు వేగవంతం కానున్నాయి. రిజిస్ట్రేషన్ విలువ రూ.10 లక్షల వరకు ఉంటే రూ.100 కు కుదించింది. రిజిస్ట్రేషన్ విలువ రూ.10లక్షలు మించితే రూ.1,000 చెల్లించాలి. ఈ నిర్ణయంతో రైతులు వారసత్వంగా సంక్రమించిన వ్యవసాయ భూముల్ని రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఆటోమ్యుటేషన్ జరుగుతుంది. వారికి పట్టాదారు పాసుపుస్తకాలతో పూర్తి హక్కులు వస్తాయి.

ఇంటిస్థలాల మరణాలకే..

★ తమ ఆస్తుల్ని వీలునామా రాయకుండా (ఇంటెస్టేట్) కుటుంబపెద్ద మరణిస్తే.. ఆయన ఆస్తుల్ని భార్య, పిల్లలు భాగపంపిణీ చేసుకుంటారు. ఇలాంటి కేసులకే ప్రస్తుత ఉత్తర్వులు వర్తిస్తాయి. అదీ వ్యవసాయ భూములకు మాత్రమే.

తిరుమలలో డ్రోన్ ఎగరవేత కలకలం



సర్వలక్షణ్ దాస్

తిరుమల, న్యూస్‌టుడే: తితిదే ఆధ్వర్యంలోని మూడంచెల భద్రత వ్యవస్థను దాటుకుని, ఓ భక్తుడు తిరుమలలో డ్రోన్ ఎగరవేయడం కలకలం రేపింది. రాజస్థాన్‌లోని జైపుర్‌కు చెందిన శుభం అండేల్‌వాల్ అలియాస్ సర్వలక్షణ్ దాస్, ఒంగోలుకు చెందిన భాను సుందర్ అలియాస్ అర్జున్‌బంద్ దాస్ ప్రవాస భారతీయులు. వీరు శ్రీవారి దర్శనార్థం శుక్రవారం బస్సులో తిరుమల చేరుకున్నారు. అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద భద్రతా తనిఖీలను దాటుకుని తిరుమలకు డ్రోన్ తీసుకొచ్చారు. శిలాతోరణం వద్ద డ్రోన్‌ను ఎగరవేసి చిత్రీకరణ ప్రారంభించారు. భద్రతా సిబ్బందితో అక్కడికి వచ్చిన తితిదే భద్రతాధికారులు వారిద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారిని పోలీసులు అప్పగించగా దర్యాప్తు చేస్తున్నారు.

పొదిలిలో స్వల్ప భూప్రకంపనలు

పొదిలి, న్యూస్‌టుడే: స్వల్ప భూప్రకంపనలతో ప్రకాశం జిల్లాలోని పొదిలివాసులు ఆందోళనకు గురయ్యారు. శుక్రవారం తెల్లవారుజామున 3.12, 3.30, 3.40 గంటల సమయంలో భూమి కంపించినట్లు స్థానికులు చెప్పారు. నాలుగు నుంచి అయిదు సెకన్ల వరకూ ఆ ప్రభావం కనిపించిందని పేర్కొన్నారు. పాతూరు, కొత్తూరు, ఇస్లాంపేట తదితర ప్రాంతాల్లో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు వచ్చారు. కొనకనమిట్ల మండలం చినారికట్ల, పెదారికట్ల ప్రాంతాల్లోనూ భూప్రకంపనలొచ్చాయని అక్కడివారు చెప్పారు. పొదిలిలో ఆరు నెలల కిందట కూడా స్వల్పంగా భూమి కంపించింది. ఇప్పుడు మళ్లీ ప్రకంపనలు రావడంతో అక్కడివారు భయాందోళనలు చెందుతున్నారు.

ఐఐటీ రూర్కీ నిర్వహణలో.. మే 17న జేఈఈ అడ్వాన్స్‌డ్

ఈనాడు, హైదరాబాద్: జేఈఈ అడ్వాన్స్‌డ్-2026 ఈసారి మే 17న జరగనుంది. దేశంలోని 23 ప్రతిష్ఠాత్మక ఐఐటీల్లో బీటెక్, బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (బీఎస్), ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశానికి అడ్వాన్స్‌డ్ పరీక్ష నిర్వహిస్తారు. ఈసారి పరీక్ష నిర్వహణ బాధ్యతను ఐఐటీ రూర్కీ చేపట్టింది. ఈ మేరకు ఆ విద్యాసంస్థ శుక్రవారం వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి, పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామని పేర్కొంది. ఐఐటీల్లో ప్రస్తుతం 18,160 సీట్లు ఉన్నాయి. అడ్వాన్స్‌డ్‌లో ఉత్తీర్ణులైన వారు బీఆర్క్ కోర్సుల్లో చేరాలనుకుంటే ఆర్కిటెక్చర్ ఆప్టిట్యూడ్ టెస్టు (ఏఏటీ) రాయాల్సి ఉంటుంది.

తిరుపతి-సాయినగర్ శిర్డీ కొత్త రైలు

విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: పుణ్యక్షేత్రాలు సందర్శించే ప్రయాణికుల సౌకర్యార్థం తిరుపతి-సాయినగర్ శిర్డీ మధ్య రైల్వే శాఖ కొత్తగా వారంతపు రైలు ప్రారంభించనుంది. దీన్ని తిరుపతిలో ఈ నెల 9న లాంఛనంగా ప్రారంభించనున్నారు. రైలు నంబరు 17425/17426 తిరుపతిలో ఉదయం 11.10 గంటలకు బయలుదేరి బుధవారం సాయంత్రం 6.35 గంటలకు సాయినగర్ శిర్డీ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఇదే రైలు 10వ తేదీ రాత్రి 10.20కి బయలుదేరి 12వ తేదీ ఉదయం 8.30 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్, లింగంపల్లి, వికారాబాద్, జహీరాబాద్, బీదర్, లాతూర్, జాల్నా, నాగర్‌సోల్, మన్మడ్ స్టేషన్లలో ఆగుతుంది.

గ్రహం అనుగ్రహం

6–12–2025 శనివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, మార్గశిర మాసం, బహుళపక్షం
విదియ: రా. 12-54 తదుపరి తదియ
మృగశిర: ఉ. 11-59 తదుపరి ఆర్ద్ర
వర్జ్యం: రా. 7-52 నుంచి 9-23 వరకు
అమృత ఘడియలు: రా.1-09 నుంచి 2-39 వరకు
దుర్ముహూర్తం: ఉ. 6-19 నుంచి 7-48 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.6.20; సూర్యాస్తమయం: సా.5.21

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	17.0	29.0
హైదరాబాద్	17.9	29.4
శ్రీకాకుళం	19.0	28.0
అనంతపురం	19.2	30.7
విశాఖపట్నం	19.8	28.0
కడప	20.0	28.0
రాజమహేంద్రవరం	21.0	33.0
విజయవాడ	21.4	29.4
కర్నూలు	22.0	31.3
ఒంగోలు	22.4	29.8
నరసాపురం	22.6	30.6
నెల్లూరు	23.0	28.2
గుంటూరు	23.0	29.0
తిరుపతి	23.6	29.0
తాడేపల్లిగూడెం	25.0	30.0


ఇదీ సంగతి!



ఫ్లైటెక్ వస్తున్నా... వారంలో అక్కడుంటా... టెన్షన్ పడకు!!

వైకుంఠ ద్వార దర్శనాల్లో సామాన్యులకే ప్రాధాన్యం

- తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్



తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనాల్లో సామాన్య భక్తులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. శుక్రవారం స్థానిక అన్నమయ్య భవనంలో జరిగిన డయల్ తితిదే ఈవో కార్యక్రమంలో వైకుంఠ ద్వార దర్శనాల ఏర్పాట్లను భక్తులకు ఆయన వివరించారు. 'ఈనెల 30 నుంచి జనవరి 8 వరకు పది రోజులపాటు వైకుంఠ ద్వార దర్శనాలు కల్పిస్తున్నాం. మొత్తం 182 గంటల దర్శన సమయంలో 164.15 గంటలు సామాన్యులకే కేటాయించాం. పది రోజుల్లో 7.70 లక్షల మంది దర్శించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ఈనెల 30, 31, జనవరి 1వ తేదీలకు ఈ-డిప్ ద్వారా 1.70 లక్షల మందికి ఇప్పటికే టోకెన్లు కేటాయించాం. మొదటి మూడు రోజులపాటు సర్వదర్శనం, ప్రత్యేక ప్రవేశ దర్శనం (రూ.300 టికెట్), శ్రీవాణి టికెట్ల జారీని రద్దుచేశాం. జనవరి 2 నుంచి 8వ తేదీ వరకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2 ద్వారా భక్తులకు సర్వదర్శనం కల్పిస్తాం. ఆ పది రోజుల పాటు తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో జారీచేసే సర్వదర్శనం టోకెన్లు, ప్రివిలేజ్ దర్శనాలు రద్దు చేశాం. ప్రముఖులు స్వయంగా వస్తే, దర్శనం కల్పిస్తాం. దాతలకు సంబంధించిన టికెట్లు శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయగా, బుక్ చేసుకున్నారు. జనవరి 6, 7, 8 తేదీల్లో తిరుపతి స్థానికుల దర్శించుకోవచ్చు. వారు ఈ నెల 10న ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు' అని ఈవో వివరించారు. సమావేశంలో అదనపు ఈవో వెంకయ్యచౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ, సీఈ సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఈ–డిప్‌లో రాలేదా.. సర్వదర్శనానికి రండి

ఈ-డిప్‌లో టోకెన్లు రాని భక్తులు నిరాశ చెందకుండా జనవరి 2 నుంచి 8 వరకు ఏ టోకెనూ లేకుండా నేరుగా సర్వదర్శనానికి రావొచ్చని తితిదే సూచించింది. సుమారు 6 లక్షల మంది శ్రీవారి సేవకుల ద్వారా ఆయా గ్రామాల పరిధిలోని భక్తులకు వైకుంఠ ద్వార సర్వదర్శనానికి రావాల్సిందిగా ఆహ్వానించాలని ఎస్ఎంఎస్‌లు పంపినట్లు తెలిసింది.

శ్రీవాణి, ఎస్ఈడీ టికెట్లకు విశేష స్పందన

జనవరి 2 నుంచి 8 వరకు శ్రీవాణి, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను శుక్రవారం విడుదల చేయగా భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. శ్రీవాణి దర్శన టికెట్లను రోజుకు 1,500 చొప్పున 10,500 టికెట్లను ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయగా.. గంటా పది నిమిషాల్లోనే మొత్తం బుక్ అయ్యాయి. ప్రత్యేక ప్రవేశ దర్శనానికి రోజుకు 15,000 చొప్పున 1,05,000 టికెట్లను మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయగా 21 నిమిషాల్లోనే కొనుగోలు చేశారు.

విశ్రాంత ప్రిన్సిపల్‌కు సైబర్ నేరగాళ్ల ఫోన్ కాల్

- 'ఈనాడు' కథనం చూపి భార్య హెచ్చరించడంతో.. తప్పిన ముప్పు



'ఈనాడు'లో ప్రచురితమైన ఈ కథనమే అప్రమత్తం చేసింది

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: డిజిటల్ అరెస్టు పేరుతో ఓ రిటైర్డ్ ప్రిన్సిపల్‌ను సైబర్ ముఠా మోసగించేందుకు యత్నించగా, అతని భార్య అప్రమత్తతో బయటపడిన ఉదంతమిది. విజయవాడలోని అయోధ్యనగర్‌కు చెందిన విశ్రాంత ప్రిన్సిపల్‌కు గత బుధవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి ట్రాయ్ నుంచి అంటూ వీడియో కాల్ చేశాడు. మీ పేరుతో ఉన్న సిమ్‌ను ముంబయిలో వివేక్ రాణా అనే వ్యక్తి వాడుతున్నాడని, మీరెవరికైనా ఆధార్ కార్డు ఇచ్చారా అని ప్రశ్నించారు. చాలా సందర్భాల్లో ఇచ్చానని, గుర్తు లేదని బాధితుడు చెప్పడంతో మా పైఅధికారి మాట్లాడతారంటూ పోలీస్ డ్రస్‌లో ఉన్న వ్యక్తిని లైన్‌లోకి తీసుకొచ్చారు. 'ఈ కేసులో నిందితుడిని పట్టుకోవాలి. మీరు సహకరించాలి. లేనిపక్షంలో మిమ్మల్ని అరెస్టు చేస్తాం. మీరు పెద్దవాళ్లన్న గౌరవంతో దిల్లీకి రమ్మనడం లేదు' అని ఆ వ్యక్తి బెదిరింపు ధోరణిలో మాట్లాడారు. కెనరా బ్యాంకులో మీ పేరుతో ఏటీఎం కార్డు ఉందంటూ అస్పష్టంగా కన్పిస్తున్న ఓ కార్డును చూపించారు. తాము భోజనం చేస్తామని ఆ వృద్ధ దంపతులు చెప్పగా, తాము లైన్‌లోనే ఉంటామంటూ రెండు గంటల పాటు కాల్ ఆన్‌లోనే ఉంచారు. ఆ సమయంలో వీరి సంభాషణలు విన్న సైబర్ ముఠా.. మళ్లీ కాల్‌లోకి వచ్చాక తీవ్రంగా హెచ్చరించారు. పిల్లల వివరాలు ఆరా తీస్తూ, ఎవరితోనూ మాట్లాడొద్దని బెదిరించారు. ఈలోగా విశ్రాంత ప్రిన్సిపల్ భార్య ఈనెల 2న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనాన్ని భర్తకు చూపించి, ఇదంతా మోసగాళ్ల ఎత్తుగడగా ఉందని చెప్పడంతో ఆయన అప్రమత్తమయ్యారు. కాల్ కట్ చేసి, వెంటనే తమ ఖాతా ఉన్న బ్యాంకుకు వెళ్లారు. అప్పటికే బ్యాంకు మేనేజర్లతో పోలీస్ కమిషనర్ సైబర్ నేరాలపై సెల్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. తర్వాత ఈ వృద్ధ జంటను మేనేజర్.. సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. వారు ఇంటి నుంచి బ్యాంకుకు చేరే లోపే వేర్వేరు నంబర్ల నుంచి దాదాపు 10 కాల్స్ వచ్చాయి. అవన్నీ సైబర్ నేరగాళ్లవని గుర్తించి వాటిని బ్లాక్ చేశారు. డిజిటల్ అరెస్టు నుంచి తప్పించుకున్న వృద్ధ జంటను అభినందించారు.

ప్రకృతికి తిరుగులేదు.. వెదురుకు ఎదురులేదు!

వెదురుతో చేసిన టూత్ బ్రష్‌లు, దువ్వెనలు శుక్రవారం విజయవాడ సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో కనిపించాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఉద్యాన ప్రదర్శనలో పర్యావరణానికి హితమైన ఉత్పత్తులెన్నో ఉన్నాయి. ప్లాస్టిక్ బ్రష్‌లు, దువ్వెలు వాడిన తర్వాత పారేస్తే అవి భూమిలో కలవడానికి చాలా ఏళ్లు పడుతుంది. అదే.. వెదురు ఉత్పత్తులైతే త్వరగా భూమిలో కలిసిపోతాయి. పర్యావరణానికి ఏమాత్రం హాని ఉండదు. వెదురు టంగ్‌క్లీనర్లూ అక్కడికి వచ్చిన వారిని ఎంతగానో ఆకట్టుకున్నాయి.

– ఈనాడు, అమరావతి



వెదురు బ్రష్‌లు, టంగ్ క్లీనర్స్

భాగస్వామి కోటాలో జీవితాంతం ఒకేచోట విధులా?

(మొదటి పేజీ తరువాయి)

ఒకేచోట పనిచేసేందుకు ఎన్నిసార్లు అవకాశం ఇవ్వడానికి చట్టంలో వెసులుబాటు ఉంది..? ఉద్యోగ సంఘాల నాయకులు ఏళ్ల తరబడి ఒకేచోట పనిచేయవచ్చా..? నిబంధనలు ఏం చెబుతున్నాయి.. తదితర వివరాలను కోర్టు ముందు ఉంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ వ్యవహారంపై లోతుగా విచారణ జరుపుతామంది. తదుపరి విచారణను జనవరి మొదటి వారానికి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

★ విజయనగరం జిల్లా సైనిక్ సంక్షేమ అధికారిగా (జడ్ఎస్‌డబ్ల్యూవో) బాధ్యతల స్వీకరణ విషయంలో కేవీఎస్ ప్రసాదరావు, మజ్జి కృష్ణారావు మధ్య తలెత్తిన వివాదంపై ధర్మాసనం విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. కృష్ణారావు తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. భార్య సమీపంలో పనిచేస్తున్న కారణంతో కృష్ణారావు విజయనగరంలో జడ్ఎస్‌డబ్ల్యూవోగా కొనసాగుతున్నారన్నారు. స్పౌజ్ కోటా వెసులుబాటును వినియోగించుకోవడం ఆయనకు ఇది మొదటిసారన్నారు. ప్రసాదరావు కోర్టుకు తప్పుడు వివరాలు నివేదిస్తున్నారని చెప్పారు.

★ ప్రసాదరావు, కృష్ణారావుల నియామకానికి సంబంధించిన నోట్ ఫైళ్లను పరిశీలించిన ధర్మాసనం అవి సక్రమంగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. జిల్లా కలెక్టర్, ఎస్పీ దాఖలు చేసిన కౌంటర్లను పరిశీలించింది. కృష్ణారావు తనతో దౌర్జన్యంగా వ్యవహరించారంటూ ప్రసాదరావు ఇచ్చిన ఫిర్యాదును మరోసారి పరిశీలించి అఫిడవిట్ దాఖలు చేయాలని విజయనగరం జిల్లా ఎస్పీ, ఒకటో పట్టణ ఇన్‌స్పెక్టర్‌ను న్యాయస్థానం ఆదేశించింది.

వసతి గృహాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు

1,365 మంది సిబ్బంది నియామకానికి ప్రభుత్వం అనుమతి

ఈనాడు, అమరావతి: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, పరిశుభ్రత చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 1,051 వసతి గృహాల్లో 1,365 మంది సిబ్బంది నియామకానికి పచ్చజెండా ఊపింది. పొరుగు సేవల విధానంలో ఈ నియామకాలు చేపట్టేందుకు అనుమతిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకాలు ఆర్థికశాఖ ఇది వరకే జారీ చేసిన నిబంధనలకు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేసింది. ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులకు అనుగుణంగా ఖర్చు ఉండేలా చూసుకోవాలని సూచించింది. రాష్ట్రంలోని అన్ని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, పరిశుభ్రత ప్రమాణాలను నెలవారీగా పర్యవేక్షించాలని, క్రమం తప్పకుండా దానిపై నివేదిక అందించడం కోసం ప్రత్యేకమైన విధానాన్ని రూపొందించాలని ఆదేశించింది.

శత వసంతాల శిలాఫలకం



అల్లూరి సీతారామ రాజు జిల్లాలోని లంబసింగి ఘాట్ రోడ్డును బ్రిటిష్ పాలకులు 1916-1921 మధ్యలో నిర్మించారు. అప్పట్లో పెదపేట, కొండసంత గ్రామాలకు వెళ్లే కూడలిలో లంబసింగి ఘాట్ రోడ్డుకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. వందేళ్లు దాటిన ఆ బండ గుర్తు నేడు పర్యాటకులకు ఓ సెల్ఫీ పాయింట్‌గా మారింది. నర్సీపట్నం నుంచి చింతపల్లి వెళ్లే పర్యాటకులు దీన్ని ఆసక్తిగా తిలకిస్తున్నారు. – న్యూస్‌టుడే, కొయ్యూరు

జగన్ వ్యాఖ్యలపై భగ్గుమన్న బీసీ సంఘాలు

బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్

ఈనాడు, అమరావతి: బీసీ సామాజికవర్గానికి చెందిన ఉన్నతాధికారులు కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ పి.కృష్ణయ్య, సీనియర్ ఐపీఎస్ అధికారి జి.గోపీనాథ్‌లను అవమానిస్తూ వైకాపా అధినేత జగన్ చేసిన వ్యాఖ్యలపై బీసీ సంఘాలు భగ్గుమన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. పలుచోట్ల ర్యాలీలు చేసి జగన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కర్నూలులో యాదవ సంఘాల కార్యకర్తలు పెద్దసంఖ్యలో రహదారిపై చేరి నిరసన వ్యక్తం చేశారు. ఉమ్మడి నెల్లూరు, కృష్ణా, ప్రకాశం, అనంతపురం, గోదావరి జిల్లాల్లో యాదవ సంఘాలు ఆందోళనలు నిర్వహించాయి. జగన్ బహిరంగ క్షమాపణ చెప్పకపోతే పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. జగన్ వ్యాఖ్యలను బీసీ సంక్షేమ సంఘాల ఐకాస ఖండించింది.



మిలియనీర్‌లా ఆలోచించడమంటే..

- మీరు అందించే సేవలకు అదనపు విలువను జోడించి ఇతరుల కన్నా భిన్నంగా నిలవడం.
- నైపుణ్యాలను పెంపొందించుకుంటూ మీ మార్కెట్ విలువను పెంచుకోవడం.
- దీర్ఘకాలిక దృష్టితో ప్రయత్నాలు కొనసాగించడం.
- అన్ని చోట్లా అవకాశాలను అన్వేషించడం.
- అనుభవజ్ఞులతో సంబంధాలు పెంచుకుంటూ నెట్‌వర్క్‌ను విస్తరించుకోవడం.
- సవాళ్లను పురోగతికి సోపానాలుగా భావించడం.

– క్రిస్, మైండ్‌సెట్ కోచ్

LG

Life's Good.

భారతదేశం నలుమూలల్లో ఆనందం, సౌకర్యంతో నిండిన గృహాన్ని సృష్టించుకునే అద్భుతమైన అవకాశాన్ని LG మీకు అందిస్తోంది. మీ ఆశయాలను నిజం చేస్తూ, LG Essential Series మీ రోజువారీ జీవితాన్ని సరళంగా, మరింత సుఖమయంగా మారుస్తుంది.

అత్యాధునిక టెక్నాలజీ ఇప్పుడు మరింత చేరువలో!

Introducing LG Essential Series

ప్రతి ఇంట్లో Appliances, ప్రతి ఇంట్లో Happiness.









Double Door Refrigerator

- **Convertible with Dairy Mode-** Convert Freezer to Fridge with Dedicated Dairy Mode
- **Turbo Fresh Zone-** Separate Compartment for Quick Chilling
- **Smart Mode-** Auto Temperature Change based on weather



Fully Automatic Washing Machine

- Long Lasting ProShield™ Motor
- Low Water Pressure Fill#
- Water Resistant Control Panel. IPX4 Rating^



Convertible Microwave Oven

- Microwave + Air Fry
- Pre-Set 331## Autocook Menu
- 28 Types of Indian Breads

INTRODUCTORY LIMITED PERIOD OFFERS

CASHBACK UP TO 5%* Max up to ₹2000 (Applicable on select models)

FIXED EMI ₹1499* (Applicable on select models)

0* DOWN PAYMENT (Rest in EMIs) (Applicable on select models)

LG BEST Care | LG 24 x 7 CUSTOMER CARE 08069379999 www.lg.com/in/support | LG WhatsApp No. 9711709999 | LG Service India Mobile App Available at Google Play | www.facebook.com/lgindiapage/ | www.x.com/lgIndia | To know more about LG, visit www.lg.com/in For Corporate/Institutional enquiries, please write to corp.enquiries@lge.com

AMERICAN EXPRESS | AXIS BANK | BOBCARD | DBS | FEDERAL BANK | HDFC BANK | IDFC FIRST Bank | J&K Bank | kotak | onecard | SBI card | YES BANK

Regd. Office: LG Electronics India Limited, A-24/6, Mohan Cooperative Industrial Estate, Mathura Road, New Delhi-110044 CIN No. U32107DL1997PLC220109

*T&C Apply. Offers applicable from 1st Dec till 31st Dec, 2025 ("Offer Period"). Product images shown are for illustration purposes. Product appearance and features may vary. By participating in these offers, the customer agrees to all terms and conditions of these offers. Offers mentioned may vary with respect to the product purchased. Any person availing this offer shall be deemed to have accepted these offer terms. Offer is available on selected products only, kindly check with store manager for offers before any purchase. LG Electronics India Limited (LGEIL) shall not assume any legal and/or financial responsibility for any unclaimed benefits beyond the applicable period of the promotional offer. Up to 5% or max ₹2000 (whichever is lower), cashback offer is applicable only on select Washing Machine models only. Cashback will be posted to the consumer account after 90 days from end of offer period, unless instant cashback is active in the store. Cashback is at the sole discretion of bank/finance company and is governed by the terms and conditions of bank/finance company. Cashback on Credit and Debit card, EMI / Non EMI transactions depends on bank to bank on select category. For purchase of product, payment is allowed only from one card (single payment cannot be divided between two or more cards). Three transactions per card are allowed during offer period (Oct~Dec, 2025) except SBI & AU S.F. One transaction per card/per month is allowed on SBI & AU S.F. Cashback should appear on charge slip for applicability. LG will facilitate interest cost up to 4% depending upon bank to bank and on tenure of EMI as opted by the customer. Processing/ convenience fee charged on the transactions may also vary from bank to bank. Customers are advised to check with respective bank/finance companies for details. Offer valid on 6 months & above EMI tenure for HDFC/SBI/ICICI/AU S.F/SCB/One Card (in case offer is live with these bank cards). LGEIL expressly disclaims any and all liability in any manner whatsoever. All finance offers are subject to approval by finance companies/banks based on their respective terms and conditions and are subject to their assessment. ₹1499/- EMI is applicable on select models of Refrigerators, 0 down payment offer is applicable only on select models of Refrigerators (kindly check with store manager for offers before any purchase). LGEIL reserves the right, at any time and without prior notice, to cancel any offer/draw or amend/modify the terms and conditions of the draw/offer. LGEIL reserves the right to disqualify any contestant/customer if they supply untruthful, inaccurate or misleading personal details and/or information, have failed to abide by the rules and/or are in breach of the terms herein. LGEIL decisions shall be final. The courts of Delhi shall have sole jurisdiction in relation to the terms and conditions of the offer/draw contained in this release which shall be interpreted according to the laws of India. LG refers to LG Electronics India Limited. LG Electronics India Limited ("LGEIL") is not the owner or seller of the third party product, and is not acting as the agent or representative of the third party with respect to the third party product. ##No. of Autocook menu may vary from model to model. ^IPX4 rating as per Intertek certification dated 19/08/2025. #Low pressure water fill is tested for water pressure measured at level of 0.6 bar. LGEIL makes no representations or warranties, express or implied, of any kind, whatsoever, with respect to such third party product. LGEIL hereby expressly disclaims all warranties with respect to the third party product, including without limitation, the warranties of merchantability and fitness for a particular purpose. LGEIL expressly disclaims any liability for the safety, performance and quality of any such third party product. Star rating may vary from product to product. For more information please visit www.lg.com/in

ఈనాడు

రష్యాయే విశ్వసనీయ నేస్తం

కాలపరీక్షకు నిలిచి గెలిచిన ఇండియా, రష్యా సంబంధాల్లో నూతన అధ్యాయం మొదలైంది. రష్యా అధ్యక్షుడు పుతిన్ తాజా భారత పర్యటన ద్వైపాక్షిక బంధాన్ని మరింత బలోపేతం చేసింది. 23వ వార్షిక శిఖరాగ్ర సదస్సులో భాగంగా రక్షణ, వాణిజ్యం, ఆర్థికం, ఆరోగ్య పరిరక్షణ, వలసలు తదితరాలకు సంబంధించి ఇరు దేశాల నడుమ కుదిరిన ఒప్పందాలు ఉభయతారకమైనవి. పాతికేళ్ల క్రితం పుతిన్ తొలిసారి రష్యా పగ్గాలు చేపట్టాక భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం మొగ్గతొడిగింది. అనంతర కాలంలో అది మరింత దృఢమైంది. ఆ బాంధవ్యాన్ని రాబోయే రోజుల్లో ఇంకా పటిష్ఠం చేసుకోవాలని మోదీ, పుతిన్ నిన్న నిశ్చయించడం హర్షణీయం. అణు విద్యుదుత్పత్తి పరంగా ఇండియాకు ఇప్పటికే తోడ్పాటు అందిస్తున్న రష్యా- రాబోయే రోజుల్లో మరిన్ని న్యూక్లియర్ రియాక్టర్లు, ఇతర అణువిద్యుత్ కేంద్రాల నిర్మాణానికి హామీ ఇచ్చింది. కర్బన ఉద్గారాల కట్టడితో పాటు జలాంతర్గాములు, అంతరిక్ష పరిశోధనల్లో భారతావనికి అది అక్కరకొస్తుంది. వలసదారులపై ట్రంప్ కన్నెర్రజేస్తున్న ప్రస్తుత తరుణంలో నిపుణ మానవ వనరులకు ఆహ్వానం పలకడానికి సంబంధించి ఇరు దేశాల నడుమ ముడిపడిన ఒప్పందం స్వాగతించదగింది!

మాస్కో నుంచి రాయితీ ధరలపై చమురు కొంటున్న ఇండియాపై ట్రంప్ కంటగింపుగా ఉన్నారు. భారత్‌పై అదనపు సుంకాలూ మోపారు. తమ షరతులకు తలొగ్గి వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి ఇండియా సిద్ధంగా లేకపోవడంపైనా ఆయన అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మోదీ, పుతిన్ భేటీ- జాతీయ ప్రయోజనాల పరిరక్షణలో ఇండియా స్వతంత్రంగా వ్యవహరిస్తుందనే కీలకాంశాన్ని మరోసారి స్పష్టంచేసింది. అంతర్జాతీయ సదస్సుల సందర్భంగానో, ఫోన్‌లోనో పుతిన్‌తో మోదీ ఇటీవల కాలంలో తరచూ చర్చలు సాగిస్తున్నారు. తద్వారా మాస్కోతో మన 'ప్రత్యేక, విశేష వ్యూహాత్మక బంధం' ప్రాధాన్యాన్ని ప్రపంచానికి చాటిచెబుతూనే, పాశ్చాత్య దేశాల ఒత్తిళ్లకు తలొగ్గేది లేదని స్పష్టం చేస్తున్నారు. వాస్తవానికి, గత ఏడు దశాబ్దాలుగా భారత రక్షణ అవసరాలకు రష్యానే పెద్ద దిక్కుగా నిలుస్తోంది. ఆయుధాలు, ఇతర సైనిక సామగ్రిని సరఫరా చేయడమే కాకుండా వాటి ఉమ్మడి అభివృద్ధికి, కీలక సాంకేతికతల బదిలీకీ మాస్కో ముందుకొస్తోంది. అలా రక్షణ రంగంలో ఇండియా స్వావలంబనకు సహకరిస్తున్న రష్యా- ఎలాంటి పరిస్థితుల్లోనైనా భారతావనికి విశ్వసనీయ నేస్తంగా నిలుస్తోంది!

ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి పదివేల కోట్ల డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలని ఇండియా-రష్యా సంకల్పించాయి. గత ఆర్థిక సంవత్సరంలో అది 6,870 కోట్ల డాలర్లకు చేరింది. చమురు దిగుమతులు వెల్లువెత్తుతున్న దరిమిలా రష్యాతో ఇండియా వాణిజ్యలోటు 5,900 కోట్ల డాలర్లకు ఎగబాకింది. ఈ అసమతౌల్యాన్ని తగ్గించేందుకు భారత్ నుంచి వ్యవసాయోత్పత్తులు, ఔషధాల కొనుగోళ్లను పెంచుతామన్న పుతిన్ వాగ్దానం- చిరకాల మైత్రీబంధానికి కొత్త చివుళ్లు తొడిగేదే. భారతదేశాన్ని అస్థిరపరిచేందుకు కాచుకు కూర్చున్న పాకిస్థాన్‌కు బీజింగ్ ఆయుధాలు సరఫరా చేస్తోంది. ఇటీవల కాలంలో ఇస్లామాబాద్‌ను ట్రంప్ సర్కారు సైతం చంకనెక్కించుకుంటోంది. ఇండియా తమ మిత్రదేశమని అమెరికా పైకెన్ని కబుర్లు చెప్పినా స్వప్రయోజనాలే పరమావధిగా పావులుకదిపే అగ్రరాజ్యాన్ని ఎన్నటికీ పూర్తిగా నమ్మలేం. ఆర్థికంగా, సాంకేతికంగా బలసంపన్నమైన పాశ్చాత్య దేశాలతో సత్సంబంధాలు నెరపుతూనే- జాతీయ భద్రత, ఇంధన అవసరాలు తదితరాలను దృష్టిలో ఉంచుకుని రష్యాతో చెలిమిని సుదృఢం చేసుకుంటూ అంతర్జాతీయ భౌగోళిక రాజకీయాల్లో ఇండియా ఒడుపుగా నెగ్గుకురావాలి!



నైతిక నిష్ఠ, సహానుభూతి, ధైర్యం, బాధ్యత, ప్రజా ప్రయోజనం... ఇవన్నీ నాయకత్వ లక్షణాలు కావాలి. నాయకత్వమనేది కేవలం ఎలాగోలా సంపాదించుకునే పదవి. కాదు, గౌరవంతో తెచ్చుకోవాల్సిన స్థానం.

– నిరుపమారావు

జ్ఞానప్రదాయిని

'తల్లీ! నిన్ను దలంచి పుస్తకము చేతన్ బూనితిన్...' అని ఆ చదువుల తల్లిని తలచుకుంటూ పుస్తకం తెరుస్తాం. ఉన్నతమైన జ్ఞాన సముపార్జనకు, ఎంచుకున్న రంగాల్లో రాణించడానికి, ఖ్యాతిని పొందడానికి ఆ జగన్మాత ఆశీస్సులు మనపై ఉండాలని కోరుకుంటాం.

కాంచీపురంలోని కామాక్షి ఆలయంలో రోజూ అమ్మను ధ్యానించే ఒక కవికి, ఒక మూగవాడికి ఆ తల్లి ప్రత్యక్షమై తన నోటిలోని తాంబూలపు పిడచ తీసి అందించిందట. కవి 'ఎంగిలి' వద్దన్నాడు. మూగవాడు మహాప్రసాదంగా భావించి అందుకున్నాడట. అంతే... అమ్మవారి పాదాలను చూస్తూ గుక్కతిప్పుకోకుండా నూరు శ్లోకాలు చెప్పాడట. అది 'పాదారవింద శతకం' అయ్యింది. అమ్మ తనను కటాక్షించిన చూపును వర్ణిస్తే 'కటాక్ష శతకం' అయ్యింది. అలాగే అమ్మ చిరునవ్వు మీద 'మందస్మిత శతకం', అమ్మవారి పెద్దరికం మీద 'ఆర్యాశతకం', అమ్మని స్తుతిస్తూ 'స్తుతి శతకం' ఇలా అయిదు వందల శ్లోకాలను ఏకబిగిన చెప్పాడు. ఆయనే మూక కవి అని పిలిచే మూక శంకరులు. అమ్మవారు సంతోషించి ఆయనను వరం కోరుకోమందట. 'నిన్ను కీర్తించిన ఈ నాలుకతో మరేదీ మాట్లాడలేను. నా వాక్కును తిరిగి తీసుకో తల్లీ' అన్నాడట. కామాక్షి మాత పట్ల ఆయన భక్తితత్పరతను వివరించే గాథ ఇది!



అంతర్యామి

కాళిదాసు మొదట నిరక్షర కుక్షి. భార్య మాట ప్రకారం ఉజ్జయిని మహాంకాళి ఆలయంలో అమ్మ కటాక్షం కోసం వేచి చూస్తూ కూర్చున్నాడు. నమ్మిన భక్తుడి నాలుక మీద ఆ తల్లి బీజాక్షరాలను రాసిందంటారు. 'మాణిక్యవీణాం' అంటూ మొదలుపెట్టి 'చతుర్భుజే చంద్రకళావతంసే' అని ఆ పరదేవతా తత్వాన్ని శ్యామలా దండకంలో వర్ణించాడు కాళిదాసు. మహాలక్ష్మి, మహాకాళి, మహా సరస్వతి... ఈ ముగ్గురూ జగన్మాత స్వరూపాలే. 'సచామర రమా వాణీ సవ్యదక్షిణ సేవితా' అంటుంది లలితా సహస్రనామం. 'శరత్ జ్యోత్స్నా శుద్ధాం' అనే శ్లోకంలో ఆది శంకరులు 'తదియనాటి చంద్రరేఖను కిరీటంలో ధరించిన జ్ఞానప్రదాయిని శారదకు మనస్ఫూర్తిగా నమస్కరించినట్లయితే తేనె, పాలు, ద్రాక్షరసం వంటి మధుర వాక్కును అనుగ్రహించి, జ్ఞానమార్గాన్ని ప్రసాదిస్తుంది' అంటారు. ఈ శ్లోకంలో సారస్వత ప్రయోగానికి సంబంధించిన ఉపదేశాన్ని ఆచార్యుల వారు మనకు అందించారు. అమ్మను సేవించేవారు ధ్యానించాల్సిన రూప వర్ణన కూడా ఈ శ్లోకంలో ఉంది. ఆ తల్లినే నమ్మి, ధ్యానించినవారు మహాకవులు, పండితులు అవుతారని ప్రతీతి. ఆ దేవదేవిని జ్ఞానాపేక్షతో సేవిస్తే అజ్ఞానం వీడిపోతుందని, దరిద్రం తొలగిపోతుందని, మోక్షాపేక్షతో సేవిస్తే సంసార సాగరంలో ఈదుతున్న వారికి మోక్షం లభిస్తుందని శంకరులు సౌందర్యలహరిలో చెబుతారు. అజ్ఞానపు చీకట్లను చీల్చుకుంటూ జ్ఞానం వైపు అడుగిడటానికి ఆ ముగ్గురమ్మల మూలపుటమ్మ అయిన జగన్మాత చల్లని చూపులు అందరి పైన ఉండాలని కోరుకుందాం!

– గంటి ఉషాబాల



దారి తప్పిస్తున్న దొంగ సంకేతాలు

నేటి కాలంలో ప్రయాణ సాధనాలకు ఉపగ్రహ సంకేతాలు ఎంతో అక్కరకు వస్తున్నాయి. అయితే వాటిని స్తంభింపజేయడం, నకిలీ సిగ్నళ్లను సృష్టించడం ద్వారా నౌకలు, విమానాలు, డ్రోన్లు గతితప్పి కూలిపోతున్నాయి. అందుకనే, ఇలాంటి పరిస్థితి చోటుచేసుకున్న పది నిమిషాల్లోనే తమకు తెలియజేయాలని ఎయిర్‌లైన్స్‌తో పాటు పైలట్లు, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లను పౌరవిమానయాన డైరెక్టర్ జనరల్(డీజీసీఏ) కార్యాలయం ఇటీవల ఆదేశించింది. దిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి రాకపోకలు సాగించే విమానాల విషయంలో పలుసార్లు 'జీపీఎస్ స్పూఫింగ్' జరగడంతో డీజీసీఏ ఈ ఆదేశాలు జారీచేసింది.

ప్రపంచవ్యాప్తంగా విమానాలు, నౌకలు ఉపగ్రహ సంకేతాలను బట్టి ప్రయాణం సాగిస్తుంటాయి. అమెరికాకు చెందిన గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్(జీపీఎస్), రష్యా, ఐరోపా, చైనాలు ఉపయోగించే గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్(జీఎన్ఎస్ఎస్) ద్వారా ఈ సంకేతాలు ప్రసారమవుతున్నాయి. కానీ, ఈ సిగ్నళ్లను స్తంభింపజేయడం(జామింగ్), అసలైన సంకేతాలను వెనక్కు నెట్టేలా నకిలీ వాటిని ఇబ్బడిముబ్బడిగా గుప్పించడం(స్పామింగ్), అసలైన సంకేతాలను అనుకరిస్తూ నకిలీ సిగ్నళ్లతో విమానాలను బురిడీ కొట్టించడం(స్పూఫింగ్) సులభమైపోయింది. నిజానికి ఇవన్నీ ఎలక్ట్రానిక్, సైబర్ యుద్ధాల్లో ఉపయోగించే ఎత్తుగడలు. దిల్లీ విమానాశ్రయంలో రోజూ 1500 విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక్కడే కాకుండా, దేశంలోని ఇతర విమానాశ్రయాల్లోనూ జీపీఎస్ స్పూఫింగ్, జామింగ్ ఘటనలు చోటుచేసుకున్నాయి. 2023 నవంబరు- 2025 ఫిబ్రవరి మధ్య అమృత్‌సర్, జమ్మూ విమానాశ్రయాల్లో దాదాపు 465సార్లు స్పూఫింగ్ ఘటనలు జరిగాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఇది ఇండియాకే పరిమితం కాదు. స్వీడన్‌లో ఈ ఏడాది మొదటి నాలుగు నెలల్లో 1,23,000 సార్లు విమానాలు, నౌకలు స్పూఫింగ్, జామింగ్‌కు గురయ్యాయి. గతేడు ప్రపంచవ్యాప్తంగా 4.3లక్షల జామింగ్ ఘటనలు జరిగాయని అంతర్జాతీయ విమాన రవాణా సంస్థ తెలిపింది.

ఆ ఘటన సంచలనాత్మకం...

అమెరికాకు చెందిన 'ఆర్‌క్యూ-170' స్టెల్త్ డ్రోన్ 2011 డిసెంబరు 5న ఇరాన్-అఫ్గానిస్థాన్ సరిహద్దు సమీపంలో రాడార్ తెర మీది నుంచి అకస్మాత్తుగా అదృశ్యమైంది. ఈ డ్రోన్ గగనతలం నుంచి నిఘా వేస్తుండగా జీపీఎస్ స్పూఫింగ్‌తో కిందకు దింపి పట్టుకున్నామని ఇరాన్ ప్రకటించింది. అమెరికా ఈ డ్రోన్‌ను ఉపగ్రహం, భూతల కేంద్రం నుంచి పంపే సంకేతాల సాయంతో నడుపుతోంది. ఇరాన్ ఆ సంకేతాలను జామ్ చేసి డ్రోన్‌ను ఆటోపైలట్ మోడ్‌లోకి తీసుకెళ్లింది. తరవాత నకిలీ సంకేతాలు పంపి(స్పూఫింగ్) దాన్ని కిందకు దించారు. తరవాత ఆ డ్రోన్‌లోని విడిభాగాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని కాపీ కొట్టి దాని ఆధారంగా ఇరాన్ సొంతంగా 'సేహి', షాహెద్ డ్రోన్లను తయారు చేసుకుంది! ఈ ఏడాది మార్చిలో మయన్మార్‌లో భూకంపం సంభవించినప్పుడు భారత్ ఒక సి-130 సూపర్ హెర్క్యులస్ విమానంలో 15 టన్నుల సహాయ సామగ్రిని మయన్మార్‌కు పంపింది. అది ఆ దేశ గగనతలంలో ప్రవేశించగానే జీపీఎస్ స్పూఫింగ్‌కు గురైంది. తరవాత భారత్ పంపిన ఇతర విమానాలకూ ఇదే బెడద ఎదురైంది. దాంతో మన పైలట్లు బయటి నుంచి వచ్చే ఉపగ్రహ సంకేతాలను కాదని, విమానంలోని సొంత నావిగేషన్ సిస్టమ్‌పై ఆధారపడి ప్రయాణం కొనసాగించారు. 2014లో హిందూ మహాసముద్రంలో మలేసియా ప్రయాణికుల విమానం అదృశ్యమవడానికి కారణం జీపీఎస్ స్పూఫింగేనని భావిస్తున్నారు. ఆ విమానం ఆచూకీ ఇంతవరకు లభించలేదు. ఐరోపా సమాఖ్య అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లేయెన్ మొన్న సెప్టెంబరులో బల్గేరియాకు విమానంలో వెళ్తుండగా, రష్యన్లు జీపీఎస్ జామింగ్‌కు దిగారని తెలిసింది. అంతకుముందు మార్చిలో పోలండ్ నుంచి బ్రిటన్‌కు వెళ్తున్న బ్రిటిష్ రక్షణమంత్రి గ్రాంట్ షాప్స్ విమానాన్ని రష్యన్లు ఇలానే జామ్ చేశారు.

సొంత నావిగేషన్ వ్యవస్థలే రక్ష!

నౌకలు, విమానాలు, డ్రోన్లకు ఉపగ్రహాల నుంచి దిశానిర్దేశం చేయడానికి అమెరికా జీపీఎస్‌ను వాడుతుంటే రష్యా 'గ్లోనాస్'(గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్)ను, ఐరోపా సమాఖ్య గెలిలియో సిస్టమ్‌ను, చైనా బైదూ వ్యవస్థను ఉపయోగిస్తున్నాయి. ప్రపంచమంతటా విస్తరించిన వ్యవస్థలివి. ఇక ప్రాంతీయ వ్యవస్థల్లో ఇస్రో తయారుచేసిన నావిక్ (నావిగేషన్ విత్ ఇండియన్ కాన్స్‌టలేషన్) ప్రధానమైనది. భారత్‌తో పాటు చుట్టూ 1500 కిలోమీటర్ల పరిధిలోని నౌకలు, విమానాలకు ఇది దిశానిర్దేశం చేస్తోంది. జపాన్ రూపొందించిన క్వాసీ జెనిత్ శాటిలైట్ సిస్టం కూడా రంగంలో ఉంది.

అధునాతన సాంకేతికతలతో భరోసా


సముద్రంలో తాము ఉండాల్సిన చోటును కాకుండా వేరేచోట ఉన్నామని నౌకల్లోని వారిని బురిడీ కొట్టించడానికి జీపీఎస్ స్పూఫింగ్‌కు పాల్పడుతున్నారు. మధ్యధరా సముద్రం, పర్షియా సింధు శాఖ జలాల్లో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి. నల్లసముద్రంలో 2017లో పలు రవాణా, యుద్ధనౌకలను ఇలానే మభ్యపెట్టారు. సముద్రంలో బాగా దూరాన ఉన్న ఆ నౌకలకు తీరానికి దగ్గర్లో ఉన్నట్లు సంకేతాలు పంపారు. 2018లో హోర్ముజ్ జలసంధిలో అనేక నౌకలు జీపీఎస్ స్పూఫింగ్ వల్ల బాగా దూరానికి జరిగిపోయాయి. 2019లో ఉత్తర ఐరోపాలోని బాల్టిక్ సముద్రంలో స్పూఫింగ్ ఘటనల మూలంగా నౌకల రవాణాకు తీవ్ర అంతరాయాలు కలిగాయి. ఇలాంటి నకిలీ సంకేతాల బెడదను తప్పించుకోవడానికి అడ్వాన్స్‌డ్ రిసీవర్ టెక్నాలజీని అభివృద్ధి చేస్తున్నారు. జీపీఎస్ సిగ్నళ్లను కెమెరాలు, సెన్సర్లు అందించే సమాచారంతో సరిచూసి నకిలీ సంకేతాలను కనిపెట్టడానికి మల్టీ సెన్సర్ ఫ్యూజన్ ప్రక్రియను ఉపయోగిస్తున్నారు. సంకేతాలు ఎక్కడి నుంచి వస్తున్నాయో నిర్ధారించుకోవడానికి జామింగ్ సిగ్నళ్ల మూలాలను పసిగట్టే టెక్నాలజీ కూడా అందుబాటులోకి వచ్చింది. పూర్తిగా జీపీఎస్ మీదే ఆధారపడకుండా బ్యాకప్ సిస్టంను రూపొందించారు. వీటి ద్వారా విమానాలు, నౌకలు సజావుగా గమ్యం చేరుకునే అవకాశముంటుంది.



పెండ్యాల కృష్ణశాస్త్రి
కేంద్ర హోంశాఖలో మాజీ సైబర్ ఫోరెన్సిక్ శాస్త్రవేత్త

ప్రపంచ గమనాన్ని మార్చిన గొప్ప గొప్ప విజేతలెవరూ విజయాల వెంట పరుగులు తీయలేదు. విజయాలే వారిని వెతుక్కుంటూ వచ్చాయి. తమ కలలకు రెక్కలిచ్చి లోహ విహంగాన్ని ఆవిష్కరించిన రైట్ సోదరులు సైతం అదే కోవకు చెందుతారు. ఇవాళ ఉదయం ఓ ఖండంలో నిద్రలేచి రాత్రి మరో ఖండంలో నిద్రపోగలుగుతున్నామంటే అది వారి చలవే! ఈ బృహత్తర యత్నం ప్రారంభించినప్పుడు ఆ అన్నదమ్ముల మెదళ్లలో ఉన్నది మానవాళికి మేలు చేయాలనే సత్సంకల్పం మాత్రమే.

బుద్ధిజీవి అయిన మనిషి అప్పటికే నేలపై వాహనాలను పరుగులు పెట్టించాడు. సముద్రాల్ని దాటేలా నౌకలు తయారు చేశాడు. ఇక జయించాల్సింది ఆకాశాన్ని మాత్రమే. ఈ దిశగా ఎన్నో పరిశోధనలు, విఫల ప్రయత్నాలు జరిగాయి. వాటన్నింటిలో ప్రధానంగా చెప్పుకోవాల్సింది...




ఏది విజయం.. ఎవరు విజేత?

సామ్యూల్ పియర్‌పాంట్ లాంగ్లీ గురించి. డబ్బులకు కొదవలేని సంపన్నుడు అతను. అమెరికాలోని పెద్దపెద్ద కంపెనీలతో పరిచయాలున్నాయి. అద్భుత తెలివితేటలు ఉన్న ఇంజినీర్లను తన ప్రాజెక్టులో భాగం చేశాడు. అంతకన్నా ఎక్కువగా.. లాంగ్లీకి గతంలో కొన్ని ఆవిష్కరణలు చేసిన అనుభవం ఉంది. సమస్త వనరులు సిద్ధం చేసుకుని రంగంలోకి దిగాడు. అయినా లాభం లేకపోయింది. అతను విమానాన్ని గాల్లోకి ఎగిరించలేకపోయాడు. కారణం ఏంటంటే... విమానాన్ని తయారుచేయడమెలా అనే దానికన్నా తయారైన విమానాలతో వ్యాపారం చేసి డబ్బు ఎలా సంపాదించాలన్న దాని గురించి లాంగ్లీ ఎక్కువగా ఆలోచించాడు. అతడిలో ఆవిష్కర్తను మించిన వ్యాపారి ఉన్నాడు. దాంతో వరస వైఫల్యాలు ఎదురవడం, మళ్లీ మళ్లీ పెట్టుబడి పెట్టాల్సి రావడంతో ఇది గిట్టుబాటు అయ్యే వ్యవహారం కాదని మధ్యలోనే కాడి వదిలేశాడు.

నిజానికి లాంగ్లీతో పోలిస్తే రైట్ సోదరులకు ఉన్న వనరులు ఏపాటి? వాళ్లకున్నది చిన్న సైకిల్‌షాపు. అందులోని విడిభాగాలతోనే తొలుత ప్రయత్నాలు మొదలుపెట్టారు. డబ్బుల కోసం ఎందరి దగ్గరో చేయి చాచారు. పైగా వాళ్లది గొప్పగా చదువుకున్న నేపథ్యమూ కాదు. కానీ సంకల్పం మాత్రం చాలా గట్టిది. ప్రయోగంలో ప్రతి దశలో లెక్కలేనన్ని వైఫల్యాలు ఎదురయ్యాయి. రెండుసార్లు చివరిదాకా వచ్చి అంతా బాగుందనుకునేలోగా కుప్పకూలిపోయాయి. మళ్లీ జీరో నుంచి మొదలుపెట్టారే తప్ప ఉసూరుమంటూ వదిలేయలేదు. ఆరేళ్లపాటు కలల యాగమే చేసి చివరికి అనుకున్నది సాధించారు. జగజ్జేతలను, ఆయా రంగాల్లో లబ్ధప్రతిష్ఠులను ముందుకు నడిపించేది ఈ లక్షణమే. ఆ మొక్కవోని సంకల్పానికే విజయాలు మోకరిల్లుతాయి. విజయం అంటే మనం ఎంత సంపాదించాం, మనకు ఎంత పేరొచ్చింది అన్నది కాదు.. మనం ఎందరి జీవితాల్లో వెలుగులు నింపగలుగుతాం.. అనే ఆలోచనే! అది ఉంటే చేపట్టిన ప్రతి పనీ సఫలమే అవుతుంది.

– అర్జున్



జగడాలమారి చైనా ఏదోక విషయంలో భారత్‌తో కయ్యం పెట్టుకోవాలని చూస్తుంటుంది. అరుణాచల్‌ప్రదేశ్ తనలో అంతర్భాగమంటూ డ్రాగన్ వదరుబోతు వ్యాఖ్యలు చేస్తుంటుంది. అలాంటి తాజా పరిణామమొకటి సిమ్లా ఒప్పందం, అరుణాచల్‌పై ఆధిపత్యం వంటి అంశాలపై చర్చకు తెరతీసింది.

అరుణాచల్‌పై చైనా కన్ను



భారత్, చైనాల మధ్య ఉద్రిక్త పరిణామమొకటి ఇటీవల చోటుచేసుకుంది. అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన పెమా వాంగ్‌జోమ్ థాంగ్‌డోక్ బ్రిటన్‌లో నివసిస్తున్నారు. ప్రయాణంలో ఉన్న ఆమెను చైనాలోని షాంఘై విమానాశ్రయంలో అధికారులు 18 గంటలపాటు నిర్బంధించారు. పెమా పాస్‌పోర్టు చెల్లదనీ, అరుణాచల్ చైనాలో అంతర్భాగమనీ, తమ దేశ పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకోవాలనీ వారు హేళనగా మాట్లాడినట్లు సామాజిక మాధ్యమంలో ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చైనా అధికారుల వ్యవహారశైలిని భారత ప్రభుత్వం ఖండించింది. అరుణాచల్‌ప్రదేశ్ ముమ్మాటికీ భారత్‌లో అంతర్భాగమని, ఆ రాష్ట్ర ప్రజలు ఇండియన్ పాస్‌పోర్టును కలిగి ఉండటానికీ, ప్రయాణించడానికీ అర్హులని డ్రాగన్‌కు స్పష్టం చేసింది. చైనా ఇలాంటి కవ్వింపులకు పాల్పడటం ఇదే మొదటిసారి కాదు. అరుణాచల్ వాసులకు 2005 నుంచి చైనా స్టేపుల్డ్ వీసాలు జారీ చేస్తోంది. ఈ వీసా ఉన్నవారి పాస్‌పోర్టు మీద ముద్ర వేయకుండా, ఓ కాగితంపై స్టాంప్ వేసి, పాస్‌పోర్టుకు జతచేస్తారంతే. అరుణాచల్‌ప్రదేశ్ చైనాలో అంతర్భాగమనీ, అక్కడి ప్రజలు తమ దేశంలో పర్యటించడానికి వీసా అక్కర్లేదని చెప్పడమే దీని ఉద్దేశం. 2013, 2023సంవత్సరాల్లోనూ అరుణాచల్ క్రీడాకారులకు స్టేపుల్డ్ వీసాలిచ్చి వివాదం సృష్టించింది చైనా. ఇలాంటి సమస్య వల్లే 2023 నాటి హాంగ్‌జౌ ఆసియా గేమ్స్‌లో భారత అథ్లెట్లు పాల్గొనలేకపోయారు.

వివాదం ఎక్కడ మొదలైంది?

'బ్రిటిష్ ఇండియా' కాలంలో భారత్, చైనాల మధ్య నేరుగా సరిహద్దు ఉండేది కాదు. మధ్యలో చాలామటుకు టిబెట్ దేశం ఉండేది. చైనా కనుసన్నల్లో ఉండే ఆ దేశంలో థియోక్రెటిక్ సర్కారు, అంటే దలైలామా పాలన సాగేది. అయితే, 1912లో చైనాలో రాజరికం పడిపోయి, గణతంత్ర రాజ్యం ఆవిర్భవించింది. ఆ తరుణంలో దలైలామా- అప్పటివరకు టిబెట్‌లో తిష్ఠవేసిన పాత సామ్రాజ్య ప్రతినిధులు, అధికారులను సాగనంపి, తమది స్వతంత్ర దేశమని ప్రకటించారు. 1951 వరకు టిబెట్ స్వతంత్ర దేశంగానే ఉంది. శాంతియుతంగా ఉండే టిబెట్‌కు సైనికశక్తి తక్కువ. దీన్ని అదునుగా భావించిన అప్పటి బ్రిటిషర్లు టిబెట్‌ను ఆక్రమించాలనుకున్నారు. కానీ భారత్, చైనా, రష్యాలాంటి మూడు పెద్ద దేశాల మధ్య ఒక దేశం ఉంటే యుద్ధాలు వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయని భావించి వెనకడుగు వేశారు. అయితే- భారత్, టిబెట్ మధ్య స్పష్టమైన సరిహద్దును నిర్ణయించాలనుకున్నారు. ఆ దిశగా జరిగిందే 1914 నాటి సిమ్లా ఒప్పందం.

ఏంటీ ఒప్పందం?


సిమ్లా ఒప్పందంపై జరిగిన చర్చల్లో బ్రిటిష్ ఇండియా, టిబెట్, చైనా దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. బ్రిటిష్ ప్రతినిధి సర్ హెన్రీ మెక్‌మెహన్... భారత్, టిబెట్ మధ్య ఒక లైన్ గీశారు. దీన్నే మెక్‌మెహన్ రేఖ అంటున్నాం. దీని ప్రకారం, అరుణాచల్‌ప్రదేశ్ మొత్తం భారత్‌లో అంతర్భాగం. టిబెట్ ప్రతినిధులు దీనికి అంగీకరించారు. చైనా మాత్రం ఒప్పుకోలేదు. అసలు సరిహద్దును నిర్ణయించే హక్కు టిబెట్‌కు లేదనీ, అరుణాచల్ టిబెట్‌లో భాగమనీ చైనా వాదిస్తోంది. 1951లో చైనా టిబెట్‌ను ఆక్రమించినప్పటి నుంచి అరుణాచల్‌ప్రదేశ్ విషయంలో అభ్యంతరం ఎక్కువైంది. గతంలో అక్కడి తవాంగ్ ప్రాంతానికే అధిక ప్రాధాన్యమిస్తూ వచ్చిన డ్రాగన్- దశాబ్దకాలంగా అరుణాచల్ మొత్తం తనదేనంటూ అంతర్జాతీయ వేదికలపై మాట్లాడుతోంది.

భారత్‌ను మయన్మార్ ద్వారా దక్షిణాసియాతో కలిపే ద్వారంగా అరుణాచల్‌ప్రదేశ్ ఉంది. పైగా ఇండియాకు ఇది కీలకమైన మిలిటరీ కమాండ్ జోన్. ఇక్కడ రక్షణ దళాలకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఇండియా శరవేగంగా అభివృద్ధి చేస్తుండటం చైనాకు కంటగింపు కలిగిస్తోంది. 1959లో భారత్ దలైలామాకు ఆశ్రయం కల్పించడంతో ఈ వివాదానికి ఆధ్యాత్మిక కోణం కూడా తోడైంది. మరోవైపు బ్రహ్మపుత్రా నది జన్మించిన ప్రాంతానికి సమీపంలో చైనా పెద్దయెత్తున ఆనకట్టలు నిర్మిస్తోంది. ప్రతిగా భారత్ కూడా అరుణాచల్‌లో కొత్త హైడ్రో ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. దీనివల్ల రాబోయే రోజుల్లో జల యుద్ధం తప్పకపోవచ్చన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. భారత్ అరుణాచల్‌లో రహదారులు, సొరంగాలు, ఇతర మౌలిక వసతులను వేగంగా నిర్మిస్తుండగా, దీనికి పోటీగా చైనా కూడా ఉద్ధృతంగా నిర్మాణాలు చేపడుతోంది. అరుణాచల్‌ప్రదేశ్‌పై కన్నేసి భారత సార్వభౌమత్వానికి సవాల్ విసురుతున్న చైనా పన్నాగాలను మన ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు కనిపెట్టుకుని ఉండాల్సిందే.

– సందరగిరి రమ్య

చిలుక సాక్ష్యం..!

పార్వతీపురంలో రామయ్య, శివయ్య అని ఇద్దరు స్నేహితులు ఉండేవారు. రామయ్య దానిమ్మతోట, శివయ్య బత్తాయితోట పక్కపక్కనే ఉండేవి. ఆ ఊళ్లోనే ఉండే భూషయ్యకు వాళ్లంటే నచ్చేది కాదు. ఎప్పుడూ గొడవలు పెట్టాలనుకునేవాడు. ఒకరోజు రాత్రి ఇద్దరు మనుషులతో దానిమ్మ పిందెలు కోయించి, శివయ్య తోటలో వేయించాడు. అది గమనించినా మౌనంగానే ఉన్నారు రామయ్య, శివయ్య. వారం గడిచాక మళ్లీ బత్తాయిలు కోయించి, రామయ్య తోటలో వేయించాడు. ఈసారి వాళ్లు గ్రామాధికారికి ఫిర్యాదు చేశారు. ఇదంతా భూషయ్యే చేయించాడేమోనని అనుమానంగా ఉందన్నాడు శివయ్య. అతణ్ని పిలిపించి విషయం అడిగాడు గ్రామాధికారి. 'నాకు దీనికి ఎలాంటి సంబంధం లేదు. అయినా నన్ను అనడానికి ఏదైనా సాక్ష్యం ఉందా?' అన్నాడు భూషయ్య. అప్పుడు



హాయ్! బుజ్జీ

రామయ్య.. 'సీతా!' అంటూ పిలిచాడు. వెంటనే వచ్చి అతని భుజం మీద వాలింది రామచిలుక. 'నిన్న రాత్రి ఏం జరిగిందో చెప్పు?' అన్నాడు రామయ్య. 'నిన్న ఇద్దరు మనుషులు శివయ్య తోటలోకి వచ్చి బత్తాయి పిందెలను తెంపి, మన తోటలో వేశారు. వాళ్లతో ఇతను కూడా ఉన్నాడు' అంటూ భూషయ్యను చూపించింది చిలుక. 'ఇది అబద్ధం చెబుతోంది' అన్నాడు భూషయ్య. 'ఆయన తాళంచెవికి ఉండాల్సిన చక్రం ఇక్కడ పడిపోతే నేనే తీసి మా యజమానికి ఇచ్చాను. కావాలంటే ఒకసారి ఆయన తాళంచెవిని చూడండి' అంది చిలుక. నిజంగానే భూషయ్య తాళంచెవికి చక్రం లేదు. అప్పుడు గ్రామాధికారి.. 'ఇప్పుడేమంటావు?' అని అడిగాడు. 'నన్ను క్షమించండి! వాళ్ల మీద అసూయతోనే ఇలా చేశాను' అన్నాడు. 'రామయ్య, శివయ్యలకు నష్టపరిహారం చెల్లించు. ఇంకోసారి ఇలాంటి పనులేమైనా చేస్తే కఠినమైన శిక్ష వేయాల్సి వస్తుంది' అని హెచ్చరించాడు గ్రామాధికారి. 'నా పనేదో నేను చూసుకుని ఉండాల్సింది. అనవసరంగా ఇప్పుడు డబ్బు, పరువు రెండూ పోయాయి. వాళ్లను విడగొట్టాలని చూసి నేనే ఇబ్బందుల్లో పడ్డాను' అనుకుంటూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు భూషయ్య.

– యు.విజయశేఖర రెడ్డి

పదాలేవి?

ఇక్కడ కొన్ని పదాలు అసంపూర్తిగా ఉన్నాయి. మొదటి పదం చివరి అక్షరాలతోనే రెండోది ప్రారంభమవుతుంది. ఓసారి ప్రయత్నించండి.

1. VOI☐☐NTURY
2. DECI☐☐EP
3. GLO☐☐ST
4. FINI☐☐IFT
5. ST☐☐EN

జవాబు: 1.VOICE, CENTURY 2.DECIDE, DEEP 3.GLOBE, BEST 4.FINISH, SHIFT 5.STOP, OPEN





మన్యం జిల్లా భామిని పాఠశాలలో విద్యార్థులతో కలిసి పాఠం వింటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ ★ పాఠశాలలో ఏర్పాటు చేసిన సెల్ఫీ బాక్స్‌లో విద్యార్థులతో కలిసి ఫొటో దిగుతున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్



భామిని పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్



భోజనం చేసిన అనంతరం సీఎం చంద్రబాబు ప్లేటును తీస్తున్న ఆయన తనయుడు, మంత్రి లోకేశ్

మన విద్యావ్యవస్థ దేశానికే ఆదర్శం

(మొదటి పేజీ తరువాయి)

సదస్సు నిర్వహించాలని ఇప్పుడే నిర్ణయించా. పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తా. విదేశీవిద్యకు 'కలలకు రెక్కలు' పేరిట ప్రోత్సాహం అందిస్తాం. పావలా వడ్డీకే విదేశీవిద్య రుణాలిప్పిస్తాం. ప్రభుత్వ పాఠశాలల్లో సోలార్ ప్యానళ్లు పెట్టుకుని విద్యుత్తు ఉత్పత్తి చేయాలి. విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రతకు మన్యం జిల్లాలో కలెక్టర్ ప్రభాకరరెడ్డి ప్రారంభించిన 'ముస్తాబు' కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం.

ఆ బాధ్యత లోకేశ్‌దే

లోకేశ్ చదివే పాఠశాలకు నేనెప్పుడూ వెళ్లలేదు. కొన్ని అంశాల్లో వెనకబడినట్లు గుర్తించి శిక్షణ ఇప్పించా. ఆ తర్వాత చక్కగా చదువుకున్నారు. ఇప్పుడు మంత్రి అయ్యారు. విద్యాశాఖ కష్టమని చెప్పినా ఏరికోరి తీసుకున్నారు. నా భార్య భువనేశ్వరి అమెరికాలో స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం వరకు లోకేశ్‌ను తీసుకెళ్లారు. రాష్ట్రంలోని విద్యార్థులను ఆ స్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత లోకేశ్‌దే.

రుద్దితే నాణ్యమైన విద్య అందదు

విద్యార్థులను స్మైక్, మౌంటెన్, స్టీమ్ అని మూడు విభాగాలుగా వర్గీకరించాం. క్లికర్ విధానం పిల్లలకు మరింత మెరుగైన విద్య, పరిజ్ఞానాన్ని అందిస్తుంది. అంధ విద్యార్థిని కరుణకుమారి ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని అంధ మహిళా క్రికెటర్ల ప్రపంచకప్ సాధించే జట్టులో ఆడింది. భామిని విద్యార్థులూ క్రీడల్లో ఉన్నతశిఖరాలకు ఎదగాలి. మెగా పీటీఎంలో మేం ఇక్కడ, పల్నాడులో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు. విద్యావ్యవస్థపై రాజకీయ రంగు పడకుండా చేస్తున్నాం. పిల్లలకు పంపిణీ చేసే పుస్తకాలపై ఏ నాయకుడి ఫొటో ఇప్పుడు భూతద్దం పెట్టి వెతికినా కనిపించదు. నైతికవిలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు మాటలను పిల్లలు చక్కగా అర్థం చేసుకుంటున్నారు. ఈ సభలో విద్యార్థి చెప్పిన నీతిపద్యాలే దీనికి నిదర్శనం. గతంలో పిల్లలు బస్తాలతో పుస్తకాలు మోసేవారు. ఇప్పుడు శనివారం నో బ్యాగ్ డే అమలుచేస్తున్నాం. విద్యార్థులను 24 గంటలు రుద్దితే నాణ్యమైన విద్య అందదు. ఇష్టంతో తక్కువ సమయం చదివినా రాణిస్తారు.

18 మందికో ఉపాధ్యాయుడు

విద్యార్థుల చదువు, వారి హాజరును తల్లిదండ్రులు ఇంటినుంచి తెలుసుకునేందుకు వీలుగా 'లీప్' యాప్ తీసుకొచ్చాం. పోషక విలువలతో ఆహారం అందిస్తున్నాం. 18 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ప్రభుత్వ పాఠశాలల్లో బోధిస్తున్నారు. అదే ప్రైవేటు పాఠశాలల్లో 26 మందికి ఒకరుంటారు. ఉపాధ్యాయుల బోధనాసక్తి పెంచేందుకు ఉత్తమవిద్య అందిస్తున్న ప్రాంతాలకు పంపించి, అధ్యయనం చేయిస్తున్నాం. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలి. గతంలో ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద కాపలా ఉంచారు. మరుగుదొడ్ల చిత్రాలు తీయించారు. వారి గౌరవాన్ని పెంచే బాధ్యత మాది. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత వారు తీసుకోవాలి. గత ప్రభుత్వం విద్యావ్యవస్థను నాశనం చేసింది. దాన్ని సరిచేస్తున్నాం.

విశాఖలో ఏరోనాటికల్ వర్సిటీ

రానున్న రోజుల్లో విశాఖలో ఏరోనాటికల్ రంగంలో విశ్వవిద్యాలయం ఏర్పాటుచేస్తాం. విశాఖను డేటా సెంటర్ హబ్‌గా రూపుదిద్దేందుకు పెట్టుబడులు తీసుకొచ్చాం. దీంతో వేలమందికి ఉపాధి అవకాశాలు అందించగలం" అని చెప్పారు.

– ఈనాడు-పార్వతీపురం మన్యం, న్యూస్‌టుడే-భామిని, పార్వతీపురం, సీతంపేట, పాలకొండ

సమాజం ఎంతో ఇచ్చింది.. ఆ రుణం తీర్చుకుందాం

విద్యా శాఖ మంత్రి లోకేశ్

ఈనాడు, పార్వతీపురం మన్యం, న్యూస్‌టుడే, పార్వతీపురం, భామిని, సీతంపేట: తల్లిదండ్రులు, గురువుల రుణం తీర్చుకోవడం గురించి పెద్దలు ఎప్పుడూ చెబుతుంటారని, అలాగే ఓ పౌరుడిగా సమాజం రుణం తీర్చుకోవాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. భామిని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం జరిగిన మెగా పీటీఎంలో ఆయన మాట్లాడారు. "తరగతి గది నుంచే దేశ భవితను మార్చొచ్చని నమ్మిన వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు. విద్యావ్యవస్థలో ఎన్నో సంస్కరణలు తీసుకురావాలి. రాష్ట్రంలో ఈ వ్యవస్థను బలోపేతం చేయడానికి మనమంతా కలిసి పనిచేయాలి.

అందుబాటులోకి క్లికర్ సాంకేతికత

రాష్ట్రంలో క్లికర్ సాంకేతికతను అందుబాటులోకి తెస్తున్నాం. పైలట్ ప్రాజెక్ట్‌గా భామినిలోను, రాష్ట్రంలో మరో 15 పాఠశాలల్లో దీన్ని అమల్లోకి తీసుకొస్తాం. ఫిన్లాండ్, ఇంగ్లండ్ లాంటి దేశాల్లో విద్యావిధానాన్ని పరిశీలించేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులను పంపుతాం. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నా వెన్నంటి ఉంటూ సలహాలిస్తున్నారు.

తల్లి కష్టంతో సీఎం అయ్యారు

మన దేశాన్ని తెల్లదొరలు పాలిస్తున్న రోజుల్లో ఓ తల్లి తన కుమారుడిని కష్టపడి చదివించారు. ఒకసారి కొడుక్కి రూ.3 ఫీజు కట్టాల్సి వచ్చింది. ఆమెవద్ద చిల్లిగవ్వ లేదు. కన్నవారు పెట్టిన పట్టుచీర తాకట్టు పెట్టి ఫీజు కట్టారు. తల్లి కష్టం చూసిన కుమారుడు ఇష్టపడి చదివి బారిస్టర్ అయ్యారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా మారి తెల్లదొరలను ఎదిరించారు. ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి అయ్యారు. ఆయనే టంగుటూరి ప్రకాశం పంతులు. ఇలా తల్లిదండ్రుల కష్టాన్ని పిల్లలు మర్చిపోకూడదు.

నైతిక విలువలూ ప్రధానమే

పిల్లల భవిత బాగుపడాలంటే విద్య ఒక్కటే సరిపోదు. నైతిక విలువలు ఉండాలి. ఇటీవల పుట్టపర్తిలో సత్యసాయి బాబా శతజయంతి వేడుకల్లో పాల్గొన్నాను. మైదానంలో వేలమంది విద్యార్థులు మూడుగంటలు కూర్చున్నారు. కార్యక్రమం అయ్యాక అందరూ లేచి మైదానాన్ని శుభ్రం చేసి వెళ్లారు. ఒక్క కాగితం ముక్క కూడా కనిపించలేదు. మనమూ అలాగే పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

ఏపీని నంబర్-1గా నిలపాలని..

శ్రీకాకుళానికి చెందిన ప్రముఖ సాహిత్యకారుడు కాళీపట్నం రామారావు(కారా) మాస్టారు సమాజరుణాన్ని తీర్చుకునే విలువైన మాటలను అందరికీ తెలియజేశారు. లక్షల కథలతో ఆయన 'కథానిలయం' ఏర్పాటుచేశారు. రాష్ట్ర విద్యావ్యవస్థను దేశంలోనే నంబర్ వన్‌గా నిలపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. 2029 నాటికి ఈ లక్ష్యాన్ని చేరుకుంటామని చెప్పాను. ఆయన సంతృప్తి చెందలేదు. రెండేళ్లలో చేరుకోవాలని ఆదేశించారు. ఆ ఆదేశాలు అమలుచేస్తాం. ముఖ్యమంత్రి చంద్రబాబు జీపీఎస్ లాంటివారు. ఏ లక్ష్యం ఛేదించాలో నిర్ణయించి దిశానిర్దేశం చేస్తున్నారు. నేను చదువుకునే రోజుల్లో తల్లిదండ్రుల సమావేశానికి ముఖ్యమంత్రి ఎప్పుడూ రాలేదు. మీ సమావేశానికి ఆయన రావడం మీ అదృష్టం' అని మంత్రి లోకేశ్ చెప్పారు.

పెట్టుబడుల కోసం మంత్రి లోకేశ్ అమెరికా పర్యటన

ఈనాడు, అమరావతి: రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా మంత్రి లోకేశ్ అమెరికా, కెనడా దేశాల్లో నెల 6 నుంచి 10 వరకు (ఐదు రోజుల పాటు) పర్యటించనున్నారు. 6న డాలస్‌లో తెలుగు డయాస్పొరా సమావేశంలో పాల్గొంటారు. 8, 9 తేదీల్లో శాన్‌ఫ్రాన్సిస్కో వేదికగా పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశం కానున్నారు. 10న కెనడాలోని టొరంటోలో పర్యటిస్తారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో పీటీఎం సందడి

45 వేల బడులు, 475 కళాశాలల్లో కార్యక్రమాలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాలు (పీటీఎం) ఘనంగా జరిగాయి. 45,074 పాఠశాలలు, 475 జూనియర్ కళాశాలల్లో జరిగిన ఈ కార్యక్రమాలకు మంత్రులు, ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, దాతలు, అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు సుమారు 74 లక్షల మంది హాజరయ్యారు. ప్రతి పాఠశాల విద్యార్థి చదవడం, రాయడం, లెక్కపెట్టడం(ఎఫ్ఎల్ఎన్)లో నిర్దేశిత సామర్థ్యాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు, మూల్యాంకన బుక్‌లెట్ గురించి తల్లిదండ్రులకు వివరించారు.

లీప్ యాప్‌లో మార్కులు

రాష్ట్రప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన లీప్ యాప్‌ను తల్లిదండ్రుల మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేయించారు. ఈ యాప్ ద్వారా తమ పిల్లల మార్కులు, హాజరును తల్లిదండ్రులు నేరుగా తెలుసుకోవచ్చు. పిల్లల మార్కులు ఆన్‌లైన్‌లో నమోదు చేయగానే యాప్‌లో అప్‌డేట్ అవుతాయి. దీంతో ప్రోగ్రెస్ కార్డుల కోసం చూడాల్సిన అవసరం లేదు. ఇందులోనే పదో తరగతి విద్యార్థుల వందరోజుల ప్రణాళిక అప్‌లోడ్ చేయనున్నారు. పిల్లలు ఏం చదువుతున్నారో తల్లిదండ్రులు తెలుసుకోవచ్చు. పబ్లిక్ పరీక్షల దృష్ట్యా పిల్లలకు నిర్వహించే స్లిప్‌టెస్ట్‌ల ప్రణాళిక ఉంది.

మన్యంలో సీఎం.. పల్నాడులో ఉప ముఖ్యమంత్రి

మెగా పీటీఎం-3.0 కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా భామిని ఆదర్శ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టర్ విజయరామరాజు, సమగ్ర శిక్షాభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో శ్రీశారద జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల సమావేశానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హాజరయ్యారు.





చిలకలూరిపేట శ్రీశారద జడ్పీ ఉన్నత పాఠశాల తరగతి గదిలో విద్యార్థులతో కలిసి కూర్చున్న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, రంజిత్ బాషా, ప్రత్తిపాటి పుల్లారావు ★ సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్. చిత్రంలో ఇంటర్ డైరెక్టర్ రంజిత్‌బాషా, జడ్పీ ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, విద్యార్థి తల్లి రాజేశ్వరి, కలెక్టర్ కృతికా శుక్లా, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ

కేరళ తరహా విద్యావిధానం అవసరం

- విద్యార్థులను దేశానికి పనికొచ్చే శక్తిగా తయారుచేయాలి
- పాఠశాలలో విషయాలపై రాజకీయం తగదు
- చిలకలూరిపేట మెగా పీటీఎంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం: రాష్ట్రంలోని పాఠశాలల్లో కేరళ తరహా విద్యావిధానం అమలుచేయాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అభిప్రాయపడ్డారు. విద్యార్థులను దేశానికి పనికొచ్చే శక్తులుగా తయారుచేయాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని శారదా జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలల్లో చోటుచేసుకుంటున్న సంఘటనలను కూడా రాజకీయం చేసేందుకు చాలా మంది సిద్ధంగా ఉన్నారు. ఇటీవల కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఓ పాఠశాలలో ఇద్దరు చిన్నారుల కొట్లాటకు కులం రంగు పులిమి రాజకీయం చేసే ప్రయత్నం చేశారని. ఇలాంటివాటిపై పెద్దలు, పిల్లలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తొలుత ఆయన వైజ్ఞానిక ప్రదర్శన తిలకించారు. తొమ్మిది, పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించి పాఠాలు అర్థమవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆయన చెప్పిన విషయాలిలా..

బలాలు, బలహీనతలు తెలుస్తాయి

"మంత్రి నారా లోకేశ్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ మెగా పీటీఎంతో పిల్లలు ఏం నేర్చుకుంటున్నారో తల్లిదండ్రులు తెలుసుకుంటున్నారు. విద్యార్థి బలాలు, బలహీనతలు తెలుస్తాయి. గతంలో పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించేవారు. ఐఏఎస్ కృష్ణతేజ తాత మైలవరపు గుండయ్య వందల ఎకరాల భూమిని దానం చేశారని చిలకలూరిపేట వచ్చాకే తెలిసింది. ఈ స్కూలు ఏర్పాటుకు తోట చంద్రయ్య స్థలం దానమిచ్చారని అధికారులు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరూ అలా చేయట్లేదు. ఇటీవల నేను మైసూరవారిపల్లె వెళ్లినప్పుడు అక్కడున్న పాఠశాలకు ఆటస్థలం లేదని తెలిసి నేనే కొని ఇచ్చాను.

ఇంగ్లిష్ మాధ్యమమే అక్కర్లేదు

డబ్బు, వస్తువులు మనకు దూరం అవుతాయేమో కానీ.. జ్ఞానం ఎప్పుడూ మనవెంటే ఉంటుంది. మహనీయుల చరిత్ర, ఇతర పుస్తకాలూ చదివితే జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చు. పిల్లలు ఉదయించే సూర్యులు. వారిలో పుస్తకాలు చదివే అలవాటు పెంచాలి. అబ్దుల్ కలాం తమిళ మీడియంలో చదివినా 'మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా ఎదిగారు. గతంలో మాదకద్రవ్యాలను పిల్లలకు అలవాటు చేయడానికి చాక్లెట్ల రూపంలో గంజాయి పంపిణీ చేసేవారని తెలిసింది. అలాంటి వాటిని నిర్మూలించాలి. దేశభవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని విద్యార్థులను తీర్చిదిద్దాలి. బూతులు తిట్టేవారి మాటలు వినవద్దు. సినిమా పిచ్చిలో పడి వారిని ఆదర్శంగా తీసుకోవద్దు. విద్యార్థుల నడవడికపై ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు దృష్టిసారించాలి.

గురువులు, తల్లిదండ్రుల ప్రభావం ఇలా..

◆ సోషల్ టీచర్ చెప్పిన పాఠం.. నా గుండెల్లో బలంగా నాటుకుపోయింది. మా హిస్టరీ టీచర్ చెప్పిన పాఠాలే సామాజిక బాధ్యత అంటే తెలిసేలా చేశాయి. ఈరోజు నేను డిప్యూటీ సీఎంగా మాట్లాడుతున్నానంటే, అందుకు ఆ రోజు వారు చెప్పిన పాఠాలే కారణం.

◆ 'మా అమ్మ రోజూ సాయంత్రం 6 గంటలైతే లైట్లువేసి దండం పెట్టుకునేవారు. ఎవరికి దండం పెట్టుకుంటున్నావని ఒకరోజు అడిగాను. భగవంతుడి పేరు చెప్పకుండా.. బల్బు కనిపెట్టింది థామస్ ఆల్వా ఎడిసన్ కదా! ఈ రోజు వెలుగులకు కారణమైన ఎడిసన్‌కు దండం పెడుతున్నానని చెప్పారు. అంటే మనకు మేలు చేసినవారికి కృతజ్ఞతతో ఉండాలని అర్థమైంది" అని పవన్‌కల్యాణ్ తెలిపారు.

ఎన్‌కౌంటర్లపై నిజనిర్ధారణకు వెళ్లిన విద్యార్థుల అడ్డగింత

చింతూరులో పోలీసులకు అప్పగించిన స్థానికులు



చింతూరు ఎస్సైతో విద్యార్థుల వాగ్వాదం

చింతూరు, న్యూస్‌టుడే: మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో గత నెలలో జరిగిన రెండు ఎన్‌కౌంటర్లపై నిజనిర్ధారణకు బయలుదేరిన తెలంగాణలోని ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాలకు చెందిన 11 మంది విద్యార్థులను శుక్రవారం చింతూరులో స్థానికులు అడ్డుకున్నారు. రెండు రోజుల కిందట మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో పర్యటించనున్నట్లు విద్యార్థులు ప్రకటించారు. ఈ క్రమంలో చింతూరు రహదారిపై స్థానికులు ధర్నాకు దిగి వారిని అడ్డుకోవడంతోపాటు పోలీసులకు అప్పగించారు. మావోయిస్టుల దిష్టిబొమ్మను దహనం చేశారు. విద్యార్థులు వాగ్వాదానికి దిగగా పోలీసులు వారిని స్టేషన్‌కు తరలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యార్థులను హైదరాబాద్ పంపేశారు.

ఏపీ వాసులకు జాతీయ హస్తకళ అవార్డులు

ఈనాడు, దిల్లీ: కేంద్ర జౌళి శాఖ 2023, 2024 సంవత్సరాలకు ప్రకటించిన 'జాతీయ హస్తకళ' అవార్డులకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు కళాకారులు ఎంపికయ్యారు. ఇందులో డి.శివమ్మ (తోలుబొమ్మలాట) శిల్పగురు-2023, బ్రహ్మానంద మహారాణ (రాతి శిల్పం), గోర్సి సంతోష్‌కుమార్ (ఆటబొమ్మలు, గాలిపటాలు)లు జాతీయ హస్తకళ 2023, 2024 అవార్డులు గెలుచుకున్నారు. ఈనెల 9న ఇక్కడి విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వారికి అవార్డులను ప్రదానం చేయనున్నారు.

ఆత్మీయ బంధానికి ఆర్థిక సత్తువ

(మొదటి పేజీ తరువాయి)

ఉక్రెయిన్ యుద్ధానికి శాంతియుత మార్గాల్లో ముగింపు పలకాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు. భారత్-రష్యా బిజినెస్ ఫోరమ్‌లోనూ మోదీ, పుతిన్ పాల్గొన్నారు.

మరింతగా ఆర్థిక సహకారం: మోదీ

"ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడంపై పుతిన్, నేను చర్చించాం. వాణిజ్యాన్ని, పెట్టుబడులను మరిన్ని రంగాలకు విస్తరిస్తాం" అని పుతిన్‌తో భేటీ అనంతరం సంయుక్త విలేకర్ల సమావేశంలో మోదీ పేర్కొన్నారు. రష్యా పౌరులకు ఉచితంగా 30 రోజుల ఈ-టూరిస్టు వీసా, 30 రోజుల గ్రూపు టూరిస్టు వీసాలను త్వరలో భారత్ ప్రవేశపెట్టనున్నట్లు ఆయన ప్రకటించారు.

ఇంధన భద్రతే మూలస్తంభం

భారత్-రష్యా భాగస్వామ్యానికి బలమైన, కీలక మూలస్తంభంగా 'ఇంధన భద్రత'ను మోదీ అభివర్ణించారు. పౌర అణు ఇంధన రంగంలో పరస్పర సహకారమూ ముఖ్యమని చెప్పారు. "క్రిటికల్ మినరల్స్ రంగంలో దిల్లీ-మాస్కో మధ్య సహకారం ప్రపంచవ్యాప్త సరఫరా గొలుసులకు కీలకం. శుద్ధ ఇంధనం, అత్యాధునిక సాంకేతిక సాధనాల తయారీ, కొత్త తరం పరిశ్రమలకు ఇది అండగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు. భారత్, రష్యా మధ్య అనుసంధానతను పెంచుకోవడానికి ప్రాధాన్యమిస్తామని చెప్పారు. అంతర్జాతీయ ఉత్తర-దక్షిణ రవాణా నడవా (ఐఎన్ఎస్‌టీసీ), ఉత్తర సముద్ర మార్గం, చెన్నై-వ్లాదివోస్తాక్ నడవాల విషయంలో నూతనోత్తేజంతో ముందుకెళ్తామన్నారు. భారత్, రష్యా మధ్య మానవ వనరుల రాకపోకలను సులభతరం చేసేలా రెండు ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలిపారు.

ఉక్రెయిన్ సంక్షోభంపై చర్చ

మోదీ-పుతిన్ భేటీలో ఉక్రెయిన్ యుద్ధం అంశం కూడా ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చింది. ఉక్రెయిన్‌లో శాంతిని భారత్ ముందునుంచీ కాంక్షిస్తున్న విషయాన్ని మోదీ గుర్తుచేశారు. అక్కడ శాంతి స్థాపనకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు దిల్లీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. ఉక్రెయిన్ యుద్ధం విషయంలో భారత్ తటస్థంగా కాకుండా, శాంతి వైపే ఉందని ప్రధాని పునరుద్ఘాటించారు. "ఉక్రెయిన్ సంక్షోభం మొదలైనప్పటి నుంచీ మనం చర్చలు జరుపుతూనే ఉన్నాం. అక్కడి పరిస్థితిని ఆత్మీయ మిత్రుడిగా మీరు మాకు ఎప్పటికప్పుడు తెలియజేస్తూనే ఉన్నారు. విశ్వాసమే ప్రధాన బలమని నేను భావిస్తున్నా. మనమంతా శాంతిమార్గాన్ని ఎంచుకోవాలి. యుద్ధం ముగింపునకు కొంతకాలంగా జరుగుతున్న ప్రయత్నాల గురించి నాకు తెలుసు. ప్రపంచంలో శాంతి నెలకొంటుందని విశ్వసిస్తున్నా. ఉక్రెయిన్ యుద్ధానికి శాంతియుత పరిష్కారాన్ని కనుగొనడంలో మేం సహకరిస్తాం" అని పుతిన్‌తో భేటీలో మోదీ వ్యాఖ్యానించారు. దీంతో పుతిన్ స్పందిస్తూ.. ఉక్రెయిన్ సంక్షోభానికి శాంతియుత పరిష్కారం కోసం మాస్కో ప్రయత్నిస్తోందని తెలిపారు.



ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌కు వస్తున్న రష్యా అధ్యక్షుడు పుతిన్, ప్రధాని మోదీ

పహల్గాం దాడిని ఖండించిన రష్యా అధ్యక్షుడు

ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే మార్గాలపైనా మోదీ, పుతిన్ చర్చించారు. రహస్య ఎజెండాలు, ద్వంద్వ ప్రమాణాలకు తావు లేకుండా.. ఉగ్రవాదంపై ప్రపంచం రాజీ లేని పోరాటం చేయాలని ప్రధాని పిలుపునిచ్చారు. ఉగ్ర రక్కసిపై భారత్, రష్యా దీర్ఘకాలంగా భుజం భుజం కలిపి పోరాడుతున్నాయని గుర్తుచేశారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో, మాస్కోలోని క్రాకస్ సిటీ హాల్‌పై జరిగిన ఉగ్రదాడులను పుతిన్ ఖండించారు. భారత్-రష్యా సంబంధాలను బలోపేతం చేయడంలో పుతిన్ రెండున్నర దశాబ్దాలుగా దృఢమైన చిత్తశుద్ధి కనబరుస్తున్నారంటూ మోదీ ప్రశంసించారు.

◆ పెట్టుబడుల ప్రోత్సాహం, పరిరక్షణపై ఉభయ ప్రయోజనకర ఒప్పందం కుదుర్చుకునేందుకు చర్చలు వేగవంతం చేయాలని ఇరు దేశాల అధికారులను మోదీ, పుతిన్ ఆదేశించారు. భారత్, యూరేషియన్ ఎకనామిక్ యూనియన్ మధ్య సరకు రవాణాపై స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం ముమ్మరంగా కృషి జరుగుతుండటాన్ని ఇరువురు నేతలు అభినందించారు. రష్యా సైన్యంలో పనిచేస్తున్న భారతీయులను విడుదల చేయాలని పుతిన్‌ను మోదీ కోరారు.


రాజ్‌ఘాట్‌ను సందర్శించిన పుతిన్

మోదీతో శిఖరాగ్ర భేటీకి ముందు.. పుతిన్ రాష్ట్రపతి భవన్‌కు వెళ్లారు. ఆయనకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆత్మీయ స్వాగతం పలికారు. త్రివిధ దళాలు గౌరవ వందనం సమర్పించాయి. రష్యా అధ్యక్షుడు రాజ్‌ఘాట్‌ను సందర్శించి మహాత్మాగాంధీకి పుష్పాంజలి ఘటించారు.

భారతీయ ఉత్పత్తులకు మరింతగా మార్కెట్ ప్రవేశం: పుతిన్

ద్వైపాక్షిక వార్షిక వాణిజ్య బంధం విలువను ప్రస్తుతమున్న 64 బిలియన్ డాలర్ల నుంచి.. 2030 కల్లా 100 బిలియన్ డాలర్ల స్థాయికి పెంచుకోవాలని భారత్, రష్యా ప్రణాళికలు రచిస్తున్నట్లు పుతిన్ తెలిపారు. "దిల్లీ ఇంధన అవసరాలను తీర్చేందుకు చమురు, గ్యాస్, బొగ్గు వంటి వాటిని సరఫరా చేసే విశ్వసనీయ భాగస్వామిగా మాస్కో ఉంది. భారతీయ ఉత్పత్తులకు మరింతగా మార్కెట్ ప్రవేశం కల్పిస్తాం" అని ఆయన పేర్కొన్నారు. రష్యా, భారత్, మరికొన్ని భావసారూప్య దేశాలు బహుళ ధ్రువ ప్రపంచం కోసం కృషిచేస్తున్నాయని చెప్పారు.

మంత్రిగారి మెగా సెల్ఫీ!



వందల మంది విద్యార్థులు, ఉత్సుకతతో వచ్చిన తల్లిదండ్రులు, ఉత్సాహంగా ఉన్న ఉపాధ్యాయులు ఒకే వేదికపై కనిపించారు. అదే.. మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం. వీరికి ప్రజాప్రతినిధులు తోడైతే ఆ సందడే వేరు కదా..! అనకాపల్లి జిల్లా పాయకరావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా వచ్చారు. అక్కడి పండగ వాతావరణం చూసి వారిలో కలిసిపోయి.. ఇలా ఓ సెల్ఫీ తీసుకున్నారు.

– న్యూస్‌టుడే, పాయకరావుపేట

ఒక్కరే అయితేనేం!



మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని గిరిశిఖర గ్రామాల్లోనూ నిర్వహించుకున్నారు. పార్వతీపురం మన్యం సాలూరు మండలం పెదపదం పంచాయతీ రామస్వామి వలస గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఒక్క విద్యార్థే ఉన్నారు. అయినా.. ఎంతో చక్కగా కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయురాలు పార్వతితోపాటు ఎస్ఎంసీ ఛైర్మన్ వి.గౌరమ్మ, వార్డు సభ్యుడు పి.సింహాచలం, విద్యార్థి తండ్రి త్రినాథ, గ్రామ పెద్దలు వచ్చి.. ఎంతో క్రమశిక్షణతో కూర్చున్నారు. బడి పనితీరుపై, బాలుడి చదువుపై ఎంతో శ్రద్ధగా చర్చించారు.

– న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

వసుంధర

vasundhara@eenadu.in



మహిళల కెరియర్ నిర్మాణంలో సందేహాలు... నిపుణుల సలహాలు

ఈనాడు వెబినార్!

ఈనాడు వసుంధర

కెరియర్‌లో ఉన్నతంగా స్థిరపడాలని ఏ మహిళకు ఉండదు? కానీ ఆ ప్రయాణంలో అతివలకు అడుగడుగునా సవాళ్లే. అవకాశాల కొరత, వేతనాల్లో వ్యత్యాసం, పదోన్నతుల్లో పక్షపాతం, నిత్యం మారే సాంకేతికత... ఇలాంటివెన్నో! కుటుంబ బాధ్యతలు, సామాజిక ఒత్తిళ్లు వీటికి అదనం. అలాగని రాజీపడుతూ కూర్చోలేం కదా! ముందడుగు వేయాల్సిందే. అందుకోసం ఏం చేయాలనేదే మీ సందేహమా?

అయితే, **'ఈనాడు- వసుంధర'** ఆధ్వర్యంలో డిసెంబరు 7న(ఆదివారం) ఉదయం 11 గం. నుంచి మధ్యాహ్నం 12:30 గం. వరకూ నిర్వహించే ఉచిత వెబినార్‌లో పాల్గొనండి. తమకు ఎదురైన సవాళ్లను అధిగమించి కెరియర్‌ను విజయవంతంగా నిర్మించుకున్న మహిళల నుంచి అమూల్యమైన సలహాలూ, సూచనలూ అందుకోండి. కెరియర్ ప్రారంభ, మధ్య దశలో ఉన్న ఉద్యోగినులకీ... డిగ్రీ చేస్తున్న, ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నవాళ్లకీ ఇది అద్భుత అవకాశం.

07.12.2025
(ఆదివారం) నాడు...

క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా https://hov.to/0f8f2cf2 వెబ్‌లింకు ఓపెన్ చేయండి.
జూమ్ ఐడీ: 953 2585 8501
పాస్‌కోడ్: 352258
తోనూ జాయిన్ కావొచ్చు.

ఈ వెబినార్ యూట్యూబ్ లైవ్ కోసం స్కాన్ చేయండి.



ఫెయ్ ఫెయ్

శాస్త్ర, సాంకేతికత రంగాల్లోనే కాదు, రోజువారీ జీవితంలోకీ ఏఐ వచ్చేసింది. కానీ మహిళల్లో చాలామంది నేటికీ కంప్యూటర్ నిరక్షరాస్యులే. ఆమె మాత్రం నేటి ఏఐని దాటి ఆలోచిస్తోంది! తనే ఫెయ్ ఫెయ్ లీ... 'గాడ్ మదర్ ఆఫ్ ఏఐ'. స్టాన్‌ఫర్డ్ ప్రొఫెసర్. ప్రారంభించిన ఏడాదికే బిలియన్ డాలర్ల విలువకి చేరిన 'వరల్డ్ ల్యాబ్స్' స్టార్టప్ సహ వ్యవస్థాపకురాలు!

ఫెయ్ ఫెయ్ లీ... ఏఐ గాడ్ మదర్!

'యంత్రాలు ఆలోచించగలవా... 75 ఏళ్ల క్రితం కంప్యూటర్ సైంటిస్ట్ అలాన్ ట్యూరింగ్‌కి వచ్చిన ఆలోచనే ఇది. ఆటోమేటెడ్ అంకగణితం, సాధారణ తర్కం కన్నా తక్కువ సామర్థ్యంతో కంప్యూటర్లు పనిచేసే కాలమది... ఆనాడు తెలివితేటల్ని నిర్మించవచ్చన్న ఆయన దూరదృష్టే ఈనాటి కృత్రిమ మేధకి దారితీసింది. పాతికేళ్లుగా ఏఐ రంగంలో ఉన్నా నేటికీ ఆ ప్రశ్నే నాకు ప్రేరణ. అదే నన్ను 'స్పేషియల్ ఇంటెలిజెన్స్(ప్రాదేశిక మేధస్సు)' కోసం పనిచేసేలా చేస్తోంది' అంటారు ఫెయ్ ఫెయ్ లీ. అసలు ఎవరీమె?

డ్రైక్లీనింగ్ దుకాణం నడుపుతూ!

లీకి పదిహేనేళ్ల వయసులో ఆమె కుటుంబం చైనా నుంచి న్యూజెర్సీలోని పార్సిప్పనీకి వలస వచ్చింది. తల్లీతండ్రీ రెస్టరంట్‌లో పనిచేసేవారు. ఆ సంపాదన సరిపోక డ్రైక్లీనింగ్ దుకాణం పెట్టారు. చదువుకుంటూనే లీ కూడా దుకాణాన్ని నడిపారు. వాళ్లకి ఇంగ్లిష్ రాకపోవడంతో కస్టమర్ కాల్స్, బిల్లింగ్, చెకింగ్... వంటివన్నీ లీనే చూసుకునేవారు. అందుకే దగ్గర్లోని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీలోనే చదువుకున్నారట. పీహెచ్‌డీకోసం కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(కాల్టెక్)కి వెళ్లినప్పటికీ దుకాణాన్ని రిమోట్‌గా నిర్వహించేవారు. 'మా దుకాణానికి నేనే సీఈవో' అని సరదాగా చెబుతుంటారు లీ. సహజంగా ఫిజిక్స్‌మీద ఆసక్తి ఉన్న లీని విశ్వం గురించిన ఆలోచనలతోపాటు అసలు మేధస్సు అంటే ఏమిటి? ఇదెలా వస్తుంది? మెషీన్స్ దీన్ని నేర్చుకోగలవా... ఇలా ఎన్నో ప్రశ్నలు వెంటాడేవి. అవే కాల్టెక్‌లో పీహెచ్‌డీ చేయించాయి.

కోటిన్నర చిత్రాలతో...

2010... కంప్యూటర్ పరిశోధన రంగం ఎటు వెళ్లాలో తెలియని సందిగ్ధ స్థితి. అందరి దృష్టీ డేటా కన్నా అల్గారిథమ్స్ మీదే. కానీ అవి సరిగ్గా పనిచేయడంలేదు. ఆ సమయంలోనే లీ అల్గారిథమ్స్‌ని దాటి ఆలోచించారు. సైకాలజీ, లింగ్విస్టిక్స్ మీద దృష్టిపెట్టారు. 'మనిషి ఎలా నేర్చుకుంటున్నాడు. ప్రధానంగా దేనిమీద ఆధారపడుతున్నాడు. అందరితో మాట్లాడుతూ, ఇతరుల్ని చూస్తూ వాళ్ల అనుభవాల నుంచే కదా. మరి కంప్యూటర్లకీ ఇదే సూత్రం వర్తింపజేసి, వీటికీ ఎంత ఎక్కువ దృశ్య డేటాని ఇస్తే అంతగా నేర్చుకోగలవు కదా' అని ఆలోచించారు. దీన్ని కొందరు సీనియర్లు కొట్టిపారేశారు, అసాధ్యమన్నారు.

అయితే లీ వెనకడుగు వేయలేదు. కొందరు గ్రాడ్యుయేట్ విద్యార్థుల సాయంతో కోటీ 50 లక్షల చిత్రాలను 22 వేల విభాగాలుగా వేరుచేసి 'ఇమేజ్‌నెట్ లేదా అలెక్స్ నెట్'ను ఏర్పాటుచేశారు. దీనికోసం వార్షిక పోటీల్నీ నిర్వహించారు.

ఈ అలెక్స్ నెట్ పనితీరు చూశాకే డీప్ లర్నింగ్ ప్రాముఖ్యత కంప్యూటర్ నిపుణులకీ అర్థమైంది. లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్‌ను అభివృద్ధి చేశారు ఏఐ గాడ్ ఫాదర్‌గా పేరొందిన జెఫ్రీ హింటన్. ఇది ఏఐలో కీలకమైన మలుపుకు కారణమైంది. అలా లీ తను చేపట్టిన ఇమేజ్ నెట్ ప్రాజెక్ట్‌తో 'గాడ్ మదర్ ఆఫ్ ఏఐ'గా పేరొందారు. 'డ్రైక్లీనింగ్ దుకాణ నిర్వహణలో భాగంగా క్లిష్ట సమస్యల్ని పరిష్కరించడం, చక్కగా కమ్యూనికేట్ చేయగలగడం, ఒత్తిడిలోనూ పనిచేయడం... ఇవే నన్ను పరిశోధన రంగంలో రాణించేలా చేశాయి. ఏఐ గాడ్ మదర్‌గా నిలిపాయి' అంటోన్న లీ... తాజాగా 'క్వీన్ ఎలిజబెత్ ప్రైజ్ ఫర్ ఇంజినీరింగ్'నీ గెలుచుకున్నారు. లీ ప్రయాణం... సాంకేతిక రంగంలో దూసుకెళ్లాలనుకునే అమ్మాయిలకు మార్గదర్శకమే కదూ!

ప్రాదేశిక మేధస్సు!

ప్రస్తుతం లీ స్టాన్‌ఫర్డ్‌లో ప్రొఫెసర్. నైతిక సాంకేతికత గురించి ఎన్నో ప్రసంగాలు చేశారు. ఐక్యరాజ్యసమితి శాస్త్రీయ పురోగతి బోర్డులో సభ్యురాలు. 'వరల్డ్ ల్యాబ్స్' స్టార్టప్ సహ వ్యవస్థాపకురాలు, సీఈవో. ప్రారంభించిన ఏడాదిలోనే బిలియన్ డాలర్ల(సుమారు రూ.9000కోట్లు) విలువకు చేరిన ఈ స్టార్టప్ ద్వారా ప్రస్తుత ఏఐని దాటి ప్రాదేశిక మేధస్సుకి ప్రయత్నిస్తున్నారు. అంటే, ఏఐ కూడా మనిషిలానే ప్రపంచాన్ని చూసి అర్థం చేసుకుంటుంది. ఇప్పటికే వరల్డ్ ల్యాబ్స్ సంస్థ విడుదల చేసిన 'మార్బుల్'తో ప్రాంప్ట్‌ల ద్వారా 3డీ ప్రపంచాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

'ఇప్పుడు ఏఐని అనేక రకాలుగా వాడుతున్నాం. అయితే దీనికి వాక్చాతుర్యం ఉంది, అనుభవం లేదు. జ్ఞానం ఉంది, ఆధారం లేదు. కానీ దృశ్య లేదా ప్రాదేశిక మేధస్సు అలా కాదు. నిజమైన, వర్చువల్ ప్రపంచాన్ని సృష్టిస్తుంది. మనల్నీ అందులో లీనమయ్యేలా చేస్తుంది. అప్పుడు విద్య, వైద్యం, సాంకేతిక రంగాల్లో మరెంతో ప్రగతిని అందుకోవచ్చు. పరమాణు శాస్త్రంలో సంక్లిష్ట భావనల్ని విద్యార్థులు తేలికగా అర్థం చేసుకోగలరు. వ్యాధుల్ని కచ్చితంగా గుర్తించగలం, స్వయం ప్రతిపత్తి గల రోబోల్ని సృష్టించగలం. నేడు చేయలేని, నేరుగా చూడలేని ఎన్నింటినో కొత్త ఏఐ చేస్తుంది, చూపిస్తుందన్న ఊహే ఈ స్పేషియల్ ఇంటెలిజెన్స్‌కి పునాది' అంటారు లీ.

ముఖ తేజస్సుకు... హరిణాసనం



హరిణ అంటే జింక అని అర్థం. ముందుగా యోగా మ్యాట్‌పైన కాళ్లను చాచి కూర్చోండి. ఆపై నిదానంగా రెండు కాళ్లను వెనకకు మడిచి వజ్రాసనంలోకి రావాలి. ఇప్పుడు గాలి తీసుకుంటూ చేతుల్ని వెనక్కి చాచి... రెండు అరచేతులు ఒకదానికొకటి చూస్తున్నట్లు ఉంచండి. తరవాత గాలి వదిలిపెడుతూ ముందుకు వంగి తలను కొంచెం ఎత్తి చూడండి. ఇది దాదాపుగా గడ్డిని మేస్తున్న జింకను పోలి ఉంటుంది. ఇలా 12-15 సెకన్లు ఉండే ప్రయత్నం చేసి తర్వాత నెమ్మదిగా తలను, శరీరాన్ని పైకి లేపుతూ చేతుల్ని దించి వజ్రాసనానికి రావాలి. ఆపై కాళ్లను చాచి దండాసనంలో విశ్రాంతి పొందండి.

జాగ్రత్తలు: మోకాళ్ల సర్జరీలు అయినవాళ్లు చేయరాదు. బీపీ ఎక్కువగా ఉన్నవాళ్లు డాక్టర్ సలహాతో చేయాలి.

ఉపయోగాలు: మెడ, వీపు కండరాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. మనసు ప్రశాంతంగా ఉంటుంది. ముఖానికి రక్తప్రసరణ పెరిగి తేజస్సు పెరుగుతుంది. తలకు రక్తప్రసరణ జరిగి తలనొప్పి తగ్గుతుంది.

ఆహారం: కండరాల బలానికి కాల్షియం, విటమిన్ డి, ప్రొటీన్లు పుష్కలంగా అందేలా చూసుకోవాలి. చిక్కుళ్లు, పాలు, ఆకుకూరలు, గింజలు, తృణధాన్యాలనీ తినాలి.

- శిరీష, యోగ గురు



అన్ని రంగాల్లోనూ మహిళల ప్రాతినిధ్యం పెరుగుతోంది. కొన్నింట నాయకత్వ స్థానాల్లోనూ ఉంటున్నారు. రావాల్సిన మార్పు ఏంటంటే... ఎవరో చెప్పారని ఫైళ్లమీద సంతకాలు పెట్టడం కాదు. ఇతరులు, పైవాళ్లు ఏం కోరుకుంటున్నారో దాన్ని చేయడం అంతకన్నా కాదు... మీరు ఏం అనుకుంటున్నారో అది స్పష్టంగా చెప్పండి. మాటల్లో, చేతల్లో దానికి కట్టుబడి ఉండండి.

- మోనా ఖండార్, ఐఏఎస్, గుజరాత్

అపరాధ భావం వెంటాడుతోందా..!

రమ్య వాళ్ల పాపకి ఆరు నెలలు. తల్లి సంరక్షణలో పాపని వదిలి ఆఫీసుకు వెళుతోంది. కానీ, తన మనసంతా పాప వైపే. దాంతో చేస్తున్న పనిలో వెనకబాటు.

రాధ వాళ్ల అబ్బాయికి నాలుగేళ్లు. తను ఆఫీస్‌కి బయలుదేరేటప్పుడు ఏడుస్తూ బై బై చెపుతాడు పిల్లాడు. దాంతో కార్యాలయానికి వచ్చినా... బాబు ఆలోచనలే.

సాగరికకి 25ఏళ్ల పెళ్లైన అమ్మాయి ఉంది. ఈమధ్య తను సమస్యలతో సతమతం అవుతూ... 'అమ్మగా నాకు ఆధారంగా ఉండాల్సిన ప్రతిసారీ నువ్వు ఫెయిల్ అయ్యావ్' అనేసింది. దాంతో పనిచేస్తున్నా సాగరికకు అన్నీ అవే ఆలోచనలు.

గృహిణి, ఉద్యోగిని ఎవరైనా తమ విధుల నిర్వహణకు కాలం వెచ్చిస్తూ పిల్లలకు సమయం కేటాయించలేకపోవడం సహజం. రోజులో ఎంత మల్టీటాస్కింగ్ చేసినా, కొన్నిసార్లు ఇలాంటి అవాంతరాలు ఎదురవుతుంటాయి. మన శ్రమ తెలియక పిల్లలూ వాళ్ల భావోద్వేగాల్ని బయట పెడుతుంటారు. ఇలాంటి సమయాల్లో పనుల్ని ఇంకాస్త ఆర్గనైజ్‌డ్‌గా ఎలా నిర్వహించగలం అన్న అంశాల మీద దృష్టి పెట్టాలే కానీ... వాళ్లన్న మాటలకు బాధపడుతూ కూర్చుంటే ఉపయోగం ఉండదు. అయితే, జీవితాన్ని ఎంత ప్రాక్టికల్‌గా నిర్వహించే వారైనా కొన్నిసార్లు ఈ అపరాధ భావంలో కొట్టుకుపోతుంటారు. అధ్యయనాల ప్రకారం దాదాపు 84శాతం మంది తల్లులు ఈ అపరాధ భావంలో కూరుకుపోతున్నారు. అలాంటప్పుడు ఏం చేయాలంటే...


- కళ్లు మూసుకుని 'నేను నా బెస్ట్ ఇస్తున్నా' అని మనసులో చెప్పుకోండి. మీ మనసులో భారం దిగేంత వరకూ బయటికి గట్టిగా చెప్పండి. దీనివల్ల మీకు ఓ స్పష్టత వస్తుంది. ఆలోచనలు పక్కదోవ పట్టకుండా ఉంటాయి.
- ఐదు నుంచి పది నిమిషాలు శ్వాస మీద ధ్యాస పెట్టడం వల్ల భావోద్వేగాలు నియంత్రణలో ఉంటాయి. మైండ్‌ఫుల్‌గా సమస్య పరిష్కారానికి ఆలోచించే సమయం దొరుకుతుంది.
- నెలల పిల్లల్ని ఇంట్లో వదిలేసి... ఉద్యోగానికి వెళుతున్న వారికి ఈ అపరాధ భావం మరింత ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల వ్యక్తి, వృత్తిగత జీవితాలకి న్యాయం చేయలేక సతమతం అవుతుంటారు. డెస్క్‌లో ఇలాంటి ఆలోచనలు వేధిస్తుంటే... రోజులో కొంత సమయం పిల్లల యోగక్షేమాలు తెలుసుకునేందుకు పెట్టుకోండి.
- ఈ దశలో 'ట్రస్ట్ ఇష్యూస్' వెంటాడుతుంటాయి. అయిన వాళ్ల దగ్గరే పిల్లల్ని వదిలేసి వచ్చినా... బాగా చూసుకుంటారా లేదా అనే ఆలోచనలు ఎక్కువగా వస్తుంటాయి. ఇలాంటప్పుడు నమ్మకం చాలా ముఖ్యం. మీరు లేకున్నా పాపకి అన్ని సౌకర్యాలు అందుతాయన్న నమ్మకంతో ఇంటి నుంచి బయలుదేరండి.
- 'నేను చేస్తున్న పని వల్ల కలిగే లాభాలు ఇవి. భవిష్యత్తులో ఆర్థిక ఇబ్బందులు రాకుండా ఉంటాయి. వాళ్ల చదువు, ఆరోగ్యం, జీవనశైలి మీద ఇంత ప్రభావం ఉంటుంది' లాంటి సానుకూల విషయాల్ని తలచుకోండి. ఇవన్నీ ఓ చోట రాయండి. దీనివల్ల మామ్ గిల్ట్ దానికదే తగ్గుతుంది.
- రోజులో వీలైనంత సమయం వాళ్లతో గడిపేందుకు ప్రయత్నించండి. అయితే ఇలా చేయాలంటే... శారీరకంగా, మానసికంగా మీరు ఫిట్‌గా ఉండాలని మరచిపోకండి.

ఆ రోజుల్లోకి... వెళ్లొద్దామా?



పరీక్షలప్పుడు నైట్ అవుట్ పేరుతో స్నేహితులంతా ఓ చోట చేరడం... లేదంటే స్నేహితురాలి ఇంటికి వెళ్లి, 'ఆంటీవాళ్లు బతిమాలుతున్నారమ్మా. ఈ రాత్రి అక్కడే పడుకుంటా! ఉదయాన్నే వచ్చేస్తా' నంటూ ఫోన్ చేయడం... చిన్నప్పుడు ప్రతి ఒక్కరికీ పరిచయమే. అమ్మ సందేహిస్తోంటే మారాం చేయడం... తీరా ఒప్పుకొన్నాక ఏదో సాధించేశామన్నట్లు ఎగిరి గంతేయడం... ఆ రోజులే వేరు. మళ్లీ అలాంటివి తిరిగొస్తే బాగుండు అని అనుకోకుండా ఉండలేం కదూ! అవును మరి... చదువుకునేప్పుడు, కనీసం ఉద్యోగాలు చేసేటప్పుడైనా నేస్తాలతో ఇలా గడపడం సాధ్యమయ్యేది. పెళ్లయ్యి, పిల్లలు పుట్టాక మన ప్రపంచమే మారిపోతుంది. దానికితోడు కొలువూ జోడైతే బిజీకి మారుపేరైపోతాం. ఇక ఇవన్నీ ఎక్కడ సాధ్యం అనుకుంటాం. కానీ బాధ్యతలన్నీ పక్కన పెట్టేయండి. సరదాగా మీ స్నేహితురాళ్లతో ఓ స్లీప్ ఓవర్ ప్లాన్ చేయండి. తిరిగి ఉత్తేజంగా తయారవుతారు.

ఫ్రెండ్స్ ఒకచోట చేరితే మామూలుగా ఉంటుందా? చిన్ననాటి చిలిపి సంగతులు, జ్ఞాపకాలన్నీ వరద కట్ట తెంచుకున్నట్లుగా వెల్లువెత్తుతాయి. ఇక సమయం, అలసట వంటివేం గుర్తొస్తాయి? గంటలన్నీ నిమిషాల్లా సాగిపోతాయి. ఈ క్రమంలో బాధ్యతలు, ఒత్తిడీ అన్నీ పక్కకు వెళ్లిపోతాయి. ఒక్క రాత్రే కావొచ్చు... కానీ కావాల్సినంత ఆనందం, ఉత్సాహం మీ సొంతం. కాబట్టే... 'అడల్ట్ స్లీప్ ఓవర్, 'విమెన్ స్లీప్ ఓవర్' అంటూ చాలామంది ప్రయత్నిస్తున్నారు. నెట్టింట వైరల్ కూడా చేస్తున్నారు. అయితే ఇక్కడ మీరూ, మీ స్నేహితురాళ్లంతే! పిల్లల బాధ్యత ఇంట్లోవాళ్లకి అప్పగించేయండి. మీకు నచ్చిన స్నాక్స్, మ్యాచింగ్ నైట్‌వేర్‌నీ ప్లాన్ చేసుకున్నారంటే... ఓ చిన్నపాటి సెలబ్రేషన్‌లానూ ఉంటుంది. ఖర్చు తక్కువ, మానసిక ప్రశాంతత కూడా. ఇంకేం ప్రయత్నించండి మరి!



బంగారం - వెండి

5న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,32,840	1,19,500	1,83,625
విజయవాడ	1,28,225	1,19,100	1,81,100
ప్రొద్దుటూరు	1,27,850	1,17,620	1,78,000
రాజమహేంద్రవరం	1,29,930	1,19,100	1,96,000
విశాఖపట్నం	1,29,450	1,19,100	1,85,000
తమిళనాడు	-----	1,20,000	1,96,000

ఆ వివరాలకో యాప్!



అపూర్వ

దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స తీసుకుంటున్న రోగులకు సంబంధించిన వివరాలన్నీ ఓ చోట ఉంటే ఎన్ని ఉపయోగాలో తెలుసా? చాలాసార్లు ఇవి అత్యవసర సమయాల్లో రోగికి తక్షణమే చికిత్స ప్రారంభించేందుకు ఉపయోగపడతాయి. ఈ వివరాలు లేక, రోగి చెప్పే పరిస్థితుల్లో ఉండక, చుట్టూ ఉన్న వాళ్లకీ ఇవేవీ తెలియక... చికిత్సలో జరిగే జాప్యం వల్ల కొన్నిసార్లు రోగి ప్రాణాలకే ప్రమాదం రావొచ్చు. ఈ సమస్య పరిష్కారానికే ఓ అప్లికేషన్ రూపొందించారు **డా.అపూర్వ టాక్.** అదేంటంటే...

క్యాన్సర్... వచ్చిందంటే చావే తప్ప బతుకు ఉండదని భావించేవారే ఎక్కువ. కీమోలు, సర్జరీలు ఏం జరిగినా అవన్నీ తాత్కాలిక ఉపశమనంగానే భావిస్తారు. ఇదంతా ఒక ఎత్తైతే... ఈక్రమంలో లెక్కలేనన్ని మందులు వాడతారు. బోలెడు వైద్య పరీక్షలూ చేయించుకుంటారు. ఈ వివరాలన్నీ జాగ్రత్తగా ఓ చోట భద్రపరచాలి. ఎందుకంటే క్యాన్సర్ మళ్లీ తిరగబడినప్పుడు... వాళ్లకు ముందుసారి జరిగిన చికిత్స తెలిస్తే ప్రస్తుత ట్రీట్‌మెంట్‌కు కొంత ఆధారం ఉంటుంది. లేదంటే అంతా మళ్లీ మొదటి నుంచి చేయాల్సి వస్తుంది' అంటారు రాజస్థాన్‌లో ప్రముఖ గైనకాలజికల్



ఆంకాలజిస్టు డా. అపూర్వ టాక్.

గ్లోబల్ వేదికపై...

'ఒక్క క్యాన్సరే కాదు... దీర్ఘకాలిక వ్యాధులు, సర్జరీలకు సంబంధించిన వివరాలన్నీ ఓ చోట ఉండటం చాలా ముఖ్యం. కానీ కాలం గడుస్తున్న కొద్దీ అన్నీ ఒక్కొక్కటిగా చేజార్చుకుంటుంటారు. తర్వాత అవసరం పడినప్పుడు వాటికోసం వెతుకుతుంటారు. పెద్ద, పేరొందిన ఆస్పత్రుల్లో ఇలాంటి వివరాలన్నీ డిజిటలైజేషన్ చేస్తారు. కానీ చిన్న ఆస్పత్రుల్లో ఇదంతా పుస్తకాలు, పేపర్ల వరకే పరిమితం అవుతున్నాయి. నా దగ్గరకు వచ్చిన చాలామంది రోగులు రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండటం గమనించాను. కొన్నిసార్లు వాళ్లకు చేసిన చికిత్స ఏంటో తెలియదు? అసలు వ్యాధే తెలియని వారూ లేకపోలేదు. అందుకే ఇలాంటి వారందరి కోసం ఓ మొబైల్ అప్లికేషన్‌ను రూపొందించాలి అనుకున్నా' అంటారు అపూర్వ. ఈ యాప్ చికిత్స పొందుతున్న, పొందిన రోగులందరి ఫోన్లలో ఇన్‌స్టాల్ చేస్తారు. ఎప్పటికప్పుడు రోగికి ఇస్తున్న మందులు, చేస్తున్న వైద్య పరీక్షల ఫలితాలు అన్నీ అందులో నమోదు చేస్తారు. వ్యాధి నుంచి కోలుకున్నాక దీన్ని ఎలా నిర్వహించాలో చెబుతారు. తింటున్న ఆహారం నుంచి వేసుకునే మందుల వరకూ అన్నీ ఇందులో నమోదు చేస్తారు. వాటి వల్ల కలిగే ఇబ్బందులు కూడా ఈ యాప్‌లో చేర్చుతారు. ఇవన్నీ సంబంధిత ఆస్పత్రి సర్వర్‌కు చేరుకునేట్లు ఏర్పాట్లుచేశారు. దీనివల్ల చికిత్స పూర్తయ్యాక కూడా రోగి రోజువారీ అప్‌డేట్లు వైద్యులకు అందుతూ ఉంటాయి. అన్నట్లు క్లినికల్ ట్రయల్స్‌కు కావాల్సిన డేటాను సేకరించేందుకూ దీన్ని ఉపయోగించొచ్చు అంటున్నారు డా.అపూర్వ. ఇటీవల దక్షిణాఫ్రికాలో జరిగిన గైనకాలజికల్ క్యాన్సర్ సొసైటీ గ్లోబల్ సమ్మిట్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించారీమె. గ్లోబల్ వేదిక మీద ఈ యాప్‌ను లాంచ్ చేశారు. దీని ఫీచర్లు, ఉపయోగాలు చూసి భవిష్యత్తులో ఇలాంటి ఆవిష్కరణలు మరిన్ని రావాలంటూ ప్రపంచ దేశాల ప్రతినిధులు ఆమెను కొనియాడారు.

ఈటీవీ భారత్ — యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి



వీటివల్ల మనసు గాయపడదు..!

కాస్త సమయం దొరికినా... సామాజిక మాధ్యమాల్ని వాడుతున్న అమ్మాయిలే ఎక్కువ. కాలక్షేపంగా అయితే పర్వాలేదు కానీ, ఇదే వ్యసనంగా మారుతోంది. పైగా ఇలా చూసే వీడియోల్లో చాలావరకూ మనసును గాయపరిచే, అడల్ట్ కంటెంట్ ఉండేవే. దాంతో ఒకదాని తర్వాత ఒకటి స్క్రోల్ చేస్తూ మానసిక సమస్యలతో సతమతం అవుతున్నవారే ఎక్కువ. అందుకే ఈ అలవాటు నుంచి బయటపడాలని ఏవేవో ప్రయత్నాలు చేస్తున్నారు. వాటిలో బ్లూమ్ స్క్రోలింగ్ కూడా ఒకటి. అంటే వీడియోల్లో చెడు అంశాల్ని చూసే బదులు... ప్రకృతితో మమేకమవ్వడమే బ్లూమ్‌స్క్రోలింగ్. ఆర్నిథాలజీ కూడా ఆ పరిష్కారాల జాబితాలో చేరింది. అదేనండీ... పక్షిశాస్త్రం. పక్షుల కిలకిలరావాలు, రెక్కల చప్పుళ్లు, నీటిలో అవి చేసే సందళ్లు, వాటి ఆహారం, దాని సేకరణ... వంటి వివరాలతో వీడియోలు బోలెడు. ఇవి చూడటానికి ఆకర్షణీయంగా ఉండి మనసుని ఆకట్టుకుంటున్నాయి. అంతేకాదు ఒకటి రెండు వీడియోలు చూస్తే... సంతృప్తి భావన కలుగుతుందట. దాంతో స్క్రోలింగ్ సమయం తగ్గుతుంది. డోపమైన్లు విడుదలై, ఆనందానికీ కారణమవుతున్నాయి. ఈ మధ్య ఇలాంటి రీల్స్‌ను రూపొందిస్తూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వాళ్లూ చాలామందే. అందుకే ఇన్‌స్టా, ఫేస్‌బుక్, వాట్సాప్ లాంటి వాటికేసి, పదే పదే మనసు లాగుతోంటే... పక్షుల వీడియోల్ని చూడమంటున్నారు నిపుణులు. దీనివల్ల మనసూ ఆహ్లాదంగా ఉంటుంది. మానసిక సమస్యల నుంచి బయటపడొచ్చు. అంతేకాదు, ఎన్నో కొత్త విషయాల్నీ తెలుసుకోవచ్చు అంటున్నారు. ప్రయత్నించి చూడండి మరి!

ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

పాదాలకో మాస్క్..!

చలికాలంలో చర్మంతోపాటూ చేతులూ పాడిబారుతుంటాయి. పాదాలూ, మడమలూ పగిలిపోతుంటాయి. ఎన్ని క్రీములూ, లోషన్లూ వాడినా ఫలితం లేదంటారా! అయితే ఆ సమస్యలకు పరిష్కారంగా వచ్చినవే ఇవి...

మృదువుగా చేస్తుంది...





శీతకాలంలో పాదాలు పగలడం మనకి సాధారణమే. దీనికితోడు మడమల వద్ద మృతకణాలు పేరుకుపోయి చూడ్డానికీ బాగోవు. ఈ 'ఫుట్ హీల్ మాస్క్' వేసి చూడండి. తేమను అందించడంతోపాటు మృతకణాలనూ తొలగిస్తుంది. మడమలు తరచూ పగిలి ఇబ్బంది పెట్టేవారికి ఇది చక్కటి పరిష్కారం. ముందు కాళ్లను బాగా శుభ్రం చేసుకోవాలి. ఆపై మడమకి ప్యాచ్ మాదిరిగా అతికించడమే. నిద్రపోయే ముందు వేసుకుని ఉదయాన్నే తీస్తే సరి. అలా కుదరదంటారా! కాలి మడమ వరకూ మాత్రమే ఉంటుంది కాబట్టి ఆఫీసుకు వెళ్లేటప్పుడు, ఇంట్లో పనిచేసుకుంటున్నప్పుడు వేసుకున్నా సరిపోతుంది. ఈ మాస్క్ మడమలకి స్క్రబ్‌గా పనిచేస్తుంది. డెడ్‌స్కిన్ పొరలుగా రాలిపోయేలా చేస్తుంది. దీంతో మృదువైన మడమలు మీ సొంతం.

కోమలంగా చేస్తాయి...





చలికాలంలో చేతులు పొడిబారడాన్ని తగ్గించేందుకు వివిధ రకాల క్రీములు, లోషన్లు రాస్తుంటాం కదా! ఇలా చేయడంవల్ల అప్పటికి తాత్కాలిక ఉపశమనం లభించినా, సమస్య పునరావృతం అవుతుంది. అలా కాకూడదంటే ఈ 'మాయిశ్చరైజింగ్ హ్యాండ్ మాస్క్'ని ప్రయత్నించండి. దీని తయారీలో ఉపయోగించిన సహజ నూనెలు చర్మంలోకి త్వరగా ఇంకి చేతులను రోజంతా తేమగా, మృదువుగానూ ఉంచుతాయి. డెడ్ స్కిన్ తొలగిపోతుంది. నిద్రపోయేముందు గ్లౌజుల మాదిరిగా చేతులకు వేసుకుంటే సరి.

పెడిక్యూర్... మానిక్యూర్ ఇంట్లోనే..




ముఖాన్ని పట్టించుకున్నట్లుగా చాలామంది పాదాలను పట్టించుకోరు. కాబట్టే, అవి నిర్జీవంగా తయారవుతాయి. వాటికి అంతలా సమయం కేటాయించలేం అనిపిస్తే ఈ 'ఫుట్ మాస్క్'లను వాడొచ్చు. ట్యాన్ తొలగిస్తాయి, నిర్జీవంగా తయారైన పాదాలకు తేమను అందిస్తాయి, మృతకణాలనూ తొలగించడంతోపాటు ఇది అందించే ప్రయోజనాలెన్నో. ఒకరకంగా పార్లర్‌కి వెళ్లకుండానే ఇంట్లోనే పెడిక్యూర్, మానిక్యూర్ అయిపోతుంది. మెరిసే మృదువైన పాదాలూ సొంతమవుతాయి. మీ అవసరాలకు తగ్గదేదో ఎంచుకోవడమే మీ వంతు. మీకూ నచ్చాయా అయితే ప్రయత్నించేయండి మరి.



కాబోయే అమ్మకు పురిటి నొప్పుల భయం

- ఆసుపత్రి వ్యవస్థలో లోపాలు.. కొత్త వైద్యుల్లో కొరవడిన నైపుణ్యం
- రాష్ట్రంలో సిజేరియన్ ప్రసవాలు పెరగడానికి కారణాలివే
- తాజా అధ్యయనంలో వెల్లడి

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) మార్గదర్శకాల ప్రకారం సిజేరియన్ డెలివరీలు 10-15 శాతానికి మించకూడదు. కానీ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 ప్రకారం మన రాష్ట్రంలో సిజేరియన్ డెలివరీలు 42.4% (ప్రైవేటు ఆసుపత్రుల్లో: 63%, ప్రభుత్వ వైద్యశాలల్లో: 26%) జరుగుతున్నాయి. సిజేరియన్ ప్రసవాల్లో మన ఆంధ్రప్రదేశ్ దేశంలో మూడో స్థానం. ఆసుపత్రుల్లో వ్యవస్థాపరమైన లోపాలు, ఇతర వైద్య కారణాలతోపాటు గర్భిణుల్లో నెలకొన్న భయం, కుటుంబ సభ్యుల ఒత్తిడి, జీవనశైలి మార్పులు ఇందుకు కారణాలుగా తాజా శాస్త్రీయ అధ్యయనంలో తేలింది. స్టేట్ హెల్త్ అండ్ వెల్ఫేర్ కన్సల్టెంట్ నాగేంద్రబాబు గువ్వల నేతృత్వంలోని బృందం నిర్వహించిన ఈ అధ్యయనం 'బీఎంసీ ప్రెగ్నెన్సీ అండ్ చైల్డ్ బర్త్-2025' జర్నల్‌లో ప్రచురితమైంది. సిజేరియన్ల రేటు అధికంగా ఉన్న విశాఖ, కృష్ణా జిల్లాలతో పాటు తక్కువగా ఉన్న అనంతపురం, చిత్తూరు జిల్లాలను ఈ బృందం అధ్యయనానికి ఎంచుకుంది. ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు చేపట్టిన పరిశోధనలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని ప్రసూతి వైద్యులు, మిడ్‌వైవ్స్‌తో మాట్లాడి కారణాలపై స్పష్టతకు వచ్చారు.



సామాజిక, మానసిక పరిస్థితులు

- సాధారణ ప్రసవం అంటే నొప్పులు భరించలేమన్న భయంతో గర్భిణులు సిజేరియన్లను ఎంచుకుంటున్నారు. ఈ దిశగా కుటుంబసభ్యులూ ప్రోత్సహిస్తున్నారు.
- అమావాస్య, రాహుకాలంలో బిడ్డ పుట్టకూడదని, ఎంచుకున్న మంచి ముహూర్తాల్లో శస్త్రచికిత్స జరగాలని కుటుంబసభ్యుల నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయి.

అవసరమైతేనే సిజేరియన్..

- అవసరం ఉన్నా, లేకున్నా సి-సెక్షన్ డెలివరీలు చేయిస్తుండడంతో తల్లుల్లో అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. వైద్య ఖర్చులూ పెరుగుతున్నాయి.
- గర్భధారణ సమయంలో బీపీ, చేతులు-కాళ్లలో వాపు, తలనొప్పి, కళ్ల బైర్లు కమ్మడం, ఫిట్స్ వంటి ప్రీ-ఎక్లాంప్సియా లక్షణాలున్నా.. గర్భంలో బిడ్డ హృదయ స్పందన, కదలికలు తగ్గడం వంటి ఫీటల్ డిస్ట్రెస్ పరిస్థితుల్లో హైపర్ టెన్షన్ తరహా నిజమైన వైద్య కారణాలు ఉన్నప్పుడు సిజేరియన్‌తో ప్రాణాలు కాపాడొచ్చు. కానీ, చాలా కేసుల్లో ఇలాంటి అత్యవసర పరిస్థితులు లేకున్నా శస్త్రచికిత్సలతో ప్రసవాలు చేస్తున్నారు.

తల్లి ఆరోగ్యం.. జీవనశైలి కారణాలు

- గర్భిణుల్లో శారీరక శ్రమ తగ్గిపోవడం, ఎక్కువసేపు కూర్చునే జీవనశైలి, బరువు పెరగడం, చిన్న నొప్పులకే భయపడిపోవడం.
- గర్భాశయ కండరాలు బలహీనంగా ఉండడం వల్ల సాధారణ ప్రసవానికి శరీర సామర్థ్యం తట్టుకోవడం లేదని వైద్యులు చెబుతున్నారు.
- హైరిస్క్ ప్రెగ్నెన్సీ ప్రసవ సమయంలో వచ్చే క్లిష్ట పరిస్థితులతో ప్రమాదం అని పేర్కొని సిజేరియన్‌కు మొగ్గు చూపుతున్నారు.

వైద్యారోగ్య వ్యవస్థలో లోపాలు

- చిన్న ఆసుపత్రుల్లో 24/7 ఆపరేషన్ థియేటర్ సదుపాయం లేకపోవడం, సిబ్బంది కొరత.
- కొత్తగా వైద్యవృత్తిలో చేరిన వారిలో సాధారణ ప్రసవాలు చేసే నైపుణ్యం లోపించడం.
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు 24 గంటలూ అందుబాటులో లేకపోవడం.
- సాధారణ ప్రసవాల్లో అప్పుడప్పుడు తలెత్తే సమస్యలు, దాడులు, న్యాయపరమైన చిక్కుల భయం.
- ఎన్టీఆర్ వైద్యసేవ- పీఎంజేఏవై వంటి పథకాల్లో సిజేరియన్‌కు కూడా పూర్తి బీమా కల్పించడంతో రోగులు, ఆసుపత్రులు శస్త్రచికిత్సకు మొగ్గు చూపడం.

అవగాహనే పరిష్కారం

- స్వచ్ఛంద సిజేరియన్ డెలివరీలకు రెండో వైద్య అభిప్రాయం తప్పనిసరి చేయాలి.
- గర్భిణులకు సాధారణ ప్రసవాల వల్ల కలిగే ఆరోగ్య, వైద్యపరమైన ప్రయోజనాలపై అవగాహన కల్పించాలి.
- యువ వైద్యులు, ఆరోగ్య సహాయకులకు ప్రసూతి సేవలపై నైపుణ్య శిక్షణ ఇవ్వాలి.
- అన్ని ఆసుపత్రుల్లో 24/7 ప్రసవ సేవలు అందించేలా వైద్యవ్యవస్థను పటిష్ఠ పరచాలి.
- ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో సిజేరియన్ రేట్లపై తరచూ ఆడిట్ చేయాలి.

- ఈనాడు, అమరావతి

వివేకా హత్య కేసులో సమగ్ర దర్యాప్తు జరగలేదు

- ఈ మాట నిందితులూ అంటున్నారు
- సీబీఐ కోర్టులో ఆయన కుమార్తె సునీత వాదన

ఈనాడు, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సమగ్ర దర్యాప్తు జరగలేదని, పలు అంశాలపై దర్యాప్తు అసమగ్రంగా ఉందని నిందితులే అంటున్నారన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆయన కుమార్తె సునీతారెడ్డి సీబీఐ కోర్టుకు నివేదించారు. వివేకా హత్య కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగించాలంటూ సునీత సీబీఐ కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగిసిపోవడంతో ఉత్తర్వుల నిమిత్తం ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసిన విషయం విదితమే. అయితే ఈ కేసులో అదనపు వాదనలు ఉన్నాయంటూ సునీత తరఫు న్యాయవాదులు మెమో దాఖలు చేయడంతో సీబీఐ ప్రధాన కోర్టు న్యాయాధికారి టి.రఘురాం శుక్రవారం విచారణ చేపట్టారు. సునీత తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, న్యాయవాది ఎస్.గౌతం వాదనలు వినిపిస్తూ కోర్టు ఆదేశిస్తే దర్యాప్తు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు సీబీఐ ఇప్పటికే వెల్లడించిందన్నారు. ప్రత్యక్ష సాక్షిగా రంగన్నను పేర్కొన్నప్పటికీ కుట్రకు దారి తీసిన పరిస్థితులు, అందులో భాగస్వాములపై సమగ్ర దర్యాప్తు జరగలేదని చెప్పారు. ఇందులో నిందితుడిగా ఉన్న దస్తగిరి క్షమాపణ చెప్పడంపై నిందితులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని, అయితే దస్తగిరి వాంగ్మూలానికి విరుద్ధంగా మాట మార్చితే తిరిగి నిందితుడిగా చేర్చే అధికారం కోర్టుకు ఉందని తెలిపారు. అవినాష్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌లో తెలంగాణ హైకోర్టులో అభియోగపత్రంలోని లోపాలకు సంబంధించి దర్యాప్తు పూర్తయినట్లు సీబీఐ చెప్పడం లేదన్నారు. కొన్ని అంశాలపై దర్యాప్తు పెండింగ్ ఉందని సీబీఐ చెబుతున్నందున దర్యాప్తు కొనసాగించకుండా చట్టపరంగా నిషేధమేమీ లేదని అన్నారు. దర్యాప్తులో లోపాలున్నప్పుడు, అసంపూర్తిగా ఉన్నప్పుడు తదుపరి దర్యాప్తునకు అనుమతించవచ్చని, అందుకు ఆదేశించే అధికారం ఈ కోర్టుకు ఉందని చెప్పారు. లోపభూయిష్టమైన దర్యాప్తు నిందితులకు అనుకూలంగా ఉంటుందన్నారు. వాదనలు విన్న న్యాయాధికారి తీర్పును వాయిదా వేశారు.

విమానాల రద్దుతో ఇబ్బంది పడ్డ..
తెలుగు రాష్ట్రాల ప్రయాణికులు

- టెర్మినళ్లలోనే తిండీ నిద్ర

ఈనాడు, హైదరాబాద్- విశాఖపట్నం (ఎన్ఏడీకూడలి), ఓర్వకల్లు, రేణిగుంట, గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థ ముందస్తు సమాచారం లేకుండా విమాన సర్వీసుల్ని రద్దు చేయడంతో తెలుగురాష్ట్రాల్లోని పలు విమానాశ్రయాల్లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయంలో శుక్రవారం ఒక్కరోజే 155 విమాన సర్వీసులను రద్దు చేయడంతో ప్రయాణికులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో విమాన సర్వీసుల రాకపోకలు యథావిధిగా సాగుతున్నట్లు చూపిస్తుండడం.. విమానాశ్రయంలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉండడంతో ప్రయాణికులు ఆగ్రహోదగ్రులయ్యారు. ఇండిగో ఎయిర్‌లైన్స్ అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయలోపం కారణంగా ఆరువేల మంది ప్రయాణికులు టెర్మినళ్లలోనే తింటూ.. అక్కడే నిద్రపోయారు.



శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికుల పడిగాపులు

చంటిపిల్లలతో వచ్చినవారు, గర్భిణులు తీవ్ర అవస్థలు పడ్డారు. హైదరాబాద్ నుంచి విజయవాడ, తిరుపతి, చెన్నై, ముంబయి నగరాలకు వెళ్లే ప్రయాణికుల్లో చాలామంది ఇండిగో ఎయిర్‌లైన్స్ సిబ్బందిపై దాడికి ప్రయత్నించగా... భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. అత్యవసరంగా వెళ్లాల్సినవారు ఇతర విమానయాన సంస్థల నుంచి టికెట్లు కొనేందుకు యత్నించగా... ధరలు ఆకాశాన్నంటాయి. టికెట్ ధరలు హైదరాబాద్ నుంచి దిల్లీకి రూ.25 వేలు, విజయవాడకు రూ.18 వేలు పలికాయి. ◆ విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం ఒక్కరోజే పదిహేను ఇండిగో విమానాలను రద్దు చేసినట్లు స్థానిక ఎయిర్‌పోర్టు డైరెక్టర్ పురుషోత్తం పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 5 నుంచి 15వ తేదీ మధ్య ప్రయాణాల కోసం టికెట్లు బుక్ చేసుకొన్న వారికి విమానాల రద్దు, రీషెడ్యూలింగ్ వల్ల పూర్తి రిఫండ్ ఇస్తామని ఆ సంస్థ పేర్కొన్నట్లు సంబంధిత ప్రతినిధులు వెల్లడించారు. ◆ ఓర్వకల్లు విమానాశ్రయానికి వస్తున్న ఇండిగో విమాన సర్వీసు రద్దైనట్లు తెలిసింది. బెంగళూరు నుంచి ఓర్వకల్లు, ఓర్వకల్లు నుంచి విశాఖపట్నం, విశాఖపట్నం నుంచి ఓర్వకల్లు, ఓర్వకల్లు నుంచి బెంగళూరుకు తిరిగే ఇండిగో విమాన సర్వీసు రెండు రోజులుగా నిలిచిపోయినట్లు తెలుస్తోంది. ◆ తిరుపతి జిల్లా రేణిగుంట విమానాశ్రయం నుంచి శుక్రవారం ఇండిగోకు చెందిన 12 సర్వీసులు రాకపోకలు సాగించాల్సి ఉండగా.. తొమ్మిదింటిని ఆ సంస్థ అధికారులు రద్దు చేశారు. టికెట్ నగదును ప్రయాణికుల ఖాతాల్లో వేస్తామని ప్రకటించారు. ఈ క్రమంలో కొందరు కౌంటర్ వద్ద సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ◆ విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం మీదుగా రాకపోకలు సాగించే ఇండిగో విమానయాన సంస్థకు చెందిన పలు విమాన సర్వీసులు శుక్రవారం ఆలస్యంగా నడిచాయి. విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తిరుపతి, వైఎస్సార్ కడప, కర్నూలుకు వెళ్లే విమాన సర్వీసులు సుమారు రెండు గంటలపాటు ఆలస్యంగా నడిచాయి.



బెంగళూరులోని విమానాశ్రయంలో నిలిచిపోయిన ఇండిగో విమానాలు

ఆన్‌లైన్‌లో టెకీ దంపతుల రిసెప్షన్

ఇంటర్నెట్‌డెస్క్, బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: ఇండిగో విమాన సర్వీసుల రద్దు కొనసాగుతున్న వేళ.. వేల మంది ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ఓ టెకీ దంపతులకు వింత అనుభవం ఎదురైంది. ఇటీవలే పెళ్లి చేసుకున్న ఆ జంట.. ఆన్‌లైన్‌లో రిసెప్షన్ చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. కర్ణాటకలోని హుబ్బళ్లికి చెందిన మేధా క్షీర్‌సాగర్, ఒడిశాలోని భువనేశ్వర్‌కు చెందిన సంగమ దాస్‌లు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. నవంబరు 23న భువనేశ్వర్‌లో వీరి వివాహం జరిగింది. బుధవారం వధువు స్వస్థలం హుబ్బళ్లిలోని గుజరాత్ భవన్‌లో రిసెప్షన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ వేడుకకు హాజరయ్యేందుకు నవదంపతులు ఇండిగో విమానంలో టికెట్లు బుక్ చేసుకున్నారు. అయితే ఆ విమాన సర్వీసు రద్దుకావడంతో అనుకున్న సమయానికి గమ్యానికి చేరుకోలేకపోయారు. అప్పటికే రిసెప్షన్‌కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. అతిథులు కూడా అక్కడికి చేరుకోవడంతో.. వధూవరులు వర్చువల్‌గా ఇందులో పాల్గొన్నారు. రిసెప్షన్ ఏర్పాటుచేసిన హాల్‌లో సిద్ధంచేసిన స్క్రీన్ మీద వధూవరులను చూపించారు. బంధువులంతా ఆన్‌లైన్‌లోనే ఈ కొత్త జంటను ఆశీర్వదించారు. దీనికి సంబంధించిన దృశ్యాలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి.



హైదరాబాద్ ప్రగతికి చంద్రబాబు మొదటి కారణం

- కాంగ్రెస్ ప్రభుత్వం దానిని కొనసాగించింది
- పరిస్థితుల మేరకు పవన్‌పై వ్యాఖ్యలు చేశా: తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి
- ఏపీ సీఎంకు గ్లోబల్ సమిట్ ఆహ్వానపత్రిక అందజేత



చంద్రబాబుకు ఆహ్వాన పత్రాన్ని అందిస్తున్న కోమటిరెడ్డి, బీర్ల అయిలయ్య

ఈనాడు, అమరావతి: "అప్పట్లో ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ఉన్న చంద్రబాబు ఐటీ గురించి ఎక్కువగా మాట్లాడేవారు. హైదరాబాద్ ఆదాయం పెరుగుతుందని... భారీగా ఉద్యోగాలు వస్తాయని చెప్పేవారు. ఇప్పుడు చూస్తే ఆయన అనుకున్నది దాటిపోయాం. ఈ అభివృద్ధికి మొదటి కారణం చంద్రబాబు.. రెండో కారణం దానిని కొనసాగించిన కాంగ్రెస్ ప్రభుత్వం" అని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్-2047'కు ఏపీ సీఎం చంద్రబాబును ఆహ్వానించేందుకు శుక్రవారం ఆయన అమరావతికి వచ్చారు. ఉండవల్లి నివాసంలో చంద్రబాబును కలిసి ఆయనకు తెలంగాణ ప్రభుత్వం తరఫున ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డిని చంద్రబాబు శాలువాతో సత్కరించి శ్రీవేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని బహూకరించారు. గంటన్నరపాటు ఇరువురూ సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం కోమటిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. "సుదీర్ఘ రాజకీయ అనుభవం చంద్రబాబు సొంతం. గతంలో ఆయనతో రాజకీయంగా విభేదించా. వ్యక్తిగతంగా కాదు. చంద్రబాబు అరెస్టును పార్టీలకతీతంగా ఖండించా" అని గుర్తుచేశారు. "రెండు రాష్ట్రాలకు ప్రపంచ స్థాయి గుర్తింపు రావాలనేదే నా ఆకాంక్ష. తెలంగాణకు నష్టం జరిగేలా ఎప్పటికీ చేయను" అని చంద్రబాబు చెప్పినట్లు మంత్రి తెలిపారు. ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై పరిస్థితుల మేరకు వ్యాఖ్యలు చేశానని... అది ముగిసిపోయిన అంశమని కోమటిరెడ్డి పేర్కొన్నారు. ప్రతిపక్ష హోదా లేకపోయినా ఏపీ మాజీ సీఎం జగన్ అసెంబ్లీకి వెళ్లి ప్రజాసమస్యలపై పోరాడాలని సూచించారు.

శబరిమల వెళ్లే భక్తులకు ప్రత్యేక విమానం

మంత్రి పార్థసారథికి స్వాముల కృతజ్ఞతలు

ఈనాడు, అమరావతి: ఇండిగో విమాన సర్వీస్ రద్దు కావడంతో ఆందోళన చెందుతున్న అయ్యప్ప భక్తులకు శబరిమల వెళ్లేందుకు గృహనిర్మాణశాఖ మంత్రి పార్థసారథి ప్రత్యేక విమాన సదుపాయం కల్పించారు. శుక్రవారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి విజయవాడ వచ్చేందుకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న ఆయన.. శబరిమల వెళ్లే విమాన సర్వీస్ ఆకస్మికంగా రద్దు కావడంతో అయ్యప్ప భక్తులు ఆందోళన చెందడాన్ని గుర్తించారు. మరింత ఆలస్యమైతే శబరిమలలో స్వామివారి దర్శన టోకెన్లు పనికి రాకుండా పోతాయని భక్తులు వాపోయారు. దీంతో మంత్రి పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడితో ఫోన్‌లో మాట్లాడి ప్రత్యేక విమాన సర్వీస్ ఏర్పాటు చేయించారు. ఆ విమానం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి బయల్దేరి వెళ్లే వరకూ పర్యవేక్షించారు. మంత్రికి అయ్యప్ప భక్తులు ధన్యవాదాలు తెలిపారు.

భవన నిర్మాణ కార్మికులకు నైపుణ్య శిక్షణ

ఈనాడు, అమరావతి: భవన నిర్మాణ కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించాలని కార్మిక శాఖ కార్యదర్శి ఎంవీ శేషగిరిబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకోసం నమోదు చేసుకున్న 65 వేల మంది కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు 2025-26 సంవత్సరానికి సంబంధించి ఈ శిక్షణ అందించనున్నారు. మూడు నుంచి ఆరు నెలల కాల వ్యవధి కలిగిన 41 కోర్సులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ విధానంలో అందిస్తారు. ఐదు వేల మంది కార్మికులకు జాతీయ నిర్మాణ అకాడమీ (న్యాక్) ద్వారా కోర్ నిర్మాణ ట్రేడ్‌లలో తర్ఫీదిస్తారు. కార్మికులపై ఆధారపడిన 60 వేల మందికి 41 కోర్సుల్లో వృత్తి, నైపుణ్య శిక్షణ అందించేందుకు ఏపీటీఎస్ ద్వారా భాగస్వామి ఎంపికకు టెండర్ల ప్రక్రియ నిర్వహించనున్నారు.

ఎగరని ఇండిగో

(మొదటి పేజీ తరువాయి)

డైరెక్టరేట్ జనరల్(డీజీసీఏ) ఇటీవల జారీచేసిన ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ (ఎఫ్‌డీటీఎల్) ఉత్తర్వులను తాత్కాలికంగా ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు. విమాన భద్రతపై రాజీ పడకుండా ప్రయాణికులు, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు, విద్యార్థులు, రోగులు, అత్యవసర అవసరాల కోసం విమాన ప్రయాణాలపై ఆధారపడే వారిని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎఫ్‌డీటీఎల్ ఉత్తర్వులపై డీజీసీఏ ప్రకటన విడుదల చేసింది. వీక్లీ విశ్రాంతి నిబంధనను పక్కన పెడుతున్నట్లు తెలిపింది. పైలట్లలో అలసట సమస్యను తగ్గించేందుకు, వారికి వారంలో విశ్రాంతి సమయాన్ని 36 గంటల నుంచి 48 గంటలకు పెంచుతూ ఇటీవల డీజీసీఏ నిబంధనలు తీసుకొచ్చింది. దీని ప్రకారం.. వీక్లీ విశ్రాంతిని, సెలవులను వేర్వేరుగా పరిగణించాలి. ఇండిగో విమాన సర్వీసులకు గత నాలుగు రోజులుగా అంతరాయం కలుగుతుండటంతో ఈ నిబంధనను తాత్కాలికంగా ఉపసంహరిస్తున్నట్లు డీజీసీఏ తెలిపింది. దీంతో ఇండిగోకు మరింత మంది పైలట్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది.

ప్రయాణికుల ఇక్కట్లు వర్ణనాతీతం

దిల్లీలో 235, ముంబయిలో 104, బెంగళూరులో 102, హైదరాబాద్‌లో 84, గోవాలో 30కి పైగా ఇండిగో విమానాలు శుక్రవారం రద్దయ్యాయి. దేశంలోని చాలా విమానాశ్రయాల్లోనూ ఇదే పరిస్థితి. దీంతో ఆ సంస్థ ఆన్‌టైమ్ పంక్చువాలిటీ సామర్థ్యం(ఓటీపీ) గురువారానికి ఏకంగా 8.5 శాతానికి పడిపోయింది. దిల్లీ సహా పలు విమానాశ్రయాలు రైల్వే ప్లాట్‌ఫామ్‌లను తలపిస్తున్నాయి. ఫ్లైట్ తాజా స్టేటస్ తెలుసుకొని ఎయిర్‌పోర్టులకు రావాలని ప్రయాణికులకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) సూచించింది. దిల్లీ విమానాశ్రయం నుంచి బయల్దేరాల్సిన ఇండిగో విమానాలన్నీ నిలిచిపోయాయి. దీంతో చాలా మంది ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌లోనే పడిగాపులు కాస్తున్నారు. దిల్లీలోనే కాదు.. బెంగళూరు, హైదరాబాద్ తదితర విమానాశ్రయాల్లోనూ గందరగోళం నెలకొంది. ఇండిగో కౌంటర్లు ఖాళీగా ఉన్నాయని, ఎయిర్‌లైన్స్ సిబ్బంది తమను పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఆహారం, తాగు నీరు కూడా ఇవ్వట్లేదని వాపోతున్నారు. మరోవైపు, తమ లగేజీలను తీసుకునేందుకు 12 గంటలకు పైగా సమయం పడుతోందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

◆ ఇండిగో విమాన సర్వీసుల అంతరాయాలపై సమగ్ర సమీక్ష, అధ్యయనం చేయడానికి నలుగురు సభ్యులతో ఓ కమిటీని డీజీసీఏ నియమించింది. 15 రోజుల్లో ఈ కమిటీ తన నివేదికను సమర్పించనుంది.

◆ 'ఎక్స్' వేదికగా కూడా ఇండిగో యాజమాన్యం ప్రయాణికులకు బహిరంగ క్షమాపణ చెప్పింది. "క్షమించండి.. మిమ్మల్ని జాగ్రత్తగా చూసుకుంటాం" అని పేర్కొంది. ఈ నెల 5-15 తేదీల మధ్య ప్రయాణాల కోసం టికెట్లు బుక్ చేసుకొని, ఈ అంతరాయాల కారణంగా వాటిని రద్దు లేదా రీషెడ్యూలింగ్ చేసుకుంటే పూర్తి రీఫండ్ ఇస్తామని పేర్కొంది. ఇండిగో సంస్థ సీఈవో పీటర్ ఎల్బెర్స్ కూడా క్షమాపణ చెప్పారు. శనివారం రద్దయ్యే విమానాల సంఖ్య వెయ్యిలోపు ఉంటుందని తెలిపారు.

చుక్కలనంటిన టికెట్ల ధరలు

ఇండిగో సంక్షోభం ముదురుతున్న వేళ విమాన టికెట్ల ధరలు ఆకాశాన్నంటాయి. కోల్‌కతా నుంచి ముంబయికి వెళ్లాల్సిన స్పైస్‌జెట్ విమాన టికెట్ ధర శుక్రవారం ఏకంగా రూ.90,000కు చేరుకుంది. ముంబయి నుంచి భువనేశ్వర్‌కు ఎయిరిండియా నడుపుతున్న విమానం టికెట్ ధర కూడా రూ.84,485 పలికింది. ఇండిగో విమానాలు రద్దైన మార్గాల్లో ధరలు భారీగా పెరిగాయని విమానయాన సంస్థ ఎగ్జిక్యూటివ్ ఒకరు తెలిపారు. మరోవైపు విమానాశ్రయాల్లో చిక్కుకున్న ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేందుకు రైల్వే కూడా రంగంలోకి దిగింది. 37 రైళ్లకు 116 కోచ్‌లు అదనంగా జోడించాలని నిర్ణయించింది. ఇప్పటికే కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను అదనపు బోగీలతో అధికారులు నడిపిస్తున్నారు.



ఇండిగో విమాన సేవల అంతరాయంపై దిల్లీలో అధికారులతో చర్చిస్తున్న పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు

ప్రభుత్వ గుత్తాధిపత్య ఫలితమిది: రాహుల్

'ఇండిగో' వైఫల్యం ప్రభుత్వ గుత్తాధిపత్య విధానానికి చెల్లిస్తున్న మూల్యమని 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. "ఇది ప్రభుత్వ గుత్తాధిపత్య విధాన ఫలితమే. విమాన జాప్యాలు, రద్దుల కారణంగా ప్రజలే దీని మూల్యం చెల్లించుకుంటున్నారు" అని పేర్కొన్నారు. ఇండిగో విమాన అంతరాయాలపై రాజ్యసభలోనూ చర్చ జరిగింది.

12 ఎంపీపీ స్థానాలకు 11న ఎన్నికలు

రెండు ఉపాధ్యక్ష, 6 ఉప సర్పంచి స్థానాలకూ నోటిఫికేషన్లు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 12 మండల పరిషత్ అధ్యక్షులు(ఎంపీపీ), రెండు ఉపాధ్యక్షులు, ఆరు కో-ఆప్షన్ సభ్యులు, మరో 6 ఉప సర్పంచి స్థానాలకు ఈనెల 11న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలంసాహ్ని శుక్రవారం వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీ చేశారు. అవిశ్వాస తీర్మానాలు, ఆకస్మిక మరణం, రాజీనామా చేసిన కారణంగా ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసే క్రమంలో ఎన్నికల సంఘం నోటిఫికేషన్లు ఇచ్చింది. ఈనెల 7లోగా సభ్యులకు సమాచారం అందించి 11న ఉదయం 11 గంటలకు ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను ఎన్నికల కమిషనర్ నీలంసాహ్ని ఆదేశించారు. తగిన కోరం లేకపోవడం, ఇతర కారణాలతో ఎన్నికలు నిర్వహించలేనప్పుడు...మరుసటి రోజు 12న చేపట్టాలని సూచించారు. అనకాపల్లి జిల్లా మునగపాక, అన్నమయ్య జిల్లా వైసీపల్లి ఉప సర్పంచి స్థానాలకు ఇదివరకు రెండుసార్లు నిర్వహించిన ఎన్నికలు వాయిదా పడినందున...ఈసారి ముగ్గురు సభ్యులు హాజరైనా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్లను ఎన్నికల కమిషనర్ ఆదేశించారు.

ఎన్నికలు నిర్వహించే ఎంపీపీ స్థానాలివే

కపిలేశ్వరపురం(అంబేడ్కర్ కోనసీమ జిల్లా), విస్సన్నపేట(ఎన్టీఆర్), ముద్దనూరు(వైఎస్సార్ కడప), పెంటపాడు(పశ్చిమ గోదావరి), యలమంచిలి(అనకాపల్లి), మాచవరం(పల్నాడు), తంబళ్లపల్లె(అన్నమయ్య), విజయపురం, నింద్ర(చిత్తూరు), ఏర్పేడు, వరదాయపాలెం(తిరుపతి), రామగిరి (సత్యసాయి)



మీ మైండ్‌సెట్‌ను ఇలా మార్చుకోండి

మన ఎదుగుదలను అడ్డుకొనే ఆలోచనాధోరణి:

- ✦ కొత్త పనులు మొదలుపెట్టడానికి నాకు వయసైపోయింది.
- ✦ నాకు పెద్దగా ప్రతిభ, సామర్థ్యాలు లేవు.
- ✦ ఈ ప్రయత్నంలో విఫలమైతే జీవితం క్లిష్టంగా మారుతుంది.

మనం ఎలా ఆలోచించాలంటే:

- ✦ ఈ పని మొదలుపెట్టడానికి ఇంతకన్నా మంచి సమయం లేదు.
- ✦ నేను సాధన చేస్తే ఎలాంటి నైపుణ్యాలనైనా నేర్చుకోగలను.
- ✦ వైఫల్యం ఎదురైనా సరే, విజయం సాధించేవరకూ ప్రయత్నిస్తాను.

– అనుష్కా సోహం బఢ్వాల్, అంత్రప్రెన్యూర్

రుణగ్రహీతలకు భారీ ఉపశమనం

(మొదటి పేజీ తరువాయి)

వాహన రుణాలు తీసుకున్న వారికీ, కొత్తగా తీసుకోవాలని ఆలోచిస్తున్న వారికీ ఎంతో ప్రయోజనం కలిగించే అంశం.

రుణ వడ్డీపై ప్రభావం

ప్రస్తుతం బ్యాంకులన్నీ రెపో ఆధారిత రుణ వడ్డీ రేటు (ఆర్ఎల్ఎల్ఆర్)ను తమ ప్రామాణిక వడ్డీ రేటుగా పరిగణిస్తున్నాయి. రెపో రేటుపై బ్యాంకులు 2.50% - 2.75% అదనంగా తమ ఖాతాదారుల వద్ద వసూలు చేస్తుంటాయి. ప్రస్తుతం రెపో రేటు 5.25%పై అదనంగా 2.5% బ్యాంకు వసూలు చేస్తే.. వడ్డీ రేటు దాదాపు 7.75% అవుతుంది. ◆ ఆర్‌బీఐ ప్రకటన తరవాత బ్యాంక్ ఆఫ్ బరోడా తన వడ్డీ రేటును 8.15% నుంచి 7.90 శాతానికి తగ్గిస్తున్నట్లు, ఈనెల 6 నుంచి కొత్త రేటు అమల్లోకి వస్తున్నట్లు వెల్లడించింది. ◆ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో ఆధారిత రుణ రేటును 8.35% నుంచి 8.10 శాతానికి తగ్గించామని, ఈనెల 5 నుంచే అమల్లోకి తెచ్చినట్లు వివరించింది. ◆ మిగిలిన ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు రెపో రేటు తాజా తగ్గింపు ప్రయోజనాన్ని త్వరలోనే తమ రుణగ్రహీతలకు అందించేందుకు సిద్ధం అవుతున్నాయి. 800 పాయింట్లకు మించి క్రెడిట్ స్కోరున్న వారికి బ్యాంకులు 0.25% వడ్డీ రాయితీ ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో రుణ చెల్లింపు చరిత్ర బాగున్న వారికి 7.50% వడ్డీకే రుణం లభించే అవకాశం లేకపోలేదు. కొవిడ్ సమయంలో వడ్డీ రేట్లు తక్కువగా ఉన్నప్పుడు, అధిక మొత్తంలో రుణ అర్హత లభించింది. ఆ తర్వాత వరసగా వడ్డీ రేట్లు పెరగడంతో, అప్పుడు రుణం తీసుకున్న వారందరికీ ఇటీవల వరకూ వడ్డీ భారంగా మారింది. ఇప్పుడు రెపో రేటు దిగి రావడంతో ప్రధానంగా వీరికి ఊరట లభించనుంది.

భారం తగ్గేది ఇలా..

ఈ ఏడాది రుణాలపై వడ్డీ రేటు 1.25% తగ్గింది. ఉదాహరణకు 2024 డిసెంబరులో రెపో రేటు 6.50% ఉన్నప్పుడు రూ.50 లక్షల గృహరుణం తీసుకున్నారనుకుందాం. అప్పుడు వడ్డీ రేటు 9% అనుకుంటే, 25 ఏళ్ల వ్యవధికి నెలవారీ వాయిదా రూ.41,960 అవుతుంది. మొత్తం వ్యవధి పూర్తయ్యేనాటికి వడ్డీ రూ.75,87,945 చెల్లించాలి. ఇదే రుణాన్ని ప్రస్తుతం 7.75% వడ్డీకి తీసుకున్నారనుకోండి... ఈఎంఐ రూ.37,766 అవుతుంది. అంటే నెలవారీ ఈఎంఐ రూపంలో రూ.4,194 మిగులుతుంది. మొత్తంగా వడ్డీ రూ.63,29,931 మాత్రమే అవుతుంది. ◆ వ్యవధి పరంగా చూస్తే.. 9% వడ్డీ ఉన్నప్పుడు 300 నెలల పాటు (25 ఏళ్లు, నెలకు వాయిదా రూ.41,960) చెల్లించాల్సిన రుణం 7.75% వడ్డీతో 229 నెలల్లోనే తీరిపోతుంది.

బ్యాంకులను సంప్రదించాలి

వడ్డీ రేటు మారినప్పుడు ఒకసారి బ్యాంకును సంప్రదించి, పూర్తి వివరాలు తెలుసుకోవడం మంచిది. కొన్ని బ్యాంకులు అడిగితే మినహా వడ్డీ రేటును సవరించవు. వీలైనంత వరకూ ఈఎంఐని తగ్గించుకోకుండా, వ్యవధి తగ్గేలా చూసుకోవాలి.

ఎఫ్‌డీ చేసే వారికి: ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) చేసి, నెలవారీ వచ్చే వడ్డీ మీద ఆధారపడే వారికి.. మాత్రం ఆదాయం కొంత తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం చాలా బ్యాంకులు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 7% లోపే వడ్డీ అందిస్తున్నాయి. ఇప్పుడు ఇది మరింత తగ్గే అవకాశం లేకపోలేదు.

తాత్కాలికంగా భర్తీ చేస్తే నిరుద్యోగుల పరిస్థితేంటి?

(మొదటి పేజీ తరువాయి)

రిజర్వేషన్ అమలు చేయాలి.. ఆ విధానాన్ని పాటించట్లేదు' అని వ్యాఖ్యానించింది. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని ప్రభుత్వం, ఎస్వీయూ అధికారులను ఆదేశించింది. పోస్టుల భర్తీ విషయంలో ముందుకెళ్లేందుకు వీలుకల్పిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల అమలును నిలుపుదల చేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథ శర్మతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. ◆ రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు విరుద్ధంగా నెలవారీ గౌరవవేతనం ప్రాతిపదికన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాలలో అకడమిక్ కన్సల్టెంట్ల పోస్టుల భర్తీ కోసం ఈ ఏడాది అక్టోబరు 31న నోటిఫికేషన్ ఇచ్చారని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్‌లో అకడమిక్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ కె.కిశోర్‌కుమార్‌రెడ్డి, మరో ఇద్దరు హైకోర్టు సింగిల్ జడ్జి వద్ద వ్యాజ్యం వేశారు. నోటిఫికేషన్‌ను రద్దుచేయాలని కోరారు. జోక్యం చేసుకోవడానికి సింగిల్ జడ్జి నిరాకరించారు. ◆ సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలుచేస్తూ పిటిషనర్లు ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. శుక్రవారం విచారణ జరిపిన ధర్మాసనం.. తాత్కాలిక ప్రాతిపదికన పోస్టుల భర్తీని తీవ్రంగా తప్పుపట్టింది. భర్తీ ప్రక్రియపై స్టే ఇవ్వొద్దంటూ ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ చేసిన అభ్యర్థనను తోసిపుచ్చింది.

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
శనివారం డిసెంబరు 6, 2025

కళల సవ్వడి.. పులకించె మది



కృష్ణా విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న కృష్ణా తరంగ్ కార్యక్రమం రెండో రోజైన శుక్రవారం అట్టహాసంగా జరిగింది. ఆయా కళాశాలల విద్యార్థులు తమ నృత్యాలతో ఆకట్టుకున్నారు. - న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

మారింది బడి.. సరికొత్త ఒరవడి..



పటమట: కేబీ జడ్పీ ఉన్నత పాఠశాలలో మెగా పీటీఎంకు వచ్చిన తల్లిదండ్రులకు పూలతో టీచర్ల స్వాగతం – ఈనాడు, అమరావతి

విరబూసిన విరులు.. కనురెప్పల కాంతులు..

విజయవాడ పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో శుక్రవారం ఫలపుష్ప ప్రదర్శన ప్రారంభమైంది. దేశంలోని వివిధ నర్సరీల నుంచి వచ్చిన మొక్కలు, పూలు ఆకట్టుకున్నాయి. - ఈనాడు, అమరావతి





ఎంచక్కా అమరాయి

పూలకుండీలు అంటే మట్టి, ప్లాస్టిక్‌తో తయారు చేసినవే ఇప్పటివరకు చూశాం. సహజసిద్ధంగా ప్రకృతిలో దొరికిన రాళ్లల్లో అందమైన మొక్కలు పెంచుకుని ఇంట్లో పెట్టుకుంటే చూడడానికి చాలా బావుంటాయి కదా. జైపుర్, రాజస్థాన్ ప్రాంతాల్లో దొరికే వివిధ రకాల ఆకృతుల్లో ఉన్న రాళ్లతో పూలకుండీలను సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో జరుగుతున్న 8వ రాష్ట్ర స్థాయి రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అగ్రి హార్టీకల్చర్ ప్రదర్శనలోని ఓ స్టాల్‌లో ఏర్పాటు చేశారు.

- ఈనాడు అమరావతి

ఒక్క టెర్మినల్ భవనం.. పూర్తి చేయించలేరా?

- కేంద్ర మంత్రి, ఇద్దరు ఎంపీలు చెప్పినా.. పరిస్థితి మారలేదు
- 30 నెలల్లో పూర్తవ్వాల్సిన నిర్మాణానికి.. 68 నెలలు దాటింది

ఈనాడు, అమరావతి

గన్నవరం విమానాశ్రయంలో ఐదున్నరేళ్ల కిందట రూ.470 కోట్లతో ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవనం పనులు ఆరంభించారు. సరిగ్గా 30 నెలల్లో పూర్తి చేస్తామన్నారు. 68 నెలలు దాటుతోంది. ఎప్పటికి పూర్తవుతుందో ఇప్పటికీ తెలియదు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు స్వయంగా వచ్చి ఇప్పటికి రెండుసార్లు పరిశీలించి పలు సూచనలు చేసి వెళ్లారు. గుత్తేదారు సంస్థ, అధికారులను గట్టిగా హెచ్చరించారు. అయినా పరిస్థితిలో ఏమాత్రం మార్పు లేదు.



వెలుపల వైపు స్టీల్ అండ్ గ్లాస్‌లను బిగించే పనులు

ఇంకా ఆరు నెలలు పట్టే వీలుంది..

మచిలీపట్నం, విజయవాడ ఎంపీలు బాలశౌరి, శివనాథ్ కేంద్రంలో అత్యంత పలుకుబడి ఉన్నవాళ్లు. అభివృద్ధి కమిటీ సమావేశాల్లో ఎంపీలు చెబుతున్నా పరిస్థితి మారడం లేదు. కేవలం ఒక్క భవన నిర్మాణం ఎందుకు పూర్తి చేయించలేకపోతున్నారు? గుత్తేదారుకు హెచ్చరికలు జారీ చేయడం, కొత్త గడువులు పెట్టడంతోనే ఏడాదిన్నర గడిచిపోయింది. తాజాగా నిర్దేశించిన డిసెంబరు లక్ష్యం కూడా దాటిపోతోంది. కనీసం మరో ఆరు నెలలు పైనే పట్టే అవకాశం కనిపిస్తోంది.

గుత్తేదారుపై చర్యలు లేవు..

టెర్మినల్ పనులను నిత్యం పర్యవేక్షిస్తామంటూ ఏడాది కిందట వాట్సప్ గ్రూపును కూడా ఏర్పాటు చేయమని.. రామ్మోహన్‌నాయుడు సూచించారు. నిత్యం ఎంత పని జరిగిందనేది వాట్సప్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేయాలని, ఇంకా ఎంత ఉందో రోజూ పెట్టాలన్నారు. 2025 జూన్‌లోగా పూర్తిచేసి తీరాలంటూ ఆదేశాలు జారీ చేశారు. 2026 జూన్ వచ్చినా పూర్తవ్వడం కష్టమే. ఇంత జాప్యం చేస్తున్నా.. గుత్తేదారు సంస్థపై చర్యలు తీసుకోవడం లేదు.

ప్రస్తుతం వెలుపల పనులు..

టెర్మినల్ లోపలి వైపు సిమెంట్ భవన నిర్మాణం పూర్తయింది. దీనికి వెలుపలి వైపు స్టీల్ ఫ్రేములు ఏర్పాటు చేసి గ్లాస్‌లు బిగించే పనులు కొనసాగుతున్నాయి.

విమానయాన సంస్థలు రావాలంటే..

ప్రముఖ విమానయాన సంస్థలకు సంబంధించిన భారీ బోయింగ్ సర్వీసులు ఇక్కడి నుంచి నడపాలంటే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నూతన టెర్మినల్ అవసరం. సౌకర్యాలు లేకపోవడం వల్లే ఏళ్ల తరబడి ప్రయత్నం చేస్తున్నా ఆయా సంస్థలు సర్వీసులు నడిపేందుకు ముందుకు రావడం లేదు. గత తెదేపా ప్రభుత్వంలోనే భారీ రన్‌వేను సిద్ధం చేసినా ఏడేళ్లుగా నిరుపయోగంగా ఉంది. దిల్లీ, ముంబయికి మాత్రమే బోయింగ్‌లు నడుస్తున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టి పెట్టి పనులు పూర్తి చేయించాలి.

మట్టిపాత్రలో చద్దన్నం.. మళ్లీ రుచిచూద్దాం



అరికెలు, జొన్నలతోనూ ప్రత్యేకంగా..



పటమట రైతుబజార్ సెంటర్‌లో స్టాల్

1980వ దశకంలో దాదాపు ప్రతి ఇంట్లో ఉదయం అల్పాహారం కాకుండా చద్దన్నం తినేవారు. మారుతున్న ఆహారపు అలవాట్లతో పాటు పరిస్థితుల కారణంగా ఇళ్లల్లో చద్దన్నం కనుమరుగయ్యిందనే చెప్పాలి. వినూత్నంగా ఇప్పుడు చద్దన్నాన్ని విక్రయించే దుకాణాలు వస్తున్నాయి. విజయవాడ నగరం పటమట రైతుబజార్ కూడలి వద్ద ఉదయపు నడక, వ్యాయామం కోసం వచ్చేవారికి మన సంప్రదాయం పేరుతో మట్టి పాత్రల్లో చద్దన్నం విక్రయిస్తున్నారు. ఇందులోనూ అరికెలు, జొన్నలు, రాగులు, బ్రౌన్‌రైస్‌తోనూ తయారు చేస్తున్నారు. వివిధ రకాల చిరుధాన్యాలతో పొంగల్ సైతం అమ్ముతున్నారు. వీటిల్లో నూనె చుక్క, మసాలా ఏమాత్రం ఉండవని దుకాణం యజమాని విజయ్ చెబుతున్నారు. - ఈనాడు, అమరావతి

మొదటి విడత కౌన్సెలింగ్‌లో 1194 సీట్ల భర్తీ

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని పలు వైద్య కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి పీజీ మెడికల్ నాన్ సర్వీస్ కన్వీనర్ కోటా సీట్ల ప్రవేశాలకు నిర్వహించిన మొదటి విడత కౌన్సెలింగ్‌లో మొత్తం 1194 సీట్లు భర్తీ అయినట్లు విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రకటించింది. అభ్యర్థులు ఈ నెల 9వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోగా ఆయా వైద్య కళాశాలల్లో చేరాల్సి ఉంటుంది. డిసెంబరు 22 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.

సీతమ్మ.. పెరట్లో సేంద్రియ సిరులు

ఇంట్లో నిత్యం పారేసే తడి వ్యర్థాలతో నాణ్యమైన ఎరువును సులువుగా తయారు చేసుకోవచ్చని ఉప్పులూరుకు చెందిన 60 ఏళ్ల వృద్ధురాలు సీతమ్మ చేసి చూపుతున్నారు. కొన్నేళ్లుగా ఆమె తయారు చేస్తున్న సేంద్రియ ఎరువును పెరటి తోటల్లోని మొక్కలకు వేస్తూ మంచి ఫలితం పొందుతున్నారు. చేపట్టిన పని చిన్నదైనా ఇతరులకు ఆదర్శం, బహుళప్రయోజనమని అధికారులు చెబుతున్నారు. సీతమ్మ కృషిని గుర్తించిన మండల, గ్రామ అధికారులు 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' సందర్భంగా సన్మానించారు.

- న్యూస్‌టుడే, ఉప్పులూరు (కంకిపాడు)



సీతమ్మను సన్మానిస్తున్న అధికారులు, గ్రామస్థులు (పాత చిత్రం)



తడి వ్యర్థాలతో తయారు చేసిన ఎరువు

తయారీ ఇలా.. అందరూ కోడిగుడ్ల పెంకులు, ఉల్లిపాయ తొక్కలను మాత్రమే మొక్కలకు వేస్తుంటారు. వీటితో పాటు కూరగాయల వ్యర్థాలు, టీపొడి, మిగిలిన ఆహార పదార్థాలు, రాలిన ఆకులు, పువ్వులు వంటి తడి వ్యర్థాలను తొట్టెలో వేసి మట్టితో కప్పాలి. నీరు పోయాల్సిన అవసరం లేదు. పొరలుగా వేయాలి. ఒకటిరెండు నెలలకు ఎరువు తయారవుతుందని సీతమ్మ చెబుతున్నారు.

వసతిగృహాల్లో పక్కా నిఘా

పర్యవేక్షణకు ప్రత్యేక యాప్

ఈనాడు, అమరావతి

సంక్షేమ వసతిగృహాలు అనగానే పడకేసిన పారిశుద్ధ్యం..రుచీ పచీ లేని ఆహారం..తాగునీటి ఇక్కట్లు..తలుపులూడిన మరుగుదొడ్లు గుర్తొస్తాయి. ఈ సమస్యల ప్రక్షాళన దిశగా ప్రభుత్వం అడుగులేస్తోంది. వసతిగృహాల పర్యవేక్షణకు హాస్టల్ పర్మినెంట్ ట్రాకింగ్ సిస్టమ్(హెచ్‌పీటీఎస్) ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. దీన్ని వినియోగించే విధానంపై వసతిగృహాల అధికారులకు శిక్షణ ఇచ్చారు.

మూడు దశల్లో పర్యవేక్షణ

సంక్షేమ వసతి గృహాల్లో రోజువారీ, వారాంతపు, నెలవారీ చేయాల్సిన పనులను విభజించారు. ఆయా కాల ప్రమాణాలను బట్టి పనులు చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ప్రాంగణ పరిశుభ్రతతో పాటు, మరుగుదొడ్లు, తాగునీటి ట్యాంకుల శుభ్రత, రేషన్, కూరగాయల నిల్వ, వినియోగం, ఆహారం తయారీ, నాణ్యత, చెత్త కుండీల ఏర్పాటు, డ్రైనేజీ నిర్వహణ, విద్యార్థుల హాజరు ఇలా అన్ని అంశాలు రోజువారీగా యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఫ్లోరింగ్, పైకప్పు, తలుపులు, కిటికీల పరిస్థితిపై చిత్రాలు నెలవారీగా అప్‌లోడ్ చేయాలి. దోమల నియంత్రణ చర్యలు, వారానికోసారి నీటిలో టీడీఎస్ స్థాయిలు పరీక్షించాల్సి ఉంటుంది. ఈ ఫలితాలు, అప్‌లోడ్ చేస్తున్న అంశాలను జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు పర్యవేక్షిస్తారు.

❖ వండిన వంట అందరికీ సరిపోతుందో లేదో..నాణ్యత ఎలా ఉంది. ఏఐ ద్వారా అంచనా వేస్తారు. వ్యత్యాసాలు గుర్తిస్తే సదరు అధికారులపై చర్యలు తీసుకుంటారు.

❖ 'అన్నిచోట్ల యాప్ పర్యవేక్షణ ఉంది. తప్పనిసరిగా నిబంధనల ప్రకారం అప్‌లోడ్ చేయాలి' అని సోషల్ వెల్ఫేర్ డీడీ షాహీద్ తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో వసతిగృహాల సమాచారం

అంశం	సాంఘిక	బీసీ
వసతిగృహాలు	71	70
విద్యార్థులు	5,187	3,157

స్క్రబ్ టైఫస్ కేసులతో కలవరం!

విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో ఇద్దరికి పాజిటివ్



ఈనాడు, అమరావతి: జిల్లాలో స్క్రబ్ టైఫస్ కేసులతో అలజడి మొదలైంది. కంచికచర్ల, జి.కొండూరులో రెండు కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం బాధితులు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కంచికచర్లకు చెందిన భవన నిర్మాణ కార్మికురాలు.. కృష్ణవేణి(45) జ్వరంతో బాధపడుతూ గురువారం జీజీహెచ్‌కు వచ్చింది. జి.కొండూరుకు చెందిన ఎస్.రాకేష్.. రెండున్నరేళ్ల బాలుడు సైతం జ్వరంతో బాధపడుతుండగా తల్లిదండ్రులు విజయవాడ పాతాసుపత్రికి తీసుకొచ్చారు. జ్వరం, దగ్గు, జలుబు లక్షణాలతో వచ్చిన వారికి ప్రభుత్వ ఆసుపత్రిలో నిత్యం స్క్రబ్ టైఫస్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. తాజాగా శుక్రవారం రెండు ఆసుపత్రుల్లో 54 మందికి పరీక్షలు నిర్వహించగా.. కృష్ణవేణి, రాకేష్‌లకు పాజిటివ్ వచ్చింది. ప్రస్తుతం వీరి ఆరోగ్యం నిలకడగానే ఉందని సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వి.రావు తెలిపారు. ముందస్తుగానే వీరికి పరీక్షలు నిర్వహించి.. వ్యాధి నిర్ధారణ చేయడంతో.. సరైన చికిత్స అందించగలిగామన్నారు.

అప్రమత్తంగా ఉండాలి...

స్క్రబ్ టైఫస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. గ్రామీణ, నగరాల్లో పొదలు అధికంగా ఉండే ప్రాంతాల్లో తెల్లని నల్లి మాదిరిగా ఉండే పురుగులు కుట్టడం ద్వారా ఈ వ్యాధి సోకుతుందని తెలిపారు. జ్వరం, వణుకు, తలనొప్పి, కండరాల నొప్పి, చర్మంపై దద్దుర్లు వంటి లక్షణాలు ఉన్న వాళ్లు వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఆరంభంలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే.. ఎలాంటి ప్రమాదం ఉండదని వైద్యులు తెలిపారు. విజయవాడ ప్రభుత్వాసుపత్రికి వస్తే.. వెంటనే నిర్ధారణ పరీక్షలు చేస్తారు. ఆసుపత్రికి అనుబంధంగా ఉన్న సిద్ధార్థ కళాశాలలోని మైక్రోబయాలజీ ల్యాబ్‌లోనే వ్యాధి నిర్ధారణ చేస్తున్నారు.

అభిమానం ఆడించింది.. క్రికెటర్‌గా నిలబెట్టింది



కానూరు, విజయవాడ క్రీడలు న్యూస్‌టుడే

దేశవ్యాప్తంగా క్రికెట్‌పై ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. అందరిలాగే అతనికి చిన్నప్పటి నుంచి ఈ ఆటపై ఆసక్తి కలిగింది. అప్పుడే క్రికెటర్ కావాలన్న లక్ష్యాన్ని ఏర్పర్చుకున్నాడు. అందుకు తగ్గట్లు నిరంతరం సాధన చేశాడు. పట్టుదలకు.. క్రమశిక్షణ తోడవడంతో అవకాశాలు వెతుక్కుంటూ వచ్చాయి. వాటన్నింటిని సద్వినియోగం చేసుకుంటూ ఒక్కో మెట్టు ఎక్కుతూ భారత విశ్వవిద్యాలయాల జట్టు తరఫున ఆస్ట్రేలియాతో జరిగే సిరీస్‌కు ఎంపికయ్యాడు విజయవాడకు చెందిన షేక్ కాజామొహిద్దీన్.



బ్యాటింగ్ చేస్తూ..

అన్ని వయో విభాగాల్లో రాణింపు..

షేక్ నాగూర్‌వలి, షహనాజ్‌బేగంల కుమారుడైన కాజామొహిద్దీన్ నగరంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో క్రికెట్‌లో ఓనమాలు నేర్చుకున్నాడు. అనంతరం తన ఆట మెరుగుపరుచుకోవడానికి కడప, విజయనగరం జిల్లా కేంద్రాల్లో ఉన్న ఆంధ్ర క్రికెట్ అకాడమీలో చేరాడు. నాలుగేళ్ల పాటు కఠోర శిక్షణ పొందడంతో మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించాడు. అలా వికెట్‌కీపర్ బ్యాట్స్‌మెన్‌గా ఆంధ్ర రాష్ట్రం తరఫున అండర్-14 జట్టులో చోటు సాధించి సౌత్ జోన్ విన్నర్స్‌గా నిలిచాడు. అండర్-16 స్థాయిలో క్వార్టర్ ఫైనల్ వరకు వెళ్లాడు. అండర్-19 టీమ్‌లో ప్రతిష్ఠాత్మకమైన వినూ మన్కడ్ ట్రోఫీలో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించాడు. ఆ ట్రోఫీలో 177 పరుగులు చేయడంతో పాటు వికెట్ కీపింగ్‌లోనూ ప్రావీణ్యం చూపించాడు. పలు మ్యాచ్‌లు గెలిపించడంలో కీలకపాత్ర పోషించాడు. ఇక్కడా జట్టును క్వార్టర్ ఫైనల్ వరకు తీసుకెళ్లాడు.

ఆస్ట్రేలియాతో ద్వైపాక్షిక సిరీస్‌కు..

ప్రస్తుతం సిద్ధార్థ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న కాజామొహిద్దీన్ తన నిరంతర ప్రదర్శనతో భారత విశ్వవిద్యాలయాల జట్టుకు ఎంపికయ్యాడు. డిసెంబరు 7 నుంచి 20వ తేదీ వరకు ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయం జట్టుతో ఆ దేశంలో జరిగే ఆరు టీ20ల ద్వైపాక్షిక సిరీస్‌లో తలపడనున్నాడు. ఈ మ్యాచ్‌ల్లోనూ సత్తా చాటి.. రంజీట్రోఫీ జట్టులో స్థానం సాధిస్తానని ఆయన ఆశాభావం వ్యక్తం చేస్తున్నాడు.

పాత బండి.. కొంటున్నావా బ్రో..!

ఈ జాగ్రత్తలు తీసుకో

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

కొత్త వాహనం ధరలో సగానికే రెండు మూడేళ్లు తిరిగిన బండి వస్తుందని.. కొన్నేళ్లు దాంతోనే నెట్టుకొచ్చి తర్వాత కొత్తది కొందామనుకుని చిరుద్యోగులు, పార్ట్ టైమ్ పని చేసే కళాశాల విద్యార్థులు ఎక్కువ మంది అనుకుంటారు. కొత్త వాహనాల్లో వస్తున్న మార్పులు.. నాణ్యత లోపాలు ఇతర కారణాలతో కొత్త వాటిని కొనుగోలు చేసేందుకు చాలా మంది ఆసక్తి చూపట్లేదు. దీంతో ఉమ్మడి జిల్లాలో సెకండ్ హ్యాండ్ ద్విచక్ర వాహనాల క్రయవిక్రయాలు రోజూ వందల్లో జరుగుతున్నాయి. అయితే బండి కొనేటప్పుడు ముందుచూపు, అవగాహన లేకపోతే జేబుకు చిల్లు తప్పదు.

ఇంజినే గుండెకాయ.. కొనే వాహనం కండీషన్ ఒకటికి రెండుసార్లు పరిశీలించాలి. నమ్మకమైన మెకానిక్ వద్దకు తీసుకెళ్లి చూపించాలి. వాహనానికి ఇంజిన్ గుండె లాంటిది.. దాని పనితీరు సరిచూశాకే కొనుగోలుకు సిద్ధపడాలి. మైలేజీ, గేర్ బాక్స్, విడిభాగాల స్థితి.. వాటి మన్నిక.. టైర్లు.. లైట్లు తదితర అన్నీ జాగ్రత్తగా చూసుకోవాలి. తప్పకుండా కొంతదూరం నడిపితే లోపాలు తెలుస్తాయి.

ఇవి తప్పనిసరి..

ఇటీవల ఉమ్మడి జిల్లాలో తరచూ ద్విచక్ర వాహనాలు చోరీలకు గురవుతున్నాయి. పట్టుపడిన వారి వద్ద ఒక్కొక్కరి నుంచి పదుల సంఖ్యలో ఎత్తికెళ్లిన బండ్లు దొరుకుతున్నాయి. చాలా వాటికి విడిభాగాలు మార్చేయడం.. నంబరు ప్లేట్లు తీసేయడం.. రంగులు మార్చడం.. ఛాసిస్ నంబరు చెరిపేయడం వంటివి చేస్తున్నారు. బండి కొనేముందు వీటన్నింటిని పరిశీలించుకుంటే మంచిది.

- పోలీసు కేసులు నమోదయ్యాయేమో నిర్ధారించుకోవాలి. ట్రాఫిక్ చలానాలు ఎంతున్నాయో చూసుకోవాలి.
- ఫైనాన్స్ క్లియరెన్స్ అయ్యిందా. అయితే దానికి సంబంధించిన నిరభ్యంతరపత్రంతో పాటు ఒరిజినల్ ఆర్సీ తీసుకోవాలి.
- పత్రాలన్నీ ఒకటికి రెండుసార్లు పరిశీలించుకోవాలి. ఆర్సీ కార్డులోని ఛాసిస్ నంబరు, వాహనంపై ఉన్నది ఒకేలా ఉండాలి.
- బండి మన పేరుపై రిజిస్ట్రేషన్ అవుతుందో లేదో ఆర్టీవో కార్యాలయంలో తెలుసుకోవాలి.
- ఇతర రాష్ట్రాల వాహనమైతే రిజిస్ట్రేషన్‌కు ఎంత అదనపు ఖర్చు అవుతుందో తెలుసుకోవాలి. అన్నీ బాగుంటేనే కొనుగోలు చేయడం ఉత్తమం.

జిల్లాలో తగ్గిన రోడ్డు ప్రమాదాలు



సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర్‌బాబు, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తదితరులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: గత ఏడాది (2024) కంటే, ఈ ఏడాది (2025) రోడ్డు ప్రమాదాలు, మరణాల సంఖ్య తగ్గింది. 2026 సంవత్సరంలో ప్రమాద మరణాలను బాగా తగ్గించేలా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-65)లో ప్రమాదాలు, మరణాలు అధికంగా ఉన్నాయని, ముఖ్యంగా ద్విచక్ర వాహనాలతో అధిక ప్రమాదాలు జరుగుతున్నట్టు విశ్లేషించారు. సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల మధ్య రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్టు పేర్కొన్నారు. జిల్లా రహదారి భద్రతా కమిటీ (డీఆర్ఎస్సీ) సమావేశాన్ని, పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబుతో కలసి కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ..గత ఏడాది 1,334 ప్రమాదాలు జరగగా, ఈ ఏడాది 918కి తగ్గినట్టు తెలిపారు. గత ఏడాది 432 మంది చనిపోగా, ఈఏడాది మరణాలు 317కి తగ్గినట్టు వివరించారు. రోడ్డు ప్రమాదాలు, సంభవించిన మరణాల్లో మూడో వంతు ద్విచక్ర వాహనాల వల్లే జరిగినట్టు చెప్పారు. ఎన్‌హెచ్-65లో 58 శాతం ప్రమాదాలు, 41 శాతం మరణాలు చోటు చేసుకున్నాయని తెలిపారు. వేగ పరిమితులు తెలిపే సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అధిక లోడుతో వెళుతున్న వాహనాలను నియంత్రించాలని ఆదేశించారు.

బాధితులను రక్షించిన వారికి ఇబ్బందులు ఉండవు

రోడ్డు ప్రమాదాల్లో బాధితులను రక్షించిన వారిపై ఎలాంటి సివిల్, క్రిమినల్ కేసులు నమోదు చేసే ప్రసక్తే లేదని కలెక్టర్ తెలిపారు. పోలీసుల విచారణ పేరిట ఇబ్బందులు ఉండవన్నారు. ఇలాంటి ప్రాణ దాతలను సత్కరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

5 స్టేషన్ల పరిధిలో అధికం.. సీపీ రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ.. జిల్లాలోని ఇబ్రహీంపట్నం, కంచికచర్ల, నగరంలోని భవానీపురం, కృష్ణలంక, పటమట పోలీసు స్టేషన్ల పరిధిలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్టు తెలిపారు. బస్టాండ్, బెంజి సర్కిల్, రామవరప్పాడు తదితర ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. తరచూ ప్రమాదాలు సంభవించే బ్లాక్ స్పాట్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు చెప్పారు.

పశ్చిమ బైపాస్‌తో నగరంలో తగ్గనున్న ట్రాఫిక్

పశ్చిమ బైపాస్ రోడ్డు అందుబాటులోకి వస్తే నగరంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో శిక్షల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన వారిలో దిచక్ర వాహనదారులు 202 మంది, పాదచారులు 102 మంది ఉన్నట్టు సీపీ వివరించారు. వీఎంసీ కమిషనర్ హెచ్.ఎం. ధ్యానచంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



దుర్గామల్లేశ్వరి మహిళా కళాశాల విద్యార్థినుల ప్రదర్శన



జానపద నృత్య ప్రదర్శనతో అలరించిన మేరీస్టెల్లా కళాశాల విద్యార్థినులు

అంతటా ఉత్సాహం.. ఆద్యంతం అద్భుతం


అమ్మోరులా..


విద్యార్థినుల సందడి

కృష్ణావిశ్వవిద్యాలయం(మచిలీపట్నం), న్యూస్‌టుడే : గిరిజన వేషధారణలతో యువతులు చేసిన నృత్యాలు, దేశభక్తి గేయాలకు చేసిన ప్రదర్శనలు, యువతులు తీర్చిదిద్దిన ముగ్గులు ఇలా వివిధ రకాల ప్రదర్శనలు, నాటికలతో కృష్ణా విశ్వవిద్యాలయం శుక్రవారం హోరెత్తిపోయింది. విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న కృష్ణాతరంగ్ అట్టహాసంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ కళాశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక అంశాలు ఆకట్టుకున్నాయి. ఉపకులపతి కె.రాంజీ, పలు విభాగాల అధిపతులు ప్రదర్శనలు వీక్షించి సందడి చేశారు. పలువురు వివిధ ప్రదర్శనలను చరవాణుల్లో బంధించేందుకు పోటీ పడ్డారు. వేలాదిగా తరలివచ్చిన విద్యార్థులతో విశ్వవిద్యాలయం కోలాహలంగా కనిపించింది.

కథ.. 35 ఏళ్ల ప్రస్థానం

❖ 7న తాజా సంకలనం ఆవిష్కరణ



కథ 2024 పుస్తకం

ఈనాడు, అమరావతి: గత 35 ఏళ్లుగా తెలుగులో ఏటా రకరకాల పత్రికల్లో వచ్చే మూడు వేలకు పైగా కథల్లో నుంచి ఉత్తమమైన 15 నుంచి 20 ఎంపిక చేసి 'కథ' పేరుతో ఓ పుస్తకం ముద్రిస్తున్నారు. 1990 నుంచి ఒక్కో ఏడాది ఒక్కో ప్రాంతంలో ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తుంటారు. కథ 2024 సంకలనం ఆవిష్కరణ సభ విజయవాడలోని మొగల్రాజపురం సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో డిసెంబర్ 07న చేయబోతున్నారు. ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో.. ఆదివారం ఉదయం 10.15 గంటలకు ఈ కథ పుస్తక ఆవిష్కరణ సభ జరగబోతోంది. అతిథులుగా ప్రముఖ ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ ఎ.వి.గురవారెడ్డి, సాహిత్య అకాడమీ ఈసీ మెంబర్ డాక్టర్ మృణాళిని పాల్గొంటారు. కథ 2024లో ప్రచురించిన కథల రచయితలు ఒక్కొక్కరు ఐదు నిమిషాల చొప్పున వారి కథ గురించి మాట్లాడతారు.

వేదాంతం అపరితమైంది


సంచిక ఆవిష్కరిస్తున్న శాంత మహారాజ్, విజ్ఞానముని మహారాజ్, రమేశ్, రాజేశ్, బాబూరావు తదితరులు

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: పదార్థం గురించి మాత్రమే సైన్సు చెబుతోందని, మనిషిని, జీవితాన్ని లోతుగా అధ్యయనం చేసేది వేదాంతం అని, శాస్త్ర విజ్ఞానానికి పరిమితులున్నాయి గానీ వేదాంతం అపరిమితమైందని శాస్త్రవేత్తలు, వైద్యులు, ఆచార్యులు అన్నారు. పీబీ సిద్ధార్థ జీవశాస్త్ర విభాగాలు, శ్రీచైతన్య సరస్వత్‌మఠ్, ఇనిస్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో రెండ్రోజుల పాటు నిర్వహించే వేదాంత-సైన్సు అంతర్జాతీయ సమ్మేళనం శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా శ్రీచైతన్య సరస్వత్ మఠ్ అధ్యక్షుడు డాక్టర్ నిష్కామ శాంత మహారాజ్, శ్రీచైతన్య సరస్వత్ ఇనిస్టిట్యూట్ అధ్యక్షుడు డాక్టర్ విజ్ఞానముని మహారాజ్ మాట్లాడుతూ గతేడాది ఖాట్మాండులో వేదాంతం, సైన్స్ మొదటి అంతర్జాతీయ సదస్సు నిర్వహించామన్నారు. ఆధునిక సైన్స్‌లో కచ్చితంగా చెప్పలేని ఆత్మ తదితర అంశాలు అనేక ఉన్నాయని, అంతిమంగా వేదాంతం మాత్రమే జీవితానికి సిసలైందన్నారు. డార్విన్ సిద్ధాంతం లోపభూయిష్టమని డాక్టర్ ఎంవీ జగన్నాథం తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మేకా రమేశ్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ ఆచార్య రాజేశ్ సి.జంపాల, సిద్ధార్థ వైద్య కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ బీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు. తొలుత ఈ కార్యక్రమం సందర్భంగా ప్రచురించిన ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు.

దుర్గగుడి భద్రతపై చర్చకు ప్రతిపాదనలు

ఇంద్రకీలాద్రి: దుర్గగుడి నూతన పాలకమండలి ఈనెల 6న నిర్వహించనున్న రెండో సమావేశంలో భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లతోపాటు దుర్గగుడి భద్రతపై సభ్యులు చర్చించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. లక్షల సంఖ్యలో దీక్షాధారులు రాష్ట్రం నలుమూలల నుంచి తరలి వచ్చే నేపథ్యంలో భద్రతను దృష్టిలో ఉంచుకొని లగేజీ స్కానర్లు ఏర్పాట్ల సాధ్యాసాధ్యాలపై అధికారులతో చర్చించేందుకు పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ ప్రతిపాదన సిద్ధం చేశారు. దత్త దేవాలయాల్లో పనిచేసే ఉద్యోగుల జీతభత్యాలు, భవానీ దీక్షల విరమణ సందర్భంగా భక్తులు సమర్పించిన మాలలు పోగు చేసుకునే హక్కు హెచ్చు పాటదారుడికి నిర్ణయించడం, బ్రాహ్మణ కార్పొరేషన్ సంబంధించిన ఫుడ్‌ను ప్రోత్సహించే ప్రతిపాదన, గిరిజన కార్పొరేషన్‌కు సంబంధించి అరకు వ్యాలీ లిక్విడ్ కాఫీ భక్తులకు విక్రయించడానికి అనుమతి వంటి విషయాలు చర్చించనున్నట్లు సమాచారం.

విద్యాభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, వేదికపై ఎమ్మెల్యే తాతయ్య

జగ్గయ్యపేట, నందిగామ గ్రామీణం: విద్యాభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని కలెక్టర్ జి. లక్ష్మీశ పేర్కొన్నారు. శుక్రవారం చిల్లకల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పీటీఎంకు స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు కూటమి ప్రభుత్వం అన్నీ వసతులు కల్పిస్తోందని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి కృషిచేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో బాలకృష్ణ, ఎంఈవో ఎల్. చిట్టిబాబు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

సుబాబుల్ ధర తగ్గిస్తే చర్యలు

ఈనాడు కథనానికి స్పందన

నందిగామ, న్యూస్‌టుడే: సుబాబుల్ ధర తగ్గిస్తే చర్యలు తీసుకుంటామని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత తెలిపారు. 'పేపరు కర్మాగారాల సిండికేట్.. సుబాబుల్ ధర తగ్గింపు' శీర్షికన ఈ నెల 4న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. దీనిపై గుంటూరులోని మార్కెటింగ్ శాఖ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆ శాఖ అధికారులు, పేపరు కర్మాగారాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ సునీత మాట్లాడుతూ రవాణా ఛార్జీలు పెరిగాయనే కారణంతో సుబాబుల ధర తగ్గించడం తగదన్నారు. వెంటనే పెంచి కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఐటీసీ పేపరు కర్మాగారాలు సుబాబుల మొక్కలు ఇచ్చి సాగును ప్రోత్సహిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయని చెప్పారు. సాగు పెంచాలనుకుంటే ముందుగా రైతులతో ధరపై ఒప్పందాలు చేసుకోవాలని సూచించారు. దీనికి విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల డిప్యూటీ డైరెక్టర్లు శారదారాణి, దివాకర్, ఏడీ రాజబాబు, నందిగామ, కంచికచర్ల, జగ్గయ్యపేట మార్కెట్ యార్డుల కార్యదర్శులు వెంకటేశ్వరరావు, ఎస్. శ్రీనివాసరావు, వి.భాస్కరరావు పాల్గొన్నారు.

కలశజ్యోతికి కదిలొచ్చిన కళారూపాలు


కూచిపూడి కళాకారుల నృత్య ప్రదర్శన


వికారాబాద్‌కు చెందిన గిరిజనుల కొమ్ముకోయ నృత్యాలు

ఈనాడు, అమరావతి: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు నిర్వహించిన భవానీ మండల దీక్షల్లో భాగంగా చేపట్టిన కలశజ్యోతి ఊరేగింపులో ఆధ్యాత్మిక, ధార్మిక, ప్రాచీన, సంప్రదాయ కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విజయవాడ సత్యనారాయణపురం శివరామక్షేత్రం నుంచి నిర్వహించిన ప్రదర్శనల్లో.. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు సనాతన ధర్మప్రచారం చేయడంతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. వికారాబాద్ అటవీ ప్రాంతానికి చెందిన గిరిజనుల కొమ్ముకోయ నృత్యాలు, కేరళ రాష్ట్రంలోని పాలక్కాడ్‌కు చెందిన సంప్రదాయ చెండా మేళం, పంచ వాయిద్యం, తూర్పుగోదావరి పిఠాపురానికి చెందిన సంప్రదాయ గరగ నృత్యం, రాజమండ్రి, అమలాపురం, తాడేపల్లిగూడెంకి చెందిన మూడు మహిళా కోలాట నృత్య బృందాలు, కృష్ణా జిల్లా గరికపర్రుకు చెందిన జానపద డప్పులు(తప్పెట్లు), విజయవాడకు చెందిన శ్రీకనకదుర్గ నృత్య కళామందిర్ నాట్యాచార్య వై.ఎస్.వి.ఎన్.అనూరాధ ఆధ్వర్యంలో శ్రీదుర్గాదేవి, పరమేశ్వరుని వేషధారణతో కూచిపూడి కళాకారుల నృత్య ప్రదర్శనలు.. కనులపండువగా సాగాయి. దుర్గమ్మ నగరోత్సవంలోని విభిన్న, అరుదైన కళా ప్రదర్శనలు సైతం ఔరా అనిపించాయి. అంతరించిపోతున్న కళారూపాలకు ప్రాణం పోయాలనే భావనతోనే దుర్గగుడి ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేయించారు. రామకోటి నుంచి గాంధీనగర్, గవర్నర్‌పేట, కంట్రోల్‌రూం పైవంతెన మీదుగా సుమారు ఏడు కి.మీ మేర ఈ ప్రదర్శనలు గురువారం రాత్రి కొనసాగాయి. దేవాలయం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కళా ప్రదర్శనలు ఏర్పాటు చేసి, మన సంస్కృతిని భవిష్యత్తుతరాలకు తెలియజేయాలనే లక్ష్యంతోనే వీటిని ఏర్పాటు చేయించినట్లు దుర్గగుడి అధికారులు తెలిపారు.

సంగీత లోకానికి రామకృష్ణయ్యపంతులు ఎనలేని సేవలు


విగ్రహానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

మధురానగర్, న్యూస్‌టుడే: గాయక సార్వభౌముడు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు విగ్రహాన్ని రామకృష్ణాపురంలో ఏర్పాటు చేయడం ద్వారా.. ఆ మహనీయుని ఘనమైన వారసత్వం, సంగీత లోకానికి ఆయన చేసిన విశేష సేవలు చిరస్థాయిగా ఉంచాలనే సంకల్పం నెరవేరిందని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం రామకృష్ణాపురంలో రామకృష్ణయ్య పంతులు విగ్రహావిష్కరణ జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ రామకృష్ణయ్య పంతులు సంగీత వైభవాన్ని, సంస్కారవంతమైన జీవితాన్ని నేటి తరం స్మరించుకోవాలని కోరారు. కర్ణాటక సంగీతానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. బాల్యం నుంచి సంగీతం పట్ల అనూహ్య ఆసక్తి ప్రదర్శించి సుసర్ల దక్షిణామూర్తి వద్ద శిక్షణ పొందారని తెలిపారు. విజయవాడలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న ఆయన అనేక మంది శిష్యులకు గురుకుల పద్ధతిలో ఉచితంగా విద్యాబోధన చేశారని తెలిపారు. కౌండిన్య సనాతన సమితి వ్యవస్థాపకులు వీరుభొట్ల అరుణ్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అన్నవరపు రామస్వామి, గొట్టుముక్కల రఘురామరాజు, డి.వి.మోహన్‌కృష్ణ, మోదుమూడి సుధాకర్, పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ, ఉప్పులూరి శేషప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు తీర్పుల ప్రకారమే స్థలం స్వాధీనం

భవానీపురం, న్యూస్‌టుడే: విద్యాధరపురం న్యూజోజినగర్‌లోని స్థలంపై కొన్నేళ్లుగా న్యాయస్థానాల్లో స్థల వివాదం నడుస్తుందని.. కోర్టు తీర్పులకు అనుగుణంగానే తాము స్థలాన్ని స్వాధీనం చేసుకున్నామని శ్రీ లక్ష్మీ రామ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ సభ్యుడు హరిప్రసాద్ పేర్కొన్నారు. భవానీపురంలోని ఒక హోటల్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1981లో సొసైటీని స్థాపించి అబ్దుల్ మజీద్ అనే వ్యక్తి వద్ద నుంచి స్థలం కొనుగోలుకు సంబంధించి ఒప్పందం చేసుకున్నామన్నారు. 1982లో ల్యాండ్ సీలింగ్ అనుమతులు రాని కారణంతో రిజిస్ట్రేషన్ జరగలేదని.. 1984లో రిజిస్ట్రేషన్ కోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. 1995లో ల్యాండ్ సీలింగ్ అనుమతి తీసుకుని కోర్టులో డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయమని కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. 2001లో మజీద్ వేరొకరికి ప్లాట్ల రూపంలో 42 మందికి స్థలాలు విక్రయించాడని తెలిపారు. ప్లాట్లు కొనుగోలు చేసిన వ్యక్తులు కోర్టుల్లో అనేక పిటిషన్లు దాఖలు చేశారని.. కాని శ్రీ లక్ష్మీ రామ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్‌కు అనుకూలంగానే కోర్టుల్లో తీర్పులు వచ్చాయని చెప్పారు. కోర్టు తీర్పు ప్రకారం స్థలం స్వాధీనం చేసుకునేందుకు గతంలో వెళ్లగా కొందరు ప్రజాప్రతినిధుల అభ్యర్థన మేరకు ఈ ఏడాది అక్టోబరు 31 వరకు గడువు ఇచ్చామని వెల్లడించారు. స్థలాన్ని స్వాధీనం చేసుకోమని నవంబరు 4న సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని పేర్కొన్నారు. స్థల వివాదంలో ఏ రాజకీయ నాయకుడి ప్రమేయం లేదని, వారు కూడా 42 మందికే మద్దతు ఇచ్చారన్నారు. మజీద్, అతని కుమారుడి చేతిలో 42 మోసపోయారని పేర్కొన్నారు. శ్రీ లక్ష్మీ రామ కోపరేటివ్ సొసైటీలో 52 మంది ఉన్నారని, న్యాయపరంగా కోర్టు ద్వారా తమకు అనుకూలంగా తీర్పులు వచ్చాయని వెల్లడించారు. న్యాయవాది పింగళి వెంకటగిరి పాల్గొన్నారు.

బీరు సీసాలతో దాడి.. సస్పెక్ట్‌షీటర్ హత్య

హతమార్చిన రౌడీషీటర్


నిందితుడు పిల్ల సాయి

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: మద్యం, గంజాయి మత్తులో రౌడీషీటర్, సస్పెక్ట్ షీటర్ బీరు సీసాలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ క్రమంలో రౌడీషీటర్ చేతిలో సస్పెక్ట్ షీటర్ హత్యకు గురయ్యాడు. విజయవాడకు చెందిన సస్పెక్ట్ షీటర్ అలవాల నవీన్‌రెడ్డి(25), రౌడీషీటర్ సాయికృష్ణ అలియాస్ పిల్ల సాయి గత కొంతకాలంగా జగ్గయ్యపేట మండలం చిల్లకల్లులో ఉంటున్నారు. చిల్లకల్లు చెందిన అన్వేష్‌కు ఇటీవల కుమార్తె జన్మించిన సందర్భంగా గురువారం రాత్రి జగ్గయ్యపేటకు సమీపంలోని ఎంసీఎల్ ఫ్యాక్టరీ సమీపంలోని ఖాళీ స్థలాల్లో స్నేహితులకు పార్టీ ఇచ్చాడు. దీనికి అన్వేష్ ఇంటి వద్ద ఉంటున్న నవీన్‌రెడ్డి, సాయితో పాటు మరో ఐదుగురు పాల్గొన్నారు.

ఇద్దరి మధ్య ఘర్షణ: తన తల్లి గురించి అవమానకరంగా మాట్లాడనే కోపంతో సాయి దాడి చేసి పలుచోట్ల పొడవడంతో నవీన్‌రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో మరో ఇద్దరు స్నేహితులు స్కూటీపై జగ్గయ్యపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందాడని తెలపడంతో భయంతో మృతదేహాన్ని అక్కడ వదిలేసి పారిపోయారు. సమాచారం అందుకున్న జగ్గయ్యపేట, నందిగామ సీఐలు వెంకటేశ్వర్లు, వైవీవీఎల్ నాయుడు, ఎస్సైలు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి శుక్రవారం కేసు నమోదు చేశారు.

నిందితుల కోసం పోలీసుల గాలింపు

నవీన్‌రెడ్డి హత్య కేసులో నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ప్రధాన నిందితుడు పిల్ల సాయి పారిపోయాడు. నిందితులు ఇద్దరు సామాజిక మాధ్యమాల్లో తమ నేర చరిత్రను వీడియోలు చేసి పోస్టు చేస్తుండడం గమనార్హం. దీనిపై జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లను న్యూస్‌టుడే సంప్రదించగా మద్యం మత్తులో తల్లిని అసభ్యంగా మాట్లాడడంతో నవీన్‌రెడ్డిను సాయి హతమార్చినట్లు చెప్పారు. ★ విజయవాడలో భవానీపురం ఉంటున్న నవీన్ రెడ్డిపై నాలుగు చోరీ కేసులు ఉన్నాయి. కొంతకాలం బెంగళూరులో ఉంటూ ఇటీవల చిల్లకల్లు వచ్చాడు. విజయవాడలోకి కృష్ణలంకకు చెందిన సాయిపై 14 కేసులు సహా గంజాయి, పోక్సో కేసులు నమోదైనట్లు సీఐ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ఒక్కింటికి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 149, 158, 169 చికెన్ విత్ స్కిన్ - 284 చికెన్ స్కిన్‌లెస్ - 294.

సంజయ్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

ఈనాడు - అమరావతి: వైకాపా హయాంలో అగ్నిమాపక శాఖ, సీఐడీలో డీజీగా పనిచేసిన కాలంలో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన కేసులో ఐపీఎస్ అధికారి సంజయ్ బెయిల్ పిటిషన్‌పై విచారణ సోమవారానికి వాయిదా పడింది. శుక్రవారం ఏసీబీ కోర్టులో ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. ప్రాసిక్యూషన్ కౌంటర్ దాఖలు చేసేందుకు న్యాయాధికారి వాయిదా వేశారు. ఇదే కేసులో నిందితుడు కొండలరావు బెయిల్ పిటిషన్లపై శుక్రవారం వాదనలు ప్రారంభమయ్యాయి. నిందితుడి తరఫు న్యాయవాది తన వాదనలు వినిపించారు. ప్రాసిక్యూషన్ వాదనల నిమిత్తం కేసును 8వ తేదీకి వాయిదా వేశారు.

తిరువూరు
• తిరువూరు • మైలవరం

కేతనకొండలో గురుకుల్ ఒలింపిక్స్ ప్రారంభం

ఇబ్రహీంపట్నం గ్రామీణం - న్యూస్‌టుడే: క్రీడలు విద్యార్థులకు శారీరక మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ అసిస్టెంట్ డైరెక్టరు ఎం.వి. మల్లీశ్వరి బాయి పేర్కొన్నారు. కేతనకొండ శ్రీస్వామి నారాయణ గురుకుల్ పాఠశాలలో శుక్రవారం ప్రాథమిక తరగతుల విద్యార్థులకు గురుకుల్ ఒలింపిక్స్ పోటీలను ఆమె ప్రారంభించారు. పాఠశాలల యాజమాన్యాలు ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్వామి నారాయణ గురుకుల్ పాఠశాల నిర్వాహకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

18న ఏపీ ఎన్జీవో మైలవరం తాలూకా యూనిట్ ఎన్నికలు

మైలవరం, న్యూస్‌టుడే: ఏపీ ఎన్జీవో మైలవరం తాలూకా యూనిట్ ఎన్నికలను ఈ నెల 18న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి ఎం.రాజుబాబు శుక్రవారం తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఈ నెల 6వ తేదీన ఓటర్ల తుది జాబితా చేసి, ఈ నెల 10వ తేదీన స్థానిక ర.భ. గెస్ట్ హౌస్‌లో నామినేషన్లను స్వీకరించనున్నట్లు వివరించారు. తాలూకా యూనిట్‌కు సంబంధించి అధ్యక్ష, సహాధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి, మూడు ఉపాధ్యక్ష, మూడు సంయుక్త కార్యదర్శితో కలిపి మొత్తం 11 పోస్టులకు ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 10వ తేదీన నామినేషన్ల అనంతరం పరిశీలన, అర్హుల జాబితాను అదే రోజున ప్రకటిస్తామని వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705


ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



స్పందనకు వందనం

స్థానిక పులివాగు వంతెన దాటాక మైలవరం వెళ్లే ప్రధాన రహదారి వెంట మురుగు కాలువలో పూడిక పేరుకుపోయి దుర్వాసన, దోమలతో అవస్థలు పడుతున్నామని స్థానికులు ఈనాడు దృష్టికి తీసుకుని రాగా సమస్యపై 5వ తేదీ 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన పంచాయతీ కార్యదర్శి బసవలింగేశ్వరరావు సిబ్బందితో మురుగు కాలువలో పూడిక తీయించి దోమల నివారణకు చర్యలు చేపట్టారు. - జి.కొండూరు, న్యూస్‌టుడే

తితిదే పవిత్రతను దెబ్బతీస్తున్న జగన్



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

గొల్లపూడి, న్యూస్‌టుడే: తితిదే పవిత్రతను దెబ్బతీసేలా జగన్ మాట్లాడుతున్నారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. గొల్లపూడిలోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చుని అబద్ధాలు, అసత్యాలు, ఊకదంపుడు ఉపన్యాసాలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని తెలిపారు. వేంకటేశ్వరస్వామికి భక్తులు ఇచ్చిన కోట్లాది రూపాయలు కొట్టేస్తే చిన్న చోరీ అంటూ భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడటం తగదన్నారు. జగన్‌లో నిజాయితీ, చిత్తశుద్ధి ఉంటే శాసనసభకు వచ్చి మాట్లాడాలన్నారు.

అటకెక్కిన నీటి కిట్లు.. నాణ్యత తెలిసేదెట్లు?

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే



గ్రామ పంచాయతీలకు సరఫరా చేసిన నీటి కిట్లు

ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు సరఫరా చేసిన తాగునీటి పరీక్ష కిట్లు వినియోగించకపోవడంతో గ్రామస్థులకు సరఫరా అవుతున్న తాగునీరు సురక్షితమేనా అన్న సందేహం కలుగుతోంది. ప్రతి మనిషికి స్వచ్ఛమైన నీటిని స్థానిక సంస్థలు అందించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. ఆచరణలో అది ఎక్కడా అమలు కావడం లేదు. మైలవరం నియోజకవర్గంలో 43 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీలు బోరువెల్ ద్వారా సేకరించిన నీటిని ఓహెచ్ఆర్‌ల ద్వారా గ్రామాలకు సరఫరా చేస్తుంది. దీంతోపాటు గ్రామీణ రక్షితనీటి సరఫరా శాఖ కూడా ఇబ్రహీంపట్నంలోని సమగ్ర రక్షిత నీటి పథకం నుంచి కూడా నియోజకవర్గ పరిధిలోని గ్రామాలకు తాగునీరు పంపిణీ చేస్తుంది. గ్రామ పంచాయతీ సరఫరా చేసే తాగునీటిలో ఉండే గాఢత, క్షారశాతం, బురద, మడ్డి పరిశీలనతోపాటు క్లోరిన్, ఫ్లోరైడ్ పరిమాణం లెక్కించేందు కోసం ప్రభుత్వం పంచాయతీలకు నీటి కిట్లు సరఫరా చేసింది. సచివాలయం ఇంజినీరింగు సహాయకులు ట్యాంకుల వద్ద, పంచాయతీ పరిధిలోని చివరి కుళాయి నుంచి నీటిని సేకరించి వాటి స్వచ్ఛతను నిర్ధారించాల్సి ఉంది. కానీ నీటి కిట్లను సక్రమంగా వినియోగించకపోవడంతో గ్రామస్థులకు కలుషితమైన నీరే దిక్కవుతోందన్న విమర్శలు వినవస్తున్నాయి.

ఎలా వినియోగించాలో తెలియక..: నియోజకవర్గ పరిధిలో ఇబ్రహీంపట్నం మండలంలో నదీ తీర గ్రామాలలో నీటి లభ్యత ఉన్న ప్రదేశాలలో బోర్లు వేసి గ్రామ పంచాయతీలు తాగు నీరు సరఫరా చేస్తున్నాయి. నీటిని పరీక్షించేందుకు ప్రభుత్వం పంపిణీ చేసిన నీటి కిట్లు కనీసం వాడిన దాఖలాలు లేవు. ఇంజినీరింగు సహాయకులకు వీటిని ఎలా ఉపయోగించాలో తెలియని పరిస్థితి.

పర్యవేక్షణ శూన్యం: నీటి నాణ్యత తెలుసుకునేందుకు కిట్లు సరఫరా చేసిన ప్రభుత్వం అవి పంచాయతీలు ఉపయోగిస్తున్నాయా.. లేదా.. అన్న విషయాన్ని పట్టించుకోవడం లేదు. గ్రామాల్లో సరఫరా చేస్తున్న నీటిని తీసుకుని హైడ్రోజన్ క్లోరైడ్ రసాయనాన్ని కలిపి నీటి పరీక్ష నిర్వహించాలి. అనంతరం హెచ్-2ఎస్ పరికరాల్లో నీటిని నింపి 24 గంటలపాటు పరీక్షించాలి. నీరు నలుపు రంగులో ఉంటే తాగేందుకు పనికిరాదని నిర్ధారిస్తారు. పర్యవేక్షణ లేక కిట్లలోని రసాయనాలకు కాలం చెల్లడంతో వాటిని అటకెక్కించారు. గ్రామాలకు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ సహాయక ఇంజినీరు వచ్చిన సందర్భాలలోనే తాగునీటి పరీక్షలు చేస్తున్నారు. మిగిలిన దినాల్లో క్లోరినేషన్‌తోనే సరిపెడుతున్నారు.

అవగాహన కల్పించాం

అన్ని పంచాయతీల్లో నీటిని పరీక్షించుకునేందుకు అవసరమైన కిట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిని ఎలా వినియోగించుకోవాలో ఇప్పటికే సచివాలయ ఇంజినీరింగు సహాయకులకు అవగాహన కల్పించాం. ప్రతి రోజు నీటి పరీక్షలు చేసేలా పర్యవేక్షిస్తాం. - సునీత, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, ఇబ్రహీంపట్నం

నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



భూసార పరీక్షా కార్డులను అందజేస్తున్న వ్యవసాయాధికారులు

తిరువూరు, గంపలగూడెం: రైతులు నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవటం ద్వారా మెరుగైన దిగుబడులను సాధించవచ్చని మండల వ్యవసాయాధికారిణి పి.పద్మ సూచించారు. మండలంలోని రామన్నపాలెంలో శుక్రవారం నేల ఆరోగ్యం, ప్రాముఖ్యతపై రైతులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. భూసార పరీక్షలు చేసిన పొలాలకు సంబంధించిన కార్డులను అందజేశారు.

విజిలెన్స్ కమిటీ సభ్యురాలిగా నియామకం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: జిల్లా మానిటరింగ్, విజిలెన్స్ కమిటీ సభ్యురాలిగా ఇబ్రహీంపట్నానికి చెందిన పచ్చిగోళ్ల ఆనందకీర్తి నియమితులయ్యారు. ఈ సందర్భంగా భాజపా, తెదేపా నాయకులు ఆమెను ఇబ్రహీంపట్నంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించిన వారికి తోడ్పాటు ఇవ్వాలని కోరారు.

వైద్యశిబిరానికి స్పందన

పెనుగంచిప్రోలు: మండలంలోని శివాపురం గ్రామంలో జయప్రద ఫౌండేషన్ ఛైర్మన్, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి స్పందన లభించింది. గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన శిబిరంలో 455 మందికి వైద్యసేవలందించారు. వీరిలో 212 మందికి కంటి వైద్య పరీక్షలు చేయగా... 126 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించామని.. వారికి జయప్రద ఫౌండేషన్ ద్వారా పంపిణీ చేస్తామని సంస్థ సమన్వయ కర్త కట్టా వెంకట నరసింహరావు తెలిపారు. కంటి శస్త్ర చికిత్సలు అవసరమైన 41 మందికి శంకర్ నేత్రా చికిత్సాలయంలో చేయిస్తామన్నారు. 235 మందికి సాధారణ వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. చెరుకూరి జనార్దన్, వెంకటరమణ, బ్రహ్మయ్య పాల్గొన్నారు.



మైలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న లయన్స్ మాజీ గవర్నర్ నిర్మల్‌రావు



మైలవరం మండలం శ్రీరాయనిగూడెం ప్రాథమిక పాఠశాలలో ప్రోగ్రెస్ కార్డులు చూపుతున్న చిన్నారులు



దాములూరు పాఠశాలలో వైద్య పరీక్షలు



మైలవరం ఎస్టీఆర్ జీఎన్ఆర్ హైస్కూల్లో ప్రదర్శన తిలకిస్తున్న తల్లిదండ్రులు

పాఠశాలల్లో సందడే సందడి..

ఆడిపాడిన విద్యార్థులు

మైలవరం, న్యూస్‌టుడే: పాఠశాలల్లో పండగ వాతావరణం నెలకొంది. మెగా పీటీఎం పేరిట ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, పలువురు తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు. తమ పిల్లల చదువుల పరిస్థితి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రోగ్రెస్ రిపోర్టులు చూసుకుని విద్యార్థులు మురిసిపోయారు. ప్రత్యేక మెనూ భోజనం అందరికీ విందు అరగించారు.

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: మెగా పీటీఎం సందర్భంగా ఇబ్రహీంపట్నం గ్రామీణ, మండల పరిధిలోని మూడు జడ్పీ ఉన్నత పాఠశాలలు, 28 మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పలు కార్యక్రమాలను నిర్వహించారు. దాములూరు పాఠశాలలో వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది విద్యార్థులతోపాటు తల్లిదండ్రులకు కూడా వైద్య పరీక్షలను నిర్వహించారు. గుంటుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటి దత్తత తీసుకున్నారు.



గుంటుపల్లి జడ్పీ పాఠశాలలో మొక్క నాటుతున్న తల్లి

విద్యార్థుల్లో సృజన వెలికితీతకు పోటీలు దోహదం

విస్సన్నపేట: విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మ కళక్తులను వెలికి తీయటానికి 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీలు తోడ్పడతాయని వికాస్ విద్యా సంస్థల డైరెక్టర్ నరెడ నర్రెడ్డి అన్నారు. స్థానిక వికాస్ జూనియర్ కళాశాలలో 'విద్యార్థుల జీవితాల్లో సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై శుక్రవారం జరిగిన ఉపన్యాస పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థినులు షేక్ మాబు జాన్, ఆర్.కృష్ణ జ్యోతిక, ఎస్.భావన తొలి మూడు స్థానాలను సాధించారు. విజేతలకు నర్రెడ్డి బహుమతులు అందజేసి అభినందించారు. ప్రిన్సిపల్ కృష్ణమాచారి, అధ్యాపకులు ధర్మయ్య, సీహెచ్ సాయిరేఖ, ఎస్.సుజాత,డి. సోవమ్మ పాల్గొన్నారు.



విజేతలతో ప్రిన్సిపల్ కృష్ణమాచారి, అధ్యాపకులు

శతాబ్ది ఉత్సవాల సభను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న దోనేపూడి శంకర్

తిరువూరు, గంపలగూడెం: ఈ నెల 22న తేదీన తిరువూరులో నిర్వహించనున్న సీపీఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముగింపు సభ, ర్యాలీని భారీగా నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గంలో మండల, గ్రామ కమిటీలను బలోపేతం చేయాలని నాయకులను సూచించారు. నగర, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. తిరువూరు నియోజకవర్గంలో చింతలపాడు ఎత్తిపోతల పథకం మరుగున పడిందని, ప్రభుత్వ నిధి కేటాయించడం లేదన్నారు. ఎ.కొండూరు మండలంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల సమస్యలు దృష్టిలో పెట్టుకుని తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. రేపవూడులో పాదయాత్రతో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.త్యాగరాజు, తూము కృష్ణయ్య, రమణరావు, వెంకటేశ్వరరావు, నాగులమీరా, డేవిడ్, ఎం.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యం



కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో [illegible] పాల్గొని మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పలు కార్యక్రమాలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి 2 పీఎస్ఎస్ రాజు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మార్గదర్శకులు కావాలి



మాట్లాడుతున్న హెచ్ఎం కేఎన్‌జే లక్ష్మి

జి.కొండూరు, న్యూస్‌టుడే: విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు తల్లిదండ్రులు మార్గదర్శకులు కావాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కేఎన్‌జే లక్ష్మి అన్నారు. చెవుటూరు ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ 3.0 సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. తొలుత విద్యార్థులు పలు నాటిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్ఎం ఎ.రమాదేవి, పీఎంసీ ఛైర్మన్ బండారు బాలకృష్ణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేరళ తరహా విద్యా విధానాన్ని అమలు చేయాలి



మాట్లాడుతున్న కేఎస్ లక్ష్మణరావు



హాజరైన విద్యార్థులు

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: కేరళ రాష్ట్రంలో అమలవుతున్న విద్యా విధానాన్ని రాష్ట్రంలోనూ అమలు చేయాలని, పేద, మధ్యతరగతి పిల్లలకు ఎటువంటి అవరోధాలు లేకుండా చదువుకోగలరని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా 53వ మహాసభలను శుక్రవారం తిరువూరులో ప్రారంభించారు. మధిర రోడ్డు ఫ్యాక్టరీ సెంటర్ నుంచి జూనియర్ కళాశాల వరకు విద్యార్థులతో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేరళలో ప్రాథమిక స్థాయి నుంచి విశ్వ విద్యాలయాల వరకు ఖాళీలను భర్తీ చేసేందుకు ... ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కుమార్‌స్వామి, కార్యదర్శి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కుమార్‌నాయక్, నాయకులు ప్రసాద్, కీర్తి తదితరులు పాల్గొన్నారు.



విస్సన్నపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రసంగిస్తున్న ఎంపీడీవో చిన్న రాట్నాలు. వేదికపై ఎమ్మార్వో లక్ష్మీ కల్యాణి, తదితరులు



విస్సన్నపేట కె.ఎం.ఆర్, ఎం.ఎస్.ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రసంగిస్తున్న కరస్పాండెంట్ నల్లపాటి కృష్ణార్జునరావు



గానుగపాడు హైస్కూల్‌లో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ కె.ఎస్.జవహర్



రంగాపురం కేజీబీవీలో మాట్లాడుతున్న ఎం.నాగేశ్వరరెడ్డి, వేదికపై నాయకులు

విద్యార్థుల సమగ్ర వికాసమే ప్రభుత్వ లక్ష్యం

కొండపల్లి, ఇబ్రహీంపట్నం- న్యూస్‌టుడే: విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం సమగ్ర వికాసమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ అన్నారు. కొండపల్లి బాలికోన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ మీట్‌లో ఆయన మాట్లాడారు. మహనీయులను ఆదర్శంగా తీసుకొని గొప్ప లక్ష్యాల దిశగా విద్యార్థులు సాగాలన్నారు. పాఠశాలకు క్రీడా వస్తువుల కొనుగోలుకు రూ.2లక్షలు సొంత నిధులను కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. క్రికెట్ క్రీడాకారిణి హారికకు రూ.25 వేల చెక్కును అందజేశారు. ★ ఇబ్రహీంపట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో: ఇబ్రహీంపట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ మీట్‌లో ఛైర్మన్ చిట్టిబాబు పాల్గొన్నారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక శిబిరాన్ని సందర్శించారు.



విద్యార్థినులతో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

ఎ.కొండూరు, గంపలగూడెం: ఎ.కొండూరు మండల వ్యాప్తంగా మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ ఉత్సాహంగా సాగింది. అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఉదయం నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి, ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు.



తిరువూరు జూనియర్ కాలేజీలో మాట్లాడుతున్న ఆర్డీవో కె.మాధురి

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఇంటింటి సర్వే



వివరాలు నమోదు చేసుకుంటున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

మొర్సుమిల్లి(మైలవరం), న్యూస్‌టుడే: స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మండలంలోని మొర్సుమిల్లిలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా శుక్రవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. బడి మానేసిన పిల్లల వివరాలను నమోదు చేసుకున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు డిజిటల్ తరగతుల శిక్షణ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శివహరిప్రసాద్, ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పోషకాహార లోపంతోనే దృష్టి సమస్యలు



కళ్లజోళ్లు అందుకొన్న విద్యార్థులతో లయన్స్‌క్లబ్ సభ్యులు

కొండపల్లి, న్యూస్‌టుడే: పిల్లల్లో పోషకాహార లోపంతోనే దృష్టి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని లయన్స్‌క్లబ్ సభ్యులు వై.ఎస్.రావు అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ సంగమం వారి ఆధ్వర్యంలో కొండపల్లిలోని పాఠశాలల విద్యార్థులకు ఉచిత కళ్లజోళ్లను శుక్రవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ చదువుకొనే పిల్లల్లో అత్యధిక మంది దృష్టి లోపాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. దృష్టి లోపాలున్న 82 మంది విద్యార్థులకు కళ్లజోళ్లను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా గవర్నర్ వీపీపీఎస్ ఆంజనేయులు, వైస్ గవర్నర్ చెన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి, లక్ష్మీ, అమ్మాజీ, మురళీమోహన్ పాల్గొన్నారు.

ఇంటికొక మహిళా పారిశ్రామికవేత్త కావాలి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఇంటికొక మహిళా పారిశ్రామికవేత్త తయారు కావాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని డీఆర్‌డీఏ పీడీ నాంచారయ్య అన్నారు. బిజినెస్ డెవలప్‌మెంట్ సర్వీస్ ప్రొవైడర్స్ కార్యక్రమాన్ని ఇబ్రహీంపట్నం వెలుగు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో, పట్టణాల్లో ఉన్న పొదుపు సంఘ మహిళలు, లీడర్ల నుంచి ఆసక్తి ఉన్న వారిని వ్యాపార రంగం వైపు ప్రోత్సహించడం దీని ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఎంపీడీవో శకుంతల, అధికారులు రవికుమార్, రఘునాథ్, సునీత, తిరువూరు, మైలవరం, జగ్గయ్యపేటకు చెందిన పొదుపు సంఘ మహిళలు పాల్గొన్నారు.



పొదుపు సంఘ మహిళలతో అధికారులు

పర్యావరణ సమతుల్యత అవసరం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: ఆరోగ్యకరమైన భూమి పర్యావరణ సమతుల్యతకు పునాది అని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. మండలంలోని శనగపాడు గ్రామంలో శుక్రవారం అంతర్జాతీయ మృత్తికా దినోత్సవాన్ని నిర్వహించారు. రైతులకు నేల ఆరోగ్య కార్డులను ఆర్డీవో బాలకృష్ణ, డీఎంఎఫ్ విజయకుమారిలతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. . జీవకోటి మొత్తం నేలపై ఆధారపడిందని చెప్పారు. 95 శాతం ఆహారం నేల నుంచే వస్తుందని.. మొక్కలకు అవసరమైన రసాయనాలు అధిక శాతం భూమి నుంచే సరఫరా అవుతుందని వివరించారు. ఎరువులు, పురుగుల మందుల వినియోగం అధికంగా వినియోగిస్తే నేల సమతుల్యత దెబ్బతింటుందని పేర్కొన్నారు. దీనివల్ల ఆహారం కలుషితం అవుతుందని చెప్పారు. దీన్ని గుర్తించి రైతులకు నేల ఆరోగ్య పరిస్థితులపై అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

భవానీపురం: ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి గ్రామంలో పులి సాల్మన్‌రాజు, గీత దంపతులు నివాసం ఉంటున్నారు. సాల్మన్‌రాజు చర్చి పాస్టర్. ఈనెల 4న తాడేపల్లిలోని చర్చిలో వివాహానికి భార్యతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్లారు. తిరిగి రాత్రి ఇంటికి వెళ్తున్న సమయంలో కనకదుర్గ ఫ్లైవంతెనపై గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో సాల్మన్‌రాజు, గీత దంపతులు గాయపడ్డారు. గమనించిన స్థానికులు వారిని నగరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెత్త తొలగింపు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : నరసాపురం - చిన్నంపేట రహదారిలో చెత్తకుప్పలు గుట్టలుగా పేరుకుపోయి దుర్వాసన వస్తోందని వాహనదారులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా పంచాయతీ అధికారులకి ఫిర్యాదు చేయగా గ్రామ కార్యదర్శి జి.స్వాతి స్పందించారు. పొక్లెయిన్ సహాయంతో చెత్తను ట్రాక్టర్‌కి ఎత్తించి డంపింగ్ యార్డ్‌కి తరలించారు.



చెత్తను తొలగిస్తున్న దృశ్యం

పీఎంఏవై మంజూరు పత్రాల అందజేత

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: తిరువూరు మండలంలో పేద, బలహీన వర్గాలకు కేంద్ర ప్రభుత్వ ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) పథకం కింద కొత్తగా గృహాలు మంజూరైన 138 మందికి స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు శుక్రవారం మంజూరు పత్రాలను తన కార్యాలయంలో అందజేశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ కె.నిర్మల, మున్సిపల్ కమిషనర్ కె.మనోజ, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గృహ లబ్ధిదారులతో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

రోడ్డు ప్రమాదంలో గాయాలు

తిరువూరుటౌన్ న్యూస్‌టుడే: తిరువూరు మండలం గానుగపాడు వంతెన సమీపంలో ఒక వ్యక్తి ప్రమాదానికి గురైనట్లు స్థానికులు తెలిపారు. వారి సమాచారం మేరకు చిట్యాల గ్రామానికి చెందిన అంగిరేకుల గిరి(42) గురువారం రాత్రి రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యంపై వేసిన పట్టా వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనానికి అడ్డు తగలడంతో వాహన నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కన పడిపోయాడని తెలిపారు. తిరువూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

50 శాతం రాయితీపై పశు బీమా

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మాగల్లులో శుక్రవారం సంగం డైయిరీ ఆధ్వర్యంలో 50 శాతం రాయితీపై పశువులకు బీమా చేయించారు. డైయిరీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జి నాగప్రభు, మధిర మేనేజరు శివకుమార్, డాక్టర్ హర్షిత్, సూపర్‌వైజర్ రాము, స్థానిక పాలసేకరణ ఉద్యోగి ఆవుల వేణు ఆధ్వర్యంలో బీమా చేయించారు.

రేషన్ దుకాణంలో తనిఖీ

నందిగామ, న్యూస్‌టుడే: స్థానిక మయూరి టాకీస్ రోడ్డులోని నాలుగో నంబర్ రేషన్ దుకాణంలో తహసీల్దార్ సురేష్‌బాబు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు.

యువతరం

youthpage@eenadu.in

అది సినిమా కాదు



అవును, మనలాంటి నైన్టీస్ కిడ్స్‌కి చంద్రముఖి కేవలం ఒక సినిమా కాదు, అదో ఎమోషన్. పేరుకి సైకలాజికల్ థ్రిల్లర్ అయినా.. హర్రర్ సినిమాల కంటే ఎక్కువగా భయపెట్టి మన మెమొరీలో శాశ్వతంగా నిలిచిపోయింది అది. ఆ సినిమాను మొదటిసారి థియేటర్‌లో చూసిన రోజు నాకు బాగా గుర్తు. అప్పట్లో నాన్నకు ఓ హీరో హోండా సీడీ 100 బండి ఉండేది. దాని మీద అమ్మ, నాన్న, నేను, దాని ట్యాంకు మీద చెల్లి కూర్చుని సినిమాకు వెళ్లాం, అది సెకెండ్ షో! సినిమా చూస్తున్నంతసేపు కళ్లు ఇంతలు చేసుకుని రెప్పార్పకుండా చూసేశా. అదేంటో అప్పుడు ఏమీ అనిపించలేదు. కానీ ఒక్కసారి థియేటర్ నుంచి బయటకు వచ్చాక అసలు కథ మొదలైంది. బండి మీద తిరిగి ఇంటికి వెళ్తుంటే.. చంద్రముఖి అలంకరణ అనుకుంటూ మా వెనకే వచ్చేస్తుందేమోనని వెనక్కి తిరిగి తిరిగి చూస్తూ భయపడుతుంటే మొదలైంది బ్యాండు. ఇక ఇంటికి వెళ్లాక కళ్లు మూసినా తెరిచినా జ్యోతిక కళ్లే కనిపించేవి. 'వారాయ్... నాన్ ఉన్నై తేడి..' అంటూ చంద్రముఖి పాడుతున్నట్లే వినిపించేది. భయానికి మీనింగ్ తెలియని ఇద్దరు కాస్త భయంతో గడ్డకట్టుకుపోయేది. ఇది చూసి, చెల్లి 'లకలకలక..' అని చీకట్లో అరుస్తూ ఇంకా ఇంకా నన్ను హింసిస్తూ నవ్వుతుండేది. కొన్నాళ్లపాటు ఆ సినిమా ప్రభావం నుంచి బయటపడలేకపోయాను అనుకోండి. నాదే కాదు, ఆ టైమ్‌లో పదోతరగతి లోపల చదువుతున్న మనతోటి వాళ్లందరిదీ ఇదే పరిస్థితి అని తర్వాత తెలిసింది నాకు. ఇప్పుడు తలుచుకుంటే మాత్రం భలే నవ్వొస్తుంది. – బిరుదుకోట మోహన, రాజమండ్రి

కొంటె కొటేషన్



1. స్కేటింగ్ రాని బూటి.. నడిరోడ్డు మీద పేటీ – ఎస్.శివ సంతోష్, శ్రీకాకుళం
2. బాగుంది నీ ఆకారం.. రోడ్డు మధ్యలో ఏందిరి వెటకారం – సుధాకర్, నంద్యాల
3. రోడ్డు మీద దెయ్యం.. నాకేం భయం – శ్రీవిద్య, జమ్మికుంట
4. దారి మధ్యలో ఉంది భూతం.. వెళ్తే అవుతాం ఖతం – జె.బాబు, వైజాగ్



ఈ ఫొటోకి సరదా వ్యాఖ్య రాసి పంపండి. బాగున్నవి ప్రచురిస్తాం.


మరీ మంచితనమా?

నేనే లీడర్

నేను ఆఫీసులో అందరితో బాగా ఉంటాను. కానీ ఎందుకు నన్నెవరూ లెక్క చేస్తున్నట్టు కనపడదు, పని ఒత్తిడి అంతా నా మీదే ఎందుకు పడుతుంది, ముఖ్యమైన విషయాల్లో నా అభిప్రాయానికి ఎందుకు గౌరవం లభించడం లేదు.. అని బాధపడుతున్నారా? అయితే మీరు 'బీయింగ్ టూ నైస్' అనే అంశం వల్ల నష్టపోతున్నారు అంటారు కెరియర్ గురులు. అన్నివేళలా అనుకూలంగా ప్రవర్తించడం వల్ల మనల్ని ఎలా ట్రీట్ చేసినా ఏం కాదులే అనే నిర్లక్ష్యం ఎదుటివారిలో పెరుగుతుందట. అందుకే అవసరం అయినప్పుడు చెప్పాల్సిన విషయాన్ని స్థిరంగా, స్పష్టంగా, ఆత్మవిశ్వాసంతో సరైన టోన్‌లో చెప్పాలట. ఒకవేళ అది ఎదుటివారికి నచ్చదు అని తెలిసినా.. మనకు అవసరం అనుకున్నప్పుడు సందేహం లేకుండా వివరించాలట. అప్పుడే మనపట్ల తేలిక అభిప్రాయం కలగకుండా.. ఇతరులు జాగ్రత్తగా వహిస్తారని చెబుతున్నారు నిపుణులు.

నేను, చాట్‌జీపీటీ..

చాట్‌జీపీటీ నీ, నా జీవితాల్లోకి ప్రవేశించి ఇప్పటికి మూడేళ్లు.. ఆన్‌లైన్ వెతుకులాటల్లో ఇదో విప్లవం. ముప్పై ఏళ్లలోపున్న వారిలో 58శాతం మంది ఇప్పటికే దీన్ని వాడుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. ఇదంతా ఒక వైపు. దీనికి ఇంకో కోణం.. ఏవిటో కలిసి బతికే మనం, అది ఏఐ అని మర్చిపోవడం.. మనుషులకు ప్రత్యామ్నాయంగా భావించడం. ఇది సరైందేనా.. చాట్‌జీపీటీ ఎంతవరకూ?



ఇందులో కొన్ని విషయాలను పరిశీలిద్దాం..

1. అనన్య నొప్పి రాగానే కంగారుపడలేదు. ఎవ్వరూ అందుబాటులో లేని పరిస్థితి అయిపోయింది. స్థిరంగా చాట్‌జీపీటీకి తన పరిస్థితి వివరించింది.
2. చాట్‌జీపీటీని అడిగాను కదా అని.. అది చెప్పినవన్నీ చేయలేదు. ఏది సులభమైన, మంచిదైన ఉపశమనమో ఆలోచించింది. తనే నిర్ణయం తీసుకుంది.
3. కేవలం చాట్‌జీపీటీ మీద ఆధారపడలేదు. డాక్టర్‌ను సంప్రదించింది.

అనన్య ఇరవైఏడేళ్ల సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. ఓరోజు రాత్రి తనకు హఠాత్తుగా విపరీతంగా నొప్పి మొదలైంది. సమయానికి ఇంట్లో ఎవరూ లేరు. ఏం చేయాలో తెలియక చాట్‌జీపీటీను అడిగింది. ఈలోగా దగ్గర్లో ఉన్న డాక్టర్ ఫోన్ నెంబర్ కోసం కూడా ట్రై చేసింది. వైద్యులు లైన్లోకి వచ్చేలోపు ఏఐ చెప్పిన హోమ్ రెమెడీస్ ట్రై చేసింది. దాంతో నొప్పి కాస్త నెమ్మదించింది. వెంటనే డాక్టర్ దగ్గరకు బయల్దేరింది. అప్పటికే ఆయన అందుబాటులోకి రావడంతో పరిస్థితి పరిశీలించి తగిన వైద్యం చేశారు. అనన్య చక్కగా ఇంటికి తిరిగి వచ్చింది.

ఈ ఉదాహరణ టెక్ సపోర్ట్ తీసుకోవడం ఎలాగో మనకు నేర్పిస్తుంది. హ్యూమన్ ఇంటరాక్షన్ ఎంత ముఖ్యమైనదో కూడా ఇందులో ఉంది. చాట్‌జీపీటీని వాడటం ఎంత వరకూ ఉండాలో ఇది తెలియజేస్తుంది. మొత్తంగా ఏఐని యూత్ ఎలా ఉపయోగించుకోవాలో దీన్లో ఉంది. ఇలా చేయడం మాత్రమే ఉత్తమమని అంటారు ఎంటర్‌ప్రైజ్ మైన్స్ ఏఐ ప్రాక్టీస్ లీడర్ మధు వడ్లమాని.

కానీ మనలో కొందరు యువత దీనికంటే భిన్నంగా ఏఐను వాడుతున్నారు. ముఖ్యంగా 2000 తర్వాత పుట్టిన వారిలో ఈ గందరగోళం ఎక్కువగా ఉందని సర్వేలు చెబుతున్నాయి. మనోభావాలు పంచుకోవడానికి పూర్తిగా దానిమీదే ఆధారపడటం, ప్రతి చిన్న విషయాన్నీ అడిగి తెలుసుకోవడం, అన్నీ దాంతో పంచుకోవడం చేస్తున్నారు. సరదాగా మొదలయ్యే ఈ అలవాటును సున్నితమైన, అతి ముఖ్యమైన విషయాల్లోనూ కొనసాగిస్తున్నారు.

సురేశ్ హాస్టల్లో ఇంటర్ చదువుతున్నాడు. ఎప్పుడూ విపరీతమైన ఒత్తిడికి లోనవుతూ ఉండటం మామూలైపోయింది. మాట్లాడటానికి అమ్మానాన్నా దూరంగా ఉన్నారు. హాస్టల్ ఫ్రెండ్స్ ఎవరి హడావుడిలో వాళ్లు. అలాంటి సమయంలో చాట్‌జీపీటీ తనకు బెస్ట్ ఫ్రెండ్‌లా మారింది. చదువుల్లో సందేహాలు తీసుకోవడం మొదలుపెట్టాడు. ఖాళీ సమయంలో బోలెడు విషయాలు తెలుసుకోవడం చేస్తున్నాడు. నెమ్మదిగా తన ఒత్తిడి, ఒంటరితనం దూరమైనట్లు అనిపించింది. ఈ తరహా వాడకం కొంతమేరకు మంచిదే అంటున్నారు నిపుణులు. ఎందుకంటే టీనేజీలో ఎదురయ్యే అనేకానేక భావోద్వేగాల వల్ల విపరీత చర్యలకు పాల్పడే కంటే.. ఇలా టెక్ సపోర్ట్ తీసుకోవడం సరైనదేగా.

మనుషులతో..

చాట్‌జీపీటీ ఎంత అయినా వాడొచ్చు. కానీ దానికి హ్యూమన్ వ్యాల్యూయేషన్ ఉండాలి అనేది కచ్చితమైన నిజం. అది చెప్పే విషయాలు, పంచుకునే అంశాలు సరైనవా, కావా.. పాటిద్దామా లేదా అన్న నిర్ణయం మనిషి మెదడే తీసుకోవాలి. అలాంటి క్వాలిటీ కంట్రోల్ ఉన్నప్పుడే అది మన కంట్రోల్‌లో ఉంటుంది. నిజానికి దీంట్లో ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ ఉంటుంది కాబట్టి డేటా షేరింగ్ విషయం భయపడాల్సింది లేదని ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు. అయినా జాగ్రత్తగా ఉండటంలో తప్పులేదు. ఎందుకంటే చాట్‌జీపీటీ మన అసిస్టెంట్. అసిస్టెంట్‌కు ఏం చేయాలో చెబుతాం, కానీ అనిపించినవన్నీ చెప్పము కదా!

మన స్కిల్స్ మనతోనే..

ఇటీవల ఒక సాఫ్ట్‌వేర్ సంస్థ సీఈవో పంచుకున్న లింక్డిన్ పోస్ట్‌లో గమనించదగిన ఓ విషయం కనిపించింది. ఆయన కొన్ని ప్రాజెక్టుల కోసం ఇంటర్న్స్‌ను పరిశీలిస్తే.. ఆ లిస్ట్‌లో ఉన్న ఫ్రెషర్స్‌లో ఒక్కరు కూడా సొంతంగా ప్రోగ్రామ్ రాయలేకపోయారట! అదే చాట్‌జీపీటీని అడిగితే మాత్రం చకచకా పని పూర్తి చేసేవారట. ఇలా అయితే మరి మన స్కిల్ ఎక్కడ ఉన్నట్టు? ఏఐను స్కిల్స్ మెరుగుకోవడానికి వాడాలి కానీ స్కిల్ కోసం దానిపై ఆధారపడకూడదు. మన నైపుణ్యాలు మనతో ఉండేలా చూసుకోవాలి. ఒక బుక్ గురించి చెప్పమని దాన్ని అడగొచ్చు. కానీ అది ఎలా ఉందో చదివి ఓ అభిప్రాయాన్ని ఏర్పరుచుకోవాల్సింది మనమే. ఈ ప్రాథమిక అర్థం చేసుకుంటే చాట్‌జీపీటీతో మన రిలేషన్‌షిప్ సాఫీగా సాగిపోతుంది.

ఎక్కడ వరకు?: ఎమోషన్, ఎక్స్‌ప్రెషన్లో ఏఐ వద్దు అనేది నిపుణుల మాట. అంటే మన అనుబంధాలు, మనోభావాలు, పూర్తి వ్యక్తిగత విషయాలు, అభిప్రాయాల్లో టెక్నాలజీకి తావివ్వకూడదు. నచ్చిన అమ్మాయికి లవ్‌లెటర్ మనసుతోనే రాయాలి, బెస్ట్‌ఫ్రెండ్‌కి స్వయంగా మాట చెప్పాలి. అంటే ఎంచుకున్న రంగంలో ఆత్మస్పర్శ సాధించడానికి ఏఐను నిచ్చెనమెట్లుగా వాడుకోవాలి.


డీటాక్స్ ఒక్కసారి: ఎటువంటి టెక్నాలజీ వాడుతున్నా వారానికి కొన్ని గంటలు డిజిటల్ డీటాక్స్ ఉండాలి అంటున్నారు నిపుణులు. అంటే, ఎలాంటి గ్యాడ్జెట్ లేకుండా ఏకాంతంగా మనతో మనం సమయం గడపడం. ఇప్పుడున్న బిజీ లైఫ్‌లో ఇలాంటి సమయం కల్పించుకోవడం ఉండి తీరాలి. ఆ టైమ్‌లో మనసులోని భావాలను రాసుకునేందుకు కాగితం, కలం మాత్రమే ఉండాలి. అప్పుడే వారమంతా గడిపిన బిజీ డిజిటల్ హెడ్‌కి కాస్త డీటాక్స్ అయ్యేది.

ఇలా చాట్‌జీపీటీ, గ్రోక్ వంటివి వాడే సమయంలో లీగల్, ఎథికల్ అంశాలనూ దృష్టిలో ఉంచుకోవాలి. ముఖ్యంగా యువత ఆవేశంలో చేసే తప్పులతో సమస్యలు ఎదుర్కొంటున్న ఘటనలు పెరుగుతున్నాయి. మొత్తానికి భవిష్యత్తునే ప్రమాదంలో పడేసే చర్యలకు పూనుకోవడం తగదు.

చివరిగా ఒక్క మాట.. ఏఐ నీకు అసిస్టెంట్, దానికి నువ్వు బానిస కాదు, ఈ మాట గుర్తుపెట్టుకో నేస్తం!

ఇలా నడిచేద్దాం

జిమ్‌కి వెళ్లే ఖాళీ, ఓపిక లేని యూత్‌కి నడక ఓ చక్కని వ్యాయామం. అయితే ఊరికే నడిచేయడం కాకుండా.. దానికీ ఓ పద్ధతి కనిపెట్టారు ఫిట్‌నెస్ గురూలు. అదే 5-4-3-2-1 రూల్. ఇందులో ఎలా నడవాలంటే..



5 – కొంచెం వేగంతో మొదలుపెట్టి, దాన్ని మరికొంచెం పెంచుతూ ఐదు నిమిషాలపాటు నడవాలి.

4 – ఆ తర్వాత నాలుగు నిమిషాలు ఇంకొంచెం వేగంగా నడవాలి.

3 – మూడు నిమిషాలు పరిగెత్తాలి (జాగింగ్‌లా).

2 – తర్వాత వచ్చే రెండు నిమిషాలు సాధారణ వేగంతో నడవాలి.

1 – చివరి ఒక నిమిషం అధిక వేగంతో నడవాలి.

..ఇలా చేయడం వల్ల కెలోరీలు ఎక్కువగా బర్న్ అవ్వడమే కాదు, నడక తర్వాత కూడా ఆ ప్రక్రియ కొనసాగుతూ ఉంటుందట. వేగంలో మార్పుల వల్ల ఎక్కువ కండరాలు కదులుతాయట. భారీ ఎక్సర్‌సైజ్‌లతో పోలిస్తే దీని వల్ల జాయింట్ల మీద ఒత్తిడి తగ్గుతుందట. మొత్తంగా ఆరోగ్యం మెరుగుదలకు దోహదపడే ఈ పిరమిడ్ వాకింగ్‌ను మనమూ ట్రై చేసేద్దాం.

తెలుసా?

యూత్‌లో చాలా మందికి తమలో తాము మాట్లాడుకునే అలవాటు ఉంటుంది. ఎవరైనా చటుక్కున చూస్తే మాత్రం 'అదేంటి నీలో నువ్వే మాట్లాడుతున్నావ్, పిచ్చిగానీ పట్టిందా' అంటూ ఆటపట్టిస్తారు. కానీ అదేమీ చెడ్డ అలవాటు కాదు అంటున్నారు పరిశోధకులు. స్వీయ చర్చ అనేది ఏదైనా ఒక విషయంపై మన దృష్టిని మెరుగుపరుచుకోవడానికి, దాన్ని వేగంగా అర్థం చేసుకోవడానికి, భావోద్వేగాలను నియంత్రించుకోవడానికి, ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవడానికి తోడ్పడుతుందని పరిశీలనల్లో రుజువైంది. ఈ అలవాటు ఉన్నవారు లక్ష్యాలను అందుకోవడంలో ఇతరుల కంటే ముందున్నారని కూడా తెలిసింది. అందుకే మీలో మీరు చర్చించుకోవడం మరీ చెడ్డ అలవాటేం కాదు.

అడవి స్నానం



'ఛీ జీవితం.. సన్యాసం తీసుకుని అడవుల్లోకి పోతా' అంటుంటాం కొన్నిసార్లు. ఏం చేస్తాం, ఉద్యోగాల్లో ఉండే ఒత్తిడి అలాంటిది. కానీ ఆ స్ట్రెస్‌ను తగ్గించుకోవడానికి సన్యాసం తీసుకోవాల్సిన అవసరం లేదుకానీ, నిజంగానే అడవుల్లోకి వెళ్లొచ్చు అంటున్నారు నేటి కుర్రకారు. అంటే వెళ్లి అక్కడే ఉండిపోవడమేం కాదు సుమా.. ఏదో ఒకటిరెండు రోజులు చిల్ అయ్యి రావడం అన్నమాట. దీనికి ఫారెస్ట్ బాత్ అనే అందమైన పేరు కూడా పెట్టారు. ఇది మనసుకు ఓ రకంగా రిఫ్రెషింగ్ స్నానమన్నమాట. అక్కడి చెట్ల ఆకులను తాకుతూ, పూల వాసనలు రంజింపజేస్తుంటే.. పక్షుల కిలకిలారావాలను వింటూ హాయిగా సేదతీరడం. అక్కడ ఉన్నన్ని రోజులూ ఎటువంటి టెక్నాలజీ వాడకుండా ప్రకృతిలో బతకడం. ఇలా ఎలాంటి ఆలోచనలు లేకుండా నేచర్ మధ్య ఉంటే.. ఉల్లాసంగా అనిపించడంతోపాటు ఆయుష్షు కూడా పెరుగుతుందని జపనీస్ వైద్యులు కనిపెట్టారట. ఫారెస్ట్ బాతింగ్ మనసుకు ఒక థెరపీలా పనిచేస్తుందని వివరిస్తున్నారు. నిజానికి ఇది పాత పద్ధతే.. కాకపోతే మళ్లీ ట్రెండింగ్‌లోకి వచ్చింది. నచ్చితే మీరూ ట్రై చేసేయండి!


అవకాశం ఉంటే చంద్రబాబు బయోపిక్‌లో నటిస్తా: శివరాజ్‌కుమార్



శివరాజ్‌కుమార్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దుర్గగుడి ఛైర్మన్ రాధాకృష్ణ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: అవకాశం ఉంటే చంద్రబాబు బయోపిక్‌లో నటిస్తానని కన్నడ కథనాయకుడు శివరాజ్‌కుమార్ తెలిపారు. మాజీ శాసనసభ్యులు గుమ్మడి నరసయ్య బయోపిక్‌లో నటించేందుకు శుక్రవారం విజయవాడ వచ్చిన ఆయన ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు ప్రజల ఆదరణ మరచిపోలేమని తెలిపారు. ప్రజాసమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసిన మాజీ శాసన సభ్యులు గుమ్మడి నరసయ్య పాత్రకు తనను ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. చిత్ర దర్శకుడు పరమేశ్వర్ మాట్లాడుతూ.. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలకు భావ సారూప్యం ఎక్కువ అని అన్నారు. పాల్వంచలో ప్రజల సమక్షంలో ఈ చిత్ర షూటింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు. దుర్గగుడి ఛైర్మన్ రాధాకృష్ణ ఆయనకు అమ్మవారి చిత్రపటం, శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

సత్యవర్ధన్ కేసులో.. రామాంజనేయులుకు రిమాండ్



రామాంజనేయులు

ఈనాడు - అమరావతి: సత్యవర్ధన్ కేసులో వల్లభనేని వంశీ అనుచరుడు రామాంజనేయులుకు కోర్టు రిమాండ్ విధించింది. తెదేపా కార్యాలయంపై దాడి కేసును ఉపసంహరించుకునేలా సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి, బెదిరించిన కేసులో గురువారం గన్నవరం మండలం కేసరపల్లిలో అరెస్టు అయిన నిందితుడిని పోలీసులు శుక్రవారం మధ్యాహ్నం విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ కోర్టులో న్యాయాధికారి భాస్కరరావు ఎదుట హాజరుపరిచారు. ఇప్పటికే నిందితుడిపై కోర్టు నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. నిందితుడికి ఈనెల 15 వరకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించాలని ఉత్తర్వుల్లో న్యాయాధికారి పేర్కొన్నారు.

పోలీసులు బెదిరించి సంతకాలు తీసుకున్నారు: న్యాయాధికారితో నిందితుడు రామాంజనేయులు

'పోలీసులు నన్ను గురువారం ఉదయం 11 గంటలకు మా ఇంటి నుంచి అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి ఇంట్లోని సీసీ కెమెరాల ఫుటేజీ కూడా చూడొచ్చు. తర్వాత వాహనంలో ఎక్కించి ఏలూరు, ఇతర ప్రాంతాలకు తిప్పారు. కళ్లకు గంతలు కట్టారు. అర్ధరాత్రి ఓ ప్రాంతంలోని హోటల్‌కు తీసుకెళ్లారు. నన్ను బెదిరించి స్టేట్‌మెంట్‌పై సంతకాలు తీసుకున్నారు. లేనిపక్షంలో చంపేస్తామని బెదిరించారు. 24 గంటల్లోపు కోర్టులో హాజరుపరచాల్సి ఉంది. కానీ.. ఆలస్యంగా న్యాయస్థానానికి తీసుకొచ్చారని' నిందితుడు రామాంజనేయులు కోర్టులో న్యాయాధికారి ఎదుట చెప్పాడు.

దర్యాప్తు అధికారి వివరణ ఇవ్వాలని ఆదేశం

నిందితుడు చెప్పింది విన్న న్యాయాధికారి.. ఏం జరిగిందన్న దానిపై వివరణ ఇవ్వాలని కేసు దర్యాప్తు అధికారి దామోదర్‌ను ఆదేశించారు.

రాజ్‌భవన్ పేరు.. లోక్‌భవన్‌గా మార్పు



విజయవాడలోని గవర్నర్ నివాసం రాజ్‌భవన్ పేరుని శుక్రవారం సాయంత్రం లోక్‌భవన్‌గా మార్చారు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషల్లో గతంలో ఉన్న రాజ్‌భవన్ పేరు స్థానంలో కొత్తగా లోక్‌భవన్‌గా మార్పు చేశారు. -ఈనాడు, అమరావతి

జగన్‌కు జోజినగర్ వాసుల వినతి

గన్నవరం గ్రామీణం: విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను భవానీపురంలోని జోజినగర్ ప్లాట్ల యాజమానులు శుక్రవారం కలిశారు. ప్లాట్ల కూల్చివేతతో తమకు తీరని అన్యాయం జరిగిందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ పట్టించుకోలేదన్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

జినేష్, శిబులపై పీటీ వారెంట్‌కు పిటిషన్ దాఖలు

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో అన్నమయ్య జిల్లా మదనపల్లె కారాగారంలో రిమాండ్‌లో ఉన్న ఇద్దరు నిందితుల కోసం ఎక్సైజ్ పోలీసులు పీటీ వారెంట్ దాఖలు చేశారు. గోవా నుంచి స్పిరిట్ సరఫరా చేసిన జినేష్, శిబులను ములకలచెరువు ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. వీరు ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. ఇద్దరినీ ఇక్కడ కేసులో కూడా నిందితులుగా చేర్చిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో జినేష్, శిబులపై పీటీ వారెంట్ జారీకి కోసం శుక్రవారం పిటిషన్ వేశారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి అభినందనీయం



ఫల, పుష్ప ప్రదర్శనలో సందర్శకులు



పుష్పాలచెంత ఫొటోలు దిగుతూ..

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

కొన్నేళ్లుగా వివిధ రకాల ఫల, పుష్పాల మొక్కల ప్రదర్శన ఏర్పాటు చేస్తూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావడం అభినందనీయమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో విజయవాడ పిన్నమనేని పాలీక్లినిక్‌రోడ్డులోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో ఈ నెల 8 వరకు నిర్వహించే ఫల, పుష్ప ప్రదర్శనను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజురోజుకూ కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో మొక్కల పెంపకంపై ప్రజలు దృష్టిపెట్టాలని కోరారు. రోజ్ సొసైటీ అధ్యక్షురాలు ఎస్.ఉషారాణి మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏడు ప్రదర్శనలు నిర్వహించామని తెలిపారు. స్టాల్స్‌లో వివిధ రకాల పూలు, ఫల మొక్కలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ చంద్రశేఖర్, సొసైటీ కార్యదర్శి జి.లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కనువిందు చేస్తున్న పూలు, మొక్కలు

ప్రదర్శనలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నర్సరీల నిర్వాహకులు, రైతులు తమ మొక్కలను ప్రదర్శించారు. నగరానికి చెందిన సందర్శకులు వాటిని ఆసక్తిగా తిలకించారు. వివిధ రకాల చామంతులు, గులాబీలు, మందారాలు కనువిందు చేస్తున్నాయి. తెల్ల చామంతులతో తయారు చేసిన హంసలు ఆకట్టుకున్నాయి. కొలను ఏర్పాటు చేసి అందులో తామర ఆకులు, కలువ పుష్పాలను ఉంచారు.

హరిత నగరంగా అమరావతి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు స్వప్నమైన ప్రజా రాజధాని అమరావతిని ఆకుపచ్చని నగరంగా తీర్చిదిద్దుతున్నామని అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) ఛైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీపార్థసారథి అన్నారు. రాజధానిలో 30 శాతం అధిక ఆక్సిజన్ అందించే చెట్లతో సుందరీకరిస్తున్నామన్నారు. నిపుణులైన అధికారులను నియమించి రహదారులు, పార్కులను ఆకర్షణీయమైన చెట్లతో బ్యూటిఫికేషన్ చేస్తున్నట్లు వెల్లడించారు. రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో మొగల్రాజపురంలోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో ఫల, పుష్ప ప్రదర్శనలో అమరావతి నగరంలో ఏడీసీ ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన స్టాల్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించారు. అమరావతిలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలు, రహదారుల వ్యవస్థ, పార్కులు, నర్సరీలు, వాగుల వెంబడి చేపడుతున్న సుందరీకరణ ఛాయాచిత్రాలను ప్రదర్శనలో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీసీ ఉద్యానవన విభాగం ఉప సంచాలకులు బి.శ్రీనివాసులు, జి.ఆండాళ్, సహాయ సంచాలకులు డి.నవీన్‌కుమార్, కె.స్వాతి, హార్టికల్చర్ అధికారి ఎన్.కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఏడీసీ ఏర్పాటు చేసిన స్టాల్ వద్ద ఛైర్‌పర్సన్, ఎండీ లక్ష్మీ పార్థసారథి, అధికారులు

నేటి నుంచి కృష్ణవేణి సంగీత నీరాజనం



గోడప్రతులను ఆవిష్కరిస్తున్న వెంకటేశన్, వీరాస్వామి, కృపాకర్

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రిత్వశాఖ(సంగీత నాటక అకాడమి), రాష్ట్ర పర్యాటక శాఖ, స్టార్ హోటల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6, 7 తేదీల్లో తుమ్మలపల్లి కళా క్షేత్రంలో 2025 ఎడిషన్ కృష్ణవేణి సంగీత నీరాజనం నిర్వహించనున్నట్లు కేంద్ర పర్యాటక శాఖ సంచాకులు(సౌత్) డి.వెంకటేశన్, ఆంధ్రప్రదేశ్ స్టార్ హోటల్స్ అసోసియేషన్(ఆశా) అధ్యక్షుడు రామిశెట్టి వీరాస్వామి తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడ ప్రతులను గుణదలలోని పార్క్ హయత్ హోటల్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 6న ప్రారంభమయ్యే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ హాజరవుతారన్నారు. హరికథ, సంకీర్తన, వీణ, గాత్ర కచేరీలు, పంచరత్న కృతులు వంటి సామూహిక ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. సంగీత నీరాజనం, క్రాఫ్ట్ బజార్లు, చేనేత ప్రదర్శనలు, స్థానిక కళాకారులు, నేత కార్మికుల సమగ్ర సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని వెల్లడించారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ అసోసియేట్ డైరెక్టర్ కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంతరాయం లేని విద్యుత్తు సరఫరా చేయండి



మాట్లాడుతున్న పి.పుల్లారెడ్డి, వేదికపై మురళీకృష్ణయాదవ్, మూర్తి, వెంకటేశ్వర్లు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి సూచించారు. శుక్రవారం సూర్యారావుపేటలోని విద్యుత్తు సర్కిల్ కార్యాలయంలో అన్ని జిల్లాల ఎస్ఈలు, ఈఈలతో ఆయన సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. నూరు శాతం విద్యుత్తు బిల్లుల వసూలు చేయాలని ఆదేశించారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ పథకం ఉపయోగాలను ప్రతి ఒక్కరికీ వివరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు పీఎం సూర్యఘర్‌ను ఎలా వినియోగించుకోవాలో స్పష్టంగా తెలియజేయాలని కోరారు. నూతన విద్యుత్తు సర్వీసులకు దరఖాస్తు చేసుకున్న వెంటనే మంజూరు చేయాలన్నారు. లో ఓల్టేజీ సమస్యలు రాకుండా నిత్య పర్యవేక్షణ ఉండాలని, ఎక్కడైనా సమస్య వస్తే..కారణాలు తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్లు మురళీకృష్ణయాదవ్, టి.వి.ఎస్.ఎన్.మూర్తి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏఈఈల సంఘ నూతన కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు వీరే..

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల(ఏఈఈల) ఉమ్మడి కృష్ణా జిల్లా కార్యవర్గాన్ని, విజయవాడ జలవనరుల శాఖ ఆవరణలోని రైతు శిక్షణ కేంద్ర భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వివరాలను శుక్రవారం పత్రికలకు విడుదల చేశారు. అసోయేషన్ అధ్యక్షుడిగా కె.సూర్యతేజ, సహాధ్యక్షుడిగా వి.వి.ప్రవీణ్‌రాజా, ప్రధాన కార్యదర్శిగా ఎం.వి.ఎన్.విజయకుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జి.వెంకటేశ్, బి.దేవి సౌమ్య, సంయుక్త కార్యదర్శులుగా ఎన్.ఎస్.ఆర్.ఎస్.కిశోర్, పి.సాయికౌశిక్, కె.ఎన్.ఎస్.ఆర్.కె.ప్రసాద్, జి.రాజు, కోశాధికారిగా జి.రాజగోపాలరావు, నిర్వాహక కార్యదర్శులుగా కె.ప్రసన్నకుమార్, బి.గోపాలరావు నాయక్, పి.నాగబాబు, మహిళా విభాగం కార్యదర్శిగా ఎస్‌కే బీబీ, మీడియా కార్యదర్శిగా ఎం.అరుణ్ కుమార్, క్రీడల విభాగ కార్యదర్శిగా ఎస్.నాగరాజు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఇరిగేషన్ కేఈ డివిజన్ డీఈఈ కె.బాబు, పరిశీలకుడిగా విజయవాడ సర్కిల్ డీఎస్ఈ ఎల్.కృష్ణప్రసాద్ వ్యవహరించారు.

గ్రంథాలయ సంస్థల పింఛనర్ల సంఘం ఎన్నిక



మధుసూదనరాజును అభినందిస్తున్న విద్యాసాగర్

విజయవాడ(గాంధీనగర్),: ఆంధ్రప్రదేశ్ జిల్లా గ్రంథాలయ సంస్థల పింఛనర్ల సంఘం నూతన కమిటీ ఎన్నిక శుక్రవారం గాంధీనగర్‌లోని ఎన్జీవో భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికల్లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కళ్లేపల్లి మధుసూదనరాజు, ప్రధాన కార్యదర్శిగా వి.వెంకటరమణ, కోశాధికారిగా పి.వెంకటేశ్వరరావు, కన్వీనర్‌గా కోన దేవదాసు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదనరాజు మాట్లాడుతూ పింఛనర్లకు ట్రెజరీ ద్వారా 010 పద్దు కింద పింఛన్లు చెల్లించాలని, పింఛనర్లకు పెంచిన గ్రాట్యుటీని 2018 జులై 1 నుంచి 2020 డిసెంబరు 31 లోపు ఉద్యోగ విరమణ చేసిన వారికి కూడా వర్తింపజేయాలని కోరారు. గ్రాట్యుటీ, కమ్యుటేషన్ ఆఫ్ పింఛను పదవీ విరమణ రోజే చెల్లించాలని, క్వాంటమ్ ఆఫ్ పింఛను సకాలంలో మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏపీఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ నూతన సభ్యులను అభినందించి పింఛనర్ల సంఘానికి పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు.

భారత్‌లోనే రష్యా సైనిక హార్డ్‌వేర్, విడిభాగాల తయారీ

దిల్లీ: రష్యాకు చెందిన ఆయుధాలు, రక్షణ సాధన సంపత్తికి సంబంధించిన సైనిక హార్డ్‌వేర్, విడిభాగాలను ఉమ్మడిగా భారత్‌లోనే ఉత్పత్తి చేయడానికి మార్గం సుగమమైంది. ఇందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని రష్యా బదిలీ చేయనుంది. శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య జరిగిన శిఖరాగ్ర సదస్సులో ద్వైపాక్షిక రక్షణ సహకారాన్ని మరింత మెరుగుపరచుకోవడంపై ప్రధాన చర్చ జరిగింది. అనంతరం విడుదలైన ఉమ్మడి ప్రకటనలో ఈ అంశాన్ని ప్రస్తావించారు. రష్యా నుంచి కొనుగోలు చేసిన ఆయుధాలకు విడిభాగాల సరఫరాలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో భారత సైనిక దళాలు చాలా ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నాయి. దీనివల్ల ఆయుధ వ్యవస్థల నిర్వహణపై ప్రభావం పడుతోందని వాపోతున్నాయి. ఈ నేపథ్యంలో తాజా నిర్ణయం జరిగింది. భారత సైనిక దళాల అవసరాలు తీర్చడానికి, ఆ తర్వాత మూడో మిత్ర దేశానికి ఆయుధాలను ఎగుమతి చేయడానికి జాయింట్ వెంచర్లను ఏర్పాటు చేయనున్నారు. దానికి కూడా ఇరు దేశాలు అంగీకరించినట్లు ఉమ్మడి ప్రకటన తెలిపింది. ఆధునిక రక్షణ పరిజ్ఞానం, వ్యవస్థలను సంయుక్తంగా అభివృద్ధి చేసేలా భారత్-రష్యా రక్షణ భాగస్వామ్యాన్ని పునర్వ్యవస్థీకరించనున్నట్లు వివరించింది.

మునీర్‌ను సీడీఎఫ్‌గా నియమిస్తూ నోటిఫికేషన్ జారీ

ఇస్లామాబాద్: పాకిస్థాన్ సైన్యాధిపతి ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్‌ను రక్షణ బలగాల తొలి అధిపతి (సీడీఎఫ్)గా నియమిస్తూ రక్షణ శాఖ శుక్రవారం అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసింది. 1970ల తర్వాత మిలటరీ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించే దిశగా పాక్ ఈ చర్యను చేపట్టింది. సీడీఎఫ్‌గా మునీర్ నియామకానికి దేశాధ్యక్షుడు జర్దారీ గురువారం ఆమోదం తెలిపారు. ఐదేళ్లపాటు ఆయన ఈ పదవిలో ఉంటారు.



విశ్వసనీయతకు ఒక్కటే మార్గం

విశ్వసనీయతను పెంచుకోవడానికి ఒక్కటే దారి ఉంది. అదేంటంటే.. మీరు చేస్తామని మాట ఇచ్చిన పనిని ఎట్టి పరిస్థితుల్లోనూ చేసి చూపించడం. అది కూడా గడువులోపే పూర్తి చేయడం. ఇంతకు మించి ఇంకేం చేయాల్సిన అవసరం లేదు. ఈ సూత్రాన్ని పాటించేవారిని అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయి.

– లువానా లారా, బిజినెస్ కన్సల్టెంట్



దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో సంయుక్త విలేకరుల సమావేశంలో పాల్గొన్న రష్యా అధ్యక్షుడు పుతిన్, ప్రధాని మోదీ ★ రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఇచ్చిన విందులో ప్రసంగిస్తున్న పుతిన్. చిత్రంలో ప్రధాని మోదీ, నిర్మలా సీతారామన్ తదితరులు

పుతిన్‌కు రాష్ట్రపతి విందు

హాజరైన ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, ప్రధాని మోదీ

దిల్లీ: శాంతి, సుస్థిరతలపై భారత్, రష్యాలకు ఉన్న నిబద్ధతే ఇరు దేశాల భాగస్వామ్యానికి మార్గనిర్దేశం చేస్తోందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉన్నారు. సామాజిక, ఆర్థిక రంగాల్లో పురోగతి కోసం కృషి చేసేందుకు దిల్లీ, మాస్కో కట్టుబడి ఉన్నాయని చెప్పారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గౌరవార్థం ముర్ము రాష్ట్రపతి భవన్‌లో శుక్రవారం విందు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. భారత్-రష్యా వ్యూహాత్మక భాగస్వామ్యం 25 వసంతాలు పూర్తిచేసుకుంటున్న వేళ పుతిన్ తాజా పర్యటన చోటుచేసుకోవడం ప్రత్యేకమని పేర్కొన్నారు. ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, ప్రధాని మోదీ తదితర నేతలు విందుకు హాజరయ్యారు. విందు అనంతరం పుతిన్ స్వదేశానికి తిరుగు ప్రయాణమయ్యారు.

గుచ్చీ దూన్ చెటిన్.. అచారీ బైగన్

పుతిన్‌కు రాష్ట్రపతి ఇచ్చిన విందులో గుచ్చీ దూన్ చెటిన్ (పుట్టగొడుగులు-కశ్మీరీ వాల్నట్ చట్నీ), అచారీ బైగన్ , యెల్లో దాల్ తడ్కా తదితర పసందైన వంటకాలను వడ్డించారు. బెంగాలీ స్వీట్ గుర్ సందేశ్, దక్షిణ భారత స్నాక్ అయిన మురుకు వంటి వాటిని కూడా అందుబాటులో ఉంచారు.

రాహుల్, ఖర్గేలకు అందని ఆహ్వానం

పుతిన్ గౌరవార్థం రాష్ట్రపతి ఏర్పాటుచేసిన విందుకు హాజరవ్వాలని రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ విపక్ష నాయకుడు రాహుల్‌గాంధీలకు ఆహ్వానం అందలేదు. దీనిపై కాంగ్రెస్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రజాస్వామ్య సూత్రాలపై కేంద్ర ప్రభుత్వానికి విశ్వాసం లేదని, అన్ని ప్రొటోకాల్‌లనూ అది కాలరాస్తోందని కాంగ్రెస్ పార్టీ మీడియా, ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేడా ఆరోపించారు. హస్తం పార్టీ ఎంపీ శశి థరూర్‌కు మాత్రం విందు ఆహ్వానం అందడం గమనార్హం.

కశ్మీరీ కుంకుమపువ్వు.. అస్సాం బ్లాక్ టీ

భారత పర్యటనకు వచ్చిన పుతిన్‌కు మోదీ.. అస్సాం బ్లాక్‌టీ, కశ్మీరీ కుంకుమ పువ్వు, చేతితో తయారుచేసిన వెండి గుర్రపు బొమ్మ, అలంకృత టీ సెట్, భగవద్గీత (రష్యా ఎడిషన్) వంటి బహుమతులను అందజేశారు. మరోవైపు.. మోదీ-పుతిన్ శిఖరాగ్ర భేటీపై ఇరు దేశాలు సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి.



యూట్యూబ్‌లో 'సాగు' నేర్చుకొని రూ.లక్షలు ఆర్జిస్తున్న ఇంజినీర్



ఝార్ఖండ్‌లోని చత్రా జిల్లా అంబాటాండ్ గ్రామ యువరైతు ఉదయ్‌కుమార్ ఇంజినీరు ఉద్యోగం మానేసిన తర్వాత వ్యవసాయంలో అద్భుతమైన విజయాలు సాధిస్తున్నారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చదివిన ఈయన పుణెలోని ఒక ప్రముఖ కంపెనీలో ఉద్యోగం చేసేవారు. అంతా సౌకర్యంగా ఉన్నా చేసేపని ఆర్నెల్లకే ఉద్యోగానికి గుడ్‌బై చెప్పేసి స్వగ్రామానికి తిరిగొచ్చేశారు. వ్యవసాయంపై ఆసక్తితో యూట్యూబ్ చూసి ఆధునిక సాగులో మెళకువలు నేర్చుకున్నారు. తన కుటుంబానికి చెందిన ఆయిదెకరాలు తోడుగా మరో 15 ఎకరాలు లీజుకు తీసుకొని మిరప, టమాటా, బఠానీ, క్యాబేజీ వంటి వాణిజ్య పంటలు సాగు చేశారు. నిపుణుల సూచనలతో ఆరంభ కష్టాలు అధిగమించి అనతికాలంలోనే లాభాలబాట పట్టారు. ఏడాది వ్యవధిలో 21 టన్నుల మిరపకాయల విక్రయంతోనే రూ.10 లక్షలు వచ్చాయి. ఉదయ్ ఉద్యోగం మానేసి తప్పు చేశాడని మొదట్లో అనుకున్నవాళ్లు, ఇప్పుడు అతడి నిర్ణయం సరైనదని అర్థమైందని తల్లి మీరాదేవి అన్నారు. ప్రభుత్వ పథకాలను తెలివిగా సద్వినియోగం చేసుకున్న ఉదయ్ విద్యావంతులైన యువత వ్యవసాయంలోకి వచ్చేందుకు స్ఫూర్తిగా మారారని జిల్లా వ్యవసాయ అధికారి గౌతమ్ కుమార్ తెలిపారు.

పాన్‌మసాలా తయారీ కేంద్రాలపై సెస్

● కొత్త బిల్లుకు లోక్‌సభ ఆమోదం



నిర్మలా సీతారామన్


దిల్లీ: పాన్‌మసాలా తయారీ యంత్రాలు, పరికరాలపై సెస్ విధింపునకు అనుమతించే బిల్లుకు శుక్రవారం లోక్‌సభ ఆమోదం తెలిపింది. దీనిద్వారా వసూలయ్యే నిధులను జాతీయ భద్రత బలోపేతానికి, ప్రజారోగ్యం కోసం ఖర్చు చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 'హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లు-2025'పై లోక్‌సభలో జరిగిన చర్చకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమాధానమిచ్చారు. అనంతరం మూజువాణి ఓటుతో సభ ఆమోదం తెలిపింది. 'పాన్‌మసాలాపై ఇప్పటికే 40శాతం జీఎస్టీ విధిస్తున్నారు. దీనికి సెస్ అదనం. తయారీ కేంద్రాల ఉత్పత్తి సామర్థ్యాన్ని బట్టి సెస్ చెల్లించాల్సి ఉంటుంది. ఇలా సమకూరే నిధులను అన్ని రాష్ట్రాలకూ పంపిణీ చేస్తామ'ని మంత్రి తెలిపారు.

45 ఏళ్లు పైబడిన మహిళలకు రైళ్లలో లోయర్ బెర్తులు: అశ్విని వైష్ణవ్

రైళ్లలో ప్రయాణించే వయోధికులు, 45 ఏళ్లకు పైబడిన మహిళలు టికెట్ రిజర్వు సమయంలో స్లీపర్ తరగతిలోని ఐచ్ఛికంలో ప్రస్తావించనప్పటికీ లోయర్ బెర్తులు కేటాయింపు ఆటోమేటిక్‌గా జరుగుతుందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ రాజ్యసభకు తెలిపారు. బెర్తుల అందుబాటును బట్టి ఈ కేటాయింపులు జరుగుతున్నాయన్నారు. ఏసీ సదుపాయం ఉన్న రైళ్లలో ప్రతి కంపార్ట్‌మెంట్‌లోనూ కొన్ని బెర్తులను వయోధికులు, గర్భిణులు, 45 ఏళ్లు పైబడిన మహిళలకు ప్రత్యేకంగా కేటాయించినట్లు లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు.

ఆలయాల సొమ్ము బ్యాంకుల మనుగడకు వాడొద్దు

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్య



దిల్లీ: ఆలయాల సొమ్మును ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న బ్యాంకులను ఆదుకోవడానికి ఉపయోగించరాదని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆలయాల సొమ్ము దేవుడికి చెందినది కాబట్టి.. దాన్ని ఆలయ ప్రయోజనాలకే వాడాలని సూచించింది. కేరళలోని తిరునెల్లి దేవస్థానం చేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్లను తిరిగి చెల్లించాలని కేరళ హైకోర్టు గతంలో ఆదేశించింది. దీనిని సవాలు చేస్తూ మనాంతవాడి కో-ఆపరేటివ్ అర్బన్ సొసైటీ లిమిటెడ్, తిరునెల్లి సర్వీస్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ సహా కొన్ని సహకార బ్యాంకులు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఈ పిటిషన్‌ను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌లతో కూడిన ధర్మాసనం విచారిస్తూ.. "మీరు ఆలయ డబ్బును ఉపయోగించి బ్యాంకును రక్షించాలనుకుంటున్నారా? కష్టాల్లో ఉన్న ఒక సహకార బ్యాంకులో డబ్బు ఉంచే బదులు, ఎక్కువ వడ్డీ ఇచ్చే జాతీయ బ్యాంకుకు ఆ నిధులను మార్చాలని ఆదేశించడంలో తప్పేముంది?" అని ప్రశ్నించింది. హైకోర్టు ఇచ్చిన ఆదేశాల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని బ్యాంకుల తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. ఆ వాదనలతో ధర్మాసనం ఏకీభవించలేదు. "మీరు ప్రజల్లో విశ్వసనీయత పెంచుకోవాలి. కస్టమర్లను, డిపాజిట్లను ఆకర్షించలేకపోతే అది మీ సమస్య' అని ఘాటుగా వ్యాఖ్యానించింది. దేవుడి డబ్బును తిరిగి చెల్లించడానికి సమయం పొడిగించాలని కోరుతూ మాత్రమే కో-ఆపరేటివ్ బ్యాంకులు హైకోర్టును ఆశ్రయించడానికి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. ఈ బ్యాంకుల పిటిషన్లను విచారించడానికి మాత్రం నిరాకరించింది. తిరునెల్లి దేవస్థానం ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసిన ఐదు సహకార బ్యాంకులు గడువు ముగిసినా, తిరిగి చెల్లించాలని పదేపదే అడిగినా.. డబ్బు ఇవ్వడానికి నిరాకరించాయి. దీంతో దేవస్థానం హైకోర్టును ఆశ్రయించింది.

'పది' ప్రమాణాల సీఎం నీతీశ్‌కు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తింపు



పట్నా: బిహార్ ముఖ్యమంత్రిగా ఇటీవల పదో విడత ప్రమాణం చేసిన నీతీశ్‌కుమార్ ఘనతకు శుక్రవారం లండన్‌కు చెందిన 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' గుర్తింపు లభించింది. జేడీయూ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సంజయ్ ఝా ఈ విషయాన్ని 'ఎక్స్' ద్వారా ప్రకటించారు. "నీతీశ్ అసాధారణమైన మైలురాయిని చేరుకోవడానికి లభించిన ఈ గుర్తింపు, అభినందన గర్వకారణం. దేశ ప్రజాస్వామ్య ప్రయాణంలో ఇది అరుదైన ప్రత్యేకత'' అని ఆయన పేర్కొన్నారు. 2000లో మొదటిసారిగా సీఎం పదవీ బాధ్యతలు చేపట్టిన నీతీశ్.. మెజారిటీ నిరూపించుకోలేక వారం రోజుల వ్యవధిలోనే వైదొలగాల్సి వచ్చింది. ఆ తర్వాత 2005లో మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసి, మధ్యలో స్వల్పకాలం (2014) మినహా ఇప్పటిదాకా ఆ పదవిలో కొనసాగుతున్నారు. తన రాజకీయ ప్రయాణంలో నీతీశ్ సందర్భానుసారం ఇటు మహాగఠ్‌బంధన్‌తో, అటు ఎన్డీయేతోనూ కలిసి నడిచారు.

13న హైదరాబాద్‌లో 'మెస్సీ మాయ'



ఈనాడు, హైదరాబాద్: 'ది గోట్ ఇండియా టూర్' ప్రస్తుతం ప్రపంచ క్రీడాభిమానుల్ని ఉర్రూతలూగిస్తున్న ట్యాగ్‌లైన్ ఇది. హైదరాబాద్ నగరంలో 13వ తేదీన ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ ఆటను ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఫుట్‌బాల్ అభిమానులు సహా సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులు సైతం అమితాసక్తి కనబరుస్తున్నారు. ఈ నెల 12వ తేదీ రాత్రికి మెస్సీ కోల్‌కతాకు చేరుకుంటాడు. 13వ తేదీ మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో 'ది గోట్' హైదరాబాద్‌కు చేరుకుంటాడు. ఆ రోజు రాత్రి 7 నుంచి 9 వరకు ఉప్పల్ స్టేడియంలో 'మెస్సీ మాయ' అలరించనుంది. తొలుత సెలబ్రిటీలతో ఎగ్జిబిషన్ మ్యాచ్ నిర్వహిస్తారు. ఒక జట్టుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మరో జట్టుకు మెస్సీ సారథ్యం వహిస్తారు. అనంతరం యువ ప్రతిభావంతులతో మెస్సీ మాస్టర్ క్లాస్ కార్యక్రమం ఉంటుంది. ఆ తర్వాత పెనాల్టీ షూటౌట్ నిర్వహిస్తారు. చివర్లో మ్యూజికల్ కాన్సర్ట్ జరుగుతుంది. ఆరోజు రాత్రి మెస్సీ నగరంలోనే బస చేసి మర్నాడు ఉదయం ప్రత్యేక విమానంలో ముంబయికి బయల్దేరతాడు.

సీఐడీ, ఏసీబీ నివేదికలను సీజే బెంచ్ ముందుంచండి

- పరకామణిలో చోరీ కేసులో రిజిస్ట్రార్‌కు హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశం
- సీల్డ్ కవర్లో నివేదికలను రిజిస్ట్రార్‌కు అందజేయండి
- సీఐడీ, ఏసీబీలకు ఆదేశం.. విచారణ వాయిదా

ఈనాడు, అమరావతి: పరకామణిలో చోరీ కేసు రాజీ వ్యవహారంపై హైకోర్టులో కీలక పరిణామం చోటు చేసుకుంది. సీఐడీ, ఏసీబీ డీజీలు ఇచ్చిన సీల్డ్ కవర్ నివేదికలను లోక్ అదాలత్ ఉత్తర్వుల చట్టబద్ధతను తేల్చేందుకు విచారణ జరుపుతున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందన్ రావులతో కూడిన ధర్మాసనం ముందు ఉంచాలని రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)ను హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశించారు. ధర్మాసనం ముందు ఉంచే నిమిత్తం సీల్డ్ కవర్లో రెండు సెట్ల నివేదికలను సోమవారానికల్లా రిజిస్ట్రార్‌కు అందజేయాలని సీఐడీ డీజీ, ఏసీబీ డీజీలకు ఆదేశాలు జారీ చేశారు. ఆ నివేదికలను తనకివ్వాలని నిందితుడు రవికుమార్ తరఫు సీనియర్ న్యాయవాది సి.నాగేశ్వరరావు గత విచారణలో అభ్యర్థించారన్న న్యాయమూర్తి.. అవి కేవలం కోర్టు పరిశీలనకేనని స్పష్టం చేశారు. ఈ దశలో ఆ నివేదికల్లో ఏముందో పరిశీలించే అధికారం నిందితుడికి లేదని తేల్చిచెప్పారు. సీఆర్‌పీసీ సెక్షన్ 173 ప్రకారం నిందితుడికి తుది నివేదికను మాత్రమే పొందే హక్కు ఉందన్నారు. విచారణను 9వ తేదీకి వాయిదా వేశారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

వైకాపా ప్రభుత్వ హయాంలో తితిదే పరకామణిలో జరిగిన చోరీపై కేసు పెట్టిన ఫిర్యాదుదారు వై.సతీష్‌కుమార్, నిందితుడు సీవీ రవికుమార్ లోక్‌అదాలత్‌లో రాజీ చేసుకున్న వ్యవహారంపై సీఐడీ దర్యాప్తు చేయించాలంటూ పాత్రికేయుడు ఎం.శ్రీనివాసులు వేసిన వ్యాజ్యంపై అక్టోబర్ 27న హైకోర్టు విచారణ జరిపింది. తితిదే బోర్డు, అధికారులు, దర్యాప్తు అధికారి, ఫిర్యాదుదారు సతీష్ కుమార్ పాత్రపై దర్యాప్తు చేయాలని సీఐడీ డీజీని.. నిందితుడు రవికుమార్, ఆయన కుటుంబసభ్యులు కూడబెట్టిన స్థిర, చరాస్తులు, వాటి క్రయవిక్రయాలపై దర్యాప్తు చేయాలని ఏసీబీ డీజీని ఆదేశించింది. వారు దర్యాప్తు జరిపి నివేదికలను సీల్డ్ కవర్లలో కోర్టుకు అందజేశారు. శుక్రవారం ఈ వ్యాజ్యం విచారణకు రాగా.. ఆ నివేదికలను సీజే బెంచ్ ముందుంచాలని సింగిల్ జడ్జి ఆదేశించారు. వాటిని పరిశీలించేందుకు విచారణను ఈ నెల 9కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతి తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు తమ ఇంప్లీడ్ పిటిషన్ను అనుమతించాలని కోరగా పరిశీలిస్తామని న్యాయమూర్తి చెప్పారు.

నకిలీ మద్యం తయారీకి జోగి అండ

- ఆయన సహకారంతోనే అద్దేపల్లి సోదరుల దందా
- 8 మంది నిందితులపై ప్రాథమిక అభియోగపత్రం దాఖలు

ఈనాడు, అమరావతి: వైకాపా నేత జోగి రమేష్ ప్రోద్బలంతోనే అద్దేపల్లి జనార్దన్‌రావు నకిలీ మద్యం తయారీకి పూనుకున్నట్లు, మంత్రిగా ఉన్నప్పుడే జోగి సోదరులకు లంచాలు అందించేవారని ఛార్జిషీట్‌లో ఎక్సైజ్ పోలీసులు పేర్కొన్నారు. నకిలీ మద్యం కేసులో శుక్రవారం విజయవాడలోని ఎక్సైజ్ కోర్టులో ప్రాథమిక అభియోగపత్రం దాఖలు చేశారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో బయటపడిన నకిలీ మద్యం వ్యవహారంపై విజయవాడ భవానీపురం ఎక్సైజ్ స్టేషన్‌లో అక్టోబరు 6న కేసు నమోదుచేశారు. ఇప్పటికి 60 రోజులు కావడంతో 8మంది నిందితులపై ఛార్జిషీట్ దాఖలుచేశారు. అరెస్టుచేసిన 60 రోజుల్లోగా ఛార్జిషీట్ వేయకపోతే నిందితులకు డిఫాల్ట్ బెయిల్ వచ్చే అవకాశం ఉంది. జోగి రమేష్ మంత్రిగా ఉండగా ఆయన అండతోనే ప్రధాన నిందితుడైన అద్దేపల్లి జనార్దన్‌రావు ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం దందా మొదలుపెట్టినట్లు, కూటమి ప్రభుత్వంలో ఊరూరా నకిలీ మద్యం తయారవుతోందని దుష్ప్రచారం చేయడమే లక్ష్యంగా ఆయనతో ములకలచెరువులో జోగి రమేష్ నకిలీ మద్యం తయారీ కేంద్రం ఏర్పాటుచేయించారని ఛార్జిషీట్‌లో ప్రస్తావించినట్లు తెలిసింది. అద్దేపల్లి జనార్దన్‌రావు, ఆయన సోదరుడు జగన్మోహన్‌రావులు జోగి రమేష్, జోగి రాము (ఏ-19)లకు రెండు, మూడు నెలలకోసారి రూ.3-5 లక్షలు ముట్టజెప్పేవారని ఇందులో పేర్కొన్నట్లు సమాచారం.

అద్దేపల్లికి జోగి ప్రోద్బలం

2022 జూన్‌లో జనార్దన్‌రావు తన బ్యాంకు ఖాతా నుంచి రూ.8లక్షలు విత్‌డ్రా చేసి అందులో రూ.4లక్షలు, మరో సందర్భంలో రూ.9లక్షలు విత్‌డ్రా చేసి అందులో రూ.5లక్షలను ఫెర్రీఘాట్ వద్ద జోగి రాముకు ముట్టజెప్పినట్లు ఛార్జిషీట్‌లో ప్రస్తావించారు. బాల్యం నుంచే రమేష్, జనార్దన్‌రావు మధ్య సన్నిహిత సంబంధాలున్నాయి. జోగి రమేష్, రాము 2006-19 మధ్య స్వర్ణ బార్‌లో భాగస్వాములు. 2019లో దానిపేరు చెర్రీస్ బార్‌గా మార్చారు. వీరి సహకారంతోనే జనార్దన్‌రావు 2013లో బాలాజీ బార్‌ను గుడ్‌విల్ ఇచ్చి కొన్నారు. తర్వాత దాని పేరును ఏఎన్ఆర్ రెస్టారెంట్ అండ్ బార్‌గా మార్చాడు. 2017లో ఇబ్రహీంపట్నం బార్ యజమానులంతా సిండికేట్‌గా ఏర్పడ్డారు. అందులో జోగి రమేష్, రాములు కీలకంగా వ్యవహరించారని దర్యాప్తులో తేలింది.

దాఖలు చేసింది వీరిపైనే..

ఛార్జిషీట్‌లో జనార్దన్‌రావు (ఏ1), జగన్మోహన్‌రావు (ఏ2), ఎన్.రవి (ఏ4), బాదల్ దాస్ (ఏ7), ప్రదీప్ దాస్ (ఏ8), శ్రీనివాసరెడ్డి (ఏ11), కల్యాణ్ (ఏ12), తిరుమలశెట్టి శ్రీనివాసరావు (ఏ13)ల పాత్ర గురించి ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు. లేబుళ్ల డిజైన్, ముద్రణ చేయించడంలో రవి, తిరుమలశెట్టి శ్రీనివాసరావులు కీలకపాత్ర పోషించారు. సీసాలను పెట్ బాటిల్స్ యజమాని శ్రీనివాసరెడ్డి సరఫరా చేశారు. ఇబ్రహీంపట్నంలో తయారైన మద్యాన్ని విజయవాడలోని శ్రీనివాస వైన్స్‌లో కల్యాణ్ అమ్మేవారు. ఇలా పెద్దఎత్తున విక్రయించినట్లు దర్యాప్తులో తేలింది.

హైకోర్టు న్యాయసేవల కమిటీ ఛైర్మన్‌గా జస్టిస్ రవినాథ్



ఈనాడు, అమరావతి: హైకోర్టు న్యాయసేవల కమిటీ ఛైర్మన్‌గా న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి నియమితులయ్యారు. హైకోర్టు సీజే, ఏపీ న్యాయసేవాధికార సంస్థ పాట్రన్ ఇన్ చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ నియామకానికి సంబంధించి ప్రభుత్వం గెజిట్ ప్రచురించింది.

మద్యం నిందితులకు 19 వరకు రిమాండ్ పొడిగింపు

ఉత్తర్వులిచ్చిన విజయవాడ ఏసీబీ కోర్టు

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో నిందితులకు విజయవాడలోని ఏసీబీ కోర్టు రిమాండ్ పొడిగించింది. శుక్రవారంతో రిమాండ్ గడువు ముగుస్తుండడంతో విజయవాడ, గుంటూరు కారాగారాల్లో ఉన్న నిందితులను పోలీసులు ఎస్కార్ట్ మధ్య కోర్టుకు తీసుకొచ్చి.. న్యాయాధికారి భాస్కరరావు ఎదుట హాజరుపరిచారు. వీరికి రిమాండ్ పొడిగించాలని ప్రాసిక్యూషన్ తరఫు న్యాయవాది కోరారు. ఈనెల 19 వరకు పొడిగిస్తూ జడ్జి ఉత్తర్వులిచ్చారు. అనంతరం వీరిని కారాగారాలకు తరలించారు. బెయిల్‌పైనున్న ఎంపీ మిథున్‌రెడ్డి, పైలా దిలీప్ కోర్టుకు రాలేదు. వారి తరఫున న్యాయవాదులు గైర్హాజరు పిటిషన్ దాఖలు చేశారు. ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్పలు హాజరయ్యారు.

✦ ఇదే కేసులో మనీ రూటింగ్‌లో కీలకంగా వ్యవహరించాడన్న ఆరోపణలతో అరెస్టైన రోణక్ కుమార్‌కు ఇంటి నుంచి భోజనం, దోమతెర అనుమతించాలని అతని తరఫు న్యాయవాది కోర్టును కోరారు. 'నిందితుడు జైన ఆచారాల ప్రకారం ఉల్లి ఉన్న ఆహార పదార్థాలు తీసుకోరు. సాయంత్రం 5 గంటల తర్వాత భోజనం చేయరు. కానీ, జైలులో ఆ తర్వాతే భోజనం పెడుతున్నారు. దోమల్లో తినడంతో ఇబ్బందులు పడుతున్నాడ'ని వివరించారు. దీనిపై పిటిషన్ దాఖలు చేసుకోవాలని న్యాయాధికారి సూచించారు. జైలులో అదనపు వసతులు కల్పించాలంటూ రోణక్ వేసిన పిటిషన్‌పై విచారణను కోర్టు సోమవారానికి వాయిదా వేసింది.

ఫొటోలు, వీడియోలపై ధనుంజయరెడ్డి ఫిర్యాదు


'ఈ కేసులో బెయిల్‌పై ఉన్నాం. వివిధ పనులపై బయటకు వెళ్తుంటాం. ప్రయాణాల నిమిత్తం ఎయిర్‌పోర్టుకు వెళ్లినప్పుడు సహనిందితులు కనిపిస్తే పలకరించుకుంటాం. ఇటీవల విమానాశ్రయంలో ముగ్గురం కలిశాం. ఒకే విమానంలో కలిసి ప్రయాణించాం. ఇలా కలిసినప్పుడు పోలీసులు ఫొటోలు, వీడియోలు తీశారు. వాటిని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారు. బెయిల్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని ప్రచారం చేస్తున్నారు. ఆయా ప్రదేశాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలు సేకరిస్తున్నార'ని ధనుంజయరెడ్డి కోర్టులో న్యాయాధికారి దృష్టికి తీసుకొచ్చారు.

వైకాపా నేత చెవిరెడ్డి సహా నలుగురి బెయిల్ పిటిషన్ల డిస్మిస్

మద్యం కేసులో నిందితులైన వైకాపా నాయకులకు న్యాయస్థానంలో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. బెయిల్ పిటిషన్లను కోర్టు తిరస్కరించింది. వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వెంకటేష్ నాయుడు, బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణలు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను విజయవాడ ఏసీబీ కోర్టు తోసిపుచ్చింది. ఈ మేరకు న్యాయాధికారి భాస్కరరావు శుక్రవారం సాయంత్రం తీర్పు వెలువరించారు. నిందితుల పాత్రపై లోతుగా దర్యాప్తు జరుగుతోందని, ఆధారాలు సేకరించాల్సి ఉందని.. ఈ దశలో బెయిల్ ఇస్తే కేసుపై ప్రభావం పడుతుందని ప్రాసిక్యూషన్ జేడీ రాజేంద్రప్రసాద్ వాదించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయాధికారి నిందితుల బెయిల్ పిటిషన్లను డిస్మిస్ చేశారు.

✦ తమను గుంటూరు జైలు నుంచి విజయవాడకు మార్చాలని నిందితులు బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణ పెట్టుకున్న పిటిషన్లను కోర్టు తోసిపుచ్చింది.

గొంతులో ఖర్జూరం ఇరుక్కొని ఊపిరాడక మృతి



గంగాధర్

పెనుకొండ, న్యూస్‌టుడే: గొంతులో ఖర్జూరం ఇరుక్కొని ఊపిరాడక ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలోని తోటగేరిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గంగాధర్ (42) ఇంట్లో ఖర్జూరాలు తింటుండగా ఒకటి పొరపాటున గొంతులోకి వెళ్లింది. అది అడ్డుపడి ఊపిరి ఆడలేదు. కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం అర్ధరాత్రి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మంత్రి సవిత బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

కడప మేయర్ ఎన్నిక నోటిఫికేషన్‌పై హైకోర్టులో వ్యాజ్యం

విచారణ ఈ నెల 9కి వాయిదా

ఈనాడు, అమరావతి: కడప మేయర్ ఎన్నిక కోసం జారీ చేసిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ కె.సురేశ్‌బాబు శుక్రవారం హైకోర్టులో అత్యవసరంగా వ్యాజ్యం వేశారు. మేయర్‌గా తనను తొలగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులపై హైకోర్టులో పిటిషన్ పెండింగ్‌లో ఉండగా, నోటిఫికేషన్ జారీ చేయడం చట్ట విరుద్ధమన్నారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం తదితరులకు నోటీసులు జారీ చేశారు. అనంతరం కౌంటర్ వేయాలంటూ విచారణను ఈ నెల 9కి వాయిదా వేశారు.


రూ.281.89 కోట్ల ఆర్థిక సంఘం నిధుల విడుదల

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పది లక్షల కంటే ఎక్కువ జనాభా కలిగిన నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలకు రూ.281.89 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. 2024-25 సంవత్సరానికి సంబంధించి రెండో విడత కింద వీటిని కేటాయించారు. ఈ మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పురపాలక శాఖ కమిషనర్‌ను ఆదేశిస్తూ ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పట్టా వచ్చిన సంతోషం.. క్యూఆర్ కోడ్‌లో సందేశం

పట్టణాలు, నగరాల పరిధిలో సొంత స్థలం ఉండి సర్కారు సాయంతో ఇల్లు కట్టుకునే లబ్ధిదారులకు ప్రభుత్వం క్యూఆర్ కోడ్‌తో కూడిన ధ్రువపత్రాలు అందిస్తోంది. లబ్ధిదారుల నుంచి మధ్యవర్తులు డబ్బు వసూలు చేయకుండా, ఇతరుల పేరుతో అనర్హులు రాయితీ పొందకుండా వీటిని రూపొందించింది. వీటిపై నున్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగా.. లబ్ధిదారు పేరు, గృహనిర్మాణ సంస్థ కేటాయించిన ఐడీ వివరాలు ప్రత్యక్షమవుతున్నాయి. శుక్రవారం చిత్తూరు నగరంలో 650 మందికి గృహనిర్మాణ పత్రాలు అందించారు. అందులో గిరింపేటకు చెందిన గుండ్లూరు మంజుల తనకు ఇచ్చిన పత్రంపై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగా.. ఫోన్ స్క్రీన్‌పై ప్రత్యక్షమైన సమాచారంతో ఆనందం వ్యక్తం చేశారు. దీనివల్ల మోసాలకు తావుండదని అక్కడికి వచ్చిన మహిళలు చెప్పారు.

– ఈనాడు, చిత్తూరు



క్యూఆర్ కోడ్‌తో కూడిన ఇంటి పట్టాలు





పట్టాపై కోడ్‌ను స్కాన్ చేస్తూ.. ★ లబ్ధిదారు సెల్‌ఫోన్‌కు వచ్చిన మెసేజ్‌లో ఐడీ నంబరు, ఇతర వివరాలు

ఛాంపియన్



కోహ్లి

రోహిత్

మధ్యాహ్నం 1.30 నుంచి

టెస్టు సిరీస్‌లో దక్షిణాఫ్రికా చేతిలో వైట్‌వాష్ పరాభవం తర్వాత.. వన్డే సిరీస్‌ను టీమ్‌ఇండియా విజయంతో ఆరంభించడంతో అభిమానుల్లో ఎంతో సంతోషం! విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ రాణించడంతో రెట్టించిన ఉత్సాహం! రెండో వన్డేలోనూ విరాట్ శతకం సాధించడంతో సిరీస్ మనదే అన్న ధీమా. కానీ 358 పరుగులు చేసి కూడా బౌలర్ల వైఫల్యంతో భారత్ ఓటమి పాలవడం పెద్ద షాక్. ఇప్పుడిక సిరీస్ ఫలితాన్ని తేల్చే పోరుకు రంగం సిద్ధమైంది. ఈ రసవత్తర సమరానికి విశాఖపట్నం వేదిక. మరి భారత క్రికెట్ అభిమానులకు ఎన్నో మధురానుభూతులను మిగిల్చిన వేదికలో టీమ్‌ఇండియా మరోసారి సత్తా చాటుతుందా? సిరీస్ విజయాన్ని అందుకుంటుందా?

చిక్కేనా.. చేజారేనా?

సిరీస్ నిర్ణయాత్మక పోరు నేడే ● విశాఖలో దక్షిణాఫ్రికాతో భారత్ ఢీ

ఈనాడు, విశాఖపట్నం

టెస్టుల్లో దక్షిణాఫ్రికాకు తలవంచిన టీమ్‌ఇండియా.. వన్డే సిరీస్‌ను సాధించి తీరాలనే పట్టుదలతో నిర్ణయాత్మక పోరుకు సిద్ధమైంది. మూడు వన్డేల సిరీస్‌లో భారత్, దక్షిణాఫ్రికా.. విశాఖలో శనివారం సిరీస్ ఫలితాన్ని తేల్చే మూడో వన్డేలో తలపడబోతున్నాయి. తొలి రెండు మ్యాచ్‌లు సాగిన తీరు చూశాక.. ఈ పోరు కూడా హోరాహోరీగా సాగడం ఖాయం అనిపిస్తోంది. బ్యాటింగ్‌లో భారత్ దూసుకెళ్తున్నప్పటికీ.. పేలవ బౌలింగ్ జట్టును ఇబ్బంది పెడుతోంది. అయితే మంచి రికార్డున్న విశాఖలో జట్టు సమిష్టిగా రాణించి సిరీస్ సాధిస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.

కట్టడి చేస్తేనే: విరాట్ వరుసగా రెండు సెంచరీలు చేశాడు.. రుతురాజ్ వన్డేల్లో తొలి శతకాన్ని బాదాడు.. కేఎల్ రాహుల్ రెండు మెరుపు అర్ధ శతకాలు బాదాడు. రోహిత్ ఓ అర్ధ సెంచరీ సాధించాడు. మొత్తంగా భారత బ్యాటింగ్ మంచి ఊపులోనే ఉంది. ప్రధాన బ్యాటర్లలో యశస్వి జైస్వాల్ ఒక్కడే పెద్ద ఇన్నింగ్స్ బాకీ ఉన్నాడు. రోహిత్‌తో కలిసి అతను జట్టుకు బలమైన పునాది వేయాల్సి ఉంది. తనకు కలిసొచ్చే మైదానంలో విరాట్ మరోసారి చెలరేగుతాడేమో చూడాలి. బ్యాటింగ్ విషయంలో భారత్ ధీమాగా ఉంది కానీ.. బౌలింగ్ ఆందోళన కలిగిస్తోంది. పేసర్లు, స్పిన్నర్లు అని తేడా లేకుండా అందరూ ధారాళంగా పరుగులిచ్చేస్తున్నారు. ముఖ్యంగా పేసర్ల ప్రదర్శన ఆశాజనకంగా లేదు. మరి అర్ష్‌దీప్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్‌తో కూడిన పేస్ త్రయం ఈ మ్యాచ్‌లో అయినా కట్టుదిట్టంగా బంతులేస్తుందేమో చూడాలి. స్పిన్‌కు సహకరించే విశాఖ పిచ్‌ను కుల్‌దీప్, జడేజా, సుందర్ త్రయం ఏమేరకు ఉపయోగించుకుంటుందన్నది ఆసక్తికరం. లోతైన బ్యాటింగ్ లైనప్ ఉన్న దక్షిణాఫ్రికాను బౌలర్లు కట్టడి చేయగలిగితేనే భారత్‌కు విజయం దక్కుతుంది.

నితీశ్‌కు ఛాన్సుందా?: గత ఏడాది సూపర్ ఫామ్‌తో మూడు ఫార్మాట్లలోనూ భారత జట్టులో కీలక ఆటగాడిగా ఎదుగుతున్నట్లు కనిపించిన తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి. ఇటీవల పేలవ ఫామ్‌తో జట్టులో తన స్థానాన్ని ప్రశ్నార్థకం చేసుకున్నాడు. దక్షిణాఫ్రికాతో రెండో టెస్టులో అవకాశాన్ని ఉపయోగించుకోలేకపోవడంతో నితీశ్‌కు.. తొలి రెండు వన్డేల్లో తుది జట్టులో చోటు దక్కలేదు. అయితే ఈ మ్యాచ్‌ల్లో స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ పేలవ ప్రదర్శన చేయడంతో అతణ్ని తప్పించి నితీశ్‌ను ఆడించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. నితీశ్ ఆంధ్రప్రదేశ్ కుర్రాడే కాబట్టి విశాఖ స్టేడియంలో పరిస్థితులపై అతడికి బాగా అవగాహన ఉంటుంది. కాబట్టి ఇక్కడ అతణ్ని ఆడించడం జట్టుకు ఉపకరించవచ్చు. మరి జట్టు యాజమాన్యం అతడికి ఛాన్సిస్తుందేమో చూడాలి.

ఉత్సాహంతో దక్షిణాఫ్రికా: తొలి వన్డేలో పోరాడి ఓడాక, ఆ స్ఫూర్తితో రెండో వన్డేలో విజయం సాధించిన దక్షిణాఫ్రికా.. ఎంతో ఉత్సాహంగా చివరి వన్డేకు సిద్ధమైంది. టెస్టు సిరీస్ విజయం తర్వాత వన్డేల్లోనూ భారత్‌పై పైచేయి సాధించి ఈ పర్యటనను చిరస్మరణీయం చేసుకోవాలని సఫారీ జట్టు చూస్తోంది. బ్యాటింగ్‌లో మార్‌క్రమ్ జోరందుకోవడం.. బ్రీట్జ్కే, బ్రెవిస్‌లతో పాటు ఆల్‌రౌండర్లు బోష్, యాన్సెన్ బ్యాటుతో సత్తా చాటుతుండటం ఆ జట్టుకు సానుకూలాంశం. కెప్టెన్ బవుమా కూడా ఊపుమీదున్నాడు. డికాక్ వైఫల్యమే జట్టును ఇబ్బంది పెడుతోంది. భారత్‌లాగే దక్షిణాఫ్రికాకూ బౌలింగ్‌లో సమస్యలున్నాయి. పేసర్లు, స్పిన్నర్లు అని తేడా లేకుండా అందరూ ధారాళంగా పరుగులిచ్చేస్తున్నారు. గత మ్యాచ్‌లో గాయపడ్డ బర్గర్ ఆడలేకపోతే బార్ట్‌మన్‌కు తుది జట్టులో చోటు దక్కుతుంది. పేసర్లు ఎంగిడి, యాన్సెన్‌లపై ఆ జట్టు ఎక్కువ ఆశలు పెట్టుకుంది. స్పిన్‌కు సహకరించే విశాఖలో కేశవ్ మహరాజ్ ప్రభావం చూపుతాడని దక్షిణాఫ్రికా ఆశిస్తోంది.

తుది జట్లు (అంచనా): భారత్: రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లి, రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్ (కెప్టెన్), వాషింగ్టన్ సుందర్/నితీశ్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, హర్షిత్ రాణా, కుల్‌దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ. **దక్షిణాఫ్రికా:** ఐడెన్ మార్‌క్రమ్, క్వింటన్ డికాక్, టెంబా బవుమా (కెప్టెన్), ర్యాన్ రికిల్‌టన్, మాథ్యూ బ్రీట్జ్కే, డివాల్డ్ బ్రెవిస్, మార్కో యాన్సెన్, కార్బిన్ బోష్, కేశవ్ మహరాజ్, లుంగి ఎంగిడి, బార్ట్‌మన్.

వైజాగ్.. అతడి అడ్డా

విరాట్ కోహ్లీకి దేశంలో అత్యంత కలిసొచ్చిన స్టేడియం విశాఖే కావడం విశేషం. ఇక్కడ 7 వన్డేలు ఆడిన అతను.. 97.83 సగటుతో 587 పరుగులు చేశాడు. వైజాగ్‌లో అతడు మూడు సెంచరీలు, రెండు అర్ధశతకాలు సాధించాడు. ఇక్కడ ఆడిన తొలి రెండు వన్డేల్లో అతను శతకాలు సాధించడం విశేషం. ప్రస్తుత సిరీస్‌లో వరుసగా రెండు శతకాలు సాధించిన విరాట్.. తనకు బాగా కలిసొచ్చిన మైదానంలోనూ సెంచరీ కొట్టాలని అభిమానులు కోరుకుంటున్నారు.

బ్యాటింగ్ పిచ్: సిరీస్ తొలి రెండు మ్యాచ్‌ల్లో పరుగుల వరద పారింది. పిచ్‌లు బ్యాటింగ్‌కు పూర్తి అనుకూలంగా కనిపించాయి. మూడో వన్డేకూ పరిస్థితి భిన్నంగా ఏమీ ఉండబోవట్లేదు. విశాఖ పిచ్ కూడా బ్యాటర్లదే. ఇక్కడ జరిగిన పది వన్డేల్లో రెండు సార్లు 350కి పైగా స్కోర్లు నమోదయ్యాయి. అయితే చివరగా 2023లో విశాఖలో ఆస్ట్రేలియాతో ఆడిన వన్డేలో భారత్ 117 పరుగులకే కుప్పకూలింది. మిగతా మ్యాచ్‌ల్లో పిచ్ బ్యాటింగ్‌కు బాగా సహకరించింది. శనివారం కూడా వికెట్ అదే తరహాలో ఉంటుందని అంచనా. ఇక్కడ స్పిన్నర్లు బాగా ప్రభావం చూపిస్తారు. మంచు ప్రభావం దృష్ట్యా టాస్ గెలిచిన జట్టు ఛేదనకే మొగ్గు చూపే అవకాశముంది.

10 విశాఖపట్నంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో భారత్ ఆడిన వన్డేలు. 7 మ్యాచ్‌ల్లో గెలిచిన టీమ్‌ఇండియా.. 2 ఓటములు చవిచూసింది. ఒక మ్యాచ్ టై అయింది.

ఈ బౌలింగ్ ఇలా ఉంటే..

ఫోర్త్ అంపైర్

స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి కెరీర్‌లో 52వ వన్డే సెంచరీ బాదేశాడు. ఆ తర్వాతి మ్యాచ్‌లోనే 53వ శతకాన్నీ ఖాతాలో వేసుకున్నాడు. భారత అభిమానులంతా ఆనందోత్సాహాలతో ఉర్రూతలూగిపోయారు. కానీ ఆ మధురానుభూతుల మాటునే ఓ చేదు గుళిక.. భారత బౌలింగ్. మన బౌలర్లు తేలిపోవడంతో తొలి వన్డేలో 350 లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా దాదాపుగా ఛేదించినంత పనిచేసింది! రెండో పోరులో భారత్ సాధించిన 358 స్కోరు కంటే నాలుగు పరుగులు ఎక్కువే బాదేసింది. కోహ్లి అద్భుత శతకాలను ఆస్వాదించేలోపే బౌలర్ల పేలవ ప్రదర్శన భారత అభిమానుల్ని ఆందోళనకు గురిచేసిందనడంలో సందేహం లేదు.



ప్రసిద్ధ్ కృష్ణ



హర్షిత్ రాణా



జడేజా



కుల్‌దీప్ యాదవ్



వాషింగ్టన్ సుందర్

మాథ్యూ బ్రీట్జ్కే.. మార్కో యాన్సెన్.. కార్బిన్ బోష్.. టోనీ జోర్జి.. ప్రపంచ క్రికెట్లో పెద్దగా పేరు లేని బ్యాటర్లు. బౌలర్‌గా యాన్సెన్ సుపరిచితుడే అయినా పూర్తిస్థాయి బ్యాటర్ మాత్రం కాదు. కానీ రెండు వన్డేల్లో అతడు, అతడి సహచర బ్యాటర్లు భారత బౌలింగ్ డొల్లతనాన్ని ఎత్తిచూపారన్నది సుస్పష్టం. మన పేసర్లు, స్పిన్నర్లపై వాళ్లు అలవోకగా ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. వచ్చే ఏడాది సొంతగడ్డపై టీ20 ప్రపంచ కప్‌ను నిలబెట్టుకోవాలని భావిస్తున్న భారత్‌కు ఇది ఊహించని పరిణామమే. స్వదేశంలో 0-2తో టెస్టు సిరీస్ కోల్పోవడమే అతిపెద్ద వైఫల్యమనుకుంటే.. 350 పైచిలుకు లక్ష్యాన్ని కూడా కాపాడుకోలేకపోవడం మరింత ఘోరం. తిలా పాపం తలా పిడికెడు అన్నట్లు.. ఈ వైఫల్యంలో ప్రతి ఒక్క బౌలరూ భాగమే. పనిభార నిర్వహణలో భాగంగా జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్‌లకు విశ్రాంతినిచ్చిన సంగతి తెలిసిందే.

గాయాలు, ఫిట్‌నెస్ సమస్యలతో ఇబ్బంది పడుతున్న 32 ఏళ్ల బుమ్రాను 2026లో పొట్టి కప్పు కోసం జాగ్రత్తగా కాపాడుతున్నారు. దాదాపు అంతే వయసున్న సిరాజ్‌కూ ఫిట్‌నెస్ సమస్యలు లేకపోలేదు. అందుకే వీరిద్దరిని ఎంపిక చేసిన టోర్నీల్లోనే ఆడిస్తున్నారు. అయితే ఇవాళ కాకపోయినా రేపైనా ఒకటో రెండో ఫార్మాట్ల నుంచి బుమ్రా, సిరాజ్‌లు రిటైరవక తప్పదు! మరి ప్రత్యామ్నాయాలేంటి? ప్రస్తుతానికైతే పరిస్థితి ఆశాజనకంగా కనిపించట్లేదు.

బుమ్రా, సిరాజ్‌ల స్థానంలో జట్టులోకొచ్చిన అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణలు వారిద్దరి లోటును భర్తీ చేశారా అన్న ప్రశ్నకు సానుకూల సమాధానం రాదు. తొలి వన్డేలో ప్రభావం చూపిన హర్షిత్ రాణా.. రెండో పోరులో తేలిపోయాడు. పేస్ విభాగం ఇంత బలహీనంగా మారుతుంటే సెలక్టర్లు ఏం చేస్తున్నారో అర్థం కావట్లేదు. తిరిగి ఫిట్‌నెస్ సాధించినా, దేశవాళీలో రాణిస్తున్నా.. వయసు ఎక్కువైందన్న ఉద్దేశంతో భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకుని సీనియర్ ఫాస్ట్‌బౌలర్ షమిని పక్కన పెట్టారు. కానీ సరైన ప్రత్యామ్నాయాలను కనిపెట్టడంలో అగర్కార్ బృందం వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. టీమ్‌ఇండియా స్పిన్ విభాగానిదీ అదే దయనీయ స్థితి. రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్‌ల గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. 37 ఏళ్ల జడేజా కెరీర్ చరమాంకంలో ఉన్నాడన్నది నిర్వివాదం. అతని బౌలింగ్‌లో మునుపటి పదును లేదన్నదీ నిజం. గత కొంతకాలంగా అతడు బంతితో కంటే బ్యాటుతోనే ఎక్కువ రాణిస్తున్నాడు. మరో నాణ్యమైన స్పిన్ ఆల్‌రౌండర్ లేకపోవడంతో అతడు బంతితో పెద్దగా రాణించట్లేదన్న విషయాన్ని ఎవరూ పెద్దగా గుర్తించలేదు. భారత్ గెలుస్తున్నంత వరకు ఎవరూ అతడి బౌలింగ్ గురించి పట్టించుకోలేదు.. ఆ అవసరం కూడా రాలేదు. కానీ దక్షిణాఫ్రికా అనామక బ్యాటర్ల ప్రదర్శన నేపథ్యంలో జడేజా బౌలింగ్ ప్రదర్శన సూక్ష్మదర్శిని కిందకి వచ్చేసింది. రెండు వన్డేల్లో జడేజా తీసిన వికెట్లు అక్షరాలా సున్నా. అలాంటప్పుడు ప్రధాన స్పిన్నర్‌గా అతను తుది జట్టులో ఉండేందుకు అర్హుడేనా అన్నది అతిపెద్ద ప్రశ్న! ఇక రెండు మ్యాచ్‌ల్లో కలిపి 7 ఓవర్లే వేసిన సుందర్‌ను ఏ కోటాలో జట్టులోకి తీసుకున్నారన్నది ఎవరూ చెప్పలేరు. స్పిన్ ఆల్‌రౌండర్‌గా జట్టులోకి వచ్చిన సుందర్‌ను జట్టు మేనేజ్‌మెంట్ పూర్తిస్థాయి బ్యాటర్‌గా మార్చేసినట్లుంది! తొలి మ్యాచ్‌లో 4 వికెట్లు తీసిన కుల్‌దీప్ యాదవ్.. రెండో వన్డేలో భారీగా పరుగులు సమర్పించుకున్నాడు. సాధారణంగా జట్టుకు ఒక్క నాణ్యమైన పేసరే అందుబాటులో ఉంటే.. స్పిన్నర్లు భారత్ భారాన్ని మోసేవాళ్లు. కానీ ఇప్పుడు ఇటు పేస్‌లోనూ.. అటు స్పిన్‌లోనూ ప్రమాణాలు చూస్తుంటే భవిష్యత్తుపై ఆందోళన కలుగుతోంది. ఈ బౌలర్లలో నిలకడలేమి ఇలాగే కొనసాగిస్తే కోహ్లి ఎన్ని సెంచరీలు కొడితే ఏం ఉపయోగం? భారత్ ఎన్ని 350 పైచిలుకు స్కోర్లు సాధిస్తే మాత్రం ఏం ప్రయోజనం? మళ్లీ జోరందుకోవాలంటే బౌలింగ్‌ను బాగా మెరుగుపర్చుకోవడం టీమ్‌ఇండియాకు తక్షణ అవసరం. ప్రధాన కోచ్‌గా అపరిమిత అధికారాన్ని చలాయిస్తున్న ప్రధాన కోచ్ గంభీర్.. దాన్ని సద్వినియోగం చేస్తున్నట్లు కనిపించట్లేదు. ఇప్పటికైనా గంభీర్, సెలక్షన్ కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్ మేల్కొనకపోతే, లోపాలను సరిదిద్దకపోతే భారత క్రికెట్‌కు మరింత నష్టం జరగకుండా ఆపడం కష్టం.



సెమీఫైనల్లో భారత్

● షూటౌట్లో బెల్జియంపై గెలుపు
● జూనియర్ హాకీ ప్రపంచకప్

సెమీఫైనల్స్ (ఆదివారం)
స్పెయిన్ × అర్జెంటీనా (సా.5.30 నుంచి)
భారత్ × జర్మనీ (రా.8 నుంచి)


చెన్నై: సుదీర్ఘ విరామం తర్వాత జూనియర్ హాకీ ప్రపంచకప్ సాధించాలన్న లక్ష్యంతో బరిలో దిగిన భారత్.. ఆ దిశగా మరో అడుగు వేసింది. శుక్రవారం ఉత్కంఠభరితంగా సాగిన క్వార్టర్‌ఫైనల్లో షూటౌట్లో 4-3తో బెల్జియంను ఓడించింది. ఆఖరిదాకా మలుపులు తిరుగుతూ ఆసక్తికరంగా సాగిన ఈ పోరులో భారత్ కీలక సమయంలో ఒత్తిడిని జయించి విజయాన్ని సొంతం చేసుకుంది. నిర్ణీత సమయంలో రెండు జట్లూ 2-2తో సమానంగా నిలిచాయి. మ్యాచ్‌లో ఆరంభం మాత్రం బెల్జియందే. 12వ నిమిషంలో మసాంట్ చేసిన గోల్‌తో ఆ జట్టు ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో క్వార్టర్ పూర్తయినా భారత్ గోల్ కొట్టలేకపోయింది. నిరీక్షణకు తెరదించుతూ రోహిత్ (44వ), శార్దానంద్ (47వ) స్వల్ప వ్యవధిలో బంతిని నెట్‌లోకి పంపి భారత్‌ను 2-1తో నిలిపారు. అక్కడ నుంచి పటిష్టమైన డిఫెన్స్‌ను కొనసాగించిన భారత్. ప్రత్యర్థిని ఆఖరిదాకా అడ్డుకుంది. మరో నిమిషంలో మ్యాచ్ ముగుస్తుందనగా బెల్జియం ఆటగాడు నాథన్ (59వ) గోల్ చేసి స్కోరు సమం చేశాడు. ఆ తర్వాత మ్యాచ్ డ్రా అయి.. షూటౌట్ అనివార్యమైంది. షూటౌట్లో శార్దానంద్ మూడు, అంకిత్ పాల్ ఒక గోల్ కొట్టి భారత్‌ను విజయపథంలో నడిపించారు. బెల్జియం జట్టులో హ్యాగో, గుర్‌లెయిన్, ఛార్లెస్ సఫలమయ్యారు.

జర్మనీ ముందంజ

డిఫెండింగ్ ఛాంపియన్ జర్మనీ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. క్వార్టర్స్‌లో షూటౌట్లో 3-1తో ఫ్రాన్స్‌ను ఓడించింది. నిర్ణీత సమయానికి రెండు జట్లు 2-2 గోల్స్‌తో సమానంగా నిలిచాయి. షూటౌట్లో జర్మనీ జట్టులో జోనాస్ వాన్, జస్టస్ వార్‌వెగ్, లుకాస్ కాసెల్ సఫలమయ్యారు. మరో క్వార్టర్స్‌లో స్పెయిన్ 4-3తో న్యూజిలాండ్‌ను ఓడించింది. ఆరంభం నుంచి దూకుడుగా ఆడిన స్పెయిన్ 3-0తో నిలిచింది. కానీ పుంజుకున్న న్యూజిలాండ్ ఆఖరి నిమిషంలో సామ్ చేసిన గోల్‌తో 3-3తో స్కోరు సమం చేసింది. ఆఖర్లో అవిలా పెనాల్టీకార్నర్‌ను గోల్‌గా మలిచి స్పెయిన్‌కు విజయాన్ని అందించాడు. మరో క్వార్టర్స్‌లో అర్జెంటీనా 1-0తో నెదర్లాండ్స్‌ను ఓడించింది. అర్జెంటీనా తరఫున ఏకైక గోల్‌ను థామస్ రూయిజ్ (52వ ని) సాధించాడు.

గ్రూప్-జెలో అర్జెంటీనా

2026 ప్రపంచకప్ డ్రా



డ్రా సందర్భంగా ట్రంప్


వాషింగ్టన్: ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ ప్రేమికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న 2026 ఫుట్‌బాల్ ప్రపంచకప్ డ్రా విడుదలైంది. శుక్రవారం వాషింగ్టన్‌లో జరిగిన ఈ వేడుకకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నె, మెక్సికో ప్రెసిడెంట్ క్లాడియా షెన్‌బామ్ హాజరయ్యారు. డ్రా తీయడానికి ముందు ఫిఫా తన తొలి శాంతి బహుమతిని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు అందించింది. ఈసారి ప్రపంచకప్‌లో రికార్డు స్థాయిలో 48 జట్లు పోటీపడనున్నాయి. గత ప్రపంచకప్ వరకు 32 జట్లే తలపడ్డాయి. జట్లను 12 గ్రూపులుగా విభజించారు. డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా గ్రూప్-జెలో ఉంది. బ్రెజిల్ గ్రూప్-సిలో, స్పెయిన్ గ్రూప్-హెచ్‌లో, జర్మనీ గ్రూప్-ఈలో, ఫ్రాన్స్ గ్రూప్-ఐలో ఉన్నాయి. గ్రూప్ దశలో మొత్తం 72 మ్యాచ్‌లో జరుగుతాయి. 32 నాకౌట్ మ్యాచ్‌లు ఉంటాయి. గత ఫిఫా ప్రపంచకప్ కన్నా ఈసారి 40 మ్యాచ్‌లు ఎక్కువగా జరగనుండడం విశేషం. 2026 జూన్ 11 నుంచి జులై 9 వరకు జరిగే టోర్నమెంట్‌కు అమెరికా, మెక్సికో, కెనడా ఆతిథ్యమివ్వనున్నాయి. క్వార్టర్ ఫైనల్స్ నుంచి అన్ని మ్యాచ్‌లూ అమెరికాలోనే జరుగుతాయి. ఈ ప్రపంచకప్‌లో మరో ఆరు స్థానాలు ఖరారు కావాల్సివుంది. ఇందుకోసం 12వ ర్యాంకు ఇటలీ సహా 22 దేశాలు పోటీపడనున్నాయి.

ఎవరు ఎక్కడ

గ్రూప్-ఎ: మెక్సికో, దక్షిణాఫ్రికా, కొరియా, ప్లేఆఫ్-డి విజేత
గ్రూప్-బి: కెనడా, ఖతార్, స్విట్జర్లాండ్, ప్లేఆఫ్-ఎ విజేత
గ్రూప్-సి: బ్రెజిల్, హైతీ, మొరాకో, స్కాట్లాండ్
గ్రూప్-డి: అమెరికా, పరాగ్వే, ఆస్ట్రేలియా, ప్లేఆఫ్-సి విజేత
గ్రూప్-ఇ: జర్మనీ, కోట్ డి ఐవరీ, ఈక్వెడార్, కురాసోవో
గ్రూప్-ఎఫ్: నెదర్లాండ్స్, జపాన్, ట్యునీసియా, ప్లేఆఫ్-బి విజేత
గ్రూప్-జి: బెల్జియం, ఈజిప్ట్, ఇరాన్, న్యూజిలాండ్
గ్రూప్-హెచ్: స్పెయిన్, సౌదీ అరేబియా, ఉరుగ్వే, కాబో వర్డీ
గ్రూప్-ఐ: ఫ్రాన్స్, సెనెగల్, నార్వే, ప్లేఆఫ్-2 విజేత
గ్రూప్-జె: అర్జెంటీనా, అల్జీరియా, ఆస్ట్రియా, జోర్డాన్
గ్రూప్-కె: పోర్చుగల్, ఉజ్బెకిస్థాన్, కొలంబియా, ప్లేఆఫ్-1 విజేత
గ్రూప్-ఎల్: ఇంగ్లాండ్, క్రొయేషియా, పనామా, ఘనా

ఆసీస్‌కు ఆధిక్యం

● ఇంగ్లాండ్‌తో యాషెస్ రెండో టెస్టు



వెదరాల్డ్, లబుషేన్

బ్రిస్బేన్: ఇంగ్లాండ్‌తో యాషెస్ రెండో టెస్టుపై ఆస్ట్రేలియా పట్టుబిగించే ప్రయత్నం చేస్తోంది. జేక్ వెదరాల్డ్ (72), లబుషేన్ (65) రాణించడంతో రెండో రోజు, శుక్రవారం ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 378 పరుగులు చేసింది. కెప్టెన్ స్టీవెన్ స్మిత్ (61), అలెక్స్ కేరీ (46 నాటౌట్) కూడా కీలక ఇన్నింగ్స్ ఆడారు. కార్స్ మూడు వికెట్లు, స్టోక్స్ రెండు వికెట్లు పడగొట్టారు. కంగారూ జట్టు ఇప్పటికే 44 పరుగుల ఆధిక్యం సంపాదించింది. కేరీతో పాటు నెసర్ (15 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. ఉదయం 325/9తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్.. 334 పరుగులకు ఆలౌటైంది. ఆస్ట్రేలియా ఆధిక్యంలోకి వెళ్లడంలో ఓపెనర్ వెదరాల్డ్ కీలక పాత్ర పోషించాడు. అలవోకగా పరుగులు రాబట్టిన అతడు 45 బంతుల్లోనే అర్ధశతకం సాధించడం విశేషం. హెడ్ (33)తో తొలి వికెట్‌కు 77 పరుగులు జోడించి శుభారంభాన్నిచ్చిన వెదరాల్డ్.. లబుషేన్‌తో రెండో వికెట్‌కు 69 పరుగుల భాగస్వామ్యంతో ఆసీస్ భారీ స్కోరుకు బాటలు వేశాడు. ఓ దశలో ఆసీస్ 291/3తో నిలవగా.. కార్స్ ఒకే ఓవర్లో గ్రీన్(45), స్మిత్‌లను ఔట్ చేశాడు. ఆ దశలో అలెక్స్ కేరీ నిలిచాడు. అతడు.. ఇంగ్లిస్ (23)తో ఆరో వికెట్‌కు 37, నెసర్‌తో అభేద్యమైన ఏడో వికెట్‌కు 49 పరుగులు జోడించాడు.

పోరాడుతున్న విండీస్

న్యూజిలాండ్‌తో తొలి టెస్టు

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో వెస్టిండీస్ పోరాడుతోంది. ఓటమిని తప్పించుకోవడం ఇప్పటికీ కష్టమే అయినా.. షై హోప్ (116 బ్యాటింగ్), జస్టిన్ గ్రీవ్స్ (55 బ్యాటింగ్) గొప్ప పట్టుదలను ప్రదర్శించడంతో మ్యాచ్‌ను అయిదో రోజుకు తీసుకెళ్లగలిగింది. 531 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు కోల్పోయి 212 పరుగులు చేసింది. గాయాల కారణంగా ఇద్దరు ఫాస్ట్‌బౌలర్లు బౌలింగ్ చేయలేకపోవడం కివీస్‌కు ప్రతికూలంగా మారింది. ఓవర్‌నైట్ స్కోరు 417/4తో నాలుగో రోజు, శుక్రవారం రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన న్యూజిలాండ్.. 466/8 వద్ద డిక్లేర్ చేసింది. గాయాల వల్ల బ్లండెల్, స్మిత్ బ్యాటింగ్‌కు వచ్చే స్థితిలో లేకపోవడంతో కివీస్ డిక్లేర్ చేయక తప్పలేదు. అయినా ఆ జట్టు భారీ లక్ష్యాన్నే నిర్దేశించింది. ఛేదనలో డఫి (2/65) ధాటికి విండీస్ ఓ దశలో 72/4తో నిలవడంతో మ్యాచ్ నాలుగో రోజే ముగిసేలా కనిపించింది. కానీ హోప్, గ్రీవ్స్ గొప్పగా పోరాడారు. అభేద్యమైన అయిదో వికెట్‌కు 140 పరుగులు జోడించారు. పేసర్ మ్యాట్ హెన్రీ 11 ఓవర్లే బౌలింగ్ చేసి పిక్క గాయంతో మైదానం వీడాడు. మరో ఫాస్ట్‌బౌలర్ స్మిత్ అసలు మైదానంలోకి రాలేదు. దీంతో పేస్ బౌలింగ్ భారమంతా పెద్దగా అనుభవం లేని డఫి, ఫౌల్క్స్‌లపైనే పడింది. స్పిన్నర్లు బ్రాస్‌వెల్, రచిన్ రవీంద్ర కలిసి 31 ఓవర్లు వేశారు. లక్ష్యానికి వెస్టిండీస్ ఇంకా 319 పరుగుల దూరంలో ఉంది.

ఎఫ్-1 డ్రైవర్ టైటిల్ ఎవరిదో!

అబుదాబి: ఫార్ములావన్‌లో ఆసక్తికర రేసుకు వేళైంది. ఆదివారం జరిగే అబుదాబి ఫైనల్ పోరులో ముక్కోణపు పోటీ నెలకొంది. లాండో నోరిస్ (మెక్‌లారెన్), మ్యాక్స్ వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్), ఆస్కార్ పియాస్ట్రి (మెక్‌లారెన్) టైటిల్ కోసం పోటీపడుతున్నారు. ఈ ముగ్గురికి ఈ ఏడాది ఎఫ్-1 డ్రైవర్ టైటిల్ గెలిచే అవకాశం ఉండడంతో ఈ సీజన్లో ఆఖరిదైన అబుదాబి జీపీ ఆసక్తికరంగా మారింది. డ్రైవర్ల జాబితాలో రెండో స్థానంలో ఉన్న వెర్‌స్టాపెన్(396)తో పోలిస్తే నోరిస్ 12 పాయింట్లు ముందున్నాడు. పియాస్ట్రి(392)కి నోరిస్(408)కు మధ్య 16 పాయింట్ల అంతరముంది. అబుదాబి రేసులో నోరిస్ పోడియంపై నిలవగలిగితే డ్రైవర్ టైటిల్‌ను చేజిక్కించుకుంటాడు. వెర్‌స్టాపెన్ ఈ టైటిల్ గెలవాలంటే అతడు రేసు నెగ్గాలి.. నోరిస్ నాలుగు అంతకంటే ఎక్కువ స్థానానికి పరిమితం కావాలి. పియాస్ట్రి డ్రైవర్ టైటిల్ సాధించాలంటే.. అబుదాబి రేసు గెలవాలి. నోరిస్ ఆరు లేదా అంతకంటే ఎక్కువ స్థానంలో నిలవాలి.

ఐసీసీ ప్లేయర్ రేసులో షెఫాలి

దుబాయ్: భారత మహిళల క్రికెట్ జట్టు స్టార్ షెఫాలి వర్మ ఐసీసీ నవంబర్ నెల ఉత్తమ ప్లేయర్ అవార్డు రేసులో నిలిచింది. వన్డే ప్రపంచకప్‌లో సెమీఫైనల్ దశ నుంచి భారత్ జట్టులోకి వచ్చిన షెఫాలి ఫైనల్లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. 87 పరుగులు చేయడంతో పాటు రెండు కీలక వికెట్లు పడగొట్టి జట్టు ట్రోఫీ గెలవడంలో తన వంతు పాత్ర పోషించింది. ఇషా (యూఏఈ), తిపాట్‌చా పుటావాంగ్ (థాయ్‌లాండ్) కూడా ఐసీసీ అవార్డు కోసం షెఫాలితో పోటీపడుతున్నారు. పురుషుల్లో దక్షిణాఫ్రికా ఆఫ్ స్పిన్నర్ సిమోన్ హార్మర్, బంగ్లాదేశ్ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ తైజుల్ ఇస్లాం, పాకిస్థాన్ ఆల్‌రౌండర్ మహ్మద్ నవాజ్ ఉత్తమ ప్లేయర్ అవార్డు రేసులో ఉన్నారు. భారత్‌పై టెస్టు సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేయడంలో హార్మర్‌ది ప్రధాన పాత్ర. అతడీ సిరీస్‌లో 8.94 సగటుతో 17 వికెట్లు తీశాడు. మరోవైపు ఐర్లాండ్‌పై బంగ్లా 2-0తో టెస్టు సిరీస్ నెగ్గడంలో తైజుల్ (13 వికెట్లు) కీలకమయ్యాడు. ముక్కోణపు టీ20 సిరీస్‌లో నవాజ్ బ్యాట్‌తో 104 పరుగులు చేసి.. బంతితో 11 వికెట్లు తీశాడు.

సీమా పునియాపై 16 నెలల నిషేధం

దిల్లీ: డోపింగ్ పరీక్షలో విఫలం కావడంతో అథ్లెట్ సీమా పునియాపై 16 నెలల నిషేధం పడింది. 2023 హాంగ్జౌ ఆసియా క్రీడల్లో డిస్కస్‌త్రోలో కాంస్యం గెలిచిన సీమాపై ఈ శిక్ష నవంబర్ 10 నుంచే అమల్లోకి రానుంది. జూనియర్ స్థాయిలో ఒకసారి డోపీగా తేలిన సీమా.. సీనియర్ విభాగంలో రెండుసార్లు ఈ నేరానికి పట్టుబడింది. తాజాగా ఆమె వాడిన నిషేధిత ఉత్ప్రేరకం వివరాలు మాత్రం ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) వెల్లడించలేదు. 2014 ఆసియా క్రీడల్లో పసిడి గెలిచిన సీమా.. 2002 జూనియర్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కంచు సాధించింది. కామన్వెల్త్‌లో నాలుగు పతకాలు ఆమె ఖాతాలో ఉన్నాయి. సీమాతో పాటు పూజ యాదవ్ (డిస్టెన్స్ రన్నర్, 4 ఏళ్ల నిషేధం), మన్‌జీత్ కుమార్ (షాట్‌పుట్, 6 ఏళ్లు), నికేశ్ ధన్‌రాజ్ (మిడిల్ డిస్టెన్స్ రన్నర్, 4 ఏళ్లు), కుల్‌దీప్ (మారథాన్, 4 ఏళ్లు), చవీ దేవి (స్టీపుల్‌ఛేజ్ 4 ఏళ్లు)లపై కూడా వాడా నిషేధాన్ని విధించింది.

'క్యాండిడేట్స్'కు చేరువలో ప్రజ్ఞానంద

దిల్లీ: భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద క్యాండిడేట్స్ టోర్నీలో స్థానానికి మరింత చేరువయ్యాడు. ఇటీవల సొంతగడ్డపై జరిగిన ప్రపంచకప్‌లో పెద్దగా రాణించలేపోయిన అతడు.. తాజాగా లండన్ చెస్ క్లాసిక్ 2025లో ఉమ్మడి విజేతగా నిలిచాడు. చివరిదైన తొమ్మిదో రౌండ్లో ప్రజ్ఞానందను ఇల్యా స్మిరిన్ (ఇజ్రాయెల్) నిలువరించాడు. వెలిమిర్ ఇవిచ్ (సెర్బియా), అమీట్ గాషి (ఇంగ్లాండ్)లతో కలిసి ప్రజ్ఞానంద అగ్రస్థానాన్ని పంచుకున్నాడు. ఈ టోర్నీలో ప్రదర్శనతో 2025 ఫిడే సర్క్యూట్‌లో ప్రజ్ఞానంద ఖాతాలో మరో 8.17 పాయింట్లు చేరాయి. అతడు ప్రస్తుతం ఏడు ఈవెంట్ల నుంచి 115.17 పాయింట్లతో ఉన్నాడు. అనిష్ గిరి (81.18), కరువానా (65.55), బ్లూబౌమ్ (63.94), సిందరోవ్ (63.82) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. కానీ ఈ నలుగురు ఇప్పటికే వివిధ మార్గాల్లో క్యాండిడేట్స్ టోర్నమెంట్‌కు అర్హత సాధించారు. వాళ్లు కాకుండా ప్రజ్ఞకు సమీప ప్రత్యర్థి కెమర్ విన్సెంట్. అతడి ఖాతాలో 55.83 పాయింట్లు ఉన్నాయి. ఫిడే సర్క్యూట్‌లో అగ్రస్థానంలో నిలిచిన ఆటగాడికి క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత లభిస్తుంది.

బెంగళూరులో డేవిస్‌కప్ పోరు

బెంగళూరు: ఫిబ్రవరి 7, 8 తేదీల్లో బెంగళూరు వేదికగా భారత్-నెదర్లాండ్ మధ్య డేవిస్‌కప్ క్వాలిఫయర్స్ పోరు జరగనుంది. ఈ సమరానికి ఆతిథ్యం ఇచ్చేందుకు దిల్లీ ఆసక్తి వ్యక్తం చేసినా.. అవకాశం ఆఖరికి బెంగళూరుకు దక్కింది. 2017లో చివరిగా ఈ నగరంలో డేవిస్ కప్ జరిగింది. అప్పుడు భారత్ 4-1తో ఉజ్బెకిస్థాన్‌ను ఓడించింది. ఇటీవలే కర్ణాటక లాన్ టెన్నిస్ సంఘం బిల్లీ జీన్ కింగ్ కప్ ప్లేఆఫ్స్‌ను బెంగళూరులో నిర్వహించింది. ప్రపంచ గ్రూప్-1 పోరులో స్విట్జర్లాండ్‌ను ఓడించి భారత్ క్వాలిఫయర్స్ చేరింది.

కుర్చీ యోగా... ప్రయోజనాలు పక్కా!



గంటల కొద్దీ కుర్చీలోనే... కాస్తంత శారీరక శ్రమా లేని జీవితాలు... ఇలాగే ఉంటే దీర్ఘకాలంలో శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు ఖాయం. కనీసం కూర్చున్న కుర్చీలోనే కొన్ని ఆసనాలు వేస్తే తక్షణ ఉత్తేజంతో పాటు, పలురకాల దీర్ఘకాలిక సమస్యలకూ అడ్డుకట్ట వేయొచ్చంటున్నారు వైద్య నిపుణులు. పది రకాల ఆసనాలను ఒక్కోదానికి ఒక్కో నిమిషం కేటాయించి చూడమంటున్నారు...

1 **క్యాట్- కౌ:** రెండు చేతులూ మోకాళ్లపై పెట్టి నడుము సమాంతరంగా ఉంచి తలని కొంచెం వంచాలి. శ్వాస తీసుకొనేటప్పుడు నడుము భాగం ముందుకు (ఆవు ఉన్నట్లుగా) వదిలేటప్పుడు వెనక్కి అనాలి (పిల్లిలా).
ప్రయోజనం: నడుము నొప్పి రాకుండా ఇది సహాయపడుతుంది. ఉన్న వారికి తగ్గిస్తుంది.



2 **ఊర్ధ్వ హస్తాసనం:** రెండు చేతులు పైకి పెట్టి వెనక్కి వంచాలి.
ప్రయోజనం: మెడనొప్పి నివారణకు...



3 **పాద హస్తాసనం:** రెండు చేతులతో రెండు పాదాలను పట్టుకోవాలి.
ప్రయోజనం: పొట్ట తగ్గడానికి, తిన్నది అరుగుదలకు ఉపయోగకరం.



4 **పార్శ్వకోణాసనం:** ఎడమ కాలుమీద ఎడమ చేతిని పెట్టాలి. కుడి చేయిని పైకి పెట్టి ముందుకు వంగి కుడి కాలిను పక్కకి చాపాలి.
ప్రయోజనం: పొట్ట పక్క భాగంలో వచ్చే నొప్పులు తగ్గిస్తుంది. వెన్నునొప్పి, మెడనొప్పులను నివారిస్తుంది. నడుము చుట్టూ ఉన్న కొవ్వును సైతం కరిగిస్తుంది.



5 **రాజకపోతాసనం:** ఎడమ మోకాలిపై కుడి కాలు వేసుకొని కొంచెం ముందుకు వంగాలి. రెండు చేతులూ ముందుకు చాపి కుర్చోవాలి.
ప్రయోజనం: సయాటికా, మోకాలి నొప్పి నివారణకు ప్రయోజనం.



6 **గరుడాసనం:** రెండు కాళ్లు 'వి' ఆకారంలో చాపాలి. రెండు చేతులూ తలకు సమాంతరంగా లంబ కోణంలో పెట్టాలి.
ప్రయోజనం: కీళ్లనొప్పులు తగ్గిస్తుంది.



7 **వక్రాసనం:** రెండు కాళ్లు సమాంతరంగా ఉంచి మెడ, నడుము పక్కకు తిప్పాలి.
ప్రయోజనం: నడుము, వెన్ను, మెడ నొప్పులు రాకుండా ఉంటాయి.



8 **వీరభద్రాసనం:** ఎడమ చేతిని ఎడమ కాలిపై ఉంచాలి. కుడి చేయిని పైకి చాచి, నడుము నిటారుగానే ఉంచి కుడి కాలు పక్కకి చాపాలి.
- రెండు చేతులు సమాంతరంగా చాచి. కుడి కాలు పక్కకి చాపాలి.
- కుడి చేతితో కుడికాలు భాగాన్ని తాకాలి. ఎడమ చేయి పైకి ఉంచాలి.

ప్రయోజనం: ఇది శరీరంలోని అన్ని భాగాలను ఉత్తేజపరుస్తుంది. బద్ధకాన్ని దూరం చేస్తుంది.



9 **శవాసనం:** కుర్చీలో కూర్చొని చేతులు రెండూ మోకాళ్లపై పెట్టి గాలి పీల్చుకొని, వదలాలి. ఈ ప్రక్రియలో శ్వాసపై దృష్టిసారించాలి.
ప్రయోజనం: ఒత్తిడి తగ్గించి మనస్సును ప్రశాంతంగా ఉంచుతుంది. మెదడు శక్తిని పెంచుతుంది.



10 **తిర్యక్ తాడాసనం:** రెండు చేతులు పైకి చాపి లాక్ చేయాలి. కుడి, ఎడమ వైపు వంచాలి.
ప్రయోజనం: కండరాలు ఉత్తేజపడతాయి. నడుముపై ఉన్న కొవ్వును తగ్గించడానికి మేలు.



అందరికీ ఉపయోగకరం..

వయసుతో నిమిత్తంలేకుండా ఎవరైనా వీటిని చేయవచ్చు. ఎక్కువ సేపు కార్యాలయాల్లో కూర్చొని పనిచేసే ఉద్యోగులకు మేలు. ఈ పది ఆసనాలు ఒక్కోదానికి ఒక్కో నిమిషం చొప్పున కేటాయిస్తే రోజంతా ఉల్లాసంగా ఉంటారు. ఇవి చేసే సమయంలో శ్వాసపై దృష్టిసారించాలి. వీటిని చేయడం వల్ల దీర్ఘకాలిక సమస్యల నుంచి బయటపడవచ్చు.

– కె.కృష్ణవేణి, యోగా గురువు, ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆసుపత్రి, అనంతపురం

ఎక్కువ సేపు కూర్చోవడం వల్ల మెడ, నడుము, వెన్నునొప్పి, పైల్స్, కళ్ల మంటలు, బద్ధకం, అలసట, అరుగుదల కాకపోవడం, ఒత్తిడి, సయాటికా, నీరసం వస్తాయని చెబుతున్నారు వైద్యనిపుణులు.

- ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం

భారీ బుద్ధుడిని చూద్దాం పదండీ!



ఈ భారీ బుద్ధుడి విగ్రహం ఏలూరులో ఉంది. 2013లో నగరంలోని ఒకటో పట్టణం గజవెల్లివారి చెరువు మధ్యలో దీన్ని నిర్మించారు. హైదరాబాద్ హుస్సేన్‌సాగర్ మధ్యనున్న బుద్ధుడి విగ్రహం ఎత్తు 58 అడుగులు కాగా, ఏలూరులో నిర్మించిన ఈ అభయ బుద్ధ విగ్రహం ఎత్తు 74 అడుగులు కావడం విశేషం. చెరువు మధ్యలో విగ్రహం, దాని చుట్టూ నడకదారితో ఉన్న ఈ బుద్ధా పార్కు నగరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. – న్యూస్‌టుడే, ఏలూరు నగరం

నేలైనా.. గోడైనా నాకు ఒక్కటే!



మూడేళ్ల కిందట ఇలా

మొలకెత్తడానికి నేలే అవసరం లేదు.. అది గోడైనా, రేకుల షెడ్డయినా తనకు ఒక్కటే అని నిరూపించిందీ రావి చెట్టు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని కారు షెడ్డు, మరుగుదొడ్లపై కొన్నేళ్ల కిందట ఓ రావి మొక్క మొలకెత్తింది. అనంతరం దాని వేర్లు నేలలోకి పాకాయి. ప్రస్తుతం ఆ చెట్టు షెడ్డు, మరుగుదొడ్లపైనే పెరిగి మహావృక్షమై అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. రాజధాని పరిధిలోని ఇతర భారీ వృక్షాలను సంరక్షిస్తున్నట్లుగానే దీన్ని కూడా ట్రాన్స్‌లొకేషన్ పద్ధతిలో తరలించి, రక్షించాలని పలువురు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, తాడేపల్లి, మంగళగిరి



నేడు మహావృక్షమై..

సిక్కోలు తీరానికి పులిబొక్కసొర్ర

శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం ఎర్రముక్కాం నేతాజీ సముద్ర తీరానికి శుక్రవారం ఉదయం భారీ నీలి తిమింగలం కొట్టుకొచ్చింది. దీనిని స్థానిక మత్స్యకారులు పులిబొక్కసొర్రగా పేర్కొన్నారు. 3 టన్నులకు పైగా బరువు ఉండటంతో.. దాని రెక్కలు ఇసుకలో గుచ్చుకుపోయి తిరిగి సముద్రంలోకి వెళ్లలేక.. అక్కడే చనిపోయింది. విషయం తెలుసుకున్న అధికారులు పరీక్షల కోసం నమూనాలు సేకరించి, కళేబరాన్ని తీరంలో పూడ్చిపెట్టారు. – న్యూస్‌టుడే, సోంపేట





పాత అలవాట్లతో కొత్త లక్ష్యాలను సాధించలేరు

మీరు పాత అలవాట్లను మార్చుకోకుండా ఎన్ని కొత్త లక్ష్యాలను విధించుకున్నా ఉపయోగం ఉండదు. బరువు తగ్గాలన్నది మీ కోరిక అయితే, రోజూ గంట సేపు తప్పనిసరిగా వ్యాయామం చేయడాన్ని అలవాటు చేసుకుంటేనే అది సాకారమవుతుంది. సంపన్నులు కావడం మీ కల అయితే, సంపాదనలో నిర్దిష్ట మొత్తాన్ని మదుపు చేయడాన్ని అలవర్చుకోవాలి. చిన్న చిన్న అలవాట్లతోనే ఎంత పెద్ద లక్ష్యాన్నైనా సాధించొచ్చు.

– మ్యాక్ బ్రౌన్, ఫుట్‌బాల్ కోచ్



చలికాచుకుంటున్నాం..

మీరైతే స్వెటర్లు వేసుకుంటారు. రగ్గులు కప్పుకొంటారు.. చలిమంటలు వేసుకుంటారు. మాకు అవన్నీ ఉండవుకదా! అందుకే ఇలా ఒత్తుకుని కూర్చుంటాం అంటున్నాయి ఈ కోళ్లు! ఒక కోడి రెక్కల కింద.. మరో కోడి.. దాని రెక్కల కింద మరో కోడి పడుకుని చలికాచుకుంటున్న ఈ దృశ్యం మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రలో కనిపించింది. – ఈనాడు, మహబూబ్‌నగర్



ఎర్రలైటు వెలిగిందంటే..

ఘాట్ రోడ్లపై వాహనాల రాకపోకలు పర్యవేక్షిస్తూ ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లను అప్రమత్తం చేసే 'వెహికల్ సెన్సర్ ఎలర్ట్' అనే పరికరాన్ని భువనేశ్వర్ ఐఐటీ రూపొందించింది. దీన్ని గంజాం-కొంధమాల్ జిల్లాల సరిహద్దులో ప్రమాదాలకు నిలయమైన కళింగ ఘాట్ రోడ్డులో గురువారం ఏర్పాటు చేసి, పరీక్షించింది. రహదారులకు రెండు వైపులా 4 అడుగుల ఎత్తులో దీన్ని బిగించింది. పూర్తిగా సౌరశక్తితో పని చేసే పరికరంలోని కెమెరాలు వాహనాల రాకపోకలను నిత్యం గమనిస్తుంటాయి. ఏవైనా వాహనాలు ఒకదానికొకటి దగ్గరికి వచ్చినా, నియంత్రణ కోల్పోయినా, డ్రైవర్లు నిద్రమత్తులో ఉన్నా పరికరంలోని సెన్సర్ పసిగడుతుంది. ఆ వెంటనే ఎర్ర లైట్లు వెలిగి, సైరన్ల మోతతో డ్రైవర్లను అప్రమత్తం చేస్తుంది. దీని పనితీరును సమీక్షించి, ఇతర ప్రమాద జోన్లలో వీటిని అమర్చుతామని అధికారులు తెలిపారు.

– న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం



కట్నం మాటెత్తితే బహిష్కరణే

మన దేశంలో నేటి ఆధునిక యుగంలోనూ వరకట్న వేధింపులకు నవ వధువులు బలి అవుతూనే ఉన్నారు. ఇలాంటి కట్న పిశాచులకు బిహార్‌లోని ఓ గిరిజన తెగ కనువిప్పు కలిగిస్తోంది. పశ్చిమ చంపారణ్ జిల్లాలో విస్తరించి ఉన్న థారూ తెగ పెళ్లిళ్లలో వరకట్నం ఇచ్చినా, తీసుకున్నా గ్రామం నుంచి బహిష్కరిస్తారు. వివాహమనేది రెండు కుటుంబాలను, రెండు హృదయాలను కలిపే పవిత్రబంధంగా భావించే వీరిలో శతాబ్దాలుగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. వీరు కుమార్తెలను గౌరవంగా భావిస్తారు. పెళ్లిళ్లు కూడా ఎటువంటి హంగూ ఆర్భాటాలు లేకుండా జరుగుతాయి. గోబర్ధియా పోలీస్‌స్టేషను పరిధిలో థారూ తెగవారు ఎక్కువసంఖ్యలో ఉన్నారు. ఈ ఠాణా 1996లో ప్రారంభం కాగా.. గత 29 ఏళ్లలో ఒక్క వరకట్న వేధింపుల కేసు కూడా నమోదు కాలేదు.

- ఈటీవీ భారత్

మార్చి 16 నుంచి 'సార్వత్రిక' పదో తరగతి పరీక్షలు

- ఇంటర్ పరీక్షలు 2 నుంచి..

ఈనాడు, అమరావతి: సార్వత్రిక విద్యా పీఠం పది, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌ను సంచాలకులు నరసింహారావు విడుదల చేశారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 16 నుంచి 28 వరకు జరుగుతాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తారు. ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 2 నుంచి 13వరకు నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుంది. ప్రాక్టికల్ పరీక్షలు ఏప్రిల్ 11 నుంచి 18 వరకు ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా నిర్వహిస్తారు.

ఉప సభాపతికి.. కిడ్నీలో రాళ్ల తొలగింపు శస్త్రచికిత్స

ఆసుపత్రి నుంచి డిశ్చార్జి

ఉండి, న్యూస్‌టుడే: కిడ్నీలో రాళ్ల సమస్యతో బాధపడుతున్న రాష్ట్ర ఉప సభాపతి రఘురామకృష్ణరాజుకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో గురువారం శస్త్రచికిత్స చేశారు. శుక్రవారం ఆయనను డిశ్చార్జ్ చేశారు. ఉప సభాపతి సోమవారం ఉండి నియోజకవర్గానికి చేరుకుంటారని సమాచారం.

అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా పి.త్రివిక్రమరావు

- భాషా సంఘం విధివిధానాలు పేర్కొంటూ ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: మండలి వెంకటకృష్ణారావు అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా పి.త్రివిక్రమరావు(విక్రమ్)ను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రెండేళ్లు ఆయన ఈ పదవిలో కొనసాగుతారని పేర్కొంది. అధికార భాషా సంఘం చేపట్టాల్సిన కార్యాచరణను ఉత్తర్వుల్లో వివరించింది. అవి...

- రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే అధికారిక కార్యక్రమాల్లో ఆంగ్ల భాష వినియోగంపై నిర్బంధం విధించడం.
- అధికార కార్యక్రమాల్లో తెలుగు భాషను ఉపయోగించడానికి కార్యచరణ రూపొందించడం.
- తెలుగు వాడకంలో సాధించిన ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షించడం.
- ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో తెలుగు వాడుకపై తనిఖీలు చేయడం, సంబంధిత అధికారులకు తగిన సూచనలు ఇవ్వడం.
- అధికార భాషాభివృద్ధికి ప్రభుత్వానికి సిఫార్సులు చేయడం, ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించడం.

కు.ని.శస్త్రచికిత్సకు వస్తే.. తొడలోకి బ్లేడ్!

- నరసరావు పేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఘటన
- సీఎం ఆదేశాలతో వైద్యుడు, సిబ్బందిపై వేటు



బాధితురాలు రమాదేవి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలలో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స కోసం చేరిన మహిళకు ట్యూబెక్టమీ చేసే సమయంలో సర్జికల్ బ్లేడ్ ఆమె శరీరంలో చొచ్చుకుపోయినా గమనించకుండా వదిలేసిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. వివరాలు బాధితురాలు రమాదేవి మాటల్లో.. 'పట్టణంలోని బాలయ్యనగర్‌కు చెందిన నేను గత నెల 24న కు.ని శస్త్రచికిత్స చేయించుకునేందుకు ప్రభుత్వ వైద్యశాలకు వచ్చాను. వైద్యులు పరీక్షలు చేసి అదే నెల 26న రావాలని సూచించారు. ఈ మేరకు ఆసుపత్రిలో చేరగా డాక్టర్ నారాయణస్వామి శస్త్రచికిత్స చేశారు. ఆ సమయంలోనే నాకు మత్తు సక్రమంగా ఇవ్వలేదు.



మహిళ తొడ భాగంలో బ్లేడ్ (ఎక్స్‌రే చిత్రం)

శస్త్రచికిత్స సమయంలో ఉపయోగించే పరికరాల పళ్లెం నా తొడపై ఉంచారు. ఆ సమయంలో కత్తెరలాంటి వస్తువు గుచ్చుకున్న బాధ కలిగింది. నొప్పిగా ఉందని చెబుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. పైగా చెంపలపై కొట్టారు. ఆరోజు సాయంత్రానికి డిశ్చార్జ్ చేశారు' అని తెలిపారు. శుక్రవారం నొప్పి తీవ్ర కావడంతో కుటుంబసభ్యులు బాధితురాలిని వైద్యశాలకు తీసుకొచ్చారు. ఎక్స్‌రే తీయగా ఆమె తొడ భాగంలో బ్లేడ్ ఉండడంతో ఆందోళనకు దిగారు. దీంతో మళ్లీ చికిత్స చేసి బ్లేడ్ తొలగిస్తామని వైద్యులు చెప్పినా నిరాకరించి స్థానిక ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి వైద్యుడు నారాయణస్వామి మాట్లాడుతూ తాను శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశానని శుభ్రం చేయాల్సిన సిబ్బంది సక్రమంగా వ్యవహరించలేదని విలేకరులకు తెలిపారు. ట్యూబెక్టమీ చేస్తే తొడలోకి బ్లేడ్ వెళ్లే అవకాశం లేదని చెప్పారు.

వైద్యుడు, ఐదుగురు సిబ్బంది సస్పెన్షన్

ప్రభుత్వ వైద్యశాలలో జరిగిన సంఘటనపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. బాధ్యులను సస్పెండ్ చేయాలని ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో వైద్యశాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి డీఎంహెచ్‌వో కార్యాలయంలో విచారణ చేపట్టారు. వైద్యశాలలో చికిత్స సమయంలోనే మహిళ తొడలో బ్లేడ్ గుచ్చుకున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. వైద్యుడు ట్యూబెక్టమీ చేస్తే బ్లేడ్ తొడలోకి ఎలా వెళుతుంది?. ఈ విషయంలో తన తప్పేమీ లేదని వైద్యుడు డైరెక్టర్‌కు వివరణ ఇచ్చారు. సిబ్బంది కారణంగానే జరిగిందని తెలిపారు. దీనిపై డీఎంహెచ్‌వో డాక్టర్ రవి మాట్లాడుతూ తొడలోకి బ్లేడ్ ఎలా చేరిందన్న అంశంపై అనుమానాలు ఉన్నాయన్నారు. దీనిపై ప్రత్యేక వైద్యబృందంతో విచారణ చేయిస్తామని తెలిపారు. విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అప్పటి వరకు వైద్యుడితో పాటు ఐదుగురు సిబ్బందిని సస్పెండ్ చేసినట్లు చెప్పారు.

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో.. 2 లక్షల మంది దివ్యాంగులకు మేలు

- పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ సర్వీసుల్లో ఇకపై ఫ్రీ

ఈనాడు, అమరావతి: దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించినందున.. రాష్ట్రంలో దాదాపు 2 లక్షల మందికి మేలు చేకూరనుంది. ఇప్పటి వరకు వీరంతా టిక్కెట్ ఛార్జీలో 50 శాతం రాయితీ పొందుతున్నారు. త్వరలో వీరికి పూర్తిగా ఉచితంగా ప్రయాణించే సదుపాయం కలగనుంది. ఈ హామీ అమలు చేసేందుకు.. దివ్యాంగుల పాస్‌లు పొందినవారు ఎందరు? రాయితీ రూపంలో ఆర్టీసీకి ఎంతమొత్తం చెల్లించాలి? తదితర వివరాలు తెలియజేయాలంటూ ప్రభుత్వం సూచించడంతో ఆర్టీసీ అధికారులు లెక్కలు సిద్ధం చేస్తున్నారు.

- ప్రస్తుతం దివ్యాంగులకు ఆర్టీసీ నాలుగు రకాల పాస్‌లు జారీచేస్తోంది. 40% శారీరక వైకల్యం, 100% వినిపించకపోవడం, 100% అంధత్వం, 69% కంటే తక్కువ ఐక్యూతో మానసిక వైకల్యం ఉంటే వారికి ఆర్టీసీ పాస్‌లు ఇస్తోంది. వీరికి పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్ సర్వీసుల్లో 50 శాతం ఛార్జీ వసూలు చేస్తోంది. మిగిలిన సగం రాయితీగా ఇస్తోంది. విశాఖపట్నం, విజయవాడలోని సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఛార్జీలేమీ లేకుండా ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తోంది.
- మొత్తంగా 2 లక్షల దివ్యాంగుల పాస్‌లకు రాయితీ రూపంలో ఆర్టీసీ ఏటా రూ.188 కోట్ల మేరకు భారం భరిస్తోంది. వీరిలో 30-40% మహిళలు ఉంటారు. వీరికి ఆగస్టు 15 నుంచి ఉచిత ప్రయాణం అమల్లోకి వచ్చింది. ఇప్పుడు దివ్యాంగులైన మగవారికి ఉచిత ప్రయాణ సదుపాయం కలగనుంది.
- రాష్ట్రంలో వికలాంగుల పింఛన్లు పొందుతున్నవారు 7.68 లక్షల మంది ఉన్నారు. మరో 24 వేల మంది పూర్తిగా మంచానికి, వీల్‌ఛైర్‌కి పరిమితమై పింఛను పొందుతున్నారు. అయితే ఏటా సగటున 2 లక్షల మంది మాత్రమే ఆర్టీసీలో దివ్యాంగుల పాస్‌లు పొందుతున్నారు. ఉచిత ప్రయాణ పథకం వల్ల ఈ పాస్‌ల సంఖ్య కొంత పెరగొచ్చని అధికారులు భావిస్తున్నారు.

రాష్ట్రంలో 75 వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాల నిర్మాణం

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్

తిరుమల, న్యూస్‌టుడే: రాష్ట్రంలో డంపింగ్ యార్డ్ లేకుండా చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తమకు లక్ష్యం నిర్దేశించారని.. అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా 75 వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. ఏ రోజు చెత్త ఆ రోజే ప్రాసెస్ అయ్యేలా ఈ ప్లాంట్లన్నీ పనిచేస్తాయన్నారు. శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రవ్యాప్తంగా పేరుకుపోయిన 90 లక్షల టన్నుల చెత్తను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రాసెస్ చేసి తొలగించాం. ఆరు ఎనర్జీ ప్లాంట్లను కొత్తగా నిర్మించనున్నాం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో చెత్తను తొలగించడంతోపాటు ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిస్తున్నాం. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను రద్దు చేయడం కోసం దశలవారీగా కార్యక్రమాలు చేపట్టాం. రైతన్నల కోసం మార్క్‌ఫెడ్ ద్వారా పెద్దఎత్తున సేంద్రియ ఎరువులను అందించేందుకు శ్రీకారం చుట్టాం' అని చెప్పారు.

గిరిపుత్రులు ఉన్నత శిఖరాలకు చేరాలి

- రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్
- విజయవంతంగా ముగిసిన ఉద్భవ్-2025



ఉద్భవ్ ఉత్సవ్ కార్యక్రమంలో బృంద నృత్యం విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన తెలంగాణ విద్యార్థులకు ట్రోఫీ అందిస్తున్న రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, సంధ్యారాణి



బహుమతుల ఉత్సవంలో విద్యార్థుల ఆనందహేల

ఈనాడు, అమరావతి: 'అడవి తల్లి ఒడిలో పుట్టి పెరిగిన గిరిపుత్రులు అత్యున్నత శిఖరాలు అధిరోహించాలి. వారికి తోడ్పాటు అందించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో చొరవ చూపుతున్నాయి. విభిన్నజాతులు, సంస్కృతులున్న సువిశాల భారతదేశంలో గిరిపుత్రుల వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన ఉద్భవ్-2025 చరిత్రలో నిలుస్తుంది' అని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. అమరావతిలోని కేఎల్ యూనివర్సిటీ ప్రాంగణంలో మూడురోజులుగా సాగిన ఆరో జాతీయ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ సొసైటీ సంప్రదాయ, సంస్కృతి కళా ఉత్సవం (ఉద్భవ్-2025) శుక్రవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో దుర్గేష్‌తో పాటు మంత్రులు డోలా బాలవీరాంజనేయ స్వామి, గుమ్మిడి సంధ్యారాణి పాల్గొన్నారు. కందుల దుర్గేష్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యార్థులు తరలివచ్చి ప్రతిభ చాటడం అసాధారణ విషయమన్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిశానిర్దేశంలో గొప్ప కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న గిరిజన కళలను ఒకే వేదికపై చూడటానికి రెండు కళ్లు సరిపోలేదని పేర్కొన్నారు. మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ ఉద్భవ్-2025 వేడుకలు జాతీయ సమగ్రత, ఐక్యతకు నిదర్శనమని అన్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గిరిజన విద్యార్థుల్లో కళానైపుణ్యాలను వెలికితీసేందుకు ఉద్భవ్ చక్కని వేదికగా నిలిచిందని పేర్కొన్నారు. 22 రాష్ట్రాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక, సంక్షేమశాఖ కార్యదర్శి మల్లికార్జున నాయక్, నెస్ట్స్ జాయింట్ కమిషనర్ బిపిన్ చంద్ర రాటూరి, ఏపీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి గౌతమి పాల్గొన్నారు. అనంతరం 49 విభాగాల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

- ఉద్భవ్-2025 ఉత్సవ్‌లో తెలంగాణ అత్యధిక పతకాలతో మొదటిస్థానంలో నిలిచింది. దేశంలోని మోడల్ ఏకలవ్య గురుకుల పాఠశాలల నుంచి 1,558 మంది విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొన్నారు. వాటిలో 11 బంగారు, 10 రజతాలు, 7 కాంస్య పతకాలు గెలుచుకుని తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. ఝార్ఖండ్, ఒడిశా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ఆంధ్రప్రదేశ్ 3 పసిడి, 5 వెండి, 4 కాంస్య పతకాలతో ఏడో స్థానంలో నిలిచింది.

కాకినాడ తీరం కాలుష్యకాసారం!

కాకినాడ సముద్ర తీరంలోని ఇసుక నల్లగా మారడంతో పర్యాటకులు, పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలుష్యం వల్లే బంగారు వర్ణంలోని ఇసుక ఇలా మారుతోందని స్థానికులు తెలిపారు. సముద్ర జలాల్లో కాలుష్య కారకాలు కలవడం వల్ల మత్స్య సంపద కూడా దొరకడం లేదని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు. కాకినాడ గ్రామీణం వాకలపూడి ప్రాంతంలో ఉండే పరిశ్రమలు వ్యర్థాలను నేరుగా సముద్రంలోకి వదులుతుండడంతో ఈ పరిస్థితి వచ్చిందని పర్యావరణవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

– ఈనాడు, కాకినాడ



ఎన్టీఆర్ బీచ్‌లో నల్లగా మారిన ఇసుక తిన్నెలు

EENADU Vol: 52, Issue: 116 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

వృద్ధికి మద్దతు కొనసాగుతుంది

'ద్రవ్యోల్బణం తగ్గడంతో, వృద్ధికి మద్దతు ఇవ్వడానికి విధానపరమైన వెసులుబాటు కలిగింది. ప్రతికూల, సవాలుభరిత అంతర్జాతీయ పరిస్థితుల్లోనూ భారత ఆర్థిక వ్యవస్థ బలంగా నిలిచింది. అధిక వృద్ధి దిశగా పయనిస్తోంది. ఇందుకు కావాల్సిన ఉత్పాదక అవసరాలను అందించడంలో ఆర్‌బీఐ మద్దతు కొనసాగుతుంది. రేట్ల కోత ప్రయోజనాలను బ్యాంకులు వినియోగదారులకు బదిలీ చేసేలా ఆర్‌బీఐ దృష్టి సారిస్తుంది.

– పరపతి విధాన సమీక్ష నిర్ణయాల వెల్లడి సందర్భంగా ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

ఆర్‌బీఐ డబుల్ బొనాంజా

- రెపోరేటులో 0.25% కోత
- బ్యాంకింగ్ రంగంలోకి రూ.లక్ష కోట్లు
- 2025-26కు జీడీపీ వృద్ధి అంచనా 6.8% నుంచి 7.3 శాతానికి పెంపు



సంజయ్ మల్హోత్రా

ఆరు నెలల అనంతరం రెపోరేటులో 0.25% కోతను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) విధించింది. అమెరికా అధిక టారిఫ్‌ల నేపథ్యంలో ఆర్థిక వ్యవస్థకు మద్దతుగా బ్యాంకింగ్ రంగంలోకి రూ. లక్ష కోట్ల నిధులు జొప్పించనున్నట్లు తెలిపింది. ఈ నిర్ణయాల వల్ల గృహ, వాహన, ఇతర రుణాలపై వడ్డీరేట్లు తగ్గడంతో పాటు ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనం చేకూరుతుంది. అమెరికా టారిఫ్‌ల కారణంగా ఎగుమతులు తగ్గి, దేశ వాణిజ్య లోటు పెరిగింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ రికార్డు కనిష్ఠానికి చేరింది. ఈ పరిస్థితుల్లో ఆర్‌బీఐ డబుల్ బొనాంజా ప్రకటించినట్లయింది.

భవిష్యత్తులో రేట్ల కోతకు అవకాశం

ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఆధ్వర్యంలోని ఆరుగురు సభ్యుల పరపతి విధాన కమిటీ రెపోరేటు (బ్యాంకులు ఆర్‌బీఐ వద్ద తీసుకునే రుణాలకు చెల్లించే వడ్డీ)ను 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 5.25 శాతానికి చేర్చాలని ఏకగ్రీవంగా నిర్ణయించింది. 'తటస్థ' ధోరణిని కొనసాగించడం వల్ల భవిష్యత్తులో రేట్ల కోతకు అవకాశం ఉన్నట్లయింది.

ప్రభుత్వ చర్యలకు మద్దతుగా..

సెప్టెంబరులో జీఎస్‌టీ సంస్కరణలను అమల్లోకి తెచ్చిన ప్రభుత్వం, కార్మిక నిబంధనలనూ సడలించింది. ఆర్థిక రంగ నియంత్రణలనూ సులభతరం చేసింది. వీటికి మద్దతు పలికేలా ఆర్‌బీఐ తాజా నిర్ణయాలున్నాయని విశ్లేషకులు పేర్కొన్నారు. రెపోరేటు తగ్గినందున, బ్యాంకులు ఆర్‌బీఐ వద్ద తక్కువ వడ్డీ రేటుకే నిధులు తీసుకుంటాయి. అందువల్ల తమ ఖాతాదారులకు ఇచ్చే రుణాలపై వడ్డీరేట్లను తగ్గించేందుకు బ్యాంకులకు వీలవుతుంది. నెలవారీ కిస్తీ మొత్తం తగ్గడంతో వినియోగదార్లు, వ్యాపారులు మరిన్ని రుణాలు తీసుకోగలుగుతారు. ఫలితంగా ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయి.

రెండు దశల్లో రూ. లక్ష కోట్లు

బ్యాంకింగ్ రంగంలో ద్రవ్యలభ్యత పెంచేందుకు బహిరంగ మార్కెట్ కొనుగోళ్ల (ఓఎమ్‌ఓ)ను ఆర్‌బీఐ నిర్వహించనుంది. ప్రభుత్వ బాండ్లను రెండు దశల్లో (రూ.50,000 కోట్ల చొప్పున) ఈనెల 11, 18 తేదీల్లో కొనుగోలు చేయనుంది. డిసెంబరు 16న 5 బిలియన్ డాలర్ల మేర విదేశీ మారకపు క్రయవిక్రయాలు చేయనుంది. ఈ చర్యల వల్ల బ్యాంకులకు ద్రవ్యలభ్యత ఒత్తిళ్లు తగ్గుతాయి.

రూపాయికి విలువను నిర్దేశించడం లేదు

విదేశీ మారకపు (ఫారెక్స్) మార్కెట్‌లో రూపాయికి ఎటువంటి శ్రేణి(బ్యాండ్)నీ ఆర్‌బీఐ లక్ష్యంగా పెట్టుకోలేదని మల్హోత్రా స్పష్టం చేశారు. దేశీయ కరెన్సీ తన సొంత, సరైన స్థాయికి వెళ్లేందుకు అవకాశం ఇస్తున్నామని అన్నారు. అమెరికా డాలర్ విలువ రూ.90కి చేరిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ఆర్‌బీఐ తదుపరి పరపతి విధాన కమిటీ (ఎమ్‌పీసీ) సమావేశం 2026 ఫిబ్రవరి 4-6 తేదీల్లో జరగనుంది.

ద్రవ్యోల్బణం తగ్గింపు.. వృద్ధి అంచనాల పెంపు..

2025 ఫిబ్రవరి తర్వాత ఇది నాలుగో రేట్ల కోత. 3 దశల్లో 100 బేసిస్ పాయింట్ల మేర రెపోరేటు తగ్గించిన ఆర్‌బీఐ, తాజా కోతతో కలిపి 125 బేసిస్ పాయింట్లను తగ్గించింది. ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణ అంచనాను 2 శాతానికి, వృద్ధి అంచనాను 6.8% నుంచి 7.3 శాతానికి ఆర్‌బీఐ సవరించింది.

అప్పటిదాకా రేట్లు 'దిగువ' స్థాయిలోనే

ద్రవ్యోల్బణం తక్కువ స్థాయుల్లో ఉన్నంత కాలం, కీలక రేట్లూ 'దిగువ' స్థాయుల్లోనే ఉంటాయని మల్హోత్రా పేర్కొన్నారు. అమెరికా టారిఫ్‌ల వల్ల ఆర్థిక కార్యకలాపాలపై చాలా తక్కువ ప్రభావమే కనిపించిందని అభిప్రాయపడ్డారు.

ఈనాడు బిజినెస్

ఇండిగోకే ఎందుకీ సమస్య?

ఇండిగో విమానాలు	417
రోజువారీ సర్వీసులు	2200
దేశీయ గమ్యాలు	90
విదేశీ గమ్యాలు	40

- భారీ సంఖ్యలో సర్వీసులు, రాత్రి పూట విమానాలు
- పైలట్లు, సిబ్బంది సంఖ్య పరిమితం
- ఎఫ్‌డీటీఎల్ నిబంధనలకు సిద్ధం కానందునే సర్వీసుల రద్దు, జాప్యం

దేశీయ అగ్రగామి విమానయాన సంస్థ ఇండిగో సర్వీసులు రోజూ వందల సంఖ్యలో రద్దవుతున్నందున, లక్షల మంది ప్రయాణికుల మీద ప్రతికూల ప్రభావం చూపుతోంది. పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) అమల్లోకి తెచ్చిన ఎఫ్‌డీటీఎల్ (ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్) నిబంధనలను పాటించేందుకు సరిపడా సిబ్బంది, పైలట్లు లేనందునే ఇండిగో సర్వీసులు భారీగా రద్దవుతున్నాయి. దేశంలో మిగిలిన విమానయాన సంస్థల కంటే ఇండిగోకే ఎందుకీ సమస్య తలెత్తింది? అనేదే అందరి సందేహం. పరిశ్రమ వర్గాల ప్రకారం.. ఇండిగో తన దగ్గర ఉన్న విమానాలతోనే, అధిక సంఖ్యలో విమాన సర్వీసులు నిర్వహిస్తోంది. అది కూడా పరిమిత సంఖ్యలో ఉన్న సిబ్బంది, పైలట్ల తోనే. సిబ్బంది, విమానాల సద్వినియోగానికి.. తక్కువ ధరకు ప్రయాణికులను చేరవేసేందుకు ఈ సంస్థ నడిపే రాత్రి పూట సర్వీసులూ అధికమే. మొత్తం దేశీయ విమాన ప్రయాణికుల్లో 63% మందిని ఈ సంస్థ చేరవేస్తోంది. వందల సంఖ్యలో సర్వీసులు రద్దవుతున్నందున, తీవ్ర ఆందోళన తలెత్తింది.

నిబంధనలు అకస్మాత్తుగా వచ్చాయా?

2024 జనవరిలో డీజీసీఏ ఈ నిబంధనలను ఖరారు చేసి, దశల వారీగా అమల్లోకి తీసుకురావాలని నిర్దేశించింది. ప్రయాణికుల భద్రత దృష్ట్యా విమాన పైలెట్లు, సిబ్బందికి తగిన విశ్రాంతి ఇవ్వాలనేది ఈ నిబంధనల సారాంశం. ఇందుకు తగినట్లుగా తగినంతమంది సిబ్బంది, పైలెట్లను సమకూర్చుకోలేక ఇండిగో ఇబ్బందుల్లో పడింది. కొంత కాలంగా ఈ సంస్థ అధిక సంఖ్యలో పైలెట్లు, సిబ్బంది నియామకాలను చేపట్టలేదు. ఇప్పటికిప్పుడు సమకూర్చుకోవడం సాధ్యం కాని పరిస్థితి. ఇతర సంస్థలు పరిమిత సంఖ్యలోనే సర్వీసులు నిర్వహిస్తున్నందున, సులువుగానే కొత్త నిబంధనలు పాటించగలుగుతున్నాయి.

ఇండిగో ఏం చేసింది...

ఈ ఏడాది జులై నుంచి అమల్లోకి వచ్చిన మొదటి దశ నిబంధనల్లో ముఖ్యమైన పైలట్లు, సిబ్బందికి వారాంతపు విశ్రాంతి గంటల పెంపు అంశాన్ని ఇండిగో అమలు చేసింది. రెండోదశలో, నవంబరు 1 నుంచి అమలు చేయాల్సిన రాత్రి ల్యాండింగ్ పరిమితిని వారానికి ఆరు నుంచి రెండుకు తగ్గించడాన్ని అమలు చేయాల్సి రావడంతో ఇండిగోకి ఇబ్బంది తలెత్తింది. ఇతర సంస్థలతో పోల్చితే, ఇండిగో తన సిబ్బందితో ఎంతో ఎక్కువ గంటలు పనిచేయిస్తుంది. అందుకే రాత్రి పూట ఇండిగో విమాన సర్వీసులు అధికంగా ఉంటాయి. ఇండిగోతో పోల్చితే ఎయిర్ ఇండియా సగం విమాన సర్వీసులే నిర్వహిస్తోంది. కొత్త నిబంధనల ఫలితంగా పైలట్లు, సిబ్బంది అందుబాటులో లేక ఇండిగో నవంబరులోనే 755 విమాన సర్వీసులు రద్దు చేసింది. ఈనెలలో రోజూ వందల సర్వీసులు రద్దవుతున్నాయి.



రెండేళ్లు మిన్నకుండి పోయిందా?

ఇండిగో సర్వీసులు రద్దు కావడంతో ప్రయాణికులకు ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, డీజీసీఏ తాత్కాలికంగా ఎఫ్‌డీటీఎల్ నిబంధనల అమలును ప్రస్తుతానికి వాయిదా వేసింది. ఫలితంగా విమానయాన సంస్థల ఒత్తిడికి డీజీసీఏ తలొగ్గిందనే విమర్శలు వస్తున్నాయి. కొత్త నిబంధనలు అమలు చేయడానికి రెండేళ్ల గడువు ఇచ్చినా ఇండిగో సిద్ధం కాలేదని, పైగా కొత్త నియామకాలపై నిషేధం విధించిందని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్ (ఎఫ్ఐపీ) విమర్శించింది. తగినంతమంది సిబ్బంది, పైలట్లు ఉంటే మినహా విమానయాన సంస్థలు కోరినట్లుగా 'సీజనల్ ఫ్లైట్ షెడ్యూళ్లను' ఆమోదించొద్దని డీజీసీఏను కోరింది. రద్దవుతున్న ఇండిగో ఫ్లైట్ల స్లాట్లను ఇతర సంస్థలకు కేటాయించాలని సూచించింది. కొత్త నిబంధనల వల్ల ఇతర విమానయాన సంస్థలకు ఇబ్బందులు లేవని, తగిన విధంగా అవి సన్నాహాలు చేయడమే దీనికి కారణమని పేర్కొంది. ఇండిగో స్వల్పకాలిక దృష్టితో, పైలట్ల నియామకాలు నిలుపుదల చేసిందని, ఏకస్వామ్య విధానాలు ప్రదర్శించిందని ఎఫ్ఐపీ ఆరోపించింది.

500 మంది పైలట్లు కావాలి...?

నూతన ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను పూర్తిగా పాటించాలంటే ఇండిగోకు అదనంగా కనీసం 500 మంది కొత్త పైలట్లు, దానికి తగ్గట్లుగా కేబిన్ సిబ్బంది కావాలని తెలుస్తోంది. అది కూడా సాధ్యమైనంత తక్కువ సమయంలోనే. దాన్ని ఏమేరకు సాధిస్తుందనేది వేచి చూడాలి. అది జరిగితేనే ఇండిగో విమాన సర్వీసులు మళ్లీ సాధారణ స్థితికి చేరుకునే అవకాశం కలుగుతుంది.

– ఈనాడు, హైదరాబాద్

కోడి గుడ్లు

6న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	651
వరంగల్	653
విజయవాడ	670
తూ/ప గోదావరి	650
విశాఖపట్నం	640
చిత్తూరు	663

'ఎక్స్'పై ఈయూ రూ.1260 కోట్ల ఫైన్

లండన్: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన సామాజిక మాధ్యమ ప్లాట్‌ఫాం 'ఎక్స్'పై ఐరోపా సమాఖ్య (ఈయూ) నియంత్రణ సంస్థ 120 మిలియన్ యూరోల (140 మి. డాలర్లు లేదా సుమారు రూ.1260 కోట్లు) అపరాధ రుసుమును విధించింది. ఈయూ డిజిటల్ నిబంధనలను ఉల్లంఘించి, వినియోగదార్లు కుంభకోణాలు, మోసాల్లో చిక్కుకునేందుకు ఎక్స్ వీలు కల్పించినట్లు పేర్కొంది. యూరోపియన్ కమిషన్ రెండేళ్ల కిందట దర్యాప్తు మొదలు పెట్టి, తాజాగా ఈ నిర్ణయాన్ని వెలువరించింది. 27 దేశాల సమాఖ్య అయిన ఈయూ తెచ్చిన డిజిటల్ సర్వీస్ యాక్ట్(డీఎస్ఏ) కింద తీసుకున్న తొలి నిర్ణయమిది. డీఎస్ఏ నిబంధనల కింద సామాజిక మాధ్యమాలు యూరోపియన్ వినియోగదార్ల రక్షణ బాధ్యతను తీసుకోవాలి. ప్రమాదకర/చట్టవ్యతిరేక కంటెంట్ ఉత్పత్తులను సైట్ నుంచి తొలగించాలి.

సి-130 జే విమాన తోక భాగాల తయారీలో హైదరాబాద్ ఘనత

ఈనాడు, హైదరాబాద్: లాక్‌హీడ్ మార్టిన్, టాటా గ్రూపు సంయుక్త సంస్థ టాటా లాక్‌హీడ్ మార్టిన్ ఏరోస్ట్రక్చర్స్ లిమిటెడ్ (టీఎల్ఎంఏఎల్) మరో మైలురాయిని అధిగమించింది. ఈ సంస్థ హైదరాబాద్‌లోని తన యూనిట్లో మిలటరీ రవాణా విభాగానికి చెందిన సి-130 జే సూపర్ హెర్క్యులస్ విమానానికి అవసరమైన 250వ తోక భాగాన్ని (ఎంపెన్నేజ్) తయారు చేసి లాక్‌హీడ్ మార్టిన్‌కు అందజేసింది. అమెరికా (జార్జియా)లోని లాక్‌హీడ్ మార్టిన్ కేంపస్‌లో తయారు చేసే సి-130 జే సూపర్ హెర్క్యులస్ విమానంలో ఉపయోగించడం కోసం ఈ తోక భాగాన్ని తీసుకెళ్లారు. విమానం స్థిరత్వం, నియంత్రణలో తోక భాగం కీలక పాత్ర పోషిస్తుంది. టీఎల్ఎంఏఎల్ 2010లో హైదరాబాద్‌లో ఈ యూనిట్ ఏర్పాటు చేసింది. ఎంతో ఆధారపడదగిన - అత్యంత విశ్వసనీయ భాగస్వామ్య సంస్థగా టీఎల్ఎంఏఎల్ రూపుదిద్దుకుందని, అద్భుత ఇంజినీరింగ్ నైపుణ్యాన్ని ఈ భాగస్వామ్య సంస్థ ప్రదర్శిస్తున్నట్లు లాక్‌హీడ్ మార్టిన్ పేర్కొంది. భారత్- అమెరికా మధ్య భాగస్వామ్యానికి, సత్సంబంధాలకు ఇది నిదర్శమని వివరించింది. ప్రపంచ వ్యాప్తంగా ఏరోస్పేస్ సరఫరా వ్యవస్థ (సప్లై చైన్ సిస్టమ్) లో భారత దేశం క్రియాశీలకంగా మారుతోందని లాక్‌హీడ్ మార్టిన్ ఉపాధ్యక్షుడు రాడ్ మెక్‌లీన్ తెలిపారు.

నెట్‌ఫ్లిక్స్ చేతికి వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ!

రూ.6.48 లక్షల కోట్ల భారీ ఒప్పందం

ప్రపంచ వినోద రంగంలో భారీ ఒప్పందం ఒకటి జరిగింది. వార్నర్ బ్రదర్స్ డిస్కవరీకి చెందిన టీవీ, సినిమా స్టూడియోలు, స్ట్రీమింగ్ విభాగాన్ని కొనుగోలు చేయడానికి దిగ్గజ స్ట్రీమింగ్ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఒప్పందం కుదుర్చుకుంది. కొనుగోలు విలువ 72 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.6.48 లక్షల కోట్లు)గా ఉండనుంది. శుక్రవారం ప్రకటించిన ఒప్పందం ప్రకారం, ఒక్కో షేరుకు 28 డాలర్లను నెట్‌ఫ్లిక్స్ చెల్లిస్తుంది. గురువారం వార్నర్ బ్రదర్స్ షేరు ముగింపు ధర 24.54 డాలర్లతో పోల్చినా, పారామౌంట్ నుంచి అంతక్రితం ఆఫర్ వచ్చిన 24 డాలర్ల కన్నా ఇది అధికమే. షేరు ముగింపు ధర ప్రకారం, వార్నర్ బ్రదర్స్ మార్కెట్ విలువ 61 బి. డాలర్లు (సుమారు రూ.5.49 లక్షల కోట్లు)గా ఉంది.

- గేమ్ ఆఫ్ థ్రోన్స్, డీసీ కామిక్స్, హ్యారీపోటర్, ఫ్రెండ్స్ వంటి ఫ్రాంఛైజీలన్నీ ఇపుడు నెట్‌ఫ్లిక్స్‌కు చేరతాయి. దీంతో హాలీవుడ్‌లో అత్యంత విలువైన లైబ్రరీల్లో ఒకటిగా నెట్‌ఫ్లిక్స్ మారుతుంది. హెచ్‌బీఓ నెట్‌వర్క్స్‌కు యజమానిగానూ మారుతుంది.

ఒప్పందం జరుగుతుందా?: ఐరోపా, అమెరికాల్లో బలమైన యాంటీ ట్రస్ట్ తనిఖీలకు ఈ ఒప్పందం లోనుకావొచ్చు. ఇప్పటికే ట్రంప్ ప్రభుత్వంతో అనుబంధం ఉన్న పారామౌంట్ సంస్థ, ఈ వారం మొదట్లో విక్రయ ప్రక్రియను ప్రశ్నించింది. నెట్‌ఫ్లిక్స్‌కు సానుకూలంగా ఉందని ఆరోపించింది. అక్టోబరులో పారామౌంట్ చేసిన 60 బి. డాలర్ల (సుమారు రూ.5.40 లక్షల కోట్ల) బిడ్‌ను వార్నర్ బ్రదర్స్ బోర్డు తిరస్కరించడం ఇందుకు నేపథ్యం. ఒక వేళ నియంత్రణ సంస్థలు ఈ ఒప్పందాన్ని అడ్డుకుంటే బ్రేకప్ ఫీజు కింద 5 బి. డాలర్ల (సుమారు రూ.45,000 కోట్ల)నూ నెట్‌ఫ్లిక్స్ ఆఫర్ చేసినట్లు సమాచారం.

జీఎస్‌టీ తొలగింపుతో బీమా రంగానికి దన్ను

పాలసీ బజార్ జాయింట్ సీఈఓ సరబ్‌వీర్ సింగ్

హైదరాబాద్ (రాయదుర్గం), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం వ్యక్తిగత బీమా పాలసీలపై జీఎస్‌టీని పూర్తిగా తొలగించడంతో.. ఈ రంగం రెండు నెలల్లో గణనీయ వృద్ధి కనబరిచిందని పాలసీ బజార్ గ్రూప్ జాయింట్ సీఈఓ సరబ్‌వీర్ సింగ్ అన్నారు. శుక్రవారం సంస్థ 'ఇన్సూరెన్స్ కా సూపర్ హీరో' నాలుగో దశ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సంస్థ ద్వారా వివిధ ఆరోగ్య బీమా సంస్థల్లో పాలసీలు తీసుకున్న వినియోగదారులకు.. నిలిచిపోయిన, తిరస్కరణకు గురైన క్లెయిమ్స్‌లను మంజూరు చేయించి సహాయం అందించారు. ఈ సందర్భంగా సహాయం పొందిన పలువురిని ఇన్సూరెన్స్‌కా సూపర్ హీరో పేరుతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సరబ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తప్పకుండా ఆరోగ్య బీమా చేయించుకోవాలని సూచించారు. ప్రజలు తమ అనారోగ్య సమస్యలను దాచి ఆరోగ్య బీమా తీసుకోవడం, ఆసుపత్రిలో చేరే పరిస్థితి లేకపోయినా చేరడం, మోసపూరితంగా క్లెయిమ్స్‌కు యత్నించడం వంటి సందర్భాల్లో.. క్లెయిమ్స్ తిరస్కరణకు గురవుతాయని, అలా 4% వరకు ఉంటాయని చెప్పారు. పాలసీ బజార్ 30 లక్షల మంది జీవితాలకు రక్షణ కల్పిస్తోందని తెలిపారు. పాలసీ బజార్ ఫిన్‌టెక్ అధ్యక్షుడు రాజీవ్ గుప్త, సంస్థ హెల్త్ ఇన్సూరెన్స్ రెన్యూవల్స్ హెడ్ జితిన్ జైన్, డైరెక్టర్ సజ్జా ప్రవీణ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

2030లోపే 10,000 కోట్ల డాలర్ల వ్యాపారం

భారత్- రష్యా ద్వైపాక్షిక వాణిజ్యంపై ప్రధాని మోదీ



దిల్లీ: భారత్- రష్యా మధ్య 10,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.9 లక్షల కోట్లు) ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యాన్ని 2030 కంటే ముందే సాధిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్- రష్యా బిజినెస్ ఫోరమ్‌లో ఆయన మాట్లాడుతూ.. గతేడాది రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, తాను కలిసి ఈ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని గుర్తు చేసుకున్నారు. 'పుతిన్‌తో తదుపరి చర్చల అనంతరం, ఇరు దేశాల మధ్య వాణిజ్య వృద్ధికి ఉన్న అవకాశాలను పరిగణనలోకి తీసుకుని.. లక్ష్యాన్ని సాధించే దిశగా చర్యలను వేగవంతం చేస్తాం. నిర్దేశిత సమయం కంటే ముందే ఈ లక్ష్యాన్ని సాధిస్తామని నేను నమ్ముతున్నా' అని మోదీ వివరించారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య వాణిజ్యం 70 బిలియన్ డాలర్లు (సుమారు రూ.6.30 లక్షల కోట్లు)గా ఉంది. వ్యాపార సంస్థలకు సరళీకృత వ్యవస్థలను సృష్టిస్తున్నామని ప్రధాని తెలిపారు. భారత్, యూరేషియన్ ఎకనామిక్ యూనియన్ (రష్యా, ఆర్మేనియా, బెలారస్, కజకిస్థాన్, కిర్గిస్థాన్) మధ్య స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పంద (ఎఫ్‌టీఏ) చర్చలు ప్రారంభమయ్యాయని ఆయన వెల్లడించారు.

పరస్పర నమ్మకమే మూలం..

'వ్యాపారం కావచ్చు.. దౌత్య సంబంధం కావచ్చు.. ఏ భాగస్వామ్యానికైనా పరస్పర నమ్మకమే మూలం. భారత్, రష్యా మధ్య సంబంధాలకూ ఈ నమ్మకమే అత్యంత బలం. ఈ నమ్మకమే మా ఉమ్మడి ప్రయత్నాలకు మార్గనిర్దేశం చేస్తోంద'ని ప్రధాని తెలిపారు. అందుబాటు ధరల్లోనే, సమర్థమైన విద్యుత్ వాహనాలు (ఈవీలు), ద్విచక్రవాహనాలు, సీఎన్‌జీ వాహన విభాగాల్లో భారత్ అగ్రగామిగా ఉండగా.. అధునాతన సామగ్రికి దిగ్గజ ఉత్పత్తిదారుగా రష్యా ఉందని మోదీ వివరించారు. ఈవీ తయారీ, విడిభాగాలు, మొబిలిటీ సాంకేతికతల్లో ఇరు దేశాలు జట్టు కట్టడం ద్వారా దేశీయ అవసరాలు తీరడమే కాకుండా, అంతర్జాతీయ అభివృద్ధికి సహకారం అందించే వీలుంటుందని ఆయన అన్నారు. పౌర అణుశక్తి రంగంలోనూ ప్రైవేటు రంగానికి అవకాశం కల్పించనున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు.

భారత్- ఈఏఈయూ ఒప్పందం త్వరగా పూర్తవ్వాలి: పుతిన్

భారత్, 5 సభ్య దేశాలతో కూడిన యూరేషియన్ ఎకనమిక్ యూనియన్ (ఈఏఈయూ) మధ్య ఎఫ్‌టీఏ సాధ్యమైనంత త్వరగా పూర్తయితే.. వస్తువులు, సేవలు, నిధుల రాకపోకల విషయంలో అవరోధాలు తగ్గుతాయని వ్లాదిమిర్ పుతిన్ తెలిపారు.

- రష్యాలో రూ.10,800 కోట్ల (1.2 బిలియన్ డాలర్ల) పెట్టుబడి అంచనాతో ఎరువుల ప్లాంటు ఏర్పాటు చేసేందుకు రష్యా సంస్థ ఉరాల్‌కెమ్‌తో భారత్‌కు చెందిన ఎరువుల తయారీ సంస్థలు రాష్ట్రీయ కెమికల్స్ ఫెర్టిలైజర్స్, నేషనల్ ఫెర్టిలైజర్స్, ఇండియన్ పొటాష్ లిమిటెడ్ ఒప్పందం కుదుర్చుకున్నాయి.
- ఇంటర్నేషనల్ ట్రాక్డ్ ప్యాకెట్ సర్వీస్ కోసం జేఎస్‌సీ రష్యా పోస్ట్‌తో భారత తపాలా విభాగం (డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్స్) ద్వైపాక్షిక ఒప్పందాన్ని కుదుర్చుకుంది.

మరోసారి రిలయన్స్ గ్రూప్ ఆస్తుల జప్తు



దిల్లీ: రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ, ఆయన గ్రూపు కంపెనీలపై జరుగుతున్న మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా తాజాగా రూ.1120 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తెలిపింది. ముంబయిలోని రిలయన్స్ సెంటర్, ఒక గెస్ట్ హౌస్, కొన్ని నివాస ఆస్తులు, చెన్నైలో 231 ప్లాట్ల భూమి ఇందులో ఉన్నాయి. ఈ ఆస్తులు రిలయన్స్ హోమ్ ఫైనాన్స్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్‌కు చెందినవని, యెస్ బ్యాంక్ మోసం కేసులో దర్యాప్తులో భాగంగా అటాచ్ చేసినట్లు ఈడీ తెలిపింది. ఇంతకు ముందు రిలయన్స్ గ్రూప్‌పై ఉన్న మనీలాండరింగ్ కేసుల్లో ఈడీ రూ.8,997 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేయగా, తాజా వాటితో కలిపి మొత్తం జప్తు చేసిన ఆస్తుల విలువ రూ.10,117 కోట్లకు చేరింది.

నోయెల్ టాటా తల్లి కన్నుమూత



ముంబయి: టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా తల్లి సిమోన్ టాటా అనారోగ్యంతో ముంబయిలోని సిటీ హాస్పిటల్‌లో శుక్రవారం కన్నుమూశారు. ఆమె వయస్సు 95 సంవత్సరాలు. 'దేశంలోని ప్రముఖ కాస్మొటిక్ బ్రాండు అయిన లాక్మే వృద్ధిలో, వెస్ట్‌సైడ్ ఫ్యాషన్ రిటైల్ ప్రారంభంలో ఆమె పోషించిన పాత్ర మరువలేనిది' అని టాటా ట్రస్ట్స్ నివాళి అర్పించింది. స్విట్జర్లాండ్‌లో జన్మించిన సిమోన్... వ్యాపార, దాతృత్వ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనేవారు. సర్ రతన్ టాటా ఇన్‌స్టిట్యూట్ సహా పలు దాతృత్వ సంస్థల కార్యకలాపాలకు ఆమె మార్గనిర్దేశం చేశారని టాటా ట్రస్ట్స్ వెల్లడించింది. కొలాబాలోని కేథడ్రల్ ఆఫ్ ద హోలీ నేమ్ చర్చిలో ఆమె అంత్యక్రియలు శనివారం జరుగుతాయని తెలిపింది.

రూ.546 కోట్ల చెల్లింపు ఆదేశాలను సవాల్ చేస్తాం: అవధూత్ సాథే

స్టాక్ మార్కెట్ల నుంచి నిషేధించడంతో పాటు అనైతికంగా ఆర్జించిన రూ.546 కోట్ల లాభాలను చెల్లించాలంటూ, సెబీ ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేయనున్నట్లు అవధూత్ సాథే ట్రేడింగ్ అకాడమీ వెల్లడించింది. సెబీ మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొన్న ఆరోపణలను సంస్థ తోసిపుచ్చింది. విద్య, శిక్షణ సంస్థగానే తమ అకాడమీ నడుస్తోందని, ఎటువంటి పెట్టుబడుల సలహాదారు, రీసెర్చ్ అనలిస్ట్, ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా పనిచేయడం లేదని స్పష్టం చేసింది.

ఆ గ్లూకోజ్ మానిటర్ల వాడకం ఆపండి

యూఎస్‌ఎఫ్‌డీఏ

అబాట్ డయాబెటిస్ కేర్ తయారుచేసిన గ్లూకోజ్ మానిటర్ సెన్సార్‌ల వల్ల ఏడుగురు మరణించడం, సుమారు ఏడు వందల మంది తీవ్ర అనారోగ్య ముప్పు బారిన పడటంతో.. కొన్ని రకాల గ్లూకోజ్ మానిటర్‌ల వాడకాన్ని ఆపేయాలని అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) హెచ్చరించింది. కొన్ని ఫ్రీస్టయిల్ లిబ్రే 3, ఫ్రీస్టయిల్ లిబ్రే 3 ప్లస్ సెన్సార్లు తప్పుడు గ్లూకోజ్ రీడింగ్‌లను చూపించొచ్చని ఎఫ్‌డీఏ అధికారులు తెలిపారు. 'తప్పు రీడింగ్ వల్ల మధుమేహ రోగులు.. వ్యాధి చికిత్స కోసం అవలంబించే జాగ్రత్తలను తగ్గించే అవకాశం ఉంటుంది. కార్బోహైడ్రేట్లను ఎక్కువగా తినడం, ఔషధాలు, ఇన్సులిన్ తీసుకోవడాన్ని తగ్గించడం లేదా మానేయడం లాంటివి చేయొచ్చు. ఇలా ఆరోగ్యం విషయంలో తప్పుడు నిర్ణయాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడొచ్చు. కొన్ని సందర్భాల్లో రోగి మరణానికి దారితీయొచ్చ'ని ఎఫ్‌డీఏ హెచ్చరించింది. అమెరికాలోని ఒక ఉత్పత్తి కేంద్రంలో తయారైన సుమారు 30 లక్షల సెన్సార్స్‌లపై ఎఫ్‌డీఏ హెచ్చరికల ప్రభావం పడనుందని అబాట్ అధికారులు తెలిపారు.

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.439 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.4,189 కోట్లు

ఆర్‌బీఐ రెపోరేటును తగ్గించిన నేపథ్యంలో, శుక్రవారం దేశీయ సూచీలు లాభాల్లో ముగిశాయి. 2025-26 జీడీపీ వృద్ధి అంచనాలను 7.3 శాతానికి పెంచడం.. సెంటిమెంట్‌ను బలపరిచింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 6 పైసలు తగ్గి 89.95 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.16% లాభంతో 63.36 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో జపాన్ నష్టపోగా, మిగతావి లాభపడ్డాయి. ఐరోపా సూచీలు మెరుగ్గా ట్రేడయ్యాయి.

- బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ రూ.1.11 లక్షల కోట్లు పెరిగి రూ.470.96 లక్షల కోట్లు (5.24 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.
- సెన్సెక్స్ ఉదయం 140 పాయింట్ల (క్రితం ముగింపు 85,265.32) నష్టంతో 85,125.48 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ఆర్‌బీఐ నిర్ణయాలు వెలువడ్డాక, లాభాల్లోకి వచ్చిన సూచీ, ఇంట్రాడేలో 85,976.72 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 447.05 పాయింట్ల లాభంతో 85,712.37 వద్ద ముగిసింది. నిఫ్టీ 152.70 పాయింట్లు పెరిగి 26,186.45 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,985.35- 26,202.60 పాయింట్ల మధ్య కదలాడింది.

మెప్పించిన ఆర్‌బీఐ నిర్ణయాలు



- **ఆర్‌బీఐ సమీక్ష నేపథ్యంలో** వడ్డీ రేట్ల ఆధారిత షేర్లు మెరిశాయి. బ్యాంకింగ్ షేర్లలో బీఓబీ 1.56%, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ 1.18%, కోటక్ బ్యాంక్ 0.89% పెరిగాయి. వాహన షేర్లలో మారుతీ 1.75%, ఐషర్ 1.54%, భారత్ ఫోర్జ్ 0.83% లాభపడ్డాయి. స్థిరాస్తి విభాగంలో ప్రెస్టేజ్ ఎస్టేట్స్ 1.99%, డీఎల్ఎఫ్ 1.50% పరుగులు తీశాయి.
- నిర్వహణ పరమైన సమస్యలతో విమానాలు నిలిచిపోవడంతో గత నాలుగు రోజుల్లో **ఇండిగో** షేరు 7.22% నష్టపోయి రూ.5371.30కు చేరింది. డిసెంబరు 1 నుంచి కంపెనీ మార్కెట్ విలువ రూ.16190.64 కోట్లు తగ్గి రూ.2.07 లక్షల కోట్లకు పడింది.

సెన్సెక్స్ ▲ 447	నిఫ్టీ ▲ 153
85712	26186

- సెన్సెక్స్ 30 షేర్లలో 23 రాణించాయి. ఎస్‌బీఐ 2.46%, బజాజ్ ఫిన్‌సర్వ్ 2.24%, బజాజ్ ఫైనాన్స్ 1.89%, మారుతీ 1.75%, హెచ్‌సీఎల్ టెక్ 1.68%, ఎల్ అండ్ టీ 1.33%, ఎం అండ్ ఎం 1.23%, ఇన్ఫోసిస్ 1.14% లాభపడ్డాయి. హెచ్‌యూఎల్, ఎటర్నల్, టీఎంపీవీ, సన్‌ఫార్మా 3.51% వరకు నష్టపోయాయి.
రంగాల వారీ సూచీల్లో.. ఫోకస్డ్ ఐటీ, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, లోహ, టెక్ 0.90% వరకు పెరిగాయి. సేవలు, యంత్ర పరికరాలు, పరిశ్రమలు, ఎఫ్ఎమ్‌సీజీ నిరాశపరిచాయి. బీఎస్ఈలో 1740 షేర్లు లాభపడగా, 2423 స్క్రిప్‌లు నష్టపోయాయి. 175 షేర్లలో ఎటువంటి మార్పులేదు.
- క్వెస్ కార్ప్ సీఈఓగా లోహిత్ భాటియా పదోన్నతి పొందారు. జనవరి 1న ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

ఐపీఓ సమాచారం

- గజా క్యాపిటల్ బ్రాండ్ కింద కార్యకలాపాలు సాగించే గజా ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్, ఐపీఓ ద్వారా రూ.656 కోట్లు సమీకరించేందుకు సెబీ వద్ద ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది.
- ఏక్వస్ ఐపీఓ ముగిసేసరికి 101.63 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 4,20,26,913 షేర్లను జారీ చేయగా, 4,27,13,15,160 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీ విభాగంలో 120.92 రెట్లు, ఎన్ఐఐల నుంచి 80.62 రెట్లు, రిటెయిల్ విభాగంలో 78.05 రెట్ల స్పందన దక్కింది.
- మీషో ఐపీఓ చివరిరోజు 79.02 రెట్ల స్పందన నమోదైంది. ఇష్యూలో భాగంగా 27,79,38,446 షేర్లు జారీ చేయనుండగా, 21,96,29,80,575 షేర్లకు బిడ్లు వచ్చాయి. రిటెయిల్‌లో 19.04 రెట్ల స్పందన కనిపించింది.
- విద్యా వైర్స్ ఐపీఓ చివరి రోజు 26.59 రెట్ల స్పందన దక్కింది.

ఈనాడు సినిమా

సార్థక అభినేత్రి.. సావిత్రి

నేడు హైదరాబాద్‌లో 90వ జయంతి వేడుక



కళ్లతో అభినయించటమే ఓ నటికి ఉండాల్సిన ప్రధాన లక్షణమైతే తెలుగువారి మహానటి సావిత్రి పదహారణాల అభినేత్రి. దాదాపు 235 చిత్రాల్లో నటించి అపూర్వమైన తన నటనా ప్రతిభతో ప్రేక్షక హృదయాల్లో చెరగని ముద్ర వేశారు. ఇందులో సింహభాగం (129) తెలుగు చిత్రాలు కాగా, తమిళంలో 95.. హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో మిగతా చిత్రాలు చేశారు. కె.వి.రెడ్డి దర్శకత్వంలో వచ్చిన అజరామర చిత్రం 'మాయాబజార్' (1957)లో సావిత్రి నటన గురించి దిగ్గజ నటుడు అక్కినేని నాగేశ్వరరావు మాట్లాడుతూ.. "ఈ చిత్రంలో హీరో ఎవరో చెప్పడం చాలా కష్టం. ఒకానొక దశలో శశిరేఖే (సావిత్రి) హీరోగా కనిపిస్తుంది. ఘటోత్కచుడు శశిరేఖగా మారిన సందర్భాల్లో ఆమె నటన శిఖరస్థాయిని అందుకొంది" అన్నారు. సావిత్రి సార్థక అభినేత్రి అనేందుకు ఇంతకు మించిన ధ్రువపత్రం మరేం కావాలి! శనివారం సావిత్రి 90వ జయంతి. ఈ సందర్భంగా నేడు హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో ప్రత్యేక వేడుకని నిర్వహిస్తున్నారు.

☛ 1950లో 'సంసారం' చిత్రంతో సావిత్రి సినీరంగ ప్రవేశం చేశారు. ఈ చిత్రంలో అప్పటికే పదేళ్ల అనుభవం ఉన్న ఏఎన్నార్ సరసన కథానాయికగా ఆమెను తీసుకున్నారు. పదిహేనేళ్ల వయసులో తన అభిమాన నటుడి పక్కన నటించేందుకు ఆమె జంకుతుండటం చూసి, ఆ పాత్ర నుంచి తప్పించి అదే చిత్రంలో హీరోయిన్ స్నేహితురాళ్లలో ఒకరిగా చిన్న పాత్ర ఇచ్చారు. ఆ తర్వాత 'పాతాళభైరవి' (1951) చిత్రంలో చిన్న నృత్య సన్నివేశంలో నటించినప్పుడు దర్శకుడు కె.వి.రెడ్డి దృష్టిలో పడ్డారు. 'పెళ్లి చేసి చూడు', 'పల్లెటూరు' చిత్రాల్లో ఎన్టీఆర్‌తో కలిసి నటించాక సావిత్రి కాస్త కుదురుకున్నారు. అక్కినేని సరసన చేయలేకపోయాననే అనే పట్టుదలతో ఎదిగిన సావిత్రి 'బ్రతుకుతెరువు'లో తొలిసారిగా ఆయన పక్కన కథానాయికగా నటించారు. 1953లో వేదాంతం రాఘవయ్య తీసిన 'దేవదాసు' చిత్రానికి తొలి ఎంపిక షావుకారు జానకి. అనివార్య కారణాలతో ఆమె స్థానంలో సావిత్రి వచ్చారు. పార్వతి లాంటి బరువైన పాత్రకు ఈ కొత్త నటా! అని పరిశ్రమ విస్తుపోయింది.

అందరి నోళ్లను మూయిస్తూ ఏఎన్నార్‌తో పోటీపడి నటించిన సావిత్రి ఆ చిత్ర ఘనవిజయంలో తనూ భాగమయ్యారు. గ్లిజరిన్ అవసరం లేకుండా పార్వతి పాత్రను పోషించి, షాట్ పూర్తయ్యాక కూడా ఆమె ఏడుస్తూనే ఉండేవారట. 'దేవదాసు'తో వచ్చిన స్టార్‌డం ఆ తర్వాత పదిహేనేళ్లు ఆమెకు తిరుగులేకుండా చేసింది.

☛ ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వంలో అత్యధికంగా 14 చిత్రాల్లో సావిత్రి నటించారు. వీరిద్దరిదీ హిట్ కాంబినేషన్. తోడికోడళ్ళు, నమ్మినబంటు, వెలుగునీడలు, మూగమనసులు, డాక్టర్ చక్రవర్తి, సుమంగళి లాంటి గొప్ప సినిమాలు ఇందులో ఉన్నాయి. తోడికోడళ్ళు చిత్రంలోని 'ఆడుతు పాడుతు పనిచేస్తుంటే..' అనే పాటలో ఆమె అక్కినేనితో కలిసి గూడతో నీళ్లు తోడుతారు. దీని కోసం ముందుగా చాలాసేపు గూడతో నీళ్లు తోడటం ప్రాక్టీసు చేశారామె. 'దొంగరాముడు' చిత్రంలో సావిత్రి కూరగాయల గంప నెత్తిన పెట్టుకొని గట్టుమీద నడవాల్సిన సన్నివేశంలో... దర్శకుడు ఖాళీ గంపతోనే చేయమని చెప్పినా ఆమె వినలేదట. ఇలాంటి సంఘటనలన్నీ నటనపై ఆమె అంకిత భావానికి నిదర్శనం.

నటుడు పద్మనాభం తీసిన 'దేవత'లో కథానాయికగా బరువైన పాత్రకు సావిత్రినే అనుకున్నారు. ఆ సమయంలో గర్భవతిగా ఉన్న ఆమె ఆర్నెల్లు షూటింగు అంటే కష్టమన్నారు. పద్మనాభం తన ఇల్లు తాకట్టు పెట్టి మూడు నెలల్లో సావిత్రితో షూటింగు పూర్తిచేసి విజయం సాధించారు. ఆరు చిత్రాలకు సావిత్రి దర్శకత్వం వహించారు. ఎన్టీఆర్ హీరోగా ఆమె తీసిన 'మాతృదేవత' విజయవంతమైన చిత్రంగా నిలిచింది. ఆ తర్వాత 'చిన్నారి పాపలు' లాంటి కొన్ని చిత్రాలతో ఆమె ఆర్థికంగా నష్టపోయి చేతులు కాల్చుకొన్నారు. చేతికి ఎముక లేకుండా చేసిన దానాలు కూడా ఇందుకు దోహదం చేశాయి. జీవిత చరమాంకంలో దాదాపు 18 నెలలు కోమాలో ఉన్న సావిత్రి తన 46వ ఏట 1981లో మృతిచెందారు. ఆమె కనుమరుగై అయిదు దశాబ్దాలు కావస్తున్నా తెలుగువారికి మహానటి అంటే ఇప్పటికీ ముందుగా గుర్తుకువచ్చే పేరు సావిత్రే.

'మూగమనసులు'లో పడవ నడిపే పాత్రను పోషించిన అక్కినేనిని జమీందారుగారి అమ్మాయి రాధ (సావిత్రి) 'ఏరా' అని పిలిచినా ఎంతో అందంగా, హుందాగా ఉంటుంది. నర్తనశాల, పాండవ వనవాసం చిత్రాల్లో ఆమె ద్రౌపది పాత్రను పోషించారు. ఈ రెండు చిత్రాలకు 'పౌరాణిక బ్రహ్మ' కమలాకర కామేశ్వరరావు దర్శకుడు. పాండవ వనవాసంలో భీముడిగా ఎన్టీఆర్ నటించగా, ఇద్దరు అగ్రనటులు ఉన్నపుడు పాట లేకపోతే ఎలాగని దర్శకుడు భీముడు, ద్రౌపదికి ఓ డ్యూయెట్ పెట్టారు. 'హిమగిరి సొగసులు మురిపించెను మనసులు' అనే ఆ పాట ఎవర్‌గ్రీన్ హిట్‌గా నిలిచింది. సావిత్రి నటజీవితంలో 1955లో నటించిన 'అర్ధాంగి', 'మిస్సమ్మ', 'దొంగరాముడు', కన్యాశుల్కం' చిత్రాలు.. 1962లో వచ్చిన 'గుండమ్మకథ', 'రక్తసంబంధం', 'మంచిమనసులు', 'ఆరాధన' ఆమె నటనా వైదుష్యానికి గీటురాళ్లు. బెంగాలీ చిత్రం ఆధారంగా తీసిన 'చివరకు మిగిలేది' సినిమా ఆర్థికంగా విజయం సాధించకపోయినా, అందులోని నర్సు పాత్ర నటిగా తనకెంతో తృప్తినిచ్చిందని సావిత్రి పలు ఇంటర్వ్యూల్లో చెప్పారు.

– జి.ఎస్.జమీర్ హుసేన్

సంక్రాంతి బరిలో శర్వానంద్



కథానాయకుడు శర్వానంద్ 'నారీ నారీ నడుమ మురారి' చిత్రంతో సంక్రాంతి బరిలో వినోదాలు పంచేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన.. సంయుక్తా మేనన్, సాక్షి వైద్య నాయకానాయికలుగా నటించిన ఈ సినిమాని రామ్ అబ్బరాజు తెరకెక్కించారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించారు. ఈ చిత్రాన్ని ముగ్గుల పండక్కి థియేటర్లలోకి తీసుకొస్తున్నట్లు శుక్రవారం ప్రకటించారు. "వినోదం నిండిన కుటుంబ కథతో తెరకెక్కిన చిత్రమిది. ఈ సంక్రాంతికి అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించే సినిమా అవుతుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి. త్వరలో విడుదల తేదీపై స్పష్టత ఇవ్వనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, ఛాయాగ్రహణం: జ్ఞానశేఖర్ వీఎస్, యువరాజ్.

ఆద్యంతం థ్రిల్ చేసేలా..'శంబాల'



'శంబాల' చిత్రంతో క్రిస్మస్‌కి థియేటర్లలో సందడి చేయనున్నారు ఆది సాయికుమార్. ఆయన హీరోగా నటించిన ఈ సినిమాని యుగంధర్ ముని తెరకెక్కించారు. రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్ర నైజాం హక్కుల్ని మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ సొంతం చేసుకుంది. ఈ విషయాన్ని నిర్మాతలు శుక్రవారం ప్రకటించారు. "ఆద్యంతం థ్రిల్ చేసే హారర్ ఫాంటసీ థ్రిల్లర్‌గా ఈ సినిమాని రూపొందించాం. ఇది ప్రేక్షకులకు మంచి థియేట్రికల్ అనుభూతిని అందిస్తుంది" అని చిత్ర బృందం తెలిపింది. ఈ సినిమా ఈనెల 25న థియేటర్లలోకి రానుంది.

'అఖండ 2' విడుదల వచ్చే వారమేనా?



అగ్ర కథానాయకుడు బాలకృష్ణ నటించిన 'అఖండ 2' విడుదలపై ఇంకా స్పష్టత రాలేదు. నిర్మాణ సంస్థకు ఎదురైన ఆర్థిక వివాదాలన్నీ కొలిక్కి వచ్చాకే కొత్త విడుదల తేదీని ప్రకటించే అవకాశాలున్నాయి. ప్రస్తుత పరిణామాల్ని బట్టి వచ్చే వారం కానీ, క్రిస్మస్ సందర్భంగా కానీ ఈ సినిమా విడుదలయ్యే అవకాశాలున్నాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. విజయవంతమైన బాలకృష్ణ - బోయపాటి శ్రీను కలయికలో 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదల కావల్సి ఉంది. గురువారం ప్రత్యేక ప్రదర్శనల ఏర్పాటుతోనే సందడి మొదలైంది. అయితే 'అఖండ 2' నిర్మాతలు తమకు బకాయిలు చెల్లించాలంటూ ప్రముఖ నిర్మాణ, పంపిణీ సంస్థ ఏరోస్ ఇంటర్నేషనల్ మద్రాస్ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. గురువారం న్యాయస్థానం స్టే ఇవ్వడంతో విడుదలకు కొన్ని గంటల ముందు అర్ధంతరంగా 'అఖండ 2' వాయిదా పడింది. వెంటనే నిర్మాతలు ఈ వివాదాన్ని పరిష్కరించుకోవడం కోసం పలువురు సినీ ప్రముఖులతో కలిసి రంగంలోకి దిగారు. గురువారం నుంచి శుక్రవారం రాత్రి వరకూ చర్చలు జరుగుతూనే ఉన్నాయి. దిల్‌రాజు, డి.సురేశ్‌బాబుతోపాటు, కథానాయకుడు బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను తదితరులు ఏరోస్ సంస్థతోపాటు, పలువురు ఫైనాన్షియర్లతో చర్చలు జరిపారు. వీటిపై శనివారం ఓ స్పష్టత వచ్చే అవకాశాలు ఉన్నాయి. అందుకే ఈ సినిమా ఇక ఈ వారం విడుదల లేనట్టే అని తెలుస్తోంది. వివాదం పరిష్కారమయ్యాక ఎప్పుడు విడుదల చేయాలనే విషయంపై ఓ నిర్ణయం తీసుకోనున్నారు.

బహిరంగంగా చర్చించే విషయాలు కావు: డి.సురేశ్‌బాబు

సినిమాలకు ఆర్థిక సంబంధమైన సమస్యలు సహజమని, ఇంతకుముందూ వచ్చాయనీ, ఇప్పుడూ వస్తున్నాయన్నారు ప్రముఖ నిర్మాత డి.సురేశ్‌బాబు. 'సైక్ సిద్ధార్థ' సినిమా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన 'అఖండ 2' వివాదంపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ "ఆర్థికపరమైన విషయాలు బహిరంగంగా చర్చించకూడదు. కానీ దురదృష్టవశాత్తూ ఈమధ్య సినిమా వ్యాపార వ్యవహారాలు వీధికెక్కుతున్నాయి. ప్రతి ఒక్కరూ ఇంత డబ్బులంట, ఈ కారణాలంట అంటూ అనవసరంగా ప్రస్తావిస్తున్నారు. ప్రేక్షకులకు సినిమా అందించడం ముఖ్యం కానీ, ఇవన్నీ ఎందుకు? ముందుగా ప్రణాళికలు ఉంటే ఇలాంటి సమస్యల నుంచి గట్టెక్కుతాం. 'అఖండ 2' సమస్య కూడా పరిష్కారం అవుతుంది" అన్నారు.

'ధురంధర్ 2' వచ్చే ఏడాదిలో

'ధురంధర్'గా థియేటర్లలో సందడి చేస్తున్నారు బాలీవుడ్ కథానాయకుడు రణ్‌వీర్‌సింగ్. ఆయన ప్రధాన పాత్రలో ఆదిత్యధర్ దర్శకత్వం వహించిన చిత్రమిది. జియో స్టూడియోస్ నిర్మించింది. సారా అర్జున్ కథానాయిక. సంజయ్ దత్, ఆర్.మాధవన్, అక్షయ్ ఖన్నా కీలక పాత్రలు పోషించారు. వాస్తవ సంఘటనలు, రాజకీయ సంఘర్షణలు తదితర అంశాలతో తీర్చిదిద్దిన ఈ చిత్రంలో తనదైన నటనతో మునుపెన్నడూ చూడని విధంగా కనిపించి సినీప్రియుల దృష్టిని ఆకర్షించారు రణ్‌వీర్. ఇప్పుడీ స్పై యాక్షన్ సినిమాకి కొనసాగింపుగా 'ధురంధర్ 2' రాబోతున్నట్లు ప్రకటించింది చిత్రబృందం. ఈ సీక్వెల్‌ను వచ్చే ఏడాది ఈద్ సందర్భంగా మార్చి 19న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు 'ధురంధర్' సినిమా ముగింపులో వెల్లడించింది.

రామ్‌గోపాల్ వర్మ.. షో మ్యాన్



దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ 'షో మ్యాన్'గా ప్రేక్షకుల్ని పలకరించేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ సినిమాని కొత్త దర్శకుడు నూతన్ తెరకెక్కిస్తున్నారు. తుమ్మలపల్లి రామసత్యనారాయణ నిర్మాత. ఈ సినిమా ఇటీవలే చిత్రీకరణ ప్రారంభించుకున్నట్లు శుక్రవారం ప్రకటించారు. ఇది గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే చిత్రమని.. సంక్రాంతికి ట్రైలర్ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత రామసత్యనారాయణ తెలియజేశారు. ఈ సినిమాలో సుమన్ ప్రతినాయక పాత్ర పోషిస్తున్నారు.

ఏమో... గందరగోళంగానే ఉన్నా!

"విజయం, వైఫల్యం అనే భావన నుంచి నన్ను నేను దూరం చేసుకున్నాన"ని అంటోంది కథానాయిక రాశీ ఖన్నా. ఇటీవలే '120 బహాదుర్' సినిమాతో తెరపై సందడి చేసిందీ భామ. ఇందులో మేజర్ షైతాన్ సింగ్ భార్య పాత్రలో కనిపించి తనదైన నటనతో ఆకట్టుకుంది. వైవిధ్యమైన పాత్రలతో ప్రయాణిస్తున్న ఈమె.. ప్రస్తుతం 'ఉస్తాద్ భగత్ సింగ్', 'బ్రిడ్జ్' తదితర సినిమాలతో బిజీగా గడుపుతోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రాశి.. తన సినీ ప్రయాణం గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది.



"నా కెరీర్‌లో నేను వరుసగా రూ.100 కోట్లు వసూలు చేసిన చిత్రాల్లో నటించిన రోజులు ఉన్నాయి. అయినా కూడా అవకాశాల కోసం ఇంకా ఎదురు చూస్తున్నాను. అలాగని రూ.100కోట్లు వసూలు చేసిన చిత్రాల్లో నటించినంత మాత్రానా.. మీకు మరిన్ని అవకాశాలు వస్తాయనే నమ్మకం లేదు. కొన్ని సార్లు పరాజయాలు వచ్చినప్పుడు కూడా మంచి ఆఫర్లను అందుకున్నా. ఈ విషయంలో చాలా గందరగోళంగా ఉన్నా. నా సినీ ప్రయాణం ప్రత్యేకంగా, చాలా వింతగా ఉంది. ఈ ప్రక్రియను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నా. కొన్ని సార్లు నా సినిమా బాగా ఆడకపోయినా నాలోని సామర్థ్యాన్ని చూసే నన్ను ఎంపిక చేసుకుంటారని నమ్ముతుంటా. ఇంకొన్ని సార్లు.. నేను ఇంత మంచి హిట్ కొట్టి కూడా.. అవకాశాలు రావడానికి ఎందుకు ఇంత సమయం పడుతుందని నన్ను నేను ప్రశ్నించుకుంటా".

బాలీవుడ్‌లోనూ ఇదే వైఖరి

"సినిమాల్లో ఆడవాళ్లను ఆట వస్తువులుగా చూపించడం చాలా కాలంగా వస్తున్నదే. అంతటా ఇలానే ఉంది. మహిళా పాత్రలు ఇంకా అనుకున్న స్థాయిలో రావట్లేదు. భవిష్యత్తులో ఏమైనా మార్పులు జరుగుతాయేమో చూడాలి. అయితే కేవలం ఇది దక్షిణాది చిత్రపరిశ్రమకే పరిమితం కాదు.. బాలీవుడ్‌లోనూ మహిళా పాత్రల పట్ల ఇదే వైఖరి. కానీ ఇది పూర్తిగా ఆయా నటుల ఛాయిస్‌పై ఆధారపడి ఉంటుంది. కొంతమందికి ఇలాంటి పాత్రలతో ఇబ్బంది ఉండదు. మరికొంతమంది తారలు దీన్నొక సమస్యగా చూస్తున్నారనేది నా అభిప్రాయం".

విజయం నాలో అహాన్ని పెంచదు

"సినిమాల హిట్, ఫ్లాప్‌ల గురించి పట్టించుకోవడం మానేశాను. ఎందుకంటే ఒక చిత్రం విజయం సాధిస్తే అది నాలో అహాన్ని పెంచదు. అలాగని వైఫల్యం నన్ను ప్రభావితం చేయదు. బాధ పెట్టదు. ఒక సినిమా విజయం సాధించినా, విఫలమైనా.. దాన్ని దాటుకొని ముందుకు వెళ్లే పరిస్థితికి వచ్చేశాను. ప్రస్తుతం నా దృష్టంతా శ్రద్ధగా పని చేయడం గురించే. నటిగా వైవిధ్యమైన, శక్తిమంతమైన పాత్రలు ఎంచుకుంటూ అత్యుత్తమంగా ప్రదర్శన ఇవ్వాలనేదే నా కోరిక".

స్క్రిప్ట్ చదవకుండా సంతకం చేసిన సినిమా అది

"తమిళ పరిశ్రమలో చాలా క్రమశిక్షణ ఉంది. తెలుగు పరిశ్రమలో నాకు ప్రేక్షకుల నుంచి ఎక్కువ మద్దతు లభించింది. ఎందుకంటే అక్కడి అభిమానులు మిమ్మల్ని అమితంగా నమ్ముతారు. హిందీ పరిశ్రమలో పాత్రలతో ప్రయోగాలు చేసే స్వేచ్ఛ ఉంది. అందుకే నాకు ఈ మూడు పరిశ్రమలు చాలా ముఖ్యం. కెరీర్ పరంగా ఎన్నో గొప్ప విషయాలు నేర్పించాయి. వాణిజ్య, కంటెంట్ ఆధారిత సినిమాలు.. నేను రెండింటినీ ఇష్టపడతాను. నాకు చాలా కలల పాత్రలు ఉన్నాయి.. యాక్షన్, పీరియాడిక్ నేపథ్యంలో సినిమాలు చేయాలనుకుంటున్నా. నేను స్క్రిప్ట్ చదవకుండా సంతకం చేసిన మొదటి సినిమా 'ఉస్తాద్ భగత్ సింగ్'. పవన్ కల్యాణ్‌తో పనిచేయాలనే నా కల ఈ సినిమాతో నెరవేరింది".

'ఈషా'లో షాక్‌కి గురి చేసే అంశాలు చాలానే!



"అందర్నీ ఉలిక్కిపడి లేచేలా చేసే సినిమా 'ఈషా'. మూఢనమ్మకాలు, ఆత్మలు అన్నింటినీ ఈ చిత్రంలో చర్చిస్తున్నాం" అన్నారు దర్శకుడు శ్రీనివాస్ మన్నె. ఆయన దర్శకత్వంలో అఖిల్ రాజ్, త్రిగుణ్, హెబ్బా పటేల్ ప్రధాన పాత్రధారులుగా నటించిన ఈ సినిమాని హేమ వెంకటేశ్వరరావు నిర్మించారు. ఇది నిర్మాతలు బన్నీవాస్, వంశీ నందిపాటి ద్వారా ఈనెల 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు శ్రీనివాస్.

■ "ఈ సినిమాలో షాక్‌కి గురి చేసే అంశాలు చాలా ఉన్నాయి. సెన్సార్ వాళ్లు సినిమా చూసి చాలా భయపెట్టిందన్నారు. ఇది పిల్లలు కూడా చూసి.. ఆస్వాదించేలాగే ఉంటుంది. సున్నిత మనస్కులు దీన్ని చూడొద్దు. సృష్టిలో అన్నీ ఉంటాయి. ఆత్మ అనేది లేకపోతే ఆ పదమే పుట్టదు కదా. మంచి ఉన్నట్లే చెడు కూడా ఉంటుంది. మనకు జరగనంత వరకు ఏదైనా మూఢనమ్మకమే. ఒకవేళ జరిగితే అది నమ్మకంగా మారుతుంది. ఈ విషయాల్నే దీంట్లో చాలా వాస్తవికంగా చూపిస్తున్నాం. అఖిల్ రాజ్, త్రిగుణ్, హెబ్బా పటేల్‌తో పాటు సినిమాలోని ప్రతి పాత్రకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. దర్శకుడిగా నాకు అన్ని రకాల చిత్రాలు చేయాలని ఉంది. తర్వాతి సినిమా కోసం కొన్ని కథలు సిద్ధం చేసుకున్నా. త్వరలో ఆ ప్రాజెక్ట్‌ను ప్రకటిస్తా".

"గతంలో నా నుంచి వచ్చిన 'కథ' చిత్రం కమర్షియల్‌గా ఆడకున్నా.. మంచి ప్రశంసలొచ్చాయి. జెనీలియాకు నంది అవార్డు కూడా వచ్చింది. కానీ, ఆ తర్వాత నా వ్యక్తిగత కారణాల వల్ల దర్శకత్వం నుంచి విరామం తీసుకున్నా. ఈ గ్యాప్‌లోనే కొన్ని కథలు సిద్ధం చేసుకున్నా. వాటిలో ఒకటే ఈ 'ఈషా'. చాలా బలమైన కంటెంట్ ఉన్న సినిమా ఇది. చావు - పుట్టుకలు, దైవత్వం, సృష్టి చేసే పనులు.. ఇలా అన్ని అంశాలతో ముడిపడి ఉన్న చక్కటి హారర్ థ్రిల్లర్ ఇది. సాంకేతికంగా అత్యున్నతంగా ఉంటుంది. మేకప్, కాస్ట్యూమ్స్, లైటింగ్, సౌండ్ డిజైనింగ్ అన్నింటిలో జాగ్రత్తలు తీసుకున్నాం".

ప్రయత్నానికి ఓటమంటూ ఉండదు! డి.సురేశ్ బాబు



శ్రీనందు, సురేశ్‌బాబు, యామిని

"ఇంతకుముందు ఎప్పుడూ చేయని రీతిలో... ఓ కామిక్ బుక్‌లా చేసిన విభిన్నమైన సినిమా 'సైక్ సిద్ధార్థ'. ఇలాంటి ప్రత్యేకమైన ప్రయత్నానికి అండగా నిలవాలనే మా సంస్థ నుంచి విడుదల చేస్తున్నాం" అన్నారు ప్రముఖ నిర్మాత డి.సురేశ్‌బాబు. ఆయన సురేశ్ ప్రొడక్షన్స్ పతాకంపై, రానా దగ్గుబాటికి చెందిన స్పిరిట్ మీడియాతో కలిసి ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్న చిత్రమే 'సైక్ సిద్ధార్థ'. శ్రీనందు కథానాయకుడిగా నటిస్తూనే, శ్యామ్ సుందర్‌రెడ్డి తుడితో కలిసి నిర్మించారు. యామినీ భాస్కర్ కథానాయిక. వరుణ్‌రెడ్డి దర్శకుడు. శుక్రవారం హైదరాబాద్‌లో 'ధుమ్ రకుమ్...' అంటూ సాగే పాటని విడుదల చేశారు. ఈ సందర్భంగా డి.సురేశ్‌బాబు మాట్లాడుతూ "నందు నాకు 'పెళ్లిచూపులు' సమయం నుంచీ తెలుసు. ప్రయత్నానికి ఎప్పుడూ ఓటమి ఉండదు. ప్రఖ్యాత ఏవీఎం నిర్మాణ సంస్థ నినాదం ఇదే. పని చేస్తూ ఉంటే ఎప్పుడో ఒకసారి ఫలితం తప్పకుండా వస్తుంది. నందు కూడా అలాంటి ప్రయత్నమే చేశాడు. 'పెళ్లిచూపులు', 'కేరాఫ్ కంచరపాలెం' తర్వాత అంత ప్రత్యేకంగా అనిపించిన ఈ సినిమాని కొని మా సంస్థ ద్వారా విడుదల చేస్తున్నా" అన్నారు. ఈ కార్యక్రమంలో కథానాయకుడు నందు, యామినీ భాస్కర్, సంగీత దర్శకుడు స్మరణ్‌సాయి తదితర చిత్రబృందం పాల్గొంది.

ఆదివాసీ మహిళ ప్రతీకారం

'మంగళవారం' విజయం తర్వాత నటి పాయల్ రాజ్‌పుత్ నుంచి రానున్న కొత్త చిత్రం 'వెంకటలచ్చిమి'. ఆమె టైటిల్ పాత్ర పోషించిన ఈ సినిమాని ముని తెరకెక్కించారు. రాజా, పవన్ బండ్రెడ్డి నిర్మించారు. శుక్రవారం పాయల్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఒంటి నిండి గాయాలు, రక్తపు మరకలతో.. జైలు గదిలో పైకప్పుకు తలకిందులుగా వేలాడదీసినట్లుగా పాయల్ కనిపించిన తీరు ఆసక్తి రేకెత్తించేలా ఉంది. "ఆదివాసీ మహిళ ప్రతీకార కథగా ఈ సినిమా రూపొందుతోంది. బలమైన భావోద్వేగాలతో ఆద్యంతం థ్రిల్ పంచుతుంది. ఈ చిత్రం తర్వాత పాయల్‌ని అందరూ వెంకటలచ్చిమి అనే పిలుస్తారు" అని దర్శక నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: వికాశ్, ఛాయాగ్రహణం: రాహుల్ మాచినేని.



పాయల్ రాజ్‌పుత్

జాబిలి తమిళ ప్రేమకథ



ఏగన్, శ్రీదేవి

'కోర్ట్' సినిమాలో జాబిలి కనిపించి సినీప్రియుల మనసుల్ని కదిలించింది శ్రీదేవి. ఇప్పుడామె తమిళంలో తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమైంది. ఆమె, ఏగన్ జంటగా 'హైకూ' అనే చిత్రంలో నటిస్తున్నారు. యువరాజ్ చిన్నసామి దర్శకత్వం వహిస్తున్నారు. శుక్రవారం ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటిస్తూ.. ఇన్‌స్టా వేదికగా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఈ పోస్టర్‌ను చూస్తే దీన్నొక యూత్‌ఫుల్ లవ్‌స్టోరీతో తీర్చిదిద్దుతున్నట్లు స్పష్టమవుతోంది. ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌లో ఫెమినా జార్జ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. విజయ్ బుల్గానిన్ సంగీతమందిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాల్ని త్వరలో వెల్లడించనున్నట్లు తెలిపాయి సినీ వర్గాలు. ప్రస్తుతం శ్రీదేవి ఖాతాలో 'బ్యాండ్‌మేళం' అనే సినిమా కూడా ఉంది.

'సిగ్మా'.. ప్రత్యేక అందం

సందీప్ కిషన్ హీరోగా లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న చిత్రం 'సిగ్మా'. ఈ సినిమాతో కథానాయకుడు విజయ్ తనయుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం కానున్న సంగతి తెలిసిందే. ముగింపు దశలో ఉన్న ఈ చిత్రంలో ఓ చక్కటి ప్రత్యేక గీతముంది. ఆ పాట కోసం చిత్ర బృందం నటి కేథరిన్‌ను రంగంలోకి దించినట్లు శుక్రవారం ప్రకటించింది. ఓ భారీ సెట్‌లో సందీప్ - కేథరిన్‌లపై పాట చిత్రీకరణ పూర్తి చేసినట్లు.. అందులో వాళ్లిద్దరూ వేసిన హుషారైన స్టెప్పులు ఆకర్షణగా నిలవనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. విభిన్నమైన యాక్షన్ కామెడీ అడ్వెంచర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమా వచ్చే ఏడాది వేసవికి తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి విడుదల కానుంది. ఈ చిత్రానికి తమన్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.



కేథరిన్

కరెంట్ అఫైర్స్



◆ కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) దేశంలోనే తొలిసారిగా పూర్తిగా మహిళలతో నిర్వహించే తన సెంట్రల్ స్టోర్ యూనిట్‌ను ఇటీవల ఎక్కడ ప్రారంభించింది? **జ:** కోర్బా (ఛత్తీస్‌గఢ్)

◆ వాతావరణ మార్పుల నేపథ్యంలో పగడపు జన్యు వైవిధ్యాన్ని కాపాడటానికి, రీఫ్ పర్యావరణ వ్యవస్థలను రక్షించడానికి ఏ దేశం ఆగ్నేయాసియాలోనే మొదటిసారిగా పగడపు లార్వా క్రయో బ్యాంక్‌ను ఇటీవల ప్రారంభించింది? **జ:** ఫిలిప్పీన్స్ (దీనిని ఫిలిప్పీన్స్, తైవాన్, ఇండోనేసియా, మలేసియా, థాయ్‌లాండ్‌లకు చెందిన శాస్త్రీయ సంస్థల మధ్య సహకారంలో భాగంగా ఏర్పాటు చేశారు.)

మాదిరి ప్రశ్నలు

◆ ప్రపంచ పత్తి దినోత్సవం(వరల్డ్ కాటన్ డే)ను ఏ రోజున నిర్వహిస్తారు?
జ: అక్టోబరు 7 (మొదటి ప్రపంచ పత్తి దినోత్సవాన్ని 2019 అక్టోబరు 7న జెనీవాలో ప్రపంచ వాణిజ్య సంస్థ నేతృత్వంలో నిర్వహించారు.)

◆ మానవ రోగనిరోధక వ్యవస్థ దాని సొంత కణజాలాలపై దాడి చేయకుండా ఉంచే ప్రాథమిక యంత్రాంగమైన పరిధీయ రోగనిరోధక సహనం (పెరిఫెరల్ ఇమ్యూన్ టాలరెన్స్)పై మార్గదర్శక ఆవిష్కరణలకుగాను 2025 సంవత్సరానికి నోబెల్ బహుమతిని ఎవరికి ప్రకటించారు?
జ: మేరీ ఇ బ్రంకో, ఫ్రెడ్ రామ్స్‌డెల్ (అమెరికా), షిమోన్ సకాగుచి (జపాన్)

మరింత సమాచారం

JUNIOR INTER Physics

Units and Measurements

◆ **What are significant figures and what do they represent when reporting the result of a measurement?** **2 Marks**

A: Significant Figures: The digits of a number that are definitely known plus one more digit that is estimated are called significant digits or significant figures.

e.g.: Time period of a simple pendulum is 1.62. The digits 1 and 6 are reliable while the digit 2 is uncertain.

◆ **Distinguish between Fundamental Units and Derived Units.**

A: Fundamental Units: Units of fundamental quantities are called fundamental units. They can neither be derived from one another nor can they be resolved into other units.

Derived Units: Units of derived quantities are called derived units.

◆ **What are the two fundamental physical quantities used to measure angle?**

A: 1) Plane Angle
2) Solid Angle

Final Exams-2026 IMPORTANT Q & A

◆ **Define Plane Angle.**

A: Plane Angle is the ratio of length of arc to radius.

◆ **What is meant by dimension of a Physical quantity?**

A: The dimensions of a Physical quantity are defined as the powers to which fundamental quantities are raised to represent it.

Motion in a Straight Line

◆ **The States of motion and Rest are relative. Explain.**

A: Rest: If the position of a body does not change with respect to surroundings, it is said to be at rest.

Motion: If the position of a body changes with respect to surroundings, it is said to be in motion.

By the definitions rest and motion are relative with respect to surroundings. **2 Marks**

◆ **Is it possible for a body to have acceleration but zero velocity?**

A: In case of vertically projected body at maximum height it's velocity is zero. But acceleration g (vertically downward), which is not zero.

For more IMP Q & A



Writer: Allu Rambabu

జనరల్ స్టడీస్ ఇండియన్ ఎకానమీ

కనీస అవసరాల ఖర్చులే కొలమానాలు!

ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతోంది. అయినప్పటికీ పేదరికం ఒక పెద్ద సమస్యగానే మిగిలి ఉంది. కోట్లాది మంది ప్రజలు కనీస అవసరాల కోసం నేటికీ అష్టకష్టాలు పడుతున్నారు. ఈ పరిస్థితి దేశ ఆర్థిక వ్యవస్థలోని లోతైన అసమానతలకు అద్దం పడుతోంది. ఇది సంఖ్యాపరమైన సమస్య మాత్రమే కాదు, గౌరవానికి, సామాజిక న్యాయానికి, మానవాభివృద్ధికి ముడిపడిన సంక్లిష్టమైన అంశం. పేదరికంతో బాధపడుతున్న వారిని గుర్తించడానికి అనేక ప్రమాణాలు అందుబాటులో ఉన్నాయి. ప్రధానంగా ఆదాయం, వినియోగ స్థాయులను, వ్యయాలను పరిగణనలోకి తీసుకొని దారిద్ర్యరేఖను నిర్ణయించారు. ఈ నేపథ్యంలో పేదరికాన్ని కొలవడానికి ప్రభుత్వం అనుసరిస్తున్న పద్ధతులను పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. అందుకోసం ఏర్పాటైన వివిధ కమిటీల అంచనాలు, గణాంకాలపై అవగాహన పెంచుకోవాలి.

పేదరికపు రేఖ (దారిద్ర్యరేఖ): ఇది భారతదేశంలో పేదరికాన్ని అంచనా వేయడానికి ఉపయోగించే ఒక సాధారణ పద్ధతి. ఆదాయం లేదా వినియోగ స్థాయులపై ఆధారపడి ఉంటుంది. ఆదాయం లేదా వినియోగం నిర్దేశిత కనీస స్థాయి కంటే తక్కువగా ఉంటే ఆ కుటుంబం దారిద్ర్యరేఖకు దిగువన ఉందని చెబుతారు. మరోరకంగా చెప్పాలంటే ఒక వ్యక్తి జీవించడానికి కావాల్సిన కనీస అవసరాలను నిర్ణయించి, వాటిని పొందడానికి చేయాల్సిన కనీస వ్యయాన్ని నిర్ధారిస్తారు. ఆ మేరకు కనీస వ్యయాన్ని చేయలేని లేదా అంతకంటే తక్కువ వ్యయం చేస్తున్న వారిని పేదరికపు రేఖకు దిగువన (బీపీఎల్) ఉన్నవారుగా పేర్కొంటారు.

> సంక్షేమం స్పష్టంగా లోపించిన స్థితి లేదా కనీస జీవన ప్రమాణాలను కూడా పొందలేని స్థితే పేదరికం.
> – ప్రపంచ బ్యాంకు

THE WORLD BANK

దారిద్ర్యరేఖ గణన: భారతదేశంలో పేదరికాన్ని ఇప్పుడు నీతి ఆయోగ్ టాస్క్‌ఫోర్స్, గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ (ఎంఓఎస్‌పీఐ) ఆధ్వర్యంలోని నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ సేకరించిన డేటా ఆధారంగా లెక్కిస్తున్నారు. గతంలో ఈ బాధ్యతను ప్రణాళికా సంఘం నిర్వహించేది. ఇప్పుడు నీతి ఆయోగ్ చేపడుతోంది.



పేదరిక రేఖ - డేటా సేకరణ పద్ధతులు

యూనిఫాం రిఫరెన్స్ పీరియడ్(యూఆర్‌పీ): దేశంలో పేదరికాన్ని అంచనా వేయడానికి జాతీయ నమూనా సర్వే కార్యాలయం నిర్వహించే వినియోగ వ్యయ సర్వేల్లో ఇది ఒక పద్ధతి. ఇందులో కొందరు వ్యక్తుల నుంచి గత 30 రోజుల్లో వారు చేసిన వినియోగ వ్యయం వివరాలను సేకరిస్తారు. అంటే ఆహారం, దుస్తులు, విద్య, ఆరోగ్యం, ఇతర వస్తువుల కొనుగోలుకు లేదా వినియోగానికి చేసిన వ్యయాన్ని లెక్కించి, దాని ఆధారంగా పేదరికాన్ని అంచనా వేస్తారు. ఈ పద్ధతిని 1993-94 వరకు ఉపయోగించి దారిద్ర్య రేఖను నిర్ణయించారు.

మిక్స్‌డ్ రిఫరెన్స్ పీరియడ్ (ఎంఆర్‌పీ): యూఆర్‌పీలోని లోపాలను సరిదిద్దుతూ ఈ పద్ధతిని 1999-2000 నుంచి ప్రవేశపెట్టారు. ఇందులో రెండు వేర్వేరు కాలపరిమితులను ఉపయోగిస్తారు. అరుదుగా కొనే మన్నికైన వస్తువుల (దుస్తులు, పాదరక్షలు, విద్య, ఆరోగ్యం మొదలైనవి)పై గతఏడాది చేసిన వ్యయాన్ని, వాటిపైనే గత 30 రోజుల్లో చేసిన వ్యయాన్ని పరిగణనలోకి తీసుకొని పేదరికాన్ని అంచనా వేస్తారు.

భారతదేశంలో పేదరికం

(అంచనాలు–కొలిచే పద్ధతులు)

భారతదేశంలో పేదరికం అనేది ఆర్థిక, సామాజిక సమస్య. సమాజంలో ప్రజలు తమ మనుగడకు కనీస అవసరాలు (ఆహారం, వస్త్రాలు, గృహ వసతి) పొందలేని పరిస్థితిని పేదరికం అంటారు. సాధారణ జీవన విధానానికి కూడా నోచుకోని వారందరినీ పేదవారుగా పేర్కొంటారు.

మానవాభివృద్ధి నివేదిక: ఇది పేదరికాన్ని బహుమితీయ కోణంలో నిర్వచిస్తుంది. ఆదాయం మాత్రమే కాకుండా విద్య, ఆరోగ్యం, జీవన ప్రమాణాలు తదితర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటుంది. ప్రజలు తమ అవసరాలను తీర్చుకోలేకపోవడంతో పూర్తి సామర్థ్యాన్ని చేరుకోలేకపోయే పరిస్థితిగా పేర్కొంది.

> “ పేదరికాన్ని అనుభవించేవాడి బాధను అంధుడు కూడా చూడగలడు.
> – నోబెల్ గ్రహీత అమర్త్యసేన్ ”





భారతదేశంలో పేదరికం అంచనాలు:

స్వాతంత్ర్యానికి పూర్వం: దాదాభాయ్ నౌరోజీ తన ‘పావర్టీ అండ్ అన్-బ్రిటిష్ రూల్ ఇన్ ఇండియా’ పుస్తకంలో మొదటిసారిగా శాస్త్రీయంగా పేదరికాన్ని అంచనా వేశారు. ఇందులో ఒక వ్యక్తి జీవించడానికి అవసరమైన కనీస ఆహార వ్యయాన్ని పొందలేని స్థితిని పరిగణనలోకి తీసుకొని పేదరికాన్ని లెక్కించారు.

★ నౌరోజీ ప్రభావంతోనే పోషకాహార అవసరాలూ, కనీస జీవన ప్రమాణాలు అనే దృక్పథంపై ఆధారపడి జాతీయ ప్రణాళిక కమిటీ (1938) ఏర్పడింది. దీనికి జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షుడిగా వ్యవహరించారు.

స్వాతంత్ర్యానంతర పేదరికం అంచనా:

★ ప్రణాళికా సంఘం ఏర్పాటు చేసిన ప్రణాళికా సంఘం నిపుణుల బృందం (1962) గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు ప్రత్యేక దారిద్ర్య రేఖలను రూపొందించింది. ★ వి.ఎం. దండేకర్, ఎన్. రథ్ (1971) జాతీయ నమూనా సర్వే కార్యాలయం (ఎన్ఎస్ఎస్ఓ) సేకరించిన డేటా ఆధారంగా భారతదేశంలో పేదరికాన్ని మొదటిసారిగా క్రమబద్ధంగా లెక్కించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 2250 కేలరీల శక్తిని అందించే ఆహారానికి అయ్యే కనీస వ్యయాన్ని ఆధారంగా చేసుకొని పేదరికాన్ని అంచనా వేశారు. ఆ కనీస ఖర్చునే దారిద్ర్యరేఖగా పేర్కొన్నారు. ★ వై.కె. అలఘ్ అధ్యక్షతన ప్రణాళికా సంఘం 1979లో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ కనీస పోషకాహార అవసరాలపై చేసే వ్యయం ఆధారంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల దారిద్ర్యరేఖను నిర్ణయించింది. దాని ప్రకారం గ్రామాల్లో 2400 కేలరీలు, పట్టణాల్లో 2100 కేలరీల శక్తిని ఇచ్చే ఆహారానికి అయ్యే ఖర్చును ప్రాతిపదికగా తీసుకున్నారు. ఆ కనీస వ్యయం కంటే తక్కువ వ్యయం చేసే వారిని పేదలుగా నిర్వచించారు. ★ ప్రణాళికా సంఘం 2005 డిసెంబరులో సురేశ్ తెందూల్కర్ కమిటీని నియమించింది. అది తన నివేదికను 2009లో సమర్పించింది. ఇది పేదరిక రేఖను నిర్ణయించడానికి మన్నికైన వస్తువులతో పాటు విద్య, ఆరోగ్యం లాంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. గృహ వినియోగ వ్యయం ఆధారంగా పేదరికాన్ని అంచనా వేయడానికి కనీస కేలరీల శక్తిని ఇచ్చే ఆహారానికి చేసే వ్యయం బదులు జీవన వ్యయ సూచీ (కాస్ట్ ఆఫ్ లివింగ్ ఇండెక్స్)ని కమిటీలో ఉపయోగించారు. యూనిఫాం రిఫరెన్స్ పీరియడ్‌కు బదులు మిక్స్‌డ్ రిఫరెన్స్ పీరియడ్ పద్ధతిని అనుసరించారు. ఈ కమిటీ నెలవారీ తలసరి వినియోగ వ్యయాన్ని (ఎంపీసీఈ) గ్రామాల్లో రూ. 446.68గా, పట్టణాల్లో రూ. 578.8గా లెక్కగట్టి దారిద్ర్యరేఖను నిర్ణయించింది.

> తెందూల్కర్ కమిటీ ప్రకారం మొత్తం పేదరిక నిష్పత్తి 1993–94లో 45.3 శాతం నుంచి 2011–12లో 21.9 శాతానికి తగ్గింది. ఇది పేదల సంఖ్యలో గణనీయమైన తగ్గుదలను సూచిస్తోంది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారి సంఖ్య 1993–94లో 403.7 మిలియన్ల నుంచి 2011–12 నాటికి 269.3 మిలియన్లకు తగ్గింది.

ఈ గణాంకాల సేకరణలో గత కమిటీల కంటే భిన్నమైన పద్ధతిని తెందూల్కర్ కమిటీ అనుసరించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆరోగ్యం, విద్య తదితర ఆహారేతర అవసరాల వ్యక్తిగత వ్యయాలనూ పరిగణనలోకి తీసుకుంది.




రచయిత: వి.రమణయ్య

తక్కువ వ్యయంతో తయారయ్యే శక్తి వనరులు!

భారతదేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ స్పృహ పెరగడంతో శిలాజ ఇంధనాల స్థానంలో కాలుష్యరహిత, పునరుత్పాదక ఇంధన వనరుల ఉత్పత్తి, వినియోగానికి ప్రాధాన్యం పెరుగుతోంది. అందులో భాగమే చౌకగా, సులభంగా లభించే శక్తి వనరులైన జీవ ఇంధనాలు. మొక్కలు సహా ఇతర జీవులు, వ్యవసాయ వ్యర్థాలు వంటి జీవ పదార్థాల నుంచి తయారయ్యే ఈ ఇంధనాలు కాలుష్య కారకాలు కాదు, వీటిని సులభంగా ఉత్పత్తి చేయవచ్చు. పర్యావరణ కాలుష్యాన్ని నివారించడం, ఇంధన భద్రత కలగడానికి దిగుమతులను తగ్గించడం, రైతుల ఆదాయాన్ని పెంచడం లాంటి విభిన్న ప్రయోజనాలను అందించే జీవ ఇంధనాల అవసరంపై పోటీ పరీక్షార్థులు అవగాహన కలిగి ఉండాలి. ప్రధాన జీవ ఇంధనాలు, వాటి ముడి పదార్థాలు, తయారీ ప్రక్రియలతో పాటు దేశంలో వినియోగం తీరుతెన్నులు, వాడకాన్ని ఎక్కువ చేయడానికి జరుగుతున్న ప్రయత్నాలనూ తెలుసుకోవాలి.

జనరల్ స్టడీస్ - సైన్స్ అండ్ టెక్నాలజీ



జీవ ఇంధనాలు

1. జీవ ఇంధనాల గురించి కింది వాక్యాల్లో సరైనవి ఏవి?
ఎ) ఇవి సూక్ష్మజీవుల చర్య వల్ల ఏర్పడతాయి.
బి) వీటిని బయోమాస్ నుంచి తయారు చేయవచ్చు.
సి) ఇవి ద్రవ లేదా వాయు రూపంలో ఉంటాయి.
డి) ఇవి తక్కువ ధరకు లభ్యమవుతాయి.
1) ఎ, బి 2) బి, సి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

2. కిందివాటిలో జీవ ఇంధనాలు కానివి ఏవి?
ఎ) సహజవాయువు బి) బయోగ్యాస్
సి) బయోడీజిల్ డి) ఇథనాల్ ఇ) పెట్రోల్
1) ఎ, డి 2) ఎ, ఇ 3) బి, సి 4) బి, డి

3. జీవఇంధనాలు వాడటం వల్ల కలిగే లాభాలు?



ఎ) వాయు కాలుష్యం జరగదు.
బి) గ్రీన్‌హౌస్ వాయువులు వెలువడవు.
సి) జీవ విచ్ఛిన్న వ్యర్థాల నిర్వహణ సరిగ్గా జరుగుతుంది.
డి) వ్యవసాయ వ్యర్థాల నుంచి ఉత్పత్తి చేసి ఆదాయం పొందవచ్చు.
1) ఎ, బి, సి, డి 2) బి, సి 3) సి, డి 4) బి, డి

4. కిందివాటిని సరైన క్రమంలో అమర్చండి.
ఎ) ఇథనాల్ 1) వుడ్ ఆల్కహాల్
బి) బయోగ్యాస్ 2) శిలాజ ఇంధనం
సి) బయోడీజిల్ 3) ఈస్ట్ కిణ్వ ప్రక్రియ
డి) సహజవాయువు 4) ట్రాన్స్ ఎస్టరిఫికేషన్
ఇ) మిథనాల్ 5) బ్యాక్టీరియా కిణ్వ ప్రక్రియ
1) ఎ-2, బి-3, సి-4, డి-1, ఇ-5
2) ఎ-4, బి-2, సి-1, డి-3, ఇ-5
3) ఎ-3, బి-5, సి-4, డి-2, ఇ-1
4) ఎ-1, బి-3, సి-2, డి-4, ఇ-5

5. ఇథనాల్‌ను కింది వేటిని ఉపయోగించుకొని కిణ్వ ప్రక్రియ ద్వారా తయారు చేయవచ్చు?
ఎ) చెరకు రసం బి) మొలాసిస్
సి) ఫల రసాలు డి) తీపిజొన్న కాండం రసం
1) ఎ, బి, సి 2) ఎ, బి, సి, డి 3) ఎ, డి 4) బి, డి

6. కిందివాటిలో సరికాని వాటిని గుర్తించండి.
ఎ) ధాన్యాలు, గింజల్లో ఉండే పిండి పదార్థాన్ని ఉపయోగించి ఇథనాల్‌ను తయారు చేయవచ్చు.
బి) మిగిలిపోయిన నూనెను ఇథనాల్‌గా మార్చవచ్చు.
సి) చెరకు, తీపిజొన్న మొక్కలను బయోడీజిల్ మొక్కలు అంటారు.
డి) కొన్నిరకాల మొక్కల లేటెక్స్ నుంచి జీవఇంధనాలను తయారు చేయొచ్చు.
1) ఎ, బి 2) బి, సి 3) సి, డి 4) ఎ, డి

7. ఇథనాల్ తయారుచేసే విధానం ఆధారంగా కిందివాటిని సరైన క్రమంలో అమర్చండి.



ఎ) మొదటి తరం ఇథనాల్ 1) జన్యుపరివర్తన జీవుల నుంచి తయారీ
బి) రెండో తరం ఇథనాల్ 2) శైవలాల బయోమాస్ నుంచి తయారీ
సి) మూడో తరం ఇథనాల్ 3) వ్యవసాయ వ్యర్థాల నుంచి తయారీ
డి) నాలుగో తరం ఇథనాల్ 4) చెరకు రసం, పిండిపదార్థాల నుంచి తయారీ
1) ఎ-2, బి-3, సి-1, డి-4 2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-4, బి-2, సి-3, డి-1 4) ఎ-3, బి-2, సి-1, డి-4

8. వ్యవసాయ వ్యర్థాలను ఇథనాల్ ఉత్పత్తికి వినియోగించడం వల్ల కలిగే లాభాలు?
ఎ) పంట అవశేషాలు కాల్చడం తగ్గుతుంది.
బి) రైతుకు అదనపు ఆర్థిక ప్రయోజనం కలుగుతుంది.
సి) గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.
డి) ఆర్థికాభివృద్ధి కలుగుతుంది.
1) ఎ, డి 2) బి, సి 3) ఎ, బి, సి, డి 4) ఎ, బి, డి

9. బయోబ్యుటనాల్‌కు సంబంధించిన కింది వాక్యాల్లో సరైనవి ఏవి?
ఎ) ఇది ఎసిటోన్ - బ్యుటనాల్ - ఇథనాల్ కిణ్వప్రక్రియ ద్వారా ఏర్పడుతుంది.
బి) బయోమాస్‌ను ఉపయోగించి దీన్ని తయారు చేయవచ్చు.
సి) క్లాస్ట్రిడియం అసిటోబ్యుటలికమ్ అనే బ్యాక్టీరియా దీనికి ఉపయోగపడుతుంది.
డి) దీన్ని పెట్రోల్‌లో కలిపి వినియోగించుకోవచ్చు.
1) ఎ, బి, సి, డి 2) సి, డి 3) బి, డి 4) ఎ, డి

10. కింది జీవ ఇంధనాల తయారీని సరైన క్రమంలో అమర్చండి.
ఎ) బయోమిథనాల్ 1) మొలాసిస్ కిణ్వ ప్రక్రియ ద్వారా
బి) బయోడీజిల్ 2) బయోమాస్‌ను రసాయన ప్రక్రియకు గురిచేసి
సి) బయోగ్యాస్ 3) నూనెలను ట్రాన్స్ ఎస్టరిఫికేషన్ ప్రక్రియ ద్వారా
డి) బయోఇథనాల్ 4) బయోమాస్‌ను కిణ్వప్రక్రియకు గురిచేసి
1) ఎ-3, బి-2, సి-1, డి-4 2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-1, బి-4, సి-3, డి-2 4) ఎ-2, బి-3, సి-4, డి-1

11. కిందివాటిలో సరికాని వాక్యాలను గుర్తించండి.
ఎ) కొన్ని మొక్కల లేటెక్స్ నుంచి హైడ్రోకార్బన్‌లు వెలికితీసి ఇంధనంగా వాడుతున్నారు.
బి) శైవలాల హైడ్రోకార్బన్‌లను ఇంధనంగా వాడవచ్చు.
సి) బయోడీజిల్‌ను కిణ్వ ప్రక్రియ ద్వారా తయారు చేస్తారు.
డి) బయోగ్యాస్‌లో ప్రొపేన్, బ్యూటేన్ ఉంటాయి.
1) ఎ, బి 2) సి, డి 3) బి, డి 4) ఎ

12. బయోగ్యాస్ గురించి కిందివాటిలో సరైన వాక్యాలు ఏవి?
ఎ) దీన్ని వ్యవసాయ వ్యర్థాలు, పశువుల పేడ నుంచి తయారు చేస్తారు.
బి) నేరుగా వాహనాలలో ఇంధనంగా వాడవచ్చు.
సి) ఇది మండటం వల్ల ఎలాంటి కాలుష్య పదార్థాలు విడుదల కావు.
1) ఎ, బి, సి 2) ఎ, బి 3) ఎ, సి 4) బి, సి

13. బయోడీజిల్‌కు సంబంధించి కిందివాటిలో సరికాని వాక్యాలు?



ఎ) దీన్ని నేరుగా ఇంధనంగా వాడవచ్చు, డీజిల్‌లో కలపవచ్చు.
బి) నూనెలు, కొవ్వులను ట్రాన్స్ ఎస్టరిఫికేషన్ ప్రక్రియ ద్వారా బయోడీజిల్‌గా మార్చవచ్చు.
సి) జట్రోపా, కానుగ మొక్కలను బయోడీజిల్ మొక్కలంటారు.
డి) బి-10 అంటే 90% బయోడీజిల్, 10% సాధారణ డీజిల్.
ఇ) బయోడీజిల్‌ను పెట్రోల్‌తో కలిపి వాడవచ్చు.
1) ఎ, సి 2) సి, ఇ 3) డి, ఇ 4) ఎ, ఇ

14. నేషనల్ పాలసీ ఆన్ బయోఫ్యూయల్స్ – 2018 (జాతీయ జీవ ఇంధన విధానం – 2018) గురించి కిందివాటిలో సరైనవి ఏవి?
ఎ) జీవ ఇంధనాలను సాధారణ, అడ్వాన్స్‌డ్‌గా విభజించారు.
బి) నేషనల్ బయోఫ్యూయల్ కో- ఆర్డినేషన్ కమిటీ అనుమతితో మిగిలిన ధాన్యాలను ఇథనాల్ ఉత్పత్తికి వాడుకోవచ్చు.
సి) ఇథనాల్ ఉత్పత్తికి పిండిపదార్థం ఉన్న పదార్థాలను వాడాలని నిర్ణయించారు.
1) ఎ, బి, సి 2) బి, సి 3) ఎ, సి 4) ఎ, బి

15. గ్లోబల్ బయోఫ్యూయల్ అలయన్స్ గురించి కిందివాటిలో సరైన వాక్యాలు ఏవి?
ఎ) దీన్ని భారత ప్రధానమంత్రి 2023లో జరిగిన జీ20 సదస్సులో ప్రారంభించారు.
బి) జీవ ఇంధనాలను ఉత్పత్తి చేసే దేశాలను సమన్వయం చేయడం, సాంకేతిక మార్పు దీని ఉద్దేశం.
సి) ఇది భారతదేశంలో జీవ ఇంధనాల కార్యక్రమాలకు ఊతమిస్తుంది.
1) ఎ, బి 2) బి, సి 3) బి 4) ఎ, బి, సి

16. భారతదేశంలో జీవఇంధనాల ఉత్పత్తికి, అభివృద్ధికి ఉద్దేశించిన కింది వాక్యాల్లో తప్పుగా ఉన్నవాటిని గుర్తించండి.
ఎ) 2025 - 26 వరకు పెట్రోల్‌లో 20% ఇథనాల్‌ను కలపాలని నిర్ణయించారు.
బి) 2030 వరకు 50% బయో డీజిల్‌ను సాధారణ డీజిల్‌లో కలపాలని నిర్ణయించారు.
సి) బయో డీజిల్ ఉత్పత్తికి వంట నూనెలను వాడుకోవచ్చని అనుమతి ఇచ్చారు.
1) ఎ, బి 2) బి 3) సి 4) బి, సి

17. జాతీయ జీవ ఇంధన విధానం–2018 వల్ల కింది ఎటువంటి లాభాలు కలుగుతాయని భావిస్తున్నారు?
ఎ) శిలాజ ఇంధనాల దిగుమతి తగ్గుతుంది.
బి) పరిశుభ్రమైన వాతావరణం సాధ్యమవుతుంది.
సి) ఘన రూప వ్యర్థ పదార్థాల నిర్వహణ సమర్థంగా జరుగుతుంది.
డి) గ్రామీణ ప్రాంతాల్లో మౌలికవసతులు, ఆర్థికాభివృద్ధి జరుగుతుంది.
1) ఎ, సి 2) బి, సి, డి 3) ఎ, బి, సి, డి 4) బి

18. కింది వాక్యాలను పరిశీలించండి.



ఎ) ప్రధానమంత్రి జీ-వన్ యోజన, 2జీ ఇథనాల్ ఉత్పత్తికి సంబంధించింది.
బి) గాల్వనైజింగ్ ఆర్గానిక్ బయో ఆగ్రో రిసోర్సెస్ - ధన్ (GOBARdhan) పథకం బయోగ్యాస్ ఉత్పత్తికి సంబంధించింది.
పై వాక్యాల ఆధారంగా కిందివాటి నుంచి సరైన సమాధానాన్ని గుర్తించండి.
1) ఎ సరైంది, బి సరికాదు 2) ఎ, బి సరైనవి
3) ఎ, బి, సరికావు
4) ఎ సరికాదు, బి సరైంది

19. కిందివాటిలో తప్పుగా ఉన్న వాక్యాలను గుర్తించండి.



ఎ) ఇథనాల్, మిథనాల్, బ్యుటనాల్, బయోడీజిల్ ద్రవరూప జీవఇంధనాలకు ఉదాహరణ.
బి) బయోగ్యాస్, బయో హైడ్రోజన్ వాయురూప జీవ ఇంధనాలకు ఉదాహరణ.
సి) ప్రస్తుతం అతి ఎక్కువగా ఉత్పత్తి చేస్తున్న, వినియోగిస్తున్న జీవ ద్రవ ఇంధనం - బ్యుటనాల్.
డి) జీవ ఇంధనాలన్నీ కిణ్వ ప్రక్రియ ద్వారా ఉత్పత్తి అవుతాయి.
1) ఎ, డి 2) బి, సి 3) సి, డి 4) ఎ, సి

20. గోబర్‌ధన్ పథకం ప్రయోజనాలు?
ఎ) దీనిలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో పశువుల పేడ, సేంద్రియ ఘన వ్యర్థాలను బయోగ్యాస్‌గా మారుస్తారు.
బి) దీని వల్ల వ్యర్థాలు కంపోస్ట్‌గా మారతాయి.
సి) రైతులకు అదనపు ఆదాయం కలుగుతుంది.
డి) పర్యావరణ పరిశుభ్రత సాధ్యమవుతుంది.
1) ఎ, బి, సి, డి 2) సి, డి
3) బి, సి 4) ఎ, డి

21. కింది ఇంధనాల్లో భిన్నమైనదాన్ని గుర్తించండి.
ఎ) కంప్రెస్‌డ్ నాచురల్ గ్యాస్
బి) బయో ఇథనాల్ సి) బయోబ్యుటనాల్
డి) బయోమిథనాల్ ఇ) బయోడీజిల్
ఎఫ్) బయోగ్యాస్
1) ఎఫ్ 2) ఎ 3) సి 4) డి

సమాధానాలు

1-4; 2-2; 3-1; 4-3; 5-2; 6-2; 7-2; 8-3; 9-1; 10-4; 11-2; 12-1; 13-3; 14-1; 15-4; 16-4; 17-3; 18-2; 19-3; 20-1; 21-2.

భారతదేశ గతిని మార్చిన.. చరిత్రాత్మక యుద్ధాలు!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

భారతదేశ చరిత్ర

18వ శతాబ్దంలో మొగల్ సామ్రాజ్యం విచ్ఛిన్నం అయ్యాక భారతదేశం రాజకీయంగా చిన్నాభిన్నమైంది. రాజకీయ అనైక్యత, అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయి. వెయ్యికి పైగా స్వతంత్ర రాజ్యాలు/ సంస్థానాలు ఆవిర్భవించాయి. ఇవన్నీ ఇంగ్లిష్ ఈస్టిండియా కంపెనీకి కలిసొచ్చాయి. 1757-1856 మధ్య కాలంలో వారు ఒక్కొక్కటిగా 500లకు పైగా రాజ్యాలను జయించి, భారతదేశంలో బలమైన బ్రిటిష్ సామ్రాజ్యాన్ని స్థాపించారు. వారి సామ్రాజ్య ఆక్రమణ మొదట బెంగాల్‌తో ప్రారంభమైంది. ప్లాసీ, బక్సార్ యుద్ధాలతో వారు బెంగాల్‌ను పూర్తిగా తమ అధీనంలోకి తీసుకున్నారు. భారతదేశ గతిని మార్చిన యుద్ధాలుగా చరిత్రకారులు వీటిని పేర్కొంటారు. వీటి గురించి పోటీపరీక్షార్థులకు అవగాహన అవసరం.

ఈస్ట్ ఇండియా కంపెనీ అధికార స్థాపన

బెంగాల్ ఆక్రమణ

క్రీ.శ. 1700 నాటికి మొగల్ చక్రవర్తి ఔరంగజేబ్ అనుమతితో ఆంగ్లేయులు కలకత్తాను పొంది, ఫోర్ట్ విలియం కోటను నిర్మించారు. ఔరంగజేబ్ మరణానంతరం మొగల్ చక్రవర్తుల అసమర్థతను, రాజకీయ పరిస్థితులను గ్రహించిన ఆంగ్లేయులు బెంగాల్‌లో స్వతంత్రంగా వ్యవహరించారు.

- బెంగాల్‌లో మొగల్ గవర్నర్‌గా ఉన్న ముర్షిద్ కులీఖాన్ 1717లో స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నాడు. ముర్షిద్ ఆర్కాట్‌కు చెందిన బ్రాహ్మణుడు. ఇస్లాంను స్వీకరించి మొగల్ కొలువులో ఉన్నత పదవులు నిర్వహించాడు. ఇతడు అనేక వ్యవసాయ, రెవెన్యూ సంస్కరణలు చేపట్టి వ్యాపార వాణిజ్యాన్ని ప్రోత్సహించాడు. జమీందారుల తిరుగుబాట్లను అణచివేశాడు. హిందువులకు ఉన్నత పదవులు కట్టబెట్టాడు.
- ముర్షిద్ తర్వాత షుజాఉద్దీన్ (1727-39), సర్ఫరాజ్ ఖాన్ (1739-40), అలీవర్దీఖాన్ (1740-56) బెంగాల్‌ను పాలించారు.
- అలీవర్దీఖాన్‌కు కొడుకులు లేకపోవడంతో మూడో కుమార్తె కొడుకైన మీర్జామహ్మద్‌ను తన వారసుడిగా ప్రకటించాడు. ఇతడే సిరాజ్-ఉద్-దౌలా అనే పేరుతో ప్రసిద్ధి చెందాడు. బెంగాల్ నవాబు పదవి చేపట్టేనాటికి సిరాజ్-ఉద్-దౌలా వయసు 23 సంవత్సరాలు.
- బెంగాల్‌లో ఆంగ్లేయుల కార్యకలాపాలను అదుపు చేయాలనే ఉద్దేశంతో ఇతడు అనేక చర్యలు తీసుకున్నాడు. దీంతో ఆంగ్లేయులతో వైరం ప్రారంభమై, ప్లాసీ యుద్ధానికి దారితీసింది.

ప్లాసీ యుద్ధం



ఆధునిక భారతదేశ చరిత్రలో ప్లాసీ యుద్ధాన్ని చరిత్రాత్మక యుద్ధంగా పరిగణిస్తారు. ఇది క్రీ.శ. 1757లో జరిగింది. దీనికి దారితీసిన పరిస్థితులను పరిశీలిస్తే..


- ఐరోపా వర్తకులు బెంగాల్‌లోని తమ వ్యాపార స్థావరాల్లో కోటలను నిర్మించడాన్ని సిరాజ్-ఉద్-దౌలా సహించలేదు. వాటిని ధ్వంసం చేయాలని ఆదేశిస్తూ జారీ చేసిన ఫర్మానాను ఆంగ్లేయులు తిరస్కరించారు. దీంతో ఘర్షణ ప్రారంభమైంది.
- ఇంగ్లిష్ ఈస్టిండియా కంపెనీ దస్తక్‌లను దుర్వినియోగం చేయడమూ కలహానికి మరొక ముఖ్యకారణంగా చెప్పవచ్చు. ఈస్టిండియా కంపెనీ వ్యాపార వస్తువులను ధ్రువీకరించే అధికార పత్రాలను దస్తక్‌లు అంటారు. దస్తక్‌లో పేర్కొన్న వస్తువులకు ఎగుమతి, దిగుమతి సుంకాల నుంచి మినహాయింపు ఉంటుంది. మొగల్ చక్రవర్తి ఫరూఖ్ షియర్ జారీ చేసిన 1717 ఫర్మానా ప్రకారం ఆంగ్లేయులు బెంగాల్‌లో సుంకాలు లేకుండా వ్యాపారం నిర్వహించుకునే రాయితీలు పొందారు. ఇందులో భాగంగానే బెంగాల్ గవర్నర్ దస్తక్‌లను జారీ చేసేవాడు. ఆంగ్లేయులు అనైతిక పద్ధతుల్లో దస్తక్‌లను దుర్వినియోగం చేయడమూ ప్లాసీ యుద్ధానికి కారణమైంది.
- ఆంగ్లేయులు బెంగాల్ పరిపాలనలో జోక్యం చేసుకోవడం, నవాబ్‌కు వ్యతిరేకమైన అధికారులకు మద్దతివ్వడం లాంటి చర్యలు కూడా ప్లాసీ యుద్ధానికి దారితీశాయి. సిరాజ్-ఉద్-దౌలాకు వ్యతిరేకంగా ఢాకాలో పనిచేస్తున్న రాజ్ బల్లభ్ తిరుగుబాటు చేసి, కలకత్తాకు పారిపోయాడు. నాటి బెంగాల్ గవర్నర్ రోజర్ డ్రెక్ ఇతడికి ఫోర్ట్ విలియంలో ఆశ్రయం కల్పించాడు.
- నవాబ్ సిరాజ్-ఉద్-దౌలా ఫోర్ట్ విలియం ఆక్రమణ, అక్కడ చోటుచేసుకున్న చీకటిగది ఉదంతం (Black Hole Tragedy) ప్లాసీ యుద్ధానికి తక్షణ కారణంగా చెప్పొచ్చు.
- 1756లో సిరాజ్-ఉద్-దౌలా ఫోర్ట్ విలియంను ఆక్రమించుకున్నాడు. రోజర్ డ్రెక్‌తో సహా అనేక మంది అక్కడి నుంచి పారిపోయారు. దాడిలో 146 మంది ఆంగ్లేయులు బందీలుగా పట్టుబడగా, వారిని ఒక చీకటి గదిలో బంధించాడు. అందులో 23 మంది మినహా మిగతావారు ఊపిరాడక మరణించారని హాల్వెల్ (Holwell) అనే ఆంగ్లేయుడు రాసిన 'బ్లాక్ హోల్ ట్రాజెడీ' అనే పుస్తకంలో ఉంది.

యుద్ధం తీరుతెన్నులు

1757 జూన్ 23న భగీరథీ నది ఒడ్డున ప్లాసీ యుద్ధం జరిగింది.

- రాబర్ట్ క్లైవ్ తన ఫిరంగి దళంలో ఒక భాగాన్ని శత్రువుపైకి పంపి, మిగిలిన సేనలను వెనకవైపు నిలిపాడు.
- వాస్తవంగా సిరాజ్ పక్షాన ఉన్న ఫ్రెంచ్ సైనికుల భాగం మాత్రమే ఆంగ్లేయ సైనికులతో యుద్ధంలో పాల్గొంది.
- సిరాజ్ సేనాధిపతి మీర్‌జాఫర్ సైన్యాలు, రాయ్‌దుర్లభ్ నేతృత్వంలోని బెంగాల్ సైన్యాలు మాత్రం శత్రుపక్షంతో యుద్ధం చేయలేదు.
- ముందు చేసుకున్న ఒడంబడిక ప్రకారం మీర్‌జాఫర్, అతని అనుచరులు నవాబ్‌ను యుద్ధంలో మోసం చేశారు.
- సిరాజ్-ఉద్-దౌలా కుటుంబంతో కలసి ముర్షిదాబాద్‌కు చేరుకున్నాడు. ప్రాణ రక్షణ కోసం పారిపోతున్న నవాబ్‌ను మీర్‌జాఫర్ సైనికులు బంధించారు. 1757 జూన్ 28న సిరాజ్‌ను మీర్‌జాఫర్ కొడుకు మీరాన్ ఉరితీయించాడు.

బక్సార్ యుద్ధం



ఆంగ్లేయుల సహకారంతో నవాబ్ అయిన మీర్ ఖాసిం (1760-63) ఈస్టిండియా కంపెనీకి పూర్తి విధేయత ప్రదర్శించాడు. చిట్టగాంగ్, బర్ద్వాన్, మిడ్నాపూర్ జిల్లాలపై వారికి సంపూర్ణ అధికారాన్ని కట్టబెట్టాడు.

- 1760లో రాబర్ట్ క్లైవ్ ఇంగ్లండ్ వెళ్లాడు. కొత్త ఆంగ్లేయ గవర్నర్‌గా వాన్‌సిత్తార్ నియమితుడయ్యాడు.
- మీర్ ఖాసిం, వాన్‌సిత్తార్ మధ్య అనేక విషయాల్లో తగాదాలు ఏర్పడ్డాయి. నవాబు ఆంగ్లేయుల వర్తకంపై ఆంక్షలు విధించాడు. దీంతో రెండు పక్షాల మధ్య 1762లో యుద్ధం జరిగింది.
- మేజర్ ఆడమ్స్ 1762 జనవరిలో 1100 మంది ఆంగ్లేయ సైనికులతో మీర్‌ఖాసింతో యుద్ధం చేశాడు. కానీ పరాజితుడై బెంగాల్ వదిలి పారిపోయాడు. ఈ సంఘటన బక్సార్ యుద్ధానికి అతి ముఖ్యమైన కారణమైంది.
- 1763లో మీర్ జాఫర్ రెండోసారి బెంగాల్ నవాబు అయ్యాడు.
- సింహాసనాన్ని కోల్పోయిన మీర్ ఖాసిం.. మొగల్ చక్రవర్తి రెండో షాఆలం, అవధ్‌కు చెందిన షుజాఉద్దౌలాతో చర్చలు జరిపి, వాన్‌సిత్తార్‌కు వ్యతిరేకంగా త్రైపాక్షిక కూటమి ఏర్పాటు చేశాడు.
- 1764 అక్టోబరు 22న బక్సార్ వద్ద ఆంగ్లేయులకు, కూటమికి మధ్య యుద్ధం జరిగింది. దీన్నే బక్సార్ యుద్ధంగా పేర్కొంటారు.
- సంఖ్యాపరంగా కూటమి సైన్యం పెద్దదైనప్పటికీ, బ్రిటిష్ సేనాని మేజర్ హెక్టర్ మన్రో వారిని ఓడించాడు.
- మొగల్ చక్రవర్తి షాఆలం ఆంగ్లేయులకు లొంగిపోయాడు.
- రాబర్ట్ క్లైవ్ భారతదేశానికి తిరిగివచ్చి 1765లో అలహాబాద్ సంధి చేసుకున్నాడు. దీని ప్రకారం బెంగాల్‌లో ద్వంద్వపాలన అనే నూతన విధానాన్ని ప్రవేశపెట్టారు. దివానీ పాలనను (రెవెన్యూ) ఇంగ్లిష్ ఈస్టిండియా కంపెనీకి, నిజామత్ పాలనను (శాంతి భద్రతలు) నవాబ్‌కు కట్టబెట్టారు.
- ద్వంద్వ పాలన 1765 నుంచి 1772 వరకు కొనసాగింది. ఈ విధానం పూర్తిగా విఫలమై 1770లో బెంగాల్‌లో భయంకరమైన క్షామం సంభవించింది. దీని కారణంగా దాదాపు 1/3వ వంతు జనాభా అంతమైంది.
- బెంగాల్ గవర్నర్‌గా వచ్చిన వారన్ హేస్టింగ్స్ 1772లో ద్వంద్వ పాలనను రద్దు చేశాడు. అప్పుడు బెంగాల్ నవాబ్‌గా ఉన్న ముబారక్‌ఉద్దౌలాను పెన్షనర్‌గా మార్చాడు. 1772లో ఆంగ్లేయులు బెంగాల్‌ను పూర్తిగా తమ అధీనంలోకి తీసుకున్నారు.

యుద్ధం తర్వాతి పరిస్థితులు

ప్లాసీ యుద్ధంలో ఆంగ్లేయుల విజయంలో కీలకపాత్ర పోషించిన సిరాజ్-ఉద్-దౌలా సేనాపతి మీర్ జాఫర్‌ను ఆంగ్లేయులు బెంగాల్ నవాబ్‌గా నియమించారు. ఇతడు వారికి విధేయుడిగా ఉన్నాడు. ఇంగ్లిష్ ఈస్టిండియా కంపెనీకి రూ.1.77 కోట్లను నష్టపరిహారంగా చెల్లించాడు. 24 పరగణాల్లో కంపెనీకి సంపూర్ణ అధికారం కల్పించాడు.

- తనను సుల్తాన్‌ను చేసిన రాబర్ట్ క్లైవ్, వాట్సన్ లాంటి అధికారులకు జాఫర్ లక్షలాది రూపాయలు కానుకగా ఇచ్చాడు.
- అయితే రోజువారీ పాలనలో ఆంగ్లేయుల మితిమీరిన జోక్యాన్ని మీర్ జాఫర్ సహించలేకపోయాడు. అతడు క్రమంగా ఆంగ్లేయులను వీడి డచ్ వారితో స్నేహం చేశాడు.
- ప్రమాదాన్ని గమనించిన ఆంగ్లేయులు 1759లో బదేరా యుద్ధంలో డచ్ వారిని ఓడించి భారతదేశం నుంచి తరిమేశారు. ఆ తర్వాత 1760లో మీర్ జాఫర్‌ను తొలగించి అతడి మేనల్లుడు మీర్ ఖాసింను నవాబ్‌ను చేశారు.
- ఆనాటి బెంగాల్ గవర్నర్ వన్సిట్టార్ట్ (Vansittart) ఈ సంఘటనను '1760 విప్లవం' అని వర్ణించాడు.



రచయిత
డాక్టర్ ఎం. రవి కుమార్
విషయ నిపుణులు

Word of the Day 852

Immutable

Telugu meaning: మార్పులేని, స్థిరమైన

English meaning: The word immutable (ఇమ్యూటబుల్) is an adjective that describes something that cannot be changed or altered.

Synonyms: Unchangeable, Fixed

Antonyms: Alterable, Variable

Usage: **1.** The laws of physics are considered immutable, governing the universe without exception.

2. Her belief in honesty was immutable, guiding every decision she made.

కరెంట్ అఫైర్స్



ఓఎన్‌జీసీ ఛైర్మన్‌గా అరుణ్ కుమార్ సింగ్ (63) పదవీ కాలాన్ని ఏడాదిపాటు పొడిగించారు. 2026 డిసెంబరు 6 వరకు సింగ్ కొనసాగేలా ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

- 2022లో అరుణ్ ఓఎన్‌జీసీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు.

ఆంధ్రప్రదేశ్ కోస్తా తీరం పొడవు ఇప్పుడు 1,053.07 కిలోమీటర్లకు చేరిందని కేంద్ర భూవిజ్ఞానం, శాస్త్ర, సాంకేతిక వ్యవహారాలశాఖ మంత్రి జితేంద్రసింగ్ తెలిపారు. నేషనల్ హైడ్రోగ్రాఫిక్ ఆఫీస్ ఇదివరకున్న 973.7 కిలోమీటర్లను సవరించి ఇప్పుడు 1,053.07 కిలోమీటర్లుగా నిర్ధారించినట్లు చెప్పారు. ఆయన 2025, డిసెంబరు 4న రాజ్యసభలో ఈ విషయాన్ని వెల్లడించారు.



అత్యవసర నిబంధనల కింద అదనంగా హెరాన్ మార్క్-2 డ్రోన్లను కొనుగోలు చేయడానికి భారత్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఇజ్రాయెల్ రక్షణ పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఆపరేషన్ సిందూర్ భారత సైనిక దళాలకు ఇవి బాగా ఉపయోగపడిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నాయి.

- హెరాన్ మార్క్-2 డ్రోన్లు ఇప్పటికే భారత సైన్యం, వాయుసేన అమ్ములపొదిలో ఉన్నాయి. ఇప్పుడు వాటిని నౌకాదళంలోనూ ప్రవేశపెట్టబోతున్నట్లు ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ పేర్కొంది.

పాకిస్థాన్ తొలి 'రక్షణ బలగాల అధిపతి (సీడీఎఫ్)'గా సైన్యాధ్యక్షుడు ఫీల్డ్ మార్షల్ ఆసీమ్ మునీర్ 2025, డిసెంబరు 4న నియమితులయ్యారు. ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ సిఫార్సు మేరకు ఆయన నియామకానికి దేశాధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ ఆమోద ముద్ర వేశారు. మునీర్ అయిదేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు.


2024-25 ఆర్థిక సంవత్సరంలో మనదేశం 6.9 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.61,410 కోట్లు) విలువైన విమాన విడిభాగాలను ఎగుమతి చేసింది. ఈ పరిశ్రమ 2030 నాటికి 22 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.95 లక్షల కోట్లు)కు చేరుకుంటుందని ప్రభుత్వ అంచనా. ఎయిర్‌బస్ మనదేశం నుంచి ఏటా 1.5 బిలియన్ డాలర్ల విలువైన విడిభాగాలను కొనుగోలు చేస్తోంది. 2030 నాటికి దీన్ని 2 బిలియన్ డాలర్లకు పెంచుకోవాలనేది ఎయిర్‌బస్ ప్రణాళిక.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

శాస్త్రవేత్తలు విశేషాలు

చార్లెస్ డార్విన్

ఈయన ప్రఖ్యాత ప్రకృతి, జీవశాస్త్రవేత్త. మానవ పరిణామక్రమం గురించి ప్రపంచానికి చాటిచెప్పారు. భూమిపై జీవరాశి ఒక్కసారిగా ఆవిర్భవించలేదని.. ఒక జీవ కణం నుంచి కాలక్రమంలో అనేక ప్రాణులు పుట్టుకొచ్చాయని పేర్కొన్నారు. కోతులే పరిణామ క్రమంలో మనుషులుగా మార్పుచెందాయని వెల్లడించారు. ఈ విషయాలన్నింటినీ తన జీవ పరిణామ సిద్ధాంతంలో ప్రతిపాదించారు. నేటికీ అనేక మంది శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు డార్విన్ సిద్ధాంతాన్ని విశ్వసిస్తారు. ఆధునిక జీవశాస్త్ర పితామహుడిగా పరిగణించే 'చార్లెస్ డార్విన్' జీవితంలోని ముఖ్య విషయాల గురించి తెలుసుకుందాం..!



బాల్యం - విద్యాభ్యాసం

డార్విన్ 1809, ఫిబ్రవరి 12న ఇంగ్లండ్‌లోని ష్రూస్‌బరీలో జన్మించారు. తండ్రి రాబర్ట్ డార్విన్ ప్రముఖ వైద్యుడు. కొడుకును కూడా డాక్టర్ చేయాలని ఆయన భావించేవారు. అయితే చార్లెస్‌కు చిన్నతనంలో చదువంటే ఇష్టం ఉండేది కాదు. టీచర్లు ఈయన్ని మంద బుద్ధి కలిగిన పిల్లాడిగా పేర్కొన్నారు. రాబర్ట్ కూడా తన కొడుకు ఎందుకూ పనికిరాడేమోనని సందేహించేవారు.

- 1818లో చార్లెస్ ష్రూస్‌బరీ స్కూల్‌లో చేరారు. బట్టీ విధానంలో చదవడం ఆయనకు నచ్చేది కాదు.
- తండ్రి ఒత్తిడి మేరకు 1825లో వైద్య విద్యను అభ్యసించేందుకు ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో చేరారు.


చివరగా

డార్విన్ సిద్ధాంతం మనుషుల ఆలోచనలను మార్చడంలో ముఖ్య భూమిక పోషించింది. జెనెటిక్ ఇంజినీరింగ్ లాంటి పరిశోధనల్లో ఇది కీలకంగా వ్యవహరించింది. మతపరమైన కారణాల వల్ల మొదట్లో ఈయన సిద్ధాంతాన్ని వ్యతిరేకించినా, తర్వాతి కాలంలో అందరూ దీన్ని స్వాగతించారు. జీవవైవిధ్య పరిశీలనలో ముఖ్య అధ్యాయంగా దీన్ని పేర్కొంటారు. జీవశాస్త్ర రంగంలో మహోన్నత వ్యక్తిగా నిలిచిన డార్విన్ 1882, ఏప్రిల్ 19న ఇంగ్లండ్‌లో మరణించారు.

డార్విన్ సిద్ధాంతం, ఆయనకి లభించిన అవార్డులు - గౌరవాలు, ఇతర జీవిత విశేషాల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - బయాలజీ

జీర్ణవ్యవస్థ



జీవుల మనుగడకు అవసరమైన వ్యవస్థల్లో జీర్ణవ్యవస్థ ముఖ్యమైంది. ఇది జంతు శరీరధర్మశాస్త్రంలో ప్రాథమిక భాగం. ఈ వ్యవస్థ నోటితో ఆహారం తీసుకోవడంతో ప్రారంభమై, పెద్దపేగులో నిల్వ అయిన వ్యర్థాలను శరీరం నుంచి బయటికి పంపడంతో ముగుస్తుంది. దీని మధ్యలో అనేక అవయవాలు తమ విధులను నిర్వర్తిస్తాయి. దీనికోసం నోరు, అన్నవాహిక, చిన్నపేగు, పెద్దపేగు, కాలేయం, క్లోమంతో సహా జీర్ణవ్యవస్థను ఏర్పరిచే ప్రధాన అవయవాల పనితీరును అర్థం చేసుకోవాలి.

జీర్ణవ్యవస్థ - ప్రధాన భాగాలు
- నోరు
- అన్నవాహిక
- జీర్ణాశయం
- చిన్న పేగు
- పెద్దపేగు
- పురీష నాళం
- పాయువు

జీర్ణక్రియ - వివిధ ప్రక్రియలు
- ఆహారాన్ని తీసుకోవడం
- యాంత్రిక జీర్ణక్రియ
- రసాయన జీర్ణక్రియ
- శోషణ
- విసర్జన

ప్రధాన జీర్ణ ఎంజైమ్‌లు
- అమైలేస్
- ప్రోటియేజ్
- లైపేస్
- న్యూక్లియేస్

మానవుల్లో జీర్ణ సంబంధ ఆరోగ్య రుగ్మతలు
- గ్యాస్ట్రో ఈసోఫాగియల్ రిఫ్లక్స్ వ్యాధి (GERD)
- అల్సర్
- ప్రకోప పేగు వ్యాధి (IBS)
- ఉదర కుహర వ్యాధి

ప్రధాన జీర్ణ ఎంజైమ్‌లు - వాటి విధులు, జీర్ణక్రియ - ఎంజైమ్ ప్రమేయం ఉన్న దశలు, ఎంజైమ్ కార్యాచరణను ప్రభావితం చేసే కారకాలు మొదలైన అంశాలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

సీనియర్ రెసిడెంట్ ఉద్యోగాలు

పీన్య, బెంగళూరులోని ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్‌ఐసీ) మూడేళ్ల ఒప్పంద ప్రాతిపదికన సీనియర్ రెసిడెంట్, ఫుల్ /పార్ట్‌టైమ్ స్పెషలిస్ట్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 24. అర్హులైన అభ్యర్థులు 2025, డిసెంబరు 16న ఇంటర్వ్యూకు హాజరుకావొచ్చు.

స్పెషలిస్ట్ పోస్టులు

ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఎన్టీపీసీ - ఎన్‌జీఈఎల్), దిల్లీ ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో స్పెషలిస్ట్-1, 2, 3, మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 18. దరఖాస్తు ఫీజు రూ.500. అర్హులైన అభ్యర్థులు 2025, డిసెంబరు 23లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

సైంటిస్ట్ పోస్టులు

కోల్‌కతాలోని సీఎస్ఐఆర్- సెంట్రల్ గ్లాస్ అండ్ సెరామిక్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 28. దరఖాస్తు ఫీజు రూ.500. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసేందుకు చివరి తేదీ 29 డిసెంబరు 2025.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలు/ అప్రెంటిస్ పోస్టులకు నేడే (డిసెంబరు 6) చివరి తేదీ

- టీహెచ్‌డీసీలో 40 అసిస్టెంట్ మేనేజర్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ పోస్టులు. ఇంజినీరింగ్, ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.
- ఐడీఈఎంఐ ముంబయిలో 33 ట్రేడ్ అప్రెంటిస్ పోస్టులు. ఐటీఐలో ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Railway Exams

Mathematics

Ratio & Proportion

1. If $p : q = 3 : 7$ and $r : q = 5 : 14$, then what is the value of $p : q : r$?
A) 6 : 14 : 5 B) 9 : 21 : 10
C) 3 : 7 : 14 D) 12 : 28 : 15

2. Four years ago, the ratio of the ages of P and Q was 5 : 6. Eight years from now, the ratio of their ages will be 13 : 15. What is the sum of their present ages?
A) 98 B) 92 C) 96 D) 90

3. The ratio of prices of Apple and Banana is 5 : 2, and the ratio of their quantities consumed by a family is 3 : 8. What is the ratio of expenditures on Apple and Banana?
A) 15 : 16 B) 10 : 21
C) 5 : 8 D) 4 : 7

4. A sum of Rs.10,335 is divided among X, Y, and Z such that the ratio of the amount of X to Y is 5 : 6, and the ratio of the amount of Y to Z is 9 : 10. What is the amount received by Y?
A) Rs.3,510 B) Rs.3,810
C) Rs.3,690 D) Rs.3,780

5. The ratio of the number of students in colleges X and Y is 7 : 9. If the number of students in colleges X and Y increases by 30% and 10% respectively, what will be the new ratio of students in X and Y?
A) 7 : 8 B) 13 : 15
C) 91 : 99 D) 91 : 117

6. In a school, the ratio of the number of boys to the number of girls is 7 : 10. If there are 180 more girls than boys, how many boys are there in the school?
A) 210 B) 420 C) 480 D) 300

7. Two numbers are respectively 25% and 60% more than a third number. What is the ratio of the two numbers?
A) 4 : 5 B) 5 : 8
C) 5 : 7 D) 25 : 32

8. A sum of 840 is divided into two parts such that the ratio of one part to the other is 5 : 7. What is the smaller part?
A) 280 B) 350 C) 300 D) 420

9. If A is the mean proportion between 16 and 4, and B is the mean proportion between 100 and 25. Find the value of 2A + 3B.
A) 110 B) 130 C) 166 D) 170

10. The salaries of Kabir and Vicky are in the ratio 5 : 2. If their salaries are increased by 20% and 12%, respectively, what will be the new ratio of their salaries?
A) 75 : 28 B) 30 : 13
C) 6 : 5 D) 28 : 15

11. The ratio of incomes of Ramesh and Suresh is 3 : 5, and the ratio of their expenditures is 4 : 3, respectively. If Ramesh saves Rs.600 out of his income of Rs.3,000, then what is the saving of Suresh?
A) Rs.1,200 B) Rs.3,200
C) Rs.1,800 D) Rs.2,000

12. The salaries of P, Q, R, and S are in the ratio 3 : 4 : 5 : 6, respectively. After increases of 20%, 25%, 30%, and 40%, respectively, the increased salary of R becomes Rs.507. What is the sum of their original salaries?
A) Rs.1,260 B) Rs.1,404
C) Rs.1,560 D) Rs.1,728

13. A company manufactures boxes of three types - plastic, wood and glass. The ratio of the numbers of plastic : wood : glass boxes is 2 : 3 : 5. The difference between the numbers of wood and glass boxes is 144. If the number of plastic boxes is increased by 25%, what will be the new number of plastic boxes?
A) 144 B) 168
C) 180 D) 192

14. A sum was to be divided between P and Q in the ratio 9 : 6. By mistake, it was divided in the ratio 6 : 9. Because of this mistake, P received Rs.540 less than what he should have received. What is the total sum?
A) Rs.2,100 B) Rs.2,400
C) Rs.2,700 D) Rs.3,000

15. Rs.18,000 is distributed among X, Y and Z such that they receive notes of Rs.500, Rs.250 and Rs.125 respectively. The amounts received are in the ratio 8 : 6 : 4. What is the ratio of the number of notes received?
A) 4 : 3 : 2 B) 2 : 3 : 4
C) 8 : 6 : 4 D) 16 : 12 : 8

16. R and S are inversely proportional to each other. When R = 12, S = 8. What will be the value of S when R becomes 18?
A) 6 B) 8 C) 12 D) 16

17. Two numbers are in the ratio 5 : 8. If the difference between these two numbers is 39, what are the numbers?
A) 65 and 104
B) 25 and 64
C) 35 and 74
D) 40 and 79

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

ఉక్రెయిన్‌లోని ఇంటిని తాకిన రష్యా డ్రోన్

- 12 ఏళ్ల బాలుడి మృతి

కీవ్: ఒకవైపు అమెరికా శాంతి ఒప్పందాలకు ప్రయత్నిస్తోంటే.. ఉక్రెయిన్‌పై రష్యా డ్రోన్లతో విరుచుకుపడింది. ఉక్రెయిన్‌లోని ఓ ఇంటిని రష్యాకు చెందిన డ్రోన్ ఢీ కొట్టడంతో ఓ 12ఏళ్ల బాలుడు మృతి చెందాడు. అయితే రష్యాకు చెందిన ఓడరేవులు, నూనె శుద్ధి కేంద్రాలే లక్ష్యంగా తొలుత ఉక్రెయినే దాడులకు కాలుదువ్వింది అని అధికారులు తెలిపారు. ఉక్రెయిన్ అధికారులతో చర్చల కోసం అమెరికా రాయబారి స్టీవ్ విట్‌కాఫ్, ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్‌లు మయామీకి వెళ్లినట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

30కి పైగా దేశాలకు ‘ట్రావెల్ బ్యాన్’ వర్తింపు!

- ట్రంప్ సర్కారు యోచన

వాషింగ్టన్: కొన్ని దేశాల పౌరులు అమెరికాలోకి అడుగుపెట్టకుండా విధించిన నిషేధాన్ని 30కి పైగా దేశాలకు అగ్రరాజ్యం విస్తరించబోతోంది. అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్టీ నోయెమ్ ఈ విషయాన్ని తెలిపారు. జూన్‌లో ట్రంప్ సర్కారు ఒక ట్రావెల్ బ్యాన్‌ను ప్రకటించింది. దీని కింద 12 దేశాల పౌరులు అమెరికాలోకి ప్రవేశించకుండా నిషేధించింది. అలాగే మరో ఏడు దేశాలవారు అగ్రరాజ్య ప్రవేశాలపై ఆంక్షలు విధించింది. తాజాగా ఈ జాబితాను విస్తరించనున్నట్లు క్రిస్టీ తెలిపారు. అయితే అందులో చేర్చబోయే దేశాల పేర్లను వెల్లడించలేదు. ఇది అధ్యక్షుడు ట్రంప్ పరిశీలనలో ఉందన్నారు. గత నెలలో అమెరికా నేషనల్ గార్డ్ సభ్యులపై అఫ్గానిస్థాన్‌కు చెందిన ఇద్దరు కాల్పులు జరిపినట్లు వెల్లడి కావడంతో ఈ యోచన చేస్తోంది.

శరణార్థుల వర్క్ పర్మిట్లకు ఎసరు

- కాల వ్యవధిపై అమెరికా కోతలు

వాషింగ్టన్: వలసదారులపై కఠిన వైఖరిని అవలంబిస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తాజాగా మరో సంచలన నిర్ణయం తీసుకుంది. శరణార్థులకు, వలసదారులకు ఇచ్చే వర్క్ పర్మిట్‌ల కాలవ్యవధిని కుదిస్తున్నట్లు అమెరికా పౌర, వలస సేవల విభాగం(యూఎస్‌సీఐఎస్) ఓ ప్రకటనలో తెలిపింది. శరణార్థులు, ఆశ్రయం పొందాలనుకునేవారు, గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్న వారికి అమెరికాలో పని చేసుకునేందుకు ఉద్యోగ అనుమతి పత్రం(ఈఏడీ) జారీ చేస్తారు. దీనికి అయిదేళ్ల కాలవ్యవధి ఉండేది. తాజా సవరణలతో దాన్ని 18 నెలలకు కుదిస్తున్నారు. భద్రతా కారణాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూఎస్‌సీఐఎస్ తెలిపింది. ఇటీవల అధ్యక్ష భవనానికి సమీపంలో ఇద్దరు నేషనల్ గార్డులపై ఓ దుండగుడు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో దేశంలోకి వలస వచ్చేవారిపై కఠిన సమీక్షలు అవసరమని భావిస్తోన్న ట్రంప్ పరిపాలనా యంత్రాంగం... వర్క్ పర్మిట్ల కాల వ్యవధిని కుదించే నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

కేరళలో అరుదైన పరాన్నజీవి మొక్క గుర్తింపు

అరుదుగా పుష్పించే పరాన్నజీవి మొక్కను 175 ఏళ్ల తర్వాత కేరళలో పరిశోధకులు మళ్లీ కనుగొన్నారు. ‘క్యాంప్‌బెలియా ఆరంటియాకా’గా ఈ మొక్కను గుర్తించారు. వయనాడ్ జిల్లాలోని థొల్లాయిరాం ప్రాంతంలో ఇది కనిపించింది. ఈ జాతి మొక్కను



మొదట 1849కి ముందు తమిళనాడులోని నడువట్టం వద్ద స్కాటిష్ వృక్ష శాస్త్రవేత్త రాబర్ట్ విట్ చూశారు. అయితే, దీనికి సంబంధించిన విశ్వసనీయమైన రికార్డులేవీ లేవు. కేరళలోని కాల్‌పెట్టకు చెందిన ఎం.ఎస్.స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ పరిశోధకులు సలీం పిచాన్‌తోపాటు అలప్పుజలోని సనాతన ధర్మ కళాశాల నుంచి వచ్చిన డాక్టర్ జోస్ మాథ్యూ, అరుణ్‌రాజ్, డాక్టర్ వి.ఎస్. సంజయ్, శ్రీలంక యూనివర్సిటీకి చెందిన బి.గోపల్లవ బృందం ‘క్యాంప్‌బెలియా ఆరంటియాకా’ను కనుగొంది. ఇంగ్లాండుకు చెందిన ‘ది రాయల్ బొటానిక్ గార్డెన్స్’ అధికారిక జర్నల్ ‘క్యూ బులెటిన్’ తాజా సంచికలో ఈ ఆవిష్కరణ ప్రచురితమైంది. పూర్తిగా పరాన్నజీవి అయిన ఈ మొక్క తన పోషణ కోసం కురింజి (స్ట్రోబిలాంథెస్) మొక్కల వేర్లపై ఆధారపడుతుంది. భూమిపై ఈ మొక్క ఉనికి కొన్ని వారాలు మాత్రమే ఉంటుంది.

ETV భారత్
యాప్ స్టోర్ & గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

అంబేడ్కర్ మెచ్చిన చారిత్రక గ్రంథాలయం

దేశమంతా నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవం నిర్వహించుకోగా.. ఆ రాజ్యాంగ నిర్మాత అయిన బాబాసాహెబ్ అంబేడ్కర్ ‘మహాపరినిర్వాణ్’ దివస్‌ను శనివారం (డిసెంబర్ 6) జరుపుకోనున్నారు. ఈ నేపథ్యంలో అధ్యయన నిమిత్తం ప్రతి నిత్యం అంబేడ్కర్ సందర్శించిన దిల్లీలోని చారిత్రక ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ)కు చెందిన కేంద్ర గ్రంథాలయం చర్చనీయాంశంగా



మారి వార్తల్లో నిలుస్తోంది. 1954 జూన్ 5న ఇదే గ్రంథాలయం గురించి అంబేడ్కర్ తన స్వదస్తూరితో “గత పదేళ్లుగా దిల్లీలో ఉంటున్నా. పురాతనమైన భారతీయ చరిత్రపై నాకున్న ఆసక్తితో ఈ గ్రంథాలయం నుంచి ఆ అంశానికి సంబంధించిన పుస్తకాలు క్రమం తప్పకుండా తీసుకువెళుతుంటా. భారతీయ చరిత్రపై ఇక్కడ పెద్ద పుస్తక భాండాగారమే ఉంది. అయితే, బ్రిటిష్ మ్యూజియంలా మరిన్ని పుస్తకాలు ఉండాల్సింది’’ అని రాశారు. భారతదేశ ప్రాచీన నాగరికత, సంస్కృతి, చరిత్రపై ఆయన చేసిన లోతైన పరిశోధనకు ఇది నిదర్శనంగా చెప్పవచ్చు. అంబేడ్కర్‌కు ఇష్టమైన ప్రదేశాల్లో ఈ గ్రంథాలయం ఒకటని ఏఎస్ఐ అధికారులు తెలిపారు.





భారత్ పర్యటనలో భాగంగా దిల్లీలోని రాజ్‌ఘాట్‌లో జాతిపిత మహాత్మాగాంధీ స్మారకం వద్ద శుక్రవారం నివాళులర్పిస్తున్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ✦ హైదరాబాద్ హౌస్‌లో ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొన్న ప్రధాని మోదీ, పుతిన్

ఉక్రెయిన్ కోసం రష్యా భద్రతను బలి చేయాలా?

- నాటో విస్తరణపై పుతిన్ ఆగ్రహం
- జెలెన్‌స్కీ తీరుపై మండిపాటు



దిల్లీ: ఉక్రెయిన్ కోసం తమ దేశ భద్రతకు విఘాతం కలిగించే ఏ ప్రతిపాదనకూ తాము సమ్మతించేది లేదని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తేల్చిచెప్పారు. రష్యా భద్రతను బలి చేయడం ఎన్నటికీ తమకు ఆమోదయోగ్యం కాదని అని స్పష్టం చేశారు. భారత పర్యటన వేళ ఆయన జాతీయ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ‘‘జెలెన్‌స్కీ అధికారంలోకి వచ్చినప్పుడు శాంతి వాగ్దానాలు చేశారు. ఆ తర్వాత ఆయన విధానం మారిపోయింది. ప్రజల ప్రయోజనాల కంటే కొద్దిమంది అతివాదుల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు’’ అని మండిపడ్డారు. ఈ వైఖరిని ‘నయా నాజీ పాలన’తో పుతిన్ పోల్చారు. శాంతియుత చర్చలకు బదులు సైనిక పరిష్కారాలకే ఉక్రెయిన్ ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

అసలు కారణం నాటో విస్తరణే

‘‘ఉక్రెయిన్ సహా ప్రతి దేశానికీ తమ రక్షణ కోసం ఏ మార్గాన్ని ఎంచుకోవాలనే స్వతంత్ర హక్కు ఉంది. కానీ, అది ఇతర దేశాలకు హాని చేసేలా ఉండకూడదు. ఉక్రెయిన్ భద్రత అంశం రష్యా సెక్యూరిటీకి ముప్పు కలిగించే విధంగా ఉండకూడదు. దాన్ని అంగీకరించలేం. నాటోను తూర్పు వైపు విస్తరించబోమని రష్యాకు హామీ ఇచ్చారు. ఆ తర్వాత అనేకసార్లు దాన్ని ఉల్లంఘించారు. ఉక్రెయిన్‌ను నాటో కూటమిలోకి లాగడం రష్యాకు ముప్పుగా భావిస్తున్నాం’’ అని పుతిన్ స్పష్టం చేశారు.

ట్రంప్ ప్రయత్నంలో చిత్తశుద్ధి

ఈ యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నారని పుతిన్ అన్నారు. నష్టాలను తగ్గించాలని ఆయన కోరుకుంటున్నారని, ఆయన ఉద్దేశాలు నిజాయతీగా ఉన్నాయని చెప్పారు. అమెరికాకు ఈ సమస్యను పరిష్కరించడంలో కొన్ని రాజకీయ, ఆర్థికపరమైన ప్రయోజనాలు కూడా ఉన్నాయన్నారు. చర్చలకు రష్యా సిద్ధంగానే ఉందని, అయితే, తమ భద్రతకు హాని కలిగించే షరతులను అంగీకరించబోమని తేల్చి చెప్పారు. ఉక్రెయిన్ తటస్థంగా ఉంటుందని ఆ దేశ మొదటి రాజ్యాంగ ప్రకటనలో స్పష్టంగా చెప్పినప్పటికీ తర్వాత దాన్ని అక్కడి పాలకులు విస్మరించారని పుతిన్ దుయ్యబట్టారు.

జీ-7 కూటమిలో రష్యా చేరబోదు

రష్యాకు జీ-7 కూటమిలో చేరే ఉద్దేశం లేదని పుతిన్ స్పష్టం చేశారు. గతంలో రష్యా జీ-8లో భాగమై ఉన్నప్పటికీ, తాను ఆ సమావేశాలకు హాజరు కావడం మానేసిన తర్వాత అది మళ్లీ జీ-7గా మారిపోయిందని గుర్తుచేశారు. జీ-7 దేశాలు తమను తాము ‘ఏడు పెద్ద దేశాలు’ అని పిలుచుకోవడాన్ని ఆయన తప్పుబట్టారు. ‘‘కొనుగోలుశక్తి పరంగా చూస్తే ఈ దేశాల ఆర్థిక బలం నానాటికీ తగ్గిపోతోంది. ఈ ప్రమాణం పరంగా పరిశీలిస్తే భారత్.. ప్రపంచంలో మూడో అతిపెద్ద దేశంగా ఉంది. మరి బ్రిటన్ వంటి దేశాలు ఎక్కడున్నాయి? జర్మనీలో వరుసగా మూడో సంవత్సరం మాంద్యం కనిపిస్తోంది. ఫ్రాన్స్ కూడా మాంద్యం అంచున ఉంది. ఐరోపాలోని పెద్ద దేశాల పరిస్థితి కూడా ఇలానే ఉంది. అయినప్పటికీ, జీ-7 ఒక ముఖ్య వేదిక కాబట్టి వారు ముందుకెళ్లాలని కోరుకుంటున్నా’’ అని చురక అంటించారు. జీ-8 నుంచి తాము వైదొలగడానికి కారణాలను అమెరికాకు వివరించినట్లు తెలిపారు. ‘‘ప్రస్తుతం రష్యా- ఐరోపా దేశాల మధ్య సంబంధాలు సరిగా లేవు. ఆ దేశాల నేతలు నాతో మాట్లాడటానికి ఇష్టపడనప్పుడు, నేను జీ-8 సమావేశానికి వెళ్లి ఎలా మాట్లాడగలను? ఒకవేళ వారు చర్చించడానికి సిద్ధంగా ఉంటే, భవిష్యత్తులో ఈ అంశాన్ని పరిశీలిస్తాం’’ అని పుతిన్ పేర్కొన్నారు. జీ-7 కంటే ఇతర అంతర్జాతీయ కూటములకు రష్యా ప్రాధాన్యం ఇస్తుందన్నారు.

‘భారత్ - చైనా.. రష్యాకు సన్నిహిత దేశాలు’

- పుతిన్ వ్యాఖ్యలను ప్రముఖంగా ప్రస్తావించిన చైనా అధికారిక మీడియా

బీజింగ్: భారత్, చైనాలు తమకు అత్యంత సన్నిహిత మిత్ర దేశాలంటూ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చేసిన వ్యాఖ్యలను చైనా అధికారిక మీడియా ‘గ్లోబల్ టైమ్స్’ ప్రముఖ్యంగా ప్రస్తావించింది. అదే సమయంలో ఆ రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో జోక్యం చేసుకునే హక్కు రష్యాకు లేదంటూ పుతిన్ చెప్పిన మాటనూ ప్రచురించింది. నిజానికి రష్యా అధ్యక్షుడు భారత పర్యటనను చైనా అధికారిక మీడియా చాలావరకూ విస్మరించింది. ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ తమ దేశంలో సాగిస్తున్న పర్యటనకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. అయితే భారత్, చైనాలతో రష్యా సంబంధాలను ఉద్దేశించి పుతిన్ వ్యాఖ్యలను మాత్రం ప్రచురించింది. భారత్, చైనాల మధ్య ఉన్న వివాదాలకు ఇరు దేశాల నేతలు పరిష్కారాన్ని కనుగొంటారన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తంచేసిన విషయాన్ని కూడా ప్రస్తావించింది. చైనా-రష్యా మధ్య సన్నిహిత వ్యూహాత్మక సంబంధాలు ఉన్నాయి. భారత్-రష్యాల మధ్య కూడా అదే స్థాయి మైత్రి ఉండటం చైనాకు రుచించడంలేదని విశ్లేషకులు చెబుతున్నారు. భారత్-చైనా సంబంధాలతోపాటు రష్యా చమురు కొనుగోలుపై అమెరికా ఆరోపణలను తిప్పికొడుతూ పుతిన్ చేసిన వ్యాఖ్యలను చైనా అధికారిక వార్తా సంస్థ షిన్హువా ప్రస్తావించింది. రష్యా చమురు, గ్యాస్‌ను కొనుగోలు చేస్తున్న దేశాల్లో చైనా అగ్రస్థానంలో ఉంది. ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని కొనసాగిస్తున్నందుకు రష్యా నుంచి దిగుమతులు ఆపాలన్న అమెరికా పిలుపును డ్రాగన్ తోసిపుచ్చుతోంది.

అమెరికా ఆంక్షలు ఫలించకపోవచ్చు

- పుతిన్ భారత పర్యటనపై చైనా

బీజింగ్: అమెరికా ఆంక్షలు, సుంకాల నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటనకు రావడంపై చైనా మీడియా కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రపంచంలో ఏ దేశమూ ఒంటరి కాదన్న స్పష్టమైన సందేశాన్ని పుతిన్ భారత పర్యటన చాటుతోందని అభిప్రాయపడింది. చైనా విదేశీ వ్యవహారాల విశ్వవిద్యాలయంలోని ప్రొఫెసర్ లీ హైడాంగ్ శుక్రవారం ఓ అంతర్జాతీయ మీడియాతో మాట్లాడారు. భారత్-రష్యా ఎవరిపైనా ఆధారపడకుండా, తమ సామర్థ్యాలను తామే సొంతంగా, మరింత శక్తిమంతంగా తయారుచేసుకోవాలని నిర్ణయించుకున్నాయని అర్థమవుతోందని తెలిపారు. ఇరు దేశాల మధ్య సమన్వయం, సహకారమే అందుకు నిదర్శనమని ప్రొఫెసర్ లీ అభిప్రాయపడ్డారు. ఇరు పక్షాలూ పరస్పర మద్దతుతో బలమైన బంధాన్ని ఏర్పరచుకున్నాయని తెలిపారు. ఫలితంగా అమెరికా సహా పశ్చిమ దేశాల ఆంక్షలు, ఒత్తిడి ఇరు దేశలపై ఆశించినంతగా ప్రభావం చూపకపోవచ్చని విశ్లేషించారు.

ఆ విషయంలో అన్ని దేశాలు మమ్మల్ని అనుసరించాలి

- ఆస్ట్రేలియా అధికారి వ్యాఖ్య

సిడ్నీ: పదహారేళ్ల కన్నా తక్కువ వయసు ఉన్నవారు సామాజిక మాధ్యమాలను వాడకుండా తీసుకువచ్చిన చట్టంపై ఆస్ట్రేలియా అధికారులు స్పందించారు. తమ చర్యలను ప్రపంచ దేశాలు సైతం అనుసరించాలని ఇ-సేఫ్టీ కమిషనర్ జూలీ ఇన్మాన్ గ్రాంట్ సూచించారు. 16 ఏళ్ల లోపు పిల్లలను సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంచాలనే నిర్ణయం గురించి మొదట తాను ఆందోళన చెందానని.. కానీ ఈ విధానాన్ని చాలామంది తల్లిదండ్రులు ఆహ్వానిస్తుండటంతో తన ఆలోచనను మార్చుకున్నానని ఆయన తెలిపారు. తమ చర్యలను అన్ని దేశాలు ఆసక్తిగా గమనిస్తున్నాయని, ఇది ప్రపంచానికి ఓ ఉదాహరణగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



జపాన్ పర్యటనలో ట్రూడో, కేటీ పెర్రీ

- మాజీ ప్రధాని కిషిదా దంపతులతో విందు

టోక్యో: కెనడా మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో, ఆయన ప్రియురాలు అమెరికన్ పాప్‌స్టార్ కేటీ పెర్రీతో కలిసి జపాన్ పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆ దేశ మాజీ ప్రధాని ఫూమియో కిషిదా, ఆయన భార్య యూకోను కలిసి విందులో పాల్గొన్నారు. ఇందుకు సంబంధించిన ఫోటోలను కిషిదా ‘ఎక్స్’ వేదికగా పంచుకున్నారు. ట్రూడో, పెర్రీలతో కలిసి దిగిన ఫొటోను కూడా ఆయన పంచుకున్నారు. ఇక, కిషిదా పోస్టును ట్రూడో రీపోస్టు చేశారు. జపాన్ మాజీ ప్రధానితో భేటీ కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. దాదాపు దశాబ్దం పాటు కెనడా ప్రధానిగా ఉన్న జస్టిన్ ట్రూడో.. ఈ ఏడాది ప్రారంభంలో తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే జులైలో ట్రూడో-పెర్రీలు మాంట్రియాల్‌లోని ఓ రెస్టారంట్‌లో తొలిసారి కనిపించారు. దీంతో వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారనే ప్రచారం జోరందుకుంది.

ఎట్టకేలకు స్వదేశానికి..

- బంగ్లాదేశ్ నుంచి బెంగాల్‌కు చేరుకున్న గర్భిణి సునాలి, ఆమె కుమారుడు సబీర్

మాల్దా: అక్రమ చొరబాటుదారు ఆరోపణలతో బంగ్లాదేశ్ జైలులో గత 103 రోజులుగా నిర్బంధంలో ఉన్న నిండు గర్భిణి సునాలీ ఖాతూన్, ఆమె కుమారుడు సబీర్ శుక్రవారం సాయంత్రం మాల్దా సరిహద్దు కేంద్రం ద్వారా భారత్‌కు చేరుకున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో భారత ప్రభుత్వం ఆమెను తిరిగి స్వదేశానికి తీసుకొచ్చింది. పశ్చిమ బెంగాల్‌లోని బీర్భూమ్ నివాసి అయిన 26 ఏళ్ల సునాలీ, ఆమె భర్త దానిశ్, కుమారుడు దిల్లీలోని రోహిణీ ప్రాంతంలో ఉన్న బెంగాలీ బస్తీలో కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నారు. చెత్త ఏరుకుంటూ ఉపాధి పొందుతున్న వారిని, బీర్భూమ్‌కే చెందిన మరో ముగ్గురినీ బంగ్లాదేశీయులనే అనుమానంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఫారినర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ ఆదేశాలతో ఆ ఆరుగురినీ ఆగస్టులో బంగ్లాదేశ్‌కు తిప్పిపంపించారు. బంగ్లాదేశ్ ప్రభుత్వం వీరిని చాపాయ్ నవాబ్‌గంజ్‌లో ఖైదు చేసింది. ఈ అంశంపై తీవ్ర వివాదం చెలరేగడం, కలకత్తా హైకోర్టుతో పాటు సుప్రీంకోర్టు వారిని భారత్‌కు తీసుకురావాలని ఆదేశించడంతో ప్రభుత్వ అధికారులు ఎట్టకేలకు సునాలీని, ఆమె కుమారుడిని విడిపించి శుక్రవారం స్వదేశానికి తీసుకొచ్చారు. నిండు గర్భిణీ అయిన సునాలి ఏ క్షణంలోనైనా ప్రసవించే అవకాశం ఉండడంతో మాల్దా మెడికల్ కళాశాల ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. వైద్యులు అనుమతిస్తే బీర్భూమ్ జిల్లాలోని ఆమె స్వగ్రామం పైకర్ గ్రామానికి చేరుస్తామని అధికారులు తెలిపారు. బంగ్లాదేశ్ నిర్బంధంలోనే ఉన్న సునాలీ భర్త, మరో ముగ్గురిని భారత్‌కు తీసుకువచ్చే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు.

ఒక్కో వ్యాధికి ఒక్కో రకం వెల్లుల్లి!

వేర్వేరు రకాల అభివృద్ధికి పరిశోధకుల యత్నం

ప్రయాగ్‌రాజ్: ఎన్నో వ్యాధులకు ప్రకృతి ప్రసాదించిన ఔషధంగా భావిస్తోన్న వెల్లుల్లిపై సరికొత్త పరిశోధనలు జరుగుతున్నాయి. వెల్లుల్లిలోని ఎలిసిన్.. అంటువ్యాధులు, శ్వాసకోశ రుగ్మతలపై పనిచేస్తుంది. గంధక ధాతువులు...అధిక రక్తపోటును, కొలెస్ట్రాల్‌నూ తగ్గిస్తాయి. సెలీనియం క్యాన్సర్ కణాలవ్యాప్తిని తగ్గిస్తుంది. ఫ్లేవనాయిడ్లు గుండె ధమనులను కాపాడతాయి. యాంటీ ఆక్సీడెంట్లు



మధుమేహం, వృద్ధాప్యం మీద పనిచేస్తాయని ఇప్పటికే శాస్త్రవేత్తలు గుర్తించారు. అయితే, వెల్లుల్లికి ఉన్న ఈ సహజ రోగ నిరోధక లక్షణాలను నానో టెక్నాలజీతో మరింత ఇనుమడింపజేయవచ్చని అలహాబాద్ విశ్వవిద్యాలయ ఆచార్యుడు కె.ఎన్. ఉత్తమ్ నిర్ధారించారు. ఆయన ఆధ్వర్యంలో పరిశోధకులు వెల్లుల్లి మొక్కపై టైటానియం డయాక్సైడ్ నానో పార్టికల్స్‌ను ప్రయోగించారు. ఈ నానో అణువులు వెల్లుల్లిలోని పోషక వ్యవస్థను మరింత బలోపేతం చేశాయి. ఫలితంగా వెల్లుల్లిలో గంధకం, భాస్వరం, క్యాల్షియం, జింక్, ఇనుము ధాతువులు సాధారణం కన్నా ఎక్కువగా ఏర్పడ్డాయి. యాంటీ ఆక్సిడెంట్లు 30 నుంచి 40 శాతం పెరిగాయి. వెల్లుల్లిలోని ఏ ధాతువు ఏ వ్యాధి చికిత్సకు తోడ్పడుతుందో నిర్ధారించుకుని ఆయా రోగాల చికిత్సకు పరిశోధనశాలలో వేర్వేరు వెల్లుల్లి రకాలను రూపొందించి పొలాల్లో సాగు చేయించాలని ఉత్తమ్ బృందం యోచిస్తోంది. ఇలాంటి రకాలకు పేటెంట్లు తీసుకుని రెండేళ్లలో రైతుకు అందించాలనుకుంటున్నామని ఉత్తమ్ చెప్పారు.

పంచాయతీ బరిలో చంద్రబాబు.. జగన్..!





భూక్యా చంద్రబాబు   బానోత్ జగన్

ఈ పేర్లు చూసి.. కంగారుపడకండి.. ఇక్కడ పోటీలో ఉన్నది మీరనుకుంటున్న నాయకులు కాదు.. అవే పేర్లతో ఉన్న స్థానిక అభ్యర్థులు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం గుండ్లరేవుకు చెందిన వీరు సర్పంచి స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. వారి పేర్లు భూక్యా చంద్రబాబు, బానోత్ జగన్నాథం అలియాస్ జగన్. ఇద్దరూ కాంగ్రెస్‌లోని ఇరు వర్గీయుల మద్దతుతో బరిలో దిగారు. వీరి పేర్ల కారణంగా పోటీతోపాటు ప్రచారం ఆసక్తిగా మారింది. ఈ నెల 9న నామినేషన్ల ఉపసంహరణ ఉన్నప్పటికీ ఇద్దరూ బరిలో నిలిచేందుకే మొగ్గు చూపుతున్నారు. వీరి మధ్య సయోధ్య కుదిర్చేందుకు వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ రంగంలోకి దిగనున్నట్లు సమాచారం. - జూలూరుపాడు, న్యూస్‌టుడే

సామాజిక మాధ్యమాల్లో చిన్నారుల చిత్రీకరణపై నియంత్రణ విధించాలి

- కేంద్రాన్ని కోరిన సుధామూర్తి



దిల్లీ: పిల్లలను సామాజిక మాధ్యమాల్లో చూపిస్తున్న తీరుపై రాజ్యసభ సభ్యురాలు, ప్రముఖ రచయిత్రి సుధామూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. దీని నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకురావాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆమె రాజ్యసభలో మాట్లాడారు. “చిన్నారులు మన భవిష్యత్తు. మంచి విలువలతో మనం వారిని పెంచాలి. మంచి చదువులు, క్రీడలు వంటి వాటిని వారికి అందించాల్సి. సామాజిక మాధ్యమాల వల్ల ప్రయోజనాలతో పాటు ప్రతికూలతలూ ఉన్నాయి. చాలా మంది తల్లిదండ్రులు తమ చిన్నారులను భిన్న రూపాల్లో, వేషధారణల్లో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేసుకుంటున్నారు. దీని వల్ల అనుసరించే వారి సంఖ్య పెరిగి తల్లిదండ్రులకు కొంత ఆదాయం రావొచ్చు. కానీ.. ఇది పిల్లల మనస్తత్వంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. చదువులు, క్రీడలపై సరిగా దృష్టి పెట్టలేరు. అందువల్ల సోషల్ మీడియాల్లో పిల్లలను చూపించే విధానంపై ఫ్రాన్స్ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో తీసుకొచ్చిన విధానాల మాదిరే ఇక్కడా ప్రభుత్వం కఠిన నిబంధనలు తీసుకురావాలి. లేదంటే భవిష్యత్తులో పిల్లలకు ఇదొక పెద్ద సమస్యగా మారుతుంది’’ అని సుధామూర్తి పేర్కొన్నారు.

న్యాయవ్యవస్థలో ఏఐ వాడకంపై నియంత్రణ అవసరం లేదు: సుప్రీం

దిల్లీ: న్యాయవ్యవస్థలో అనియంత్రిత కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్ సాంకేతికతల వాడకాన్ని అరికట్టాలంటూ నమోదైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం తిరస్కరించింది. ఏఐ వల్ల ప్రమాదాలున్నా.. వాటిని పరిపాలనా విధానాల ద్వారా పరిష్కరించవచ్చని స్పష్టంచేసింది. న్యాయ సంబంధిత విధానాల్లో ఏఐ రూపొందించిన సమాచారాన్ని ఉపయోగించడం వల్ల ప్రమాదాలు జరగొచ్చని కార్తికేయ రావల్ అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సీజేఐ జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మాల్యాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ‘ఏఐ న్యాయ నిర్ణయాలు తీసుకోలేదు. జడ్జీలు, న్యాయవాదులు ఏఐ ఇచ్చిన సమాచారాన్ని తప్పనిసరిగా ధ్రువీకరించాలి. ఇది ఇప్పటికే న్యాయ అకాడమీలు, బార్ అసోసియేషన్‌లలో అమలులో ఉంది. సమయం గడిచే కొద్దీ న్యాయవాదులు, న్యాయమూర్తులు దీనిపై అవగాహన పెంచుకుంటారు. మీ సూచనలు నిజంగా ఉపయోగకరమని భావిస్తే.. న్యాయ పరిపాలనా విభాగానికి మెయిల్ ద్వారా పంపండి’ అని ధర్మాసనం స్పష్టంచేసింది. దీంతో పిటిషనర్ తన పిటిషన్‌ను వెనక్కి తీసుకునేందుకు అనుమతి అడగ్గా.. సుప్రీం దానికి అంగీకరించింది.

అమెరికాలోని బర్మింగ్‌హామ్‌లో అగ్ని ప్రమాదం

- తెలుగు విద్యార్థులకు తీవ్రగాయాలు!

ఇంటర్నెట్‌డెస్క్: అమెరికాలోని అలబామా రాష్ట్రం బర్మింగ్‌హామ్‌లో తెలుగు విద్యార్థులు ఉంటున్న భవనంలో అగ్ని ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదవశాత్తు చెలరేగిన మంటలతో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలైనట్లు సమాచారం. ఏపీ, తెలంగాణకు చెందిన 10 మంది తెలుగు విద్యార్థులు ఆ భవనంలో నివాసం ఉంటూ అలబామా యూనివర్సిటీలో చదువుకుంటున్నట్టు తెలుస్తోంది. దీనిపై పూర్తి వివరాలు తెలియరాలేదు.

దేవుడి సొమ్ము దోచుకోవడం చిన్న చోరీనా?

జగన్‌పై నీలాయపాలెం విజయ్‌కుమార్ ధ్వజం



ఈనాడు, అమరావతి : తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామికి భక్తులు సమర్పించిన కానుకలు దోచుకోవడం చిన్న చోరీనా? అని వైకాపా అధినేత జగన్‌ను ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ ప్రశ్నించారు. హిందూ దేవుళ్లంటే అంత ఎగతాళా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందువుల మనోభావాల్ని దెబ్బతీసినందుకు జగన్ క్షమాపణలు చెప్పాలని డిమాండు చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు.

వేంకటేశ్వరస్వామి హుండీ అంటే అంత లోకువగా ఉందా జగన్?

- ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజం

ఈనాడు, అమరావతి: కోర్కెలు తీరిన భక్తులు తమ ఒంటి మీదున్న నగలన్నింటినీ శ్రీవారికి సమర్పించుకుంటారని...కానీ వైకాపా అధినేత జగన్ ఆ శ్రీవారినే నిలువు దోపిడీ చేశారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి హుండీ అంటే అంత లోకువగా ఉందా? అని జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరకామణిలో చోరీ కేసు గురించి అహంకారంతో మాట్లాడిన ఆయన తీరును హిందూ సమాజం క్షమించదని హెచ్చరించారు. శ్రీవారి పరకామణిలో చోరీ అనేది చిన్న కేసు అంటూ జగన్ చేసిన వ్యాఖ్యల్ని ఎక్స్ వేదికగా శుక్రవారం తీవ్రంగా ఖండించారు. ‘‘శ్రీవారి హుండీలో చేయి పెట్టినా తప్పు లేదన్నట్టు మాట్లాడతారా? సీఎంగా ఉన్నప్పుడు శ్రీవారి విషయంలో మీరు అనేక పాపాలు చేశారు. ఆ పాపాలే శాపాలై మీ పార్టీని 11 స్థానాలకు పరిమితం చేశాయి. అయినా ఇంకా అహంకారంతో విర్రవీగుతున్నారు. భగవంతుడి విషయంలో మీ అహంకారపూరిత మాటల్ని జీసస్ కూడా క్షమించరు’’ అని సోమిరెడ్డి పేర్కొన్నారు. శ్రీవారి హుండీలో చోరీని తక్కువ చేసిన మాట్లాడినందుకు జగన్ లెంపలేసుకొని, బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

డిసెంబరు 29 కాంట్రాక్టర్స్ డేగా గుర్తించాలి

ఈనాడు, అమరావతి: ఏటా డిసెంబరు 29వ తేదీని కాంట్రాక్టర్స్ డేగా ప్రభుత్వం అధికారికంగా గుర్తించాలని స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (సబ్కా) కోరింది. ఈ మేరకు సీఎంకు శుక్రవారం లేఖ రాసినట్లు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయకుమార్, సూర్యప్రకాశ్ ఓ ప్రకటనలో తెలిపారు.

భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ పదవీకాలం పొడిగింపు

ఈనాడు, అమరావతి: భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్, ఏపీ సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ సీఈఓగా వ్యవహరిస్తున్న ఆర్.మల్లికార్జునరావు పదవీకాలాన్ని ప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. ఈ నెల 10తో ఆయన పదవీకాలం ముగియనుండగా, 2026 డిసెంబరు 12 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

కరెన్సీ మ్యూజియంగా.. ఫరీదాబాద్ వ్యాపారి ఇల్లు

ఈటీవీ భారత్: డిజిటల్ చెల్లింపుల ప్రస్తుత జమానాలో చలామణిలో ఉన్న కరెన్సీనే కళ్లారా చూడటం అరుదుగా మారుతోంది. చరిత్రలో భాగమైన రాజుల కాలం నాటి నాణేలు, తర్వాత వచ్చిన కరెన్సీ నోట్ల గురించి కొత్తతరం తెలుసుకోవాలంటే కరెన్సీ మ్యూజియంగా మారిన సతీశ్ సింఘాల్ ఇంటిని సందర్శించాలి. హరియాణాలోని ఫరీదాబాద్‌కు చెందిన నూనెలు, మసాలాల వ్యాపారి సతీశ్ గత 21 ఏళ్లుగా వందకు పైగా



దేశాల పాతకాలపు అరుదైన నాణేలు, కరెన్సీ నోట్లు సేకరిస్తూ తన ఇంటినే మ్యూజియంగా మార్చేశారు. దేశంలోని వివిధ ప్రాంతాలు తిరిగి వీటిని సేకరించారు. 1839 నాటి నాణేలు సైతం ఇక్కడ చూడవచ్చు. ఫ్యాన్సీ, స్పెషల్ సీరియల్ నంబర్లు గల నోట్లు, భారత ప్రభుత్వం వివిధ సందర్భాల్లో ప్రముఖుల స్మారకంగా జారీ చేసిన ప్రత్యేక నాణేలు తన సేకరణలో ఉన్నాయి. ఆయనకున్న ఆసక్తికి గుర్తింపుగా లిమ్కా, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లలో స్థానం దక్కింది. భార్య వందనా సింఘాల్‌తో కలిసి ఓ హాబీగా 2004లో ఈ కార్యక్రమాన్ని సతీశ్ ప్రారంభించారు. తర్వాత ఆమె మరణించినా ప్రపంచంలోని ప్రతి దేశం కరెన్సీ ఉండేలా తన ఇంటిని ప్రదర్శన శాలగా మార్చాలనే లక్ష్యంతో సేకరణ కొనసాగిస్తున్నారు.

భారత్‌నెట్ ప్రాజెక్టు పర్యవేక్షణకు ఎస్‌పీవీ

ఈనాడు, అమరావతి: భారత్‌నెట్ ప్రాజెక్టు పర్యవేక్షణకు 'ఆంధ్రప్రదేశ్ భారత్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్' పేరిట ఎస్‌పీవీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. దీనికోసం ఏర్పాటు చేసే బోర్డులో డైరెక్టర్లుగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి ఐదుగురు చొప్పున సభ్యులు ఉంటారు. రాష్ట్రంలో ఏపీ ఫైబర్‌నెట్ మొదటి దశ నెట్‌వర్క్‌తో పాటు భారత్‌నెట్ నెట్‌వర్క్, కార్యకలాపాలు, నిర్వహణ ఈఎస్‌పీవీ పరిధిలో చేపట్టేందుకు కాంట్రాక్టు సంస్థను ఎస్‌పీవీ ఎంపిక చేయనుంది. రూ.2,428 కోట్లతో నెట్‌వర్క్ నిర్మాణం చేపట్టేందుకు గుత్తేదారు ఎంపికను నిర్వహించే టెండర్ల ప్రక్రియను ఎస్‌పీవీ పర్యవేక్షిస్తుందని తెలిపింది.

వైద్య విద్య పీజీ ఫీజులు ఖరారు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 2023-24 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభమైన నూతన ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పీజీ వైద్య విద్య కోర్సుల వార్షిక రుసుములను నిర్ణయిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. 2025-26లో ఎన్‌ఎంసీ మంజూరు చేసిన సీట్ల పునర్వ్యవస్థీకరణ, వార్షిక రుసుముల నిర్ధారణపై ఏఎఫ్‌ఆర్‌సీ, ఏపీఎంఎస్‌ఐడీసీ బోర్డు పంపిన నివేదికలు, తీర్మానాలను ప్రభుత్వం ఆమోదించింది. ఎన్‌ఆర్‌ఐ కోటా సీట్లు మిగిలితే అవి సెల్ఫ్ ఫైనాన్స్ కింద భర్తీ చేయాలని పేర్కొంది. ఈ అవకాశం ఇచ్చిన తర్వాత కూడా సీట్లు మిగిలితే డీఎంఈ మార్గదర్శకాల ప్రకారం భర్తీ చేసే వెసులుబాటు కల్పించింది.

కరిచే కుక్కలకు కళ్లెం!



- ప్రత్యేక షెల్టర్లలోకి ప్రమాదకరమైన కుక్కలు
- నగరపాలక సంస్థల్లో విధిగా కేంద్రాల ఏర్పాటు
- 100% శునకాలకు సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు
- సుప్రీంకోర్టు ఆదేశాలతో ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ

ఈనాడు, అమరావతి: జనాలపైకి దూకుడుగా వెళ్లడంతో పాటు వారిని కరిచే వీధికుక్కల నియంత్రణకు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమిస్తోంది. ఇలాంటి వాటిని గుర్తించి ప్రత్యేక షెల్టర్లలో పెట్టాలని నిర్ణయించింది. నగరపాలక సంస్థల్లో దశల వారీగా 'డేంజరస్ యానిమల్ పౌండ్లు' ఏర్పాటు చేయాలని కమిషనర్లను ఆదేశించింది. శునకాలకు క్లస్టర్ల వారీగా సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు, రేబిస్ టీకాలు 100% వేయించాలని పేర్కొంది. వీధి కుక్కల దాడిలో దేశంలో ఏదో ఒక చోట చిన్నారులు మృతి చెందడం, పెద్దలకు గాయాలు కావడం వంటి ఘటనల నేపథ్యంలో జనసమ్మర్ద ప్రాంతాల నుంచి వాటిని తరలించాలని ఇటీవల సుప్రీంకోర్టు రాష్ట్రాలను ఆదేశించడంతో ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. ప్రత్యేకించి చిన్నారులపై దాడి చేయడం, వాహనాలపై వెళ్లే వారిని వెంబడించి గాయపరుస్తున్న కుక్కల కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది.

✦ రాష్ట్రంలో 123 పుర, నగరపాలక సంస్థల్లో, నగర పంచాయతీల్లో 5.15 లక్షల వీధికుక్కలు ఉన్నాయి. వీటిలో 10-15% మేర దూకుడుగా వ్యవహరిస్తున్నట్లు అంచనా. చిన్నారులపై దాడి చేస్తున్నవి, రోడ్లపై వెళ్లే వారిని గాయపరిచేవి ఇవేనని గుర్తించారు. వీటిని ప్రత్యేక షెల్టర్లలో పెట్టి సంరక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా కుక్కకాట్లు నిరోధించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. నగరపాలక సంస్థల్లో విధిగా షెల్టర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించింది.

✦ శునకాలకు సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు, రేబిస్ టీకాలు వేయించేందుకు ప్రస్తుతం ఉన్న 45 కేంద్రాలను క్లస్టర్ల వారీగా వినియోగించుకోనున్నారు. ఒక్కో సెంటర్‌కు చుట్టూ ఉన్న రెండు, మూడు పట్టణాల్లో శునకాలను తీసుకొచ్చి శస్త్రచికిత్సలు చేయిస్తారు.

ఒక్కో శునకంపై రూ.1,500

✦ కుక్కలను వీధుల్లో పట్టుకుని సెంటర్లకు తీసుకొచ్చి వాటికి శస్త్రచికిత్స, రేబిస్ టీకా, ఇతర సంరక్షణ చర్యలకు ఒక్కో దానిపై రూ.1,500 చొప్పున ఖర్చు చేయాలని పురపాలక శాఖ నిర్ణయించింది. క్లస్టర్ సెంటర్లకు తీసుకెళ్లే వాటిపై అదనంగా మరో రూ.వంద ఖర్చు చేయనున్నారు. పశుసంవర్ధక శాఖ గుర్తించిన జంతు సంక్షేమ సంస్థలు సెంటర్ల నిర్వహణ బాధ్యతలు చూడనున్నాయి.

✦ శునకాల నుంచి రక్షణకు చిన్నారులు స్వీయ జాగ్రత్తలు తీసుకునేలా పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతోనూ సమావేశాలు ఏర్పాటు చేస్తారు.

కమిషనర్లకు రోజువారీ, వారాంతపు లక్ష్యాలు

✦ సమస్యాత్మక శునకాలను గుర్తించి ప్రత్యేక షెల్టర్లకు తరలింపు, సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు, రేబిస్ టీకాలు వేయించడంపై కమిషనర్లకు ప్రభుత్వం రోజువారీ, వారాంతపు లక్ష్యాలు నిర్దేశించింది. ఆ మేరకు గడువులోగా లక్ష్యాలు పూర్తి చేయాలని ఆదేశించింది.

✦ శునకాల నియంత్రణ కార్యక్రమాలపై పర్యవేక్షణకు పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల వారీగా ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల భాగస్వామ్యంతో కమిటీలు ఏర్పడనున్నాయి.

పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్



ఇన్‌సర్వీస్ టీచర్లను టెట్ నుంచి మినహాయించండి

కేంద్రానికి తెదేపా ఎంపీ లావు డిమాండ్



ఈనాడు, దిల్లీ: ఇన్‌సర్వీస్‌లో ఉండే టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇస్తూ విద్యాహక్కు చట్టం, ఎన్‌సీటీఈ చట్టాలను సవరించాలని తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం లోక్‌సభ జీరో అవర్‌లో దీనిపై మాట్లాడారు. "మా కుటుంబం విద్యాసంస్థలు నడుపుతుంది. నేను చిన్నప్పుడు టీచర్ ఇంట్లో పెరిగాను. దేశ నిర్మాణం కోసం టీచర్లు పడే కష్టం గురించి నాకు బాగా తెలుసు. అయితే 2010 ఆగస్టు 23 ముందు నియమితులైన టీచర్లంతా రెండేళ్లలోపు టీచర్ అర్హత పరీక్ష పాస్ కావాలని సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు దేశవ్యాప్తంగా లక్షల మంది ఉపాధ్యాయుల్లో భయాందోళనలు రేపింది. విద్యాహక్కు చట్టం నిబంధనల్లో ఈ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇచ్చారు. ఇందులో చాలామంది ఇప్పటివరకు 15-30 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకొని గ్రామీణ, గిరిజన ప్రాంత పాఠశాలల వ్యవస్థకు వెన్నెముకగా నిలిచారు. ఎప్పుడో ముగిసిపోయిన ఈ సమస్యను సుప్రీంకోర్టు ఇప్పుడు మళ్లీ తెరపైకి తేవడం వల్ల సర్వీసులో ఉన్న టీచర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఉద్యోగ జీవితం చివరదశలో ఉన్నవారిని మళ్లీ ప్రవేశపరీక్ష రాయాలని చెప్పడం వారికి బాధాకరంగా ఉంది. గడువులోగా వారు పరీక్ష పాసవ్వకపోతే ఉద్యోగాలు కోల్పోతారు. దీనివల్ల గ్రామీణప్రాంత పాఠశాలలు ఖాళీ అవుతాయి. అందువల్ల కేంద్రం ఆర్టీఈ చట్టానికి, ఎన్‌సీటీఈ చట్టానికి సవరణలు చేసి 2010 ఆగస్టుకు ముందు నియమితులైన టీచర్ల ప్రయోజనాలు కాపాడాలి. ఉపాధ్యాయులకు గౌరవం, స్థిరత్వం, భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే" అని చెప్పారు.

జాతీయ జలరవాణా-4 ద్వారా ఐదేళ్లలో 4 కోట్ల టన్నుల సరకు రవాణా

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ గుండా సాగే జాతీయ జలరవాణా-4 ద్వారా గత ఐదేళ్లలో 4.1 కోట్ల టన్నుల సరకు రవాణా చేసినట్లు నౌకాయానశాఖ మంత్రి శర్బానంద్ సోనోవాల్ తెలిపారు. ఆయన శుక్రవారం లోక్‌సభలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు ఈ మేరకు బదులిచ్చారు. ఈ జలమార్గంలో ఇప్పటివరకు రూ.43.43 కోట్ల పనులు చేపట్టినట్లు చెప్పారు. ఈ మార్గం భద్రాచలం నుంచి పోలవరం వరకు 127 కి.మీ., పోలవరం నుంచి రాజమహేంద్రవరం వరకు 44 కి.మీ., కృష్ణానదిలో వజీరాబాద్ నుంచి పులిచింతల వరకు 86 కి.మీ., పులిచింతల నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు 71 కి.మీ., తెలంగాణలో పులిచింతల నుంచి శ్రీశైలం వరకు 32 కి.మీ. ఉన్నట్లు చెప్పారు. తెలంగాణలోని భాగం 2026 జులైకల్లా అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.

బడా కంపెనీలకు మేలుచేసేలా విధానాలు సరికాదు

- విద్యుత్తు నియంత్రణ మండలి విచారణలో సీపీఎం నేత బాబూరావు



విద్యుత్తు నియంత్రణ మండలి ఆన్‌లైన్ విచారణలో పాల్గొన్న బాబూరావు

విజయవాడ(సూర్యారావుపేట), న్యూస్‌టుడే: బడా కంపెనీలకు మేలు చేసే, సామాన్యులపై భారాలు వేసేలా సౌర, ఇతర సంప్రదాయేతర విద్యుత్తు విధివిధానాలు రూపొందించడం శోచనీయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు పేర్కొన్నారు. కాలుష్య నివారణకు, విద్యుత్తు ఛార్జీల తగ్గింపునకు సౌరవిద్యుత్తు ఉపయోగపడాలి గానీ.. ప్రజలపై భారం పడేలా ఉండకూడదన్నారు. కేంద్రం వ్యవసాయ పంపుసెట్లకు సౌర విద్యుత్తును అందించే కుసుమ్ 3 పథకం టారిఫ్‌పై కర్నూలులోని విద్యుత్తు నియంత్రణ మండలి కార్యాలయంలో ఛైర్మన్ పి.వి.ఆర్.రెడ్డి అధ్యక్షతన ఆన్‌లైన్‌లో బహిరంగ విచారణ జరిగింది. విజయవాడ నుంచి బాబూరావు విచారణలో ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. సెకి ద్వారా అదానీ సంస్థ నుంచి 7 వేల మెగావాట్ల విద్యుత్తును యూనిట్‌కు రూ.2.49 చొప్పున కొనుగోలు చేయడం భారమని విమర్శలుండగా, వ్యవసాయ పంపుసెట్లకు వినియోగించే విద్యుత్తును రూ.3.18 చొప్పున కొనాలని ప్రభుత్వం ప్రతిపాదించడం దుర్మార్గమన్నారు. పారదర్శకంగా అన్ని సంస్థలను పోటీలో పాల్గొనే అవకాశం లేకుండా ఎంపికచేసిన సంస్థలకే టెండర్‌లో పాల్గొనే అవకాశం కల్పించడం తగదన్నారు. విద్యుత్తు ఛార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం 17 నెలల్లో రూ.23,884 కోట్ల భారాలు మోపిందని దుయ్యబట్టారు. మిగులు విద్యుత్తు పేరుతో థర్మల్ విద్యుత్తు కేంద్రాల్లో ఉత్పత్తి నిలిపేస్తున్నారని, అయినా ఫిక్స్‌డ్ ఛార్జీల పేరుతో ఆ భారం వినియోగదారులపై మోపుతున్నారని దుయ్యబట్టారు. ప్రజాప్రతినిధుల ఇంట ఉన్న కంపెనీల నుంచి సౌర విద్యుత్తు కొనుగోలు చేస్తున్నారని.. కంపెనీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు కుమ్మక్కై ప్రజలపై భారాన్ని వేస్తున్నారన్నారు. గుర్తింపు లేని పలు కంపెనీలు విచ్చలవిడిగా రావడంతో భవిష్యత్తులో నిర్వహణ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. దీన్ని నివారించేందుకు ముందుజాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం మోపిన సర్దుబాటు, ట్రూ అప్ ఛార్జీల భారాలను రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న రూ.12,771 కోట్ల ట్రూ అప్ ఛార్జీలను ఉపసంహరించుకుంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకోవాలని బాబూరావు డిమాండ్ చేశారు.

హిందూ సంప్రదాయాలను అపహాస్యం చేయడం అలవాటైపోయింది

ఎక్స్‌లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ పోస్ట్



ఈనాడు, అమరావతి: హిందూ సంప్రదాయాలు, ఆచారాలను అపహాస్యం చేయడం కొన్ని వర్గాలకు ఆనవాయితీగా మారిందని జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తమిళనాడులోని తిరుప్పరంకుండ్రం ఘటనపై ఆయన స్పందించారు. 'హిందూ సంప్రదాయాలు, ఆచారాల్లా ఇతర మతపరమైన కార్యక్రమాలనూ అపహాస్యం చేసేంత ధైర్యం చేస్తారా? తిరుప్పరంకుండ్రం కార్తికేయ స్వామి ఆలయాన్ని ఆరు పుణ్యస్థలాల్లో మొదటిదిగా పరిగణిస్తారు. తమిళ మాసం కార్తిగైలో కొండపై దీపాలు వెలిగించడం హిందువుల పురాతన సంప్రదాయం. నేడు భారతదేశంలోని హిందువులు తమ విశ్వాసాన్ని ఆచరించడానికి, వారి ఆచారాలను నిర్వహించడానికి న్యాయపరమైన జోక్యాలను కోరాల్సి రావడం విచారకరం. నిర్ణయాత్మక న్యాయపోరాటంలో గెలిచిన తర్వాత కూడా భక్తులు తమ సొంత ఆస్తిపై సరళమైన, శాంతియుత కర్మను నిర్వహించలేకపోతే వారి సొంత దేశంలో నిజంగా రాజ్యాంగన్యాయం ఎక్కడ లభిస్తుంది? దీపథూన్ వద్ద కార్తిగై దీపాన్ని వెలిగించే హక్కును మద్రాసు హైకోర్టు ధ్రువీకరించింది. ఏదైనా మతపరమైన పండుగను ఒక వారం ఆలస్యంగా మార్చవచ్చా? హక్కును పొందినా ఆచారాన్ని కోల్పోయాం. భక్తులు తమ సొంత దేవాలయాలు, మతపరమైన వ్యవహారాలను చురుగ్గా నిర్వహించేందుకు సనాతన ధర్మరక్షా బోర్డు అవసరం. హిందువులు కుల, ప్రాంతీయ, భాషాపరమైన అడ్డంకుల ద్వారా వేరైనంత కాలం హిందూ మతం, ఆచారాలపై అపహాస్యం, అవమానాలు కొనసాగుతూనే ఉంటాయి" అని పేర్కొన్నారు.

వైకాపా అధికార ప్రతినిధిగా నాగార్జున యాదవ్

ఈనాడు, అమరావతి: వైకాపా రాష్ట్ర అధికార ప్రతినిధిగా పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గానికి చెందిన యనమల నాగార్జున యాదవ్ నియామకం అయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

హైకోర్టు న్యాయవాదుల సంఘం ఎన్నికల్లో మహిళలకు 1/3 వంతు రిజర్వేషన్ కల్పించండి

హైకోర్టులో వ్యాజ్యం

ఈనాడు, అమరావతి: హైకోర్టు న్యాయవాదుల సంఘం ఎన్నికల్లో మహిళా న్యాయవాదులకు 1/3 వంతు రిజర్వేషన్ కల్పించాలంటూ దాఖలైన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. రిజర్వేషన్ కల్పించేందుకు ఓ విధానంతో రావాలని హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు, కార్యదర్శిని ఆదేశించింది. విచారణను బుధవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు.

✦ ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఎన్నికల్లో మహిళా న్యాయవాదులకు 1/3 వంతు రిజర్వేషన్ కల్పించేలా ఆదేశాలివ్వాలంటూ న్యాయవాది తోట సునీత హైకోర్టులో (పార్టీ ఇన్ పర్సన్ పిటిషన్) వ్యాజ్యం దాఖలు చేశారు. బార్ కౌన్సిల్, న్యాయవాదుల సంఘాల ఎన్నికల్లో మహిళా న్యాయవాదులకు రిజర్వేషన్ కల్పించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందన్నారు. ఈ విషయంలో తీర్మానం చేసి, బైలాను సవరించేలా ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘాన్ని ఆదేశించాలని కోరారు. శుక్రవారం జరిగిన విచారణలో న్యాయవాదుల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది చిదంబరం వాదనలు వినిపిస్తూ.. రిజర్వేషన్ కల్పించేందుకు సిద్ధమేనన్నారు. బైలాను సవరించాల్సిన అవసరం ఉందని న్యాయమూర్తి దృష్టికి తెచ్చారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. రిజర్వేషన్ కల్పనకు ఓ విధానంతో రావాలంటూ విచారణను బుధవారానికి వాయిదా వేశారు.

పనివేళలు ముగిశాక ఉద్యోగులను ఫోన్లు, మెయిల్స్‌తో విసిగించొద్దు

- లోక్‌సభలో ప్రైవేటు బిల్లు



దిల్లీ: విధులు ముగించుకుని ఇంటికి చేరుకున్న ఉద్యోగులకు కార్యాలయ పనుల నిమిత్తం ఫోను చేసి, మెయిల్స్ పంపి వారి విశ్రాంతికి భంగంకలిగించకుండా నిరోధించే ప్రైవేటు బిల్లు ఒకటి శుక్రవారం లోక్‌సభ ముందుకు వచ్చింది. 'రైట్ టు డిస్‌కనెక్ట్ బిల్లు-2025'ను ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే ప్రవేశపెట్టారు. విధులు ముగిశాక, సెలవు రోజుల్లో కూడా ఉద్యోగులకు వారి ఆఫీసుల నుంచి ఫోన్లు, మెయిల్స్ రావడం వల్ల వ్యక్తిగత, కుటుంబ జీవనానికి ఆటంకం కలుగుతోందని సుప్రియ పేర్కొన్నారు. అటువంటి కాల్స్, మెయిల్స్‌ను స్వీకరించకుండా తిరస్కరించే హక్కు ఉద్యోగులకు కల్పించాలని బిల్లు పేర్కొంది. దీనికి గాను 'ఉద్యోగుల సంక్షేమ సంఘం'ను నెలకొల్పాలని బిల్లు ప్రతిపాదించింది.

● కాంగ్రెస్ ఎంపీ కడియం కావ్య మరో బిల్లును లోక్‌సభ ముందుంచారు. రుతుస్రావం సమయంలో మహిళలకు వారు పని చేసే స్థలాల్లో కల్పించాల్సిన వివిధ సదుపాయాల కోసం 'మెన్‌స్ట్రువల్ బెనిఫిట్స్' బిల్లును ఆమె ప్రతిపాదించారు. ● జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్) నుంచి తమిళనాడు రాష్ట్రానికి మినహాయింపునిచ్చేలా రూపొందించిన బిల్లును కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ● దేశంలో మరణ శిక్షలను రద్దు చేయాలని ప్రతిపాదిస్తూ డీఎంకే ఎంపీ కనిమొళి కరుణానిధి మరో బిల్లును సభ ముందుంచారు.

లార్డ్ పదాన్ని తొలగించాలి

పాఠశాల పుస్తకాలు, ఎన్.సి.ఇ.ఆర్.టి. ప్రచురణలు, ప్రభుత్వ పత్రాలు, అధికార వెబ్‌సైట్లలో ఇప్పటికీ బ్రిటిష్ వైస్రాయ్‌లు, గవర్నర్ జనరళ్లను 'లార్డ్' (దొర) అని సంబోధిస్తున్నారనిభాజపా సభ్యుడు సుజీత్ కుమార్ శుక్రవారం రాజ్యసభ జీరో అవర్‌లో పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయినా వలస కాలంనాటి మనస్తత్వాన్ని వదిలించుకోకపోవడం శోచనీయమనీ, ఇకనైనా 'లార్డ్' పదాన్ని తొలగించాలని కోరారు. 8 నుంచి 12వ తరగతి వరకు ఎన్.సి.ఇ.ఆర్.టి. పాఠ్య పుస్తకాల్లో లార్డ్ కర్జన్, లార్డ్ డల్హౌసీ, లార్డ్ మౌంట్ బాటన్ అనే పదాలు పలుమార్లు దర్శనమిస్తున్నాయని తెలిపారు. వీరికి నాటి బ్రిటిష్ వలస ప్రభుత్వం తన అవసరాల కోసం 'లార్డ్' హోదా ఇచ్చిందనీ, భారతీయులపై దారుణ అణచివేతకు పాల్పడిన ఈ తెల్ల దొరలను ఇప్పటికీ 'లార్డ్' అంటూ గౌరవించడమేమిటని ఆయన ప్రశ్నించారు.

సభ్యుల హక్కులు కాపాడండి: డెరెక్ ఓ బ్రియాన్

దిల్లీ: ఎగువ సభలో నిబంధన 280 కింద 'పాయింట్ ఆఫ్ ఆర్డర్' లేవనెత్తే సభ్యుల హక్కులను సభాధ్యక్షుడైన ఛైర్మన్ కాపాడాలని తృణమూల్ ఎంపీ డెరెక్ ఓ బ్రియాన్ విజ్ఞప్తి చేశారు. పాయింట్ ఆఫ్ ఆర్డర్‌ను లేవనెత్తటానికి 45 నిమిషాల పాటు నిలుచున్నా తమకు అవకాశం రావడంలేదని, దీంతో సభామధ్యంలోకి వెళ్లాల్సి వస్తోందని ఛైర్మన్ సి.పి.రాధాకృష్ణన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఛైర్మన్ రాధాకృష్ణన్ స్పందిస్తూ... ఒక సమయంలో ఒక సభ్యుడు మాత్రమే పాయింట్ ఆఫ్ ఆర్డర్‌ను ప్రస్తావించాలని, ఒకేసారి ఎక్కువ మంది సభ్యులు మాట్లాడటానికి ప్రయత్నిస్తే 'పాయింట్ ఆఫ్ ఆర్డర్' ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. ఒక సభ్యుడు నిలబడి పాయింట్ ఆఫ్ ఆర్డర్‌ను ప్రస్తావిస్తున్నప్పుడు మిగతా సభ్యులు కూడా అందుకు అవకాశం ఇవ్వాల్సి ఉంటుందని పార్లమెంటు వ్యవహారాల మంత్రి రిజిజు పేర్కొన్నారు.

ఓడపై దొంగల దాడి

దుబాయ్: గల్ఫ్‌లో సముద్రపు దొంగలు రెచ్చిపోయారు. ఇరుకైన బాబ్ ఎల్-మండెబ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న ఓ నౌకపై శుక్రవారం దాడిచేశారు. ఓడను చిన్న ఓడలు వెంబడించి, దానిపై కాల్పులు జరిపాయని బ్రిటిష్ సైన్యానికి చెందిన యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సెంటర్ తెలిపింది. నౌకపై రెండుసార్లు దాడి జరిగిందని, అందులోని సాయుధ గార్డులు ప్రతిగా కాల్పులు జరిపారని ప్రైవేటు భద్రతా సంస్థ డయాప్లస్ గ్రూప్ తెలిపింది. సిబ్బంది సురక్షితంగా ఉన్నారని వివరించింది. ఇదో సరకు రవాణా నౌక అని వివరించింది.

సహకార్ ట్యాక్సీలో 51వేల మంది డ్రైవర్ల నమోదు

కేంద్ర మంత్రి అమిత్ షా వెల్లడి

గాంధీనగర్: కొత్తగా ప్రారంభించిన 'సహకార్ ట్యాక్సీ సర్వీసు'.. మరో రెండేళ్లలో దేశంలోనే అతిపెద్ద సహకార ట్యాక్సీ కంపెనీగా మారనుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. పైలట్ ప్రాజెక్టుగా దీన్ని దిల్లీలో ప్రారంభించామని, ఇప్పటికే ఇందులో దాదాపు 51వేల మంది డ్రైవర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. వీరి పూర్తి ఆర్జనలు బ్యాంకు ఖాతాల ద్వారా అందుతాయని చెప్పారు.

పార్లమెంటులో 8, 9 తేదీల్లో వందేమాతరంపై చర్చ

- లోక్‌సభలో ప్రధాని మోదీ... రాజ్యసభలో అమిత్ షాతో ఆరంభం

దిల్లీ: వందేమాతరం గేయాన్ని రచించి 150 ఏళ్లయిన సందర్భాన్ని పురస్కరించుకుని పార్లమెంటులో ప్రత్యేక చర్చ జరగనుంది. లోక్‌సభలో ప్రధాని మోదీ ఈ నెల 8న, రాజ్యసభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా 9న ఈ చర్చను ప్రారంభిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. సోమవారం మధ్యాహ్నం లోక్‌సభలో మొదలయ్యే చర్చ రోజంతా జరగనుంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఇతర మంత్రులూ పాల్గొంటారు. రాజ్యసభలో జరిగే చర్చలో కేంద్ర మంత్రి జె.పి.నడ్డా కూడా భాగస్వామి అవుతారు. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) సహా ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో ఈ నెల 9, 10 తేదీల్లో, రాజ్యసభలో 10,11 తేదీల్లో చర్చ జరగనుందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

మనం ఇక్కడ అరవడానికి రాలేదు

పార్లమెంటులో గందరగోళంపై శశిథరూర్

ఇంటర్నెట్ డెస్క్: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్), ఇతర అంశాలపై ప్రతిపక్షాల ఆందోళనలతో పార్లమెంటు సమావేశాలకు అంతరాయాలు కలగడంపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను చర్చించడానికి గందరగోళం సృష్టించాల్సిన అవసరంలేదన్నారు. ఇక్కడ దేశం కోసం, ప్రజల కోసం మాట్లాడాలే తప్ప, అరిచి గందరగోళం సృష్టించొద్దని సహచర ఎంపీలకు సూచించారు. 'నేను మొదటి నుంచీ ఇదే చెబుతున్నాను. సోనియాగాంధీతో సహా నా పార్టీ నాయకులకు ఈ విషయం బాగా తెలుసు. పార్టీలో నేను ఒంటరిని కావచ్చు. కానీ, ప్రజలు తమకు పార్లమెంటులో ప్రాతినిధ్యం వహించడానికి నన్ను ఎన్నుకున్నారు. అంతేకానీ ఇక్కడ అరవడానికి, గందరగోళం సృష్టించడానికి కాదు. వారి కోసం, దేశం కోసం నా తెలివితేటలు ఉపయోగించి మాట్లాడాలనే ఉద్దేశంతో నన్ను ఇక్కడికి పంపారు' అని శశిథరూర్ వ్యాఖ్యానించారు.

రాజస్థాన్ హైకోర్టుకు బాంబు బెదిరింపు

జైపుర్: రాజస్థాన్ హైకోర్టుకు ఈమెయిల్ ద్వారా బాంబు బెదిరింపు రావడంతో శుక్రవారం ఖాళీ చేయించినట్లు అధికారులు తెలిపారు. బాంబు నిర్వీర్యం దళం, డాగ్ స్క్వాడ్ మొత్తం కాంప్లెక్స్‌లో విస్తృత తనిఖీలు చేపట్టడంతో అన్ని న్యాయపరమైన ప్రక్రియలు కొద్దిసేపు ఆగిపోయాయని వారు వివరించారు. తనిఖీల అనంతరం ఎలాంటి అనుమానాస్పద వస్తువుల్నీ స్వాధీనం చేసుకోలేదని పోలీసులు తెలిపారు.

భారత్‌తో సంబంధాలు మెరుగుపరచుకోవాలి

- ట్రంప్ భద్రతా వ్యూహం



న్యూయార్క్: భారత్‌తో వాణిజ్య, ఇతర సంబంధాలను మెరుగుపరచుకోవడానికి అమెరికా ప్రయత్నాలు కొనసాగించాలని డొనాల్డ్ ట్రంప్ సర్కారు పేర్కొంది. క్వాడ్ కూటమిలో సహకారం ద్వారా ఇండో-పసిఫిక్ భద్రతకు ఇది దోహదపడుతుందని తెలిపింది. 'అమెరికా జాతీయ భద్రతా వ్యూహం' పేరిట ట్రంప్ సర్కారు తాజాగా వ్యూహపత్రాన్ని విడుదల చేసింది. దక్షిణ చైనా సముద్రంలో భద్రతా సవాళ్లను ఎదుర్కోవడానికి భారత్‌తో బలమైన సహకారం అవసరమని వివరించింది. "మానవజాతి చరిత్రలో అమెరికా అత్యంత విజయవంతమైన, గొప్ప దేశంగా, పుడమిపై స్వేచ్ఛకు నెలవుగా కొనసాగేందుకు ఈ వ్యూహపత్రం ఒక మార్గసూచిగా ఉపయోగపడుతుంది. దేశ సామర్థ్యానికి సంబంధించిన అన్ని అంశాలనూ బలోపేతం చేసుకొని అమెరికాను సురక్షిత, సుసంపన్న, స్వేచ్ఛాయుత, గొప్ప దేశంగా మారుస్తాం" అని ఈ పత్రంలో ట్రంప్ సందేశమిచ్చారు. పశ్చిమార్ధగోళంలో ఉమ్మడి వైఖరులను మరింత బలోపేతం చేసుకునేందుకు ఐరోపా, భారత్ సహా ఆసియాలోని మిత్రపక్షాలతో కలిసి పనిచేయాలని వ్యూహపత్రం నిర్దేశించింది. శాంతియుత అధ్యక్షుడిగా ట్రంప్ గుర్తింపు పొందారని తెలిపింది. భారత్-పాకిస్థాన్, ఇజ్రాయెల్-ఇరాన్, గాజా సహా ప్రపంచవ్యాప్తంగా 8 ఘర్షణలకు ఆయన ముగింపు పలికారని వివరించింది.

పెళ్లి వయసు రాకపోయినా సహజీవన హక్కు

రాజస్థాన్ హైకోర్టు తీర్పు



జైపుర్: చట్టబద్ధంగా పెళ్లి చేసుకొనే వయసు రాకపోయినా ఇద్దరు వయోజనులు తమ ఇష్టప్రకారం కలసి జీవించవచ్చని రాజస్థాన్ హైకోర్టు పేర్కొంది. ఆ జంట అలా కలసి ఉండకూడదనడం వారి రాజ్యాంగ హక్కులకు భంగకరమే అవుతుందని జస్టిస్ అనూప్ ధర్మాసనం తీర్పు వెలువరించింది. కోటాకు చెందిన 19 ఏళ్ల యువకుడు, 18 ఏళ్ల యువతి కలసి జీవించడానికి ఈ ఏడాది అక్టోబరు 27న ఒప్పందం కుదుర్చుకున్నారు. దాన్ని యువతి తల్లిదండ్రులు వ్యతిరేకించి, యువకుడిని చంపేస్తామని హెచ్చరించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని యువ జంట కోర్టుకు విన్నవించింది. చట్టప్రకారం పురుషుడి వివాహ వయసు 21 సంవత్సరాలనీ, అందువల్ల 19 ఏళ్ల యువకుడిని సహజీవనం చేయడానికి అనుమతించకూడదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారు. 21వ రాజ్యాంగ అధికరణ వ్యక్తుల ప్రాణాలకూ, వ్యక్తిగత స్వేచ్ఛకూ భరోసా ఇస్తోందనీ, వివాహ వయసు రాలేదనే కారణంపై ఆ హక్కును హరించకూడదని జడ్జి తేల్చారు. సదరు హక్కును కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. యువ జంటకు రక్షణ ఏర్పాట్లు చేయాలని జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు.

కేరళలో రూ.కోట్ల విలువైన పక్షుల స్మగ్లింగుకు అడ్డుకట్ట





ఈటీవీ భారత్: థాయిలాండ్ నుంచి రూ.కోట్ల విలువచేసే అరుదైన, అంతరించిపోతున్న 11 పక్షుల అక్రమ రవాణాకు ప్రయత్నించిన జంటను కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కేరళ కస్టమ్స్ అధికారులు అరెస్టు చేశారు. కౌలాలంపూర్ మీదుగా ఇక్కడికి చేరుకున్న ఆ జంట కదలికలపై అనుమానం రావడంతో తనిఖీ చేయగా ఈ గుట్టు బయటపడింది. వెంటనే వారిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. లగేజిలో ప్రత్యేకంగా ఒక కంపార్ట్‌మెంటు తయారుచేసి అందులో పక్షులను నిర్బంధించారు. ఈ జంటతోపాటు ఏడేళ్ల బాబు కూడా ఉన్నాడు. తదుపరి విచారణ కోసం వీరిని అటవీశాఖకు అప్పగించారు. మలయత్తూరు డీఎఫ్‌వో కార్తీక్ 'ఈటీవీ భారత్'తో మాట్లాడుతూ. . విచారణ ప్రారంభించామని, ప్రాథమిక దర్యాప్తు తర్వాత చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇటువంటి పక్షులను వాటి ఆవాసాల నుంచి మరొక దేశానికి రవాణా చేయడం అంతర్జాతీయ వన్యప్రాణుల రక్షణ చట్టాలను తీవ్రంగా ఉల్లంఘించడమేనని తెలిపారు. ఈ పక్షులను తిరిగి థాయిలాండ్‌కు పంపే ముందు అవసరమైన ప్రాథమిక వైద్య సంరక్షణ అందిస్తారు. ఏడాది కిందట కూడా తిరువనంతపురానికి చెందిన ఇద్దరిని అరెస్టు చేసిన కస్టమ్స్ అధికారులు వారి నుంచి స్వాధీనం చేసుకున్న 14 అరుదైన పక్షులను తిరిగి థాయిలాండ్‌కు తరలించారు. తాజా ఘటన తర్వాత ఈ అక్రమ రవాణా ప్రయత్నాల వెనుక పనిచేస్తున్న అంతర్జాతీయ సిండికేట్లపై కస్టమ్స్, అటవీశాఖలు దర్యాప్తును ముమ్మరం చేసినట్లు అధికారులు వెల్లడించారు.

నెహ్రూను కించపరచడమే కేంద్ర సర్కారు ప్రధాన లక్ష్యం

సోనియా గాంధీ విమర్శ



దిల్లీ: దేశ తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూను దూషించడమే కేంద్రంలోని అధికార పక్ష ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ శుక్రవారం ఆరోపించారు. నెహ్రూ ఘనతలను 'తుడిచేయడమే' కాకుండా ఆయనకు సంబంధించిన సామాజిక, రాజకీయ పునాదులను నాశనం చేయాలని అధికారపక్షం చూస్తోందన్నారు. ఆయన వ్యక్తిత్వాన్ని కించపరచడమే కాకుండా స్వాతంత్ర్య సంగ్రామంలో ఆయన పోషించిన పాత్రను తగ్గించడమే ఈ చర్యల ఉద్దేశమని పేర్కొన్నారు. ఇది తమకు ఆమోదయోగ్యం కాదన్నారు. దిల్లీలోని జవహర్ భవన్‌లోని నెహ్రూ సెంటర్ ఇండియా ప్రారంభోత్సవ కార్యక్రమం ఆమె పాల్గొన్నారు. నెహ్రూ.. ఆధునిక భారత్ ప్రధాన రూపశిల్పి అని పేర్కొన్నారు. ప్రణాళికాబద్ధ ఆర్థిక పురోగతికి ఆయన ప్రాధాన్యం ఇచ్చేవారని చెప్పారు. శాస్త్ర, సాంకేతిక సామర్థ్యాల వృద్ధితోపాటు ప్రజల్లో శాస్త్రీయ జిజ్ఞాస కలిగించేందుకు ఆయన కట్టుబడ్డారని తెలిపారు. లౌకికవాదాన్ని ఆయన గట్టిగా విశ్వసించేవారని తెలిపారు. ఆయన సిద్ధాంతాలు నేటికీ మన జీవితాలను తీర్చిదిద్దుతున్నాయన్నారు.

రూ.లక్షల విలువ గల వజ్రాల లాకెట్ మింగేసిన దొంగ

న్యూజిలాండ్‌లో ఘటన

వెల్లింగ్టన్: రూ.లక్షలు విలువచేసే వజ్రాలు పొదిగిన గుడ్డు ఆకారంలోని ఓ లాకెట్‌ను న్యూజిలాండ్‌కు చెందిన ఓ దొంగ మింగేసిన ఘటన ఆక్లాండ్‌లో చోటుచేసుకుంది. దుకాణ యజమాని ఫిర్యాదు చేయడంతో గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు ఆ దొంగను గుర్తించి లాకెట్‌ను వైద్యపరంగా బయటికి రప్పించారు. సెంట్రల్ ఆక్లాండ్‌లోని ప్యాట్రిడ్జ్ జ్యువెలర్స్‌లో ఈ ఘటన జరిగింది. 32 ఏళ్ల వ్యక్తి మింగిన లాకెట్‌లో 60 తెల్ల వజ్రాలు, 15 నీలమణులు, 18 క్యారెట్ల చిన్న బంగారు ఆక్టోపస్ బొమ్మ ఉంది. ప్రస్తుతం అతడు వైద్యుల పర్యవేక్షణలోనే ఉన్నాడు. అతనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

